భారతి

సాహిత్య మాసపత్రిక
ఏప్రిల్ 1983

గమనించు మిత్రమా

నారాయణరెడ్డి

వినుతి వినోదము

నరసింహాచార్యులు

గుండెకు అండ

దాశరథి

నారాయణబాబు నవకవిత

గంగప్ప

సెర్గిజ్ కార్చెవ్‌స్కీ

బ్రహ్మానంద

చైతన్య స్రవంతి

రంగారావు

ఇంతా కాళిదాసు, రమేష్‌బాబు, శేషగిరిరావు, అంజయ్య, సోమసుందర్, సాంధ్యశ్రీ, మాణిక్యరావు, రాధాకృష్ణశర్మ, శ్రీరామమూర్తి, రామచంద్రరావు, సత్యనారాయణరెడ్డి ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

ఏప్రిల్ 1983

సంపుటము : 60   సంచిక : 4

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1983

ఉల్కాపాతాలు

శ్రీ వఝ్ఝల కాళిదాసు

౧

ఆకాశంనుంచి పడుతున్న పిడుగులన్నీ
దారిద్ర్యాన్నీ, ధన మదాన్నీ,
స్వార్థాలనీ, అనర్థాలనీ,
అసత్యాలనీ, అఘాయిత్యాలనీ,
భస్మం చేస్తే బాగుండును!

౨

కాకులను కుంటాయి
దేముడుకి నాలుగు ముక్కులూ,
ఎనిమిది రెక్కలూ,
ఉరుములాంటి కంఠమూ,
ప్రగాఢాంధ కార వర్ణమూ,
ఉంటాయని!

3

నిజం చెప్పడం చాలా సులభం,
సజావుగా ఎవరేనా చెప్పివచ్చు;
అబద్ధం ఆడాలంటే
అవసరం బుద్ధిబలం వాక్చక్యం!

౪

అవసరాలు అనర్థాలు
ప్రతి జీవికీ కలుగుతాయి;
అవి లేనిది నిర్జీవ జడపదార్థం!

౫

అవకాశాలు దొరకలేదని
అవివేకు లనుకుంటారు:
అవకాశాలూ, అదునులూ
దొరికించుకో గలవాళ్లే
దొరలౌతారు!

౬

గొప్పలు చెప్పుకొనే వాడికి 'నిన్న'
ఏమీ చేతకానివాడికి 'రేపు'
కార్యాచరణ దీక్షా దక్షత
కలవాడికి 'నేడు' కావాలి.

౭

అపజయం కలుగుతుందేమో
అని జడుసుకొనే వాడికి
జయం ఎన్నడూ కలగదు.

౮

అనుభవ జ్ఞానం
బాధా సహన జన్యం!
ఆనందం కేవలం క్షణికం
అనంతర ఫలం శూన్యం!

౯

అసమానత్వం 'అర్థం' వల్ల కలుగుతుంది
అనర్థాలకి అదే దారి తీస్తుంది.

౧౦

వెర్రి కేకలు వేస్తే విప్లవం రాదు
ప్రజల కడుపులూ హృదయాలూ
భగ్గుమనాలి!

౧౧

ప్రజాభిప్రాయం ప్రకృతి లాంటిది,
ప్రభాత మంద మరుదం కురాలూ
ప్రగాఢ నీరంధ్రాంధ కారాలూ
ప్రశాంత శరత్ చంద్ర శాలలూ
ప్రళయ భయంకరాశని పాతాలూ
ప్రమోదకర వసంత సౌరభాలూ
ప్రభంజన విదారిత వస్తుతతీ
ప్రసాదిస్తుంది కనక!

పదార్చన

డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు

౧

"నెట్టుకొని కొలుతు నన్నయ
భట్టోపాధ్యాయి సార్వభౌముని - కవితా
పట్టాభిషిక్తు - భారత
ఘట్టోల్లంఘన పటిష్ఠు గాఢ ప్రతిభున్"

౨

అనచు నుతియించు శ్రీనాథు నమల వాణి
ఆత్మలోపల మ్రుగ్గి - మోదాబ్ధి తేలి
పొలుపు మొలయగ - భావ విస్ఫూర్తి మెరయ -
శబ్దశాసను నన్నపాచార్యుఁ గొలుతు.

౩

గౌతమీ వారి రుచులను గారవించి
భట్టు నారాయణుని స్నేహపాత్రు నెంచి
వ్యాసవాణికి భక్తిమై నంజలించి
భారతాను వాదమున నుపక్రమించె.

౪

'మద మాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య సం
పదలం' దేలు చళుక్యవల్లభుఁడు ప్రాపైనిల్వ, వాగ్వైదుషీ
పదవిభ్రాజితుఁడైన నన్నయ కవిప్రాలేయశైలమ్ము - నె
మ్మది వేయేండ్లకు మున్ను భారతము నిర్మాణించె
నుద్వేలుఁడై.

౫

రాజితసత్కవీంద్రబుధరాజి మహాధరణీలలామ సం
పూజితమైన ఆంధ్రమును పూవులపల్లకిలోన నిల్పె వి
భ్రాజిత శోభతోడను, ధరామరవంశ విభూషణుండు - రా
రాజుల కంటిచల్వ - కవిరాజు - మహామతి - నన్నయార్యుడే!

౬

అక్షర రమ్యతం బొదివి ఆంధ్రమునందున కుప్పవోసె, ప్ర
త్యక్షము సౌనటుల్ - సుకవితా మధుధారలు చిందునట్లు - నీ
యక్షయ కావ్యభిక్ష కెదురన్నది యున్నదె నన్నయార్య! నీ
శిక్షిత కావ్య తత్త్వ మృదు శింజిని మ్రోతలె
గౌతమీ ఝురుల్

౭

భావుకుడైన పంపకవి భారతమందలి వంపుసొంపులున్
ద్రావిడ కావ్యసారణుల రమ్యరసజ్ఝరి నాదమోదముల్
ధీవిలసన్మయూఖముల తేజము చిప్పిలు దేవభాషలో
తావులు చిమ్ము కావ్యసుమదామము నిండెనొ నీ
మనస్సిలో!

౮

సారస్వతస్ గిరీంద్రులు ప్రసన్న
కథా కవితాగ్రయుక్తిలో
నారసినారు - ప్రాజ్ఞులు ప్రహర్ష
ముతో తలయూపినారు - క
ర్పూర పరాగ పాండు రుచిపూరము
లం దనివొందినారు - నీ
భారత భారతీ శుభగభస్తి
సహస్రములు నిల్పుకొంటకై

—✲—

డా॥ ఎస్. గంగప్ప

నారాయణబాబు నవకవిత

ఒకానొక సందర్భంలో ఒక సాహితీ వేత్త తెలుగు కవులను ఉద్దేశించి "కొందరు మహాప్రతిభావంతులైనా అడుగున పడిపోతారు. కాని మరికొందరిని అదృష్టం వరించి, అనుకోనంతగా అత్యంత ప్రచారంలోకి వస్తారు" అన్నారు. నిజమే! కొందరి విషయంలో ఇది చాలా వాస్తవమనిపిస్తుంది. మొట్టమొదటి ఉదాహరణగా ఇందుకు ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు అనే ఇద్దరు స్వతంత్ర నాటక కర్తల్ని గ్రహించవచ్చు. ధర్మవరంవారి కొచ్చినంత ప్రచారప్రాముఖ్యాలు, కోలాచలం వారికి రాలేకపోయాయి. కారణం ధర్మవరం వారిని అదృష్టం వరించడమే అని నిక్కచ్చిగా చెబుతారు. ఈనాటికీ జీవించి ఉన్నవారు, బళ్లారి రాఘవ శిష్యులలో ఉత్తములూ అయిన పూజ్యులు జోళదరాసి దొడ్డనగౌడగారి నడిగితే, నిజానికి బళ్ళారి రాఘవ ప్రముఖనటుడుగా పైకి వచ్చింది కోలాచలం వారి నాటకాలవల్లనే. అందులోను ప్రసిద్ధ నాటకమైన 'ది ఫాల్ ఆఫ్ విజయనగర్' అనిపిలువబడే రామరాజు చరిత్ర లేక విజయనగర పతనమనే నాటకంలో పటాన్ రుస్తుమ్ పాత్రను పోషించి షేక్స్పియర్ విషాదాంత నాటకాల్లోని విషాద నాయక పాత్రల్లోని పలురకాల భావాల్ని మెళుకువతో చూపించి మహానటుడుగా నిరూపించుకొన్నారు రాఘవ. కోలాచలంవారు కేవలనాటకాలే గాక అనేకమైన ఇతర రచనలుచేశారు. అందులో చాలా ముఖ్యమైన గ్రంథం వారుఆంగ్లంలో రచించిన "ది డ్రమెటిక్ హిస్టరీ ఆఫ్ ది వరల్డ్" అన్నది. దీని ప్రతులీనాడు లభించవు. సాహిత్య అకాడమిలాంటి సంస్థలు పునర్ముద్రించవలసిన అగత్యం ఎంతైనా వుంది. ప్రప్రథమంగా 1905 లో బళ్ళారిలో వాణీవిలాస నాటకశాలను నిర్మింపజేయడమే గాక ప్రపంచనాటక చరిత్ర రచించిన ఘనత వీరిది. వేదాలు, భగవద్గీతలపై ఉపన్యాసాలెన్నో ఉన్నాయి. అయినా వీరికి రావలసినంత ప్రచారప్రాముఖ్యాలు రాలేదంటే ఆశ్చర్యం లేదు.

అలాంటి అదృష్టం వరించని వారికోవకు చెందినవారు శ్రీరంగం నారాయణబాబు. తనకాలాన్ని అధిగమించి, భవిష్యత్తులో రాబోయే తెలుగుసాహిత్యంలోని నవ్యధోరణుల కెన్నింటికో నాందీ పల్కిన అభ్యుదయ కవిశేఖరుడు నారాయణబాబు. సమకాలికంగా శ్రీ అవంత్స సోమసుందర్ లాంటి కవి విమర్శకులు ఎందరెన్ని దృక్కోణాలనుంచి రుధిరజ్యోతిర్దర్శనం గాంచినా, ఇంకా రావలసింది, దర్శించవలసింది నారాయణబాబు కవితలో ఎంతో మిగిలి వుంది. ఆయనకు రావలసినంత కీర్తిగాని, ప్రఖ్యాతిగాని, లేదంటే సాహితీవేత్తలెన్నో రకాలైన కారణాలు చెబుతారు. వాటితో మనకు పనిలేదు. పై పెచ్చు పాఠకుడనే తుమ్మెద ఆస్వాదించవలసింది కవి కవితా మకరందాన్నే గదా? తద్వారా ఆ కవితలోని మనోజ్ఞత, రసార్ద్రత, భావిజీవితానికి, మనిషి మనుగడకి వలసినవి ఎంతగా చెప్పాడో, అవి ఎంత ఎంతగా ఉపకరించగలవో చూడడమే సహృదయ హృదయ లక్ష్యం! ఆ మేరకు రుధిరజ్యోతిలోని నవ్యకవితా ధోరణుల్ని పర్యాలోకించి పరవశించడమే ఈ వ్యాసోద్దేశం.

ఏ కవి అయినా - పూర్వుడుగాని, నవీనుడుగాని - అపూర్వంగా చెప్పిందే అత్యుత్తమ కవిత అనే విషయం అందరూ అంగీకరించిందే. అందుకే కవికి ప్రతిభనవనవోన్మేషమై వుండాలనడంలోని రహస్యం ఇదే. భావుకత అనే లక్షణం కవికిలేనినాడు ఆ కవి త్రికాలావధికమైన, సార్వజనీనమైన కవిత చెప్పలేదనడం అతిశయోక్తికాదు; అత్యుక్తి అంతకంటేకాదు; అది స్వభావోక్తి- అంటేనే అతుకుతుంది. వాస్తవానికి అప్పుడు ఒకడు కవికాగలడని గూడా మనకు స్పష్టమవుతుంది. నారాయణబాబులో వస్తువైవిధ్యంతోపాటు ఈ భావుకత నిస్తులంగా ఉంది. అందుకు ఆయన కవిత అంతా ఉదాహరణే అవుతుంది. మచ్చుకు 'నగ్నగీతాలు' అనే ఖండిక తీసుకొందాం. పురాణప్రసిద్ధ విషయాల్నే తీసుకొని, లోకంలోని సామాన్యసంగతుల్ని, సంఘటల్ని గ్రహిస్తూనే ఎంతో వైభవోపేతమూ, వాడిగా వేడిగా, సూటిగా హృదయంలో బాణంలా దూసుకుపోయేలా, రసుక్కున గుచ్చుకొని బయటకు వచ్చే ఈ తెల్లా చెప్పడం నారాయణబాబు కవితలోని నైపుణ్యం; అది అంటే తెలుగుజాతి చేసుకొన్న పుణ్యం.

"సరికొత్త
శరీరంలో
నెత్తురుపాడిన
పాటకు
నగ్న శోభ

నందనవనమై
పూచింది"

ఇందులో' నెత్తురుపాడిన పాట'; 'నగ్నశోభ' అన్నవి నవ్యాతినవ్యమైన ప్రయోగాలు. ఆ "సరికొత్త శరీరంతో నెత్తురు పాడిన పాటకు నగ్నశోభనందనవనమై పూచిందట" ఎంతమనోజ్ఞమైన భావన! ఎంతటి మనోహరమైన భావుకత! నందనవనం పూయటంమామూలే! పురాణప్రసిద్ధమే. లేదంటే కవి కాళిదాసు కుమార సంభవంలో అకాలవసంతర్తు ప్రాదుర్భావంతో పూయటమూ మనమెరుగుదుము. ఈ సరికొత్త శరీరంలో నెత్తురు పాడిన పాటకు నగ్నశోభనందనవనమై పూయడం మాత్రం కొత్తలో కొత్త. నవ్యంలో నవ్యమేకాదు భవ్యమూను. అలాంటి నందన వనమై పూచిన నగ్నశోభను

"అవలోకిస్తే
అవినీతని
బుద్ధుబుచెప్పే
బుద్ధికికాదు"

"కన్నులనిండే
అందంకోసం
కళవళపడు
డెందాలకె"

అని నిత్యమైన సత్యాన్ని చెప్పి చివరికంటాడు కవి-

"చూపులతో
అందుకోండి!" అని.

ఈ చూపులు భౌతికమైనవి కావు. అంతశ్చక్షువులు; మన శ్చక్షువులు! తద్వారా గ్రహించి 'నందన వనంలా పూచిన నగ్న శోభను' పరమానంద పరవశుల్ని కమ్మంటున్నారు నారాయణబాబు పాఠకుల్ని.

"అదేమిటి
పండ్లరుచి తెలిసికూడా
పచ్చికాయలు రాల్చుకుంటూ
పారిపోయే
ఉడుతసరదా!"

అన్న సత్యాన్ని తెలుపుతూనే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేయడంలో ఉంది ధ్వని!ఆ వెనువెంటనే భారతప్రసిద్ధ విషయాన్ని గ్రహించి, ఆనాటినుంచి ఈనాటివరకు ఎడతెగకుండాలేదా మరింత పెచ్చుపెరిగిపోయి జరుగుతూన్న విషయాన్ని ఏనాడో వివరించా అభ్యుదయ భావికవి—

"వారెవరు ?
ఏదో
కీచకభావం
నా సైరంధ్రీ గీతాన్నే
చెరబడితే
చూస్తూ ఊరుకొనే
నా రక్తం
ధర్మరాజు" అంటారు మెల్లగా చల్లగా. ఇందులో ఎంతో ధ్వని ఉంది. సైరంధ్రి వేషంలోని ద్రౌపదిని కామాంధుడై కళ్లుగానక కీచకుడుచెరబట్టితే కంకుభట్టయిన ధర్మరాజు ఏమాత్రమూ చలించకుండా నిబ్బరంగా ఉండగలిగాడు. కానీ వలలుడైన భీముడో చీమూ నెత్తురున్న మనిషిలా ఊగిపోయి పుష్పఫల భరితమైన వృక్షాన్ని పెకలించబోయాడు. ఇది భారత కథ. ఆ కథనే ప్రతీకగా గ్రహించి నారాయణబాబు అలతి అలతి పదాలతో అతిశయితమైన అర్థంతో భావగర్భితంగా ఎంతోగొప్పగా చెప్పారు. కొండంత భావాన్ని చిన్న అద్దంలో బింబించారు. ఇది కవిత. ఇది భావుకత. 'వాక్యం రసాత్మకం కావ్య' మ్మన్న విశ్వనాధుని నిర్వచనం అంతకంటే "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్య' మ్మన్న జగన్నాధ పండిత రాయల నిర్వచనం ఇక్కడ ప్రత్యక్షర సత్యం. సహృదయైక వేద్యం.

తన నగ్నగీతాన్నిగూర్చి చేసిన నారాయణబాబు భావన అనన్య సామాన్యమేకాదు. అనితరసాధ్యమన్నా అసత్యంకాదు.

"జగమంతా
కన్నయితే
చీకటి కజ్జలమైతే
నాగీతం
చూపు!" - ఇంతటితో ఆగక మరణానంతరం జీవి వైతరణిని దాటాలంటే గోదానం చేయాలన్న మన హైందవమత సంప్రదాయాన్ని ఎంతో చక్కగా ఆ గోదానమే తన గీతమని నవ్యాతి నవ్యంగా విప్లవఋషిగా వ్యక్తీకరించారు-

"నీవునేను
ఈ ప్రపంచ వైతరణి
దాటేందుకు
నీ కోసం
నే చేసిన

గోదానం
నా గీతం!" అంటారు.

వైతరణి అంటే ఎక్కడో. ఈ ప్రపంచమే వైతరణి: దాన్ని దాటడానికి చేసేదే తన గీత మనే గోదానమంటారు నారాయణబాబు! ఇలా ఎవరూ చెప్పలేదు! ఇలా చెప్పడం ఎవరికీ చేతకాదు! అదే నారాయణబాబులోని ప్రత్యేకత! అదే అతనిలోని భావుకత!

సంప్రదాయ కవితపై తిరుగుబాటు చేసినవాళ్ళు, కొత్త పుంతలు తొక్కినవాళ్ళు భావ కవులు. అలాగే భావకవులతో కలిసి కవితలల్లిన కొందరు భావకవితపై ఎదురు తిరిగి అభ్యుదయ పథగాములయ్యారు. అలాంటి అభ్యుదయ భావోపసంపన్నుల్లో శ్రీ నారాయణబాబును మనం ఉట్టంకించడం అవసరం. శ్రీశ్రీ చక్కటి భావ కవిత- భావకవితేమిటి- ప్రబంధ కవిత అల్లారు ఆరంభంలో; కాని ఆ వెనుక అభ్యుదయ కవులకే అధినేత అయ్యారు.

"భావకవి న్మాత్రమకా న్నే
నహంభావకవి" నని శతాభిషేదేలురాగాల డజన్'లో
తన కసి నంతటిని తీర్చుకొన్నాడు. పోతే నారాయణబాబు 'ప్రేయసితో నరకానికి' అనే ఖండికలో భావకవితోద్యమంపై నిరసన వ్యక్తీకరించారు.

"రా!
నాతో నరకానికి
స్వాహా వల్లభు
పూజించే
సోమయాజుల మాటలు
బ్రతుకె నరచి
బంభరముల్లు తిరుగు
భావకవుల పాటలు
విని మోసపోయిన
వనిత!
వనత!
నత!
స్వర్గం అంటూఉంటే
ఎపుడైనా చూడొచ్చు
నరకం ఇఖ ఎన్నాళ్ళో ఉండదట!"

అని కొందరనుకొన్నట్లు 'భావ కవిత' గా ఈసడించుకొంటూనే చివరిగా ఇలా అంటారు వారు -

"చిత్రగుప్తుని
చిట్టాలన్నీ చింపి
పత్రాలు పకోడీల సుబ్బయ్య
పొట్లాలకు యిస్తా
యముని మహిషానికి
ఏరుపూసి
బంజరుభూములు దున్నించి
పంటలు పండిస్తా
లే, పద! వేళ్లైపోతున్నాది
వనితా వనతానతానన!"

అని చెప్పి అల్పాక్షరాలతో అనంతార్థ స్వర్గ నరకాలకున్న తేడాని కాంట్రాస్టుగా ఎంత గొప్పగా చెప్పారో చూస్తే నారాయణబాబు నవత, సింప్లిసిటీ, ఎకనామీ ఆఫ్ వర్డ్స్ మొదలైన కవికుండవలసి లక్షణాలు స్పష్టంకాక మానవు.

"అనర్థం
స్వార్థం
నాకం!

పరార్థం
యథార్థం
నరకం!"

బహుశా తెలుగులో మరేకవి స్వర్గనరకాల్లో నరకానికుండే విశిష్టతని వివరించిన కవి లేడేమో! వాస్తవానికి భావకవులంతా అదర్శవాదులు. అప్రాప్త సుందరికై, ఊహాప్రేయసికై ఆరాటపడి ఆనందానికి బదులు శోకాన్ని, నిర్వేదాన్ని సృష్టించిన వారన్న విషయాన్ని ఈ కవి మనకు స్పష్టం చేస్తున్నారు. అందుకే నరకమే నయమంటూ రమ్మని తన ప్రేయసిని పిలుస్తున్నారు.

నారాయణబాబు తన కవితలో ఉపయోగించిన ఉపమాసామాగ్రి నవ్యమేకాదు; భవ్యమూను; అందరికీ సాధ్యమయ్యేదీ కాదు; అనన్యసాధ్యమూను. కొన్ని ఉదాహరణలు:

"జితేంద్రియుని
బుద్ధిలాగు
జేగంటలాగు
కిటికీలో
దీపం!" అనడం, అంతకంటే

"గోడివతల
గదిలోపల
పేరుకొన్నకాంతి
గోడవతల
చీకటి!"-

అనడం అందులోను 'గదిలోపల పేరుకొన్న కాంతి' అనడంలోను మరింతకంటే గూడా

"హృదయంలో
ఒకటిరెండు
వెలుతురు గాయాలు" అనడంలో నారాయణబాబు నవ్యాతినవ్యమైన ఉపమాప్రయోగ నైపుణి ప్రకటితమవుతుంది. "వెలుతురు గాయాలు" అని ప్రయోగించిన కవు లెందరున్నారు ?

"గోడవతల
చీకటినవ్వింది ?"

ప్రయోగం అనంతార్థప్రయోగ స్ఫూర్తిమంతం.

ఇంకా గ నించండి కమనీయమైన ఈ ఉపమాప్రయోగాల్ని-

"రుధిరజ్యోతిర్
జ్వలనాలలనా
ప్రియుండ!
విప్లవఋషిని
విద్రోహకవిని
ఆహవరంగం నా
హృదంతరంగం
పగిలిన ఖలేజాలె
నా
పాటల ఖలేజాలు"

అనడంలో ఉంది ఆయన నవ్యత.

"మర ఫిరంగినై
మహతిగ మీటి
కదనకుతూహలరాగం
వినిపిస్తాను
అగ్గిని కురిపిస్తాను."

అనడంలో నారాయణబాబు నవ్యత అంటే తిరుగుబాటు ధోరణితో ఎంత విస్పష్టం చేశారో తెలుస్తుంది మనకు. "గాలి పెదవులు, చావుపూవులు, వెన్నెలకత్తి" అని చెప్పడమేకాదు; చివరికి -

"మహాశక్తినై
మారణమంత్రం
పారణచేస్తూ
చివురించిన ఈ
జనాళియుద్ధం
జైత్రరథమ్ముగ
కజ్జలకాళి
గజ్జలగుర్రం
కాలభుజంగం
కళ్ళెంలాగి
'ఛలో! ఛలో!' యని
సాగిపోయెదను"—

అని తమ నవ్యకవితా దృక్పథాన్ని, విప్లవ విరాట్స్వరూపాన్ని వివిధ రీతుల వివరించారు.

ఇంకా ఈ ఉపమాప్రయోగాలెన్నో రకాలు—

"ఆముదపు ప్రమిదలలో
వెలిగేదీపాలు
హృదయంలో భావాలు"

"కాలిన ప్రేయసి
దేహం
చమురుకంపు
ఈ లోకం"

"మక్కున విధి
త్రాడై వేలాడగ
పటిపట్టీలాగుతుంది"

"గాలికెడగే
తెరచాపై కదిలింది
రెక్కలు విప్పింది
ఎవరో బంధించిన
ఎముకల పంజరమ్ములో
ఆత్మ
ఎగరాలని"

"హేమంత శర్వరీ కురులు
ఇరులు"— ఇలా చెబుతూపోతే మొత్తం పుస్తక మంతా ఉదాహరించవలసి వస్తుంది. సహృదయులు చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

ఇకపోతే నారాయణబాబు కవితలోని నవతను చవిచూడాలంటే ఆయనలో ప్రస్ఫుటంగా కొట్టవచ్చినట్లు కనిపించే అధివాస్తవికత, నగరవర్ణన, ప్రతీక కవిత, శబ్దచిత్ర భావచిత్ర కవితాధోరణుల్ని పరిశీలిస్తే ఆయన ప్రతిభావ్యుత్పన్నతలు మరింతగా మన మనస్సులకు ఆనందం అందించి నవకవితల్లజునిగా స్వరూప స్వభావాలతో కన్పట్టకపోరు. అద్దంలో కొండను చూచినట్లు స్థూలంగా ఒకటి రెండు ఉదాహరణలతో వీటిని పరిశీలిద్దాం.

నగరవర్ణన చేసిన మొదటి అభ్యుదయ కవి నారాయణబాబు. ఒకనాటి విశాఖపట్నాన్ని గూర్చి ఆయన చెప్పిన ఈ కవితలో ఎంత వాస్తవికత-కాదు- అదివాస్తవికత? విశాఖపట్నం సుమారు మూడుపదులవెనుక చూసినవారికిది ఎంతో సహజమూ, వాసవమూ అనిపిస్తుంది. సందేహమేలేదు.

"విశాఖపట్నం
విశాఖపట్నం
జోడులేక
పోకూడదు
నీగ్రో స్త్రీ బుగ్గల్లాగ
నిగనిగలాడే తారురోడ్లు."

ఇందులో 'తారురోడ్లని నీగ్రో స్త్రీ బుగ్గల్లా' పోల్చడం నారాయణబాబు కొక్కరికే చేతవుతుందనిపిస్తుంది. ఈ నగర వర్ణన 11 పుటలు సాగింది. ఉల్లేఖిస్తూపోతే మొత్తం అంతా చేయవలసి వస్తుంది. అలాకాక కొన్నింటిని చవిచూద్దాం. నా వ్యాఖ్యానం అనవసరమనే భావిస్తూ మానేస్తున్నా.

"ఇక్కడ-
స్వర్గం నరకం
సురక్షించి
కంపు కొడతాయి.

ఇక్కడ
చావుబ్రదుకు
అత్తా కోడళ్లలా
అభిమానించుకుంటూ
కొట్లాడుతాయ్.

పడిపోయిన కొంపల్లో
పాతివ్రత్యం
మురికి గుడ్డల్లో కంపుకొట్టి
పలవిస్తే
రంకుసెంటు వాసనతో
రైంయని
కారులో షి
కారు చేస్తుంది."
"సిరాబుడ్డిలో ఆత్మహత్య
విమానంలో భ్రూణహత్య
పెట్టెబండిలో గర్భస్రావం
సూటులో సుడిగుండం"
"మనీపర్సులో దొంగలు"
"చల్లగా మెల్లగా హాయిగా
ఆశుదాని కౌగిలిలా రాత్రిలు
లెంపకాయ కొట్టినట్టు పగళ్లు"
"దోసెడంత సందుల్లో
గోదావరంత కుళ్లు కాలవలు"
"సాయంత్రిం
చందమామ
సినిమా చూశాకే
వెన్నెల కాస్తాడు"
"మేడలపై
మెడికల్ కుర్రాళ్లు
ఎముకలతో
వలపు జాబు
లిఖిస్తారు"
"తల్లులు
పాలీయని
పిల్లలె
తాండవ కృష్ణులు"
"త్రాగేందుకు నీరులేకపోయినా
డయాబిటీస్‌కు లోటులేదు.
పిలవకుండా
పలికే పుండలకు
పిలిస్తే పలికే జబ్బులు"
"సకలరోగ నివారిణి
సాని
దొరసాని
నరసమ్మ"
"పురిటిగది ఆసుపత్రి"
"భోగందానింటికెళ్లి
బాగుపడినవాడుండొచ్చు.
లాయర్ల యింటికెళ్లి
లాభం పొందినవాడు సున్న
గుమాస్తాగాళ్లంతా
గుల్లదాళ్లు.

బీదవాళ్ల నెత్తురు
బీరులాగ తాగేస్తారు"

"దొరసానిలాంటి
విశాఖపట్నానికి
వాల్తేరు వక్షోజం
ధనవంతుల ధనుష్కోటి"

"ఆంధ్రుల విశ్వవిద్యాలయం
ఓఢ్రుల సహాయం
అరవ పండితులు
మార్కులొస్తే
మహా మహోపాధ్యాయ
రాకపోతే
రాలుగాయ"

"ఆఫీసులు ఆశ్రమాలు
ఆఫీసర్లే ఋషులు
లంచం కోసం తపస్సు
అచ్చర కన్నెలు
రూపాయలు"

"ప్రజల పాపం హార్బరు చేసేందుకే
హార్బరు
థర్మామీటర్లలాంటి
గొయ్యలతో
ఎనిమా దొక్కుల్లాంటి
స్టీమర్లు
నగ్నంగా స్త్రీ
స్నానం చేసేటప్పుడు
ఎదురుగుండా పరాయి మొగాడు
ఏరాడకొండ
అలీబాబా
అద్దం—"

ఇది విశాఖ విస్పష్టమైన వర్ణన. ఇంతగా వర్ణించిన కవిచూపు ఎంత సూక్ష్మాతి సూక్ష్మమైందో, పరిశీలన ఎంత పరినిష్ఠమైందో వేరుగా చెప్పనవసరంలేదు. దీన్ని వివరించబోవడం విడ్డూరం. అందుకే వదిలేస్తున్నా. ఇలాగే పఠాభిసైతం మద్రాసునగరపట్టన చాలా చక్కగా చేశారు. తమ "ఫిడేలురాగాలడజన్" లో.

పదచిత్రాలు, భావచిత్రాలు నారాయణబాబు కవితలో కోకొల్లలు. 'విశాఖపట్నం' ఖండికలో పూర్వం ఉల్లేఖించినవన్నీ ఇందుకు ఉదాహరణలే. కొన్ని మచ్చుకు 'సామిదేవి' ఖండికలో—

"కాలంనాగు
వినువీధులలో
వెన్నెలపడగ
విప్పింది,
శారదరాత్రి
శంకరు ఫాలం
బూది పవిత్రత
బూరాపూదిందీ"

ఇలాగే 'కావాలి' అనే ఖండికలో—

"ఆరిన చితిలో
బూడిదవెన్నెల
జారినచుక్కపుడక
ఒకచేచుక్క,
సమాధిలో
మృతశిశువట్టుల
జలదాంతర శశి"

ఇందులో కవికిగల ఆర్తి అర్థమవుతుంది. ఇంకా ఇంత కంటే 'భావం' అనే ఖండికలో 'ఇమేజరీ' పరాంకోటినందింది—

"వేడిగ గీతం
విప్పి గప్పిన నిప్పు
హృదయం
కుదిపిన కుంపటి
జీవితం
హేమంత నిశ
మంచు దెబ్బ
సహించుకోలేక
పుడమి
అంచులు వెలసిన
నిశానీల దుప్పటి
కప్పుకొని
ముడంకె వేసి
నిద్రిస్తే
పుండుమీద చేయిలా
బాధాకరంగా గాలి"

ఇంకా ఇలాగే "తెలుగుస్వాతి", "చల్లనిగాలి", "వెన్నెల లోతుల్లో" అనే ఖండికలో ఎంతో స్ఫూర్తిమంతమైన 'ఇమేజరీ' మనం చూడవచ్చు.

నారాయణబాబు నవ్యాతి నవ్యంగా చెప్పిన అధివాస్తవికతకు "చిన్నా", "గేదెపెయ్య", "నేనెవరో" ఖండికలు చక్కటి ఉదాహరణలు. ఈ నవ్యధోరణిలో ఆయనకాయనేసాటి. ఎవరూ లేరు పోటీ ఈనాటికీ ఇలాగే వీరి ప్రతీక కవితకు 'గడ్డిపరక', 'కిటికిలో దీపం' నిక్కమైన నిదర్శనాలు.

ఓ పక్క సంప్రదాయ ప్రతీకల్ని వాడుతూనే సంప్రదాయ విరుద్ధంగా నినదించడం నారాయణబాబు కవితలోని మరోనవ్యత.

కొన్ని ఉదాహరణలు—

"నల్లని త్రాచుకోరలు
తెల్లని మఖూచికుండలు
గగనమ్మున
తారలు!"

"ఒళ్లు తెలియని
పుళ్ల బాధతో
వెక్కి వెక్కి
ఏడ్చినది
చుక్కల ఆకాశం!"

"ఆహవరంగం నా
హృదంతరంగం"

"పగిలిన ఖలేజాలే
నా పాటలజలేజాలు"

"మరఫిరంగినై
మహతిగ మీటి
కదన కుతూహలరాగం
వినిపిస్తాను
అగ్గిని కురిపిస్తాను."

ఇలాగే 'జ్వలనా', 'అగ్ని వీణ', 'దులుపు బూజు', 'ప్రేయసితో నరకానికి' మొదలైన ఖండికల్లో ఎన్నోచిత్రాలు చూడ వచ్చు. ఇంకా "ఎడారి పుష్పించింది", "విహాయస! విపినమటుల, విహరించె ఐరావతపు పంది! అర్ధచంద్రుడు! అందపు నా! చంద మామ! మనలో మనమాట! మరచితివా! మరచితినా" "తీతుక! తుమ్మచెట్టుమీంచి! 'తీ'యని 'తీ'యని! ప్రేమగీతి! వినిపిస్తే"— ఇలా ఎన్నైనా చూపించవచ్చు. తద్వారా నారాయణబాబు 'కదన కుతూహల రాగం'లో—

"రుధిరజ్యోతిర్
జ్వలనాలలనా
ప్రియుండ!
విప్లవఋషిని
విద్రోహకవిని"—

అని చెప్పుకొన్న మాటలు అక్షరసత్యం.

చివరిగా ఒకవిషయం ముచ్చటించుకోవడం అత్యవసరం. నారాయణబాబు ప్రభావం దిగంబర కవులపై ఎక్కువగానే కని పిస్తుంది. అంటే దిగంబర కవులు నారాయణబాబు కవితవల్ల బాగా ఇన్‌స్పైర్ అయి రాసారనడానికిఎన్నైనా ఉదాహరించవచ్చు. అభ్యు దయ కవి నారాయణబాబు ఏనాడో రాసిన 'దేశమాత' కవిత చదివి చెరబండరాజు 'వందేమాతరం' దిక్ చవిచూస్తే ఈ భావం ప్రస్ఫుటమవుతుంది.

"ఉసురుసురైంది
ఉమ్మలించింది
అసువులు వీడి
చచ్చినదేశమాతయై
చాపచుట్టగ
నేలకువాలింది"

(దేశమాత - నారాయణబాబు)

"ఓ నా ప్రియమైన మాతృదేశమా
....
అంతర్జాతీయ విపణిలో అంగాంగం
తాకట్టుపెట్టిన అందం నీది.
....
ఒంటిమీద గుడ్డలతో జండాలు కుట్టించి
వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యం నీది
....
ఆకలికి ఎండి మాడి ఎరువుసొమ్ములతో
వీధినబడ్డ సింగారం నీది
అమ్మా భారతీ నీగమ్యం ఏమిటితల్లీ!"

(వందేమాతరం - చెరబండరాజు)

ఇలాగే నారాయణబాబు "కదనకుతూహలరాగం", మహా స్వప్న 'గ్లానిర్భవతి భారత' భైరవయ్య 'చెరచబడ్డ గీతాన్ని 'ఉదా హరణలుగా చెప్పవచ్చు. ఇంకా ఎన్నైనా చూపించవీలుంది.

ఇలాగా తెలుగుసాహిత్యాభ్యుదయాకాశంలో అనంతకాలమూ అత్యున్నతంగా పరిజ్వలించే "జ్వలనాలలనా ప్రియుండు" మాత్రమే కాదు! ధ్రువతార నారాయణబాబు!

ప్రేమదే ఆ ఘనత!

వ్రాలకాకిని చూచి
తీపి కోకిలని భ్రమిసేను.

గొంతు విప్పగనే
గుండెలోకి తొంగిచూడగనే
మరుభూమి కనిపించి
చితిమంట లెగసి
హాహారవముల
అష్టమశని 'జముడుగాక సంగీతము' వినిపించింది!
ఏనాటి దౌర్భాగ్యమో కాలపాశమై నునులాగింది!!

నా మధువని ఎక్కడ ?
నా వలపు వసంత మెక్కడ ?
మందహాసాల
మధురానురాగ కోకిల స్వరమెక్కడ ?
నను లాలించే ఆ ఆత్మీయతా సమీరమెక్కడ ?

కాని
ఎందుకనో ఏమో
తెలిసో
తెలియకో
చేతినుంచి జారింది పాదరస ముత్యం!

నేలపాలై
ఎన్నో ముక్కలుగా
నిలుచుండిపోయింది నిట్టూరుపులతో!

ఆ ముత్యమే
నా హృదయంలోని సత్యమై
నన్ను నిలువునా దహిస్తోంది!
నా అణువణువునా శతఘ్నుల నింపుతోంది!

కాదని కాలు కదపలేను
అవునని పెదవి మెదపలేను
ఆ చెలిని మరచి
జాలితో నన్ను సముదాయించు కోలేను!
ఆ చెల్వను శిక్షించాలని
కసితో నన్ను నేనే చంపుకోలేను!

మరవలేను
మదిలో దాచలేను
గుండెను పిండుతున్న వేదనొక చోట;
మమత నద్దుతున్న భావనొక చోట!
ఆ వేదన నాలోని 'మామూలు మనిషి' ఆవేదన
ఆ భావన నాలోని 'ప్రేమపిపాసి' రాగాలాపన
నాదికాదు కానేకాదు బలహీనత
అది ముమ్మాటికీ ప్రేమదే ఆ ఘనత
అందుకే దానికి తలవంచాను
సుఖీభవ! అని దీవించాను!

ద్వైతమా? అద్వైతమా?

గతానుభవాలు
అవిస్మృత గాఢాను భూతులై
రాటుదేలిన హృదయాన్ని సెంట్రిఫ్యూజ్ చేస్తుంటే
అంతరాత్మే సెంట్రీ !

ఎన్ని కలలు
అంతం లేని కడలి అలలు
వలయాలు వలయాలుగా చుట్టేస్తుంటే
ఈ అంతరాత్మే ఎస్కార్ట్!

వసంతాలు వాడిపోలేదు
కొన్ని నన్ను విడిచి వెళ్ళాయి
హేమంతాలు వెళ్ళిపోనూ లేదు
కొన్ని నాలో విడిది చేసాయి
ఈ ప్రత్యగాత్మ అప్పటికీ యిప్పటికీ అంతే
మాటామంతీ లేదు!
మౌనం
నిర్వేద నిర్వాణం!
జస్ట్! సైలెన్స్!!

ద్వైతమా? అద్వైతమా?

కాకికి పిండాన్ని పెడుతున్నాను
పితృశేషాన్ని తింటున్నాను
అస్థిత్వవాదినై అలారం మ్రోగిస్తున్నాను
అనంతవారధినై హ్యూమన్‌చైన్‌ని రౌండు
కొట్టిస్తున్నాను
ఎలా ఉన్నా ఏంచేసినా ఎప్పటికీ ఒకటేరకం
ఈ ప్రత్యగాత్మ అనవగతం!
ధ్యానం
నిశ్చల నిర్మాల్యం !
జస్ట్ ! మెడిటేషన్!!

ఆమె కావాలని
కళ్లు కాంక్షించి వాంఛించేవి
ఆమె పొందు కావాలని
గుండె తల్లడిల్లి తలమునకలయ్యేది
విరహంలో వినూత్నా వేగం రూయిన్ చేసేది
సంగమంలో సాటిరాని ఉద్వేగం అసిడ్ రెయిన్ కురిపించేది
అయినా అదేమో
ఆత్మమాత్రం స్పదించదు!

ప్రతిధ్వనిస్తుంది!
ఇటీజ్ హెల్ప్‌లెస్‌లీ అన్‌యిమాజినబుల్ !!

ఆమె నన్ను విడిచి వెళ్ళింది
నా కోసం "మిచీ"◆ని వదిలి వెళ్లింది
ఆమె నన్ను రమ్మంటూ రంపుపెడుతోంది
నా "మిచీ" కోసం యీ దేహం మొరాయిస్తోంది
వియోగంలో ఎంతబాధ ఆల్‌మోస్ట్ కిల్లింగ్
కర్తవ్యపరాయణంలో ఎంత బాధ్యత
ఒహ్ ! థ్రిల్లింగ్

అయినా అదేమో
ఆత్మ అసలు పట్టించుకోదు!
ఏమాత్రమూ విన్పించుకోదు!
ఇట్ సీమ్స్ హైలీ యిడియాటిక్ !!

ఎన్ని రాత్రులు గడిచాయి
ఎన్ని సమాధులు నడిచాయి
ఎన్ని ఉదయాలు వెలిగాయి
ఎన్ని పురిటినొప్పులు కేరింతలేసాయి
ఈ ఆత్మ చిద్విలాసంగా నవ్వుతుంది!
అల్ఫ్రెడ్ హిచ్‌కాక్ సస్పెన్స్‌లా ఏడుస్తుంది!
ఏదీ అర్థంకాదు
అసలు బోధపడదు!

ఎన్ని ఎక్స్‌పెరిమెంట్స్ చేశారు
ఎన్నెన్ని కామెంట్స్ మొదలెట్టారు
ఎన్ని యిజాలు నిజాలకోసం బయలు దేరాయి
యిన్ని కత్తులు నెత్తుటి మడుగుల్లో మునిగితేలాయి
అయినా ఈ ఆత్మ చూస్తూనేఉంటుంది!
అనంతంగా అనందిస్తూనే ఉంటుంది!
అదో విచిత్రం
అర్థంకాదు దాని వైనం!

చూడు మనూ!
ఆత్మ అనేది ఉంటే
పరమాత్మ ఎవర్ గ్రీన్!
ఆత్మ అనేది లేదనుకొంటే
ఈ జీవాత్మే నోమోర్ !

◆("మిచీ" అనేది "మైథిలీచంద్ర" పేరుకి పొట్టి రూపం)

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

డాక్టర్ కోర్లపాటి శ్రీరామమూర్తి

అపర నన్నయభట్టు లక్షణసారము, ఆంధ్రశబ్దచింతామణి

(గత సంచిక తరువాయి)

ఆంధ్రశబ్ద చింతామణి ఆదికవి నన్నయభట్టు కృతము కానిచో, మధ్యకవి నన్నయభట్టు కృత మగునా? అనగా లక్షణ సారము, ఇంద్రవిజయము, రాఘవాభ్యుదయము రచించిన నన్నయ భట్టు అగునా? అని. పరిశీలనీయము.

ఆదికవి నన్నయభట్టు కాలము పదునొకండవ శతాబ్ది. మధ్య కవి నన్నయభట్టు కాలము పదునైదవ శతాబ్ది ఉత్తరార్ధము, పదు నారవ శతాబ్ది పూర్వార్ధము అని (1450-1550) పూర్వోక్తము. ఇది ప్రాతిపదిక. ఇక -

'ఆదిని శబ్దశాసన మహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపఁగాఁబడియె నెందును దానినె కాని సూత్ర సం
పాదన లేమిచేఁ దెనుఁగుపల్కు మొత్తముకట్టిఁగూర్చి
చెప్పఁగా
రాదని పక్షపాటి కవి రాక్షసుఁడీ నియమంబుఁ
జేసినన్' - 46 ప., 1 ఆ.

అని కాకునూరి అప్పకవి ఆంధ్రశబ్ద చింతామణి యందే కలదు. ఆంధ్రశబ్ద చింతామణి ఆదికవి నన్నయభట్టు కృతమని అంగీకరించిన కాకునూరి అప్పకవియే యీ విషయమును ప్రతిపాదించుట గమనార్హమైన విశేషము. పయి విషయము నందు తెలుగు భాషకు సూత్రసంపాదనము అనగా వ్యాకరణము లేకపోవుట వలన దక్షారామములోని కవిరాక్షసుడు పయి నియమము చేసినట్లు కలదు. అనగా కవిరాక్షసుని కాలము వఱకు తెలుగు వ్యాకరణమైన ఆంధ్రశబ్ద చింతామణి లేదని అవ గాహన మగును. కవి రాక్షసీయమను ఛందోగ్రంథమును, ఆది నారాయణ చరిత్ర మను పూర్వకావ్యమును రచించిన కవిరాక్షసుని కాలము నన్నయ, తిక్కనల నడిమి కాలము.[19] కనుక తిక్కనకు పూర్వము ఆంధ్రశబ్దచింతామణి లేదని కరతలామలకము. మఱి,

'మున్ను తెలుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్పరేఁ జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయభట్టాది కవి జనంబుల కరుణన్

క్రొత్తగ నాంధ్రభాషకును గొంచక లక్షణమిట్లు చెప్పునే
యుత్తమబుద్ధి యీతఁడని యొరలవోపక విన్నఁజాలు మీ
రొత్తిన మీకు మాఱునకు నుత్తరమిచ్చుట చాలయెగ్గు మీ
చిత్తమునందు నన్నెరవు సేయకుఁడీ కవులార
మ్రొక్కెదన్' 10

అని కేతన ఆంధ్రభాషా భూషణమునందు కలదు. ఇందు కేతనకు పూర్వము తెలుగునకు లక్షణము అనగా తెలుగుభాషకు లక్షణము అనగా తెలుగువ్యాకరణమును ఎప్పుడును ఎవ్వరును రచింప లేదని, కేతనయే క్రొత్తగ అనగా మొట్టమొదట తెలుగు వ్యాకరణమును రచించినట్లును కలదు. కేతన తెలుగు వ్యాకరణము ఆంధ్రభాషా భూషణమే. అది కర్ణాటకభాషా భూషణమును అనుసరించినది[20] గాని, ఆంధ్రశబ్ద చింతామణిని అనుసరించినది కాదు. అనగా కేత నకు పూర్వము ఆంధ్రశబ్దచింతామణి లేదని అవగాహన మగును. కేతన, తిక్కనలు సమకాలికులు. కనుక తిక్కనకాలము నందును ఆంధ్రశబ్ద చింతామణి లేదని కరబదరకము.

ఆంధ్రశబ్దచింతామణికి తొలి ఆధారాలము బాలసరస్వతీయము. అందు

'కవిభల్లటైః క్రియాణాం నామ్నాంచోల్లోప ఇష్యతేహ్యేషు
స్థిథమైక వచనమాత్రే వికృతౌ నాన్తాదయో౽పి కథ్యన్తే'
- 18 శ్లో. హ. వ.

అని కలదు. ఇందు కవిభల్లటుని మతము కలదు. కవిభల్లటుడు సంస్కృతమున పదమంజరి, గణమంజరి, తెలుగున విక్రమార్క-

చరిత్రము రచించెను.21 పదమంజరిని బట్టి బుద్ధనృపాలుని కాలము వాడని, గుణమంజరినిబట్టి దక్షారామము వాడని, సకలభాషా కవితా నిర్వాహకుడని తెలియును. అంతేకాదు. కాకునూరి అప్పకవి పేర్కొన్న కవిభల్లటపక్కిక (5 వచ., 1 అ.) కవిభల్లటుని తెలుగు వ్యాకరణ గ్రంథమే అగును. అదికూడా కేశవ ఆంధ్రి భాషాభూషణము కంటె అనంతర గ్రంథమే అగును. కనుక, కవి భల్లటునికి సంబంధించిన బుద్ధనృపాలుడు కవిసార్వభౌముడు, కవి కల్పతరువు, కవిలోకభోజుడు, కవిపురందరుడు, సమసీమిభోషణో త్సుక సుఖోన్నతుడు, రంగనాథ రామాయణకర్త అయిన గోన బుద్ధభూవిభుడు కావచు ను. రంగనాథరామాయణ రచనాకాలము పదమూడవ శతాబ్ది ఉత్తరార్ధము. 22 కనుక బుద్ధనృపాలుని కాలమువాడైన కవిభల్లటుని కాలమును పదమూడవశతాబ్ది ఉత్తరార్ధమే. కనుక పదమూడవశతాబ్ది ఉత్తరార్ధములోని కవిభల్లటుని మతమును ప్రతిపాదించిన ఆంధ్రశబ్దచింతామణి పదమూడవశతాబ్ది ఉత్తరార్ధము కంటె అనంతరకాలములోని గ్రంథము కావలయును.

ఆంధ్రశబ్దచింతామణిలోని 'కవిభల్లటైః' అను పదమునకు 'కవిభల్లటైః=కవిభల్లటాచార్య లనెడి పురాతన లక్షణకర్త చేత' అని ఎలకూచి బాలసరస్వతి టీక. "కవిభల్లట సంప్రదాయమువారు" అని పారనంది రామశాస్త్రిలుగారి అర్థము. కవిభల్లటుని కాలము కంటె కవిభల్లటుని సంప్రదాయము వారి కాలము అనంతర మగును. కవిభల్లటుని కాలము పదమూడవ శతాబ్ది ఉత్తరార్ధము కావున, కవిభల్లటుని సంప్రదాయము వారి కాలము పదునాల్గవ శతాబ్ది కావలయును. అయిన కవిభల్లట సంప్రదాయము వారి మతము కలదన్న ఆంధ్రశబ్దచింతామణి పదునాల్గవశతాబ్ది కంటె అనంతరగ్రంథ మగును.

ఆంధ్రశబ్దచింతామణికి తొలి ఆ వ్యాఖ్యయైన బాలసరస్వతీయము నందే ఇట్లుకలదు -

'దీర్ఘాణాం హ్రస్వ స్స్యాన్నపదేశ్యపదే నచైకవర్ణేపి'
- 47 శ్లో. అ. ప

ఇందు 'దీర్ఘాంత ములైన శబ్దములకు హ్రస్వము వచ్చును. దేశ్యపు దెలుగుపద మందురాదు. ఏకాక్షర తత్సమపద మందును దీర్ఘమునకు హ్రస్వమురాదు' అని బాలసరస్వతి టీక. లక్ష్మీ అను సంస్కృత శబ్దములోని, సిరీ అను ప్రాకృతశబ్దములోని అంతిమ దీర్ఘమునకు హ్రస్వమువచ్చి లక్ష్మి, సిరి అను తత్సమరూపములు సిద్ధించును. అట్లు దేశ్యశబ్దము లందు అంతిమ దీర్ఘమునకు హ్రస్వము రాదని నిషేధింపబడినది. నిజమైన దేశ్యశబ్దములు దీర్ఘాంతములు కావు. కనుక దేశ్యశబ్దములందు అంతిమ దీర్ఘము నకు హ్రస్వము రాదని నిషేధింపనక్కరలేదు. కాని దేశ్యశబ్దము లుగ వ్యవహృతమైన అన్యదేశ్య శబ్దములు దీర్ఘాంతములు కలవు. కనుక సూత్రములోని నిషేధమునకు నిమిత్తము అన్యదేశ్యశబ్ద ములు; 'నవలా, నవలాలు; జేజే, జేజేలు; తేజీ, తేజీలు; నేజా, నేజాలు; లకోరీ, లకోరీలు' అని బాలసరస్వతి ఉదాహరణములు. ఇందు 'జయ జయ' అను సంస్కృత పదబంధమునకు 'జేజే' అనునది వికృతి అయినను మరి అసలు శబ్దము జయశబ్దమే. జయశబ్ద వికృతి జే. అది ఏకాక్షరశబ్దము. జేజే యనునది ఆమ్రే డిత రూపము. ఏకవర్ణమునందును అంతిమదీర్ఘమునకు హ్రస్వము రాదు అను నిషేధమునకు అది విషయము. నవలా, తేజీ, నేజా, లకోరీ, మొదలైన శబ్దములు అన్యదేశ్యములు. ఇట్టి శబ్దములందు అంతమదీర్ఘమునకు హ్రస్వము రాదని నిషేధించుటకు - వచ్చిన సందర్భముగాని, వచ్చునా ? రాదా ? అను సందేహము గాని ఉండ వలయును. కవుల అన్యదేశ్య ప్రయోగములు ప్రథమతః తిక్కన భారతమునందు కలవు. తిక్కన, మారన ప్రయోగించిన కైపు, త్రాసు అను శబ్దములు అన్యదేశ్యములైనను దీర్ఘాంతములుకావు. దీర్ఘాంతమైన అన్యదేశ్యప్రయోగము ప్రథమతః శ్రీనాథుని హర విలాసము నందుకలదు. అది అన్యదేశ్య శబ్దములోని అంతిమ దీర్ఘమునకు హ్రస్వము వచ్చిన సందర్భము.

'ఖుసిమీఱన్ సురథాణి నింపుకొలువై కూర్చున్నచో'

ఇందు 'ఖుసి' అను పదమునకు మూలము 'ఖుషీ' అను పారసీక పదము. కనుక అన్యదేశ్యము. అది దీర్ఘాంతము. కాని శ్రీనాథుని ప్రయోగము హ్రస్వాంతము. ఇట్టి ప్రయోగము జక్కన విక్రమార్క చరిత్ర యందును కలదు.

'అన్నవల ముద్దుమోమును
దిన్నని నెన్నడుము నగవుదేటెడు కన్నుల్' - 73 ప. 5 అ.

ఇందు 'నవల' అను పదమునకు మూలము 'నవలతా' అను సంస్కృత పద బంధమునకు సంబంధించిన 'నవలఆ' అను ప్రాకృతరూప మని కొందఱి అభిప్రాయము. నవలత అనగా క్రొత్తతీగ అని అర్థము. స్త్రీ క్రొత్తతీగ వలె ఉండును గాన నవ లతా = నవలఆ = నవల = అనిది అనుట వ్యుత్పత్తి కాదు, వ్యుత్పత్త్యాభాసము. నవల అను పదమునకు జక్కన విక్రమార్క చరిత్రకు పూర్వము కవి ప్రయోగము మృగ్యము. అది ప్రాకృత వికారమైనచో, అర్వాచీన ప్రయోగము కావలసిన అవశ్యకము లేదు. కవిత్రయ ప్రయోగమే కన్నులకు కట్టును. అర్వాచీన

ప్రయోగమైన 'నవల' అను పదమునకు మూలము 'నుబలా' అను పారసీక పదము. అది దీర్ఘాంతము. కాని ఇక్కడన ప్రయోగము హ్రస్వాంతము. అదేశబ్దము అల్లసానిపెద్దన మనుచరిత్రమునందు ఇట్లు కలదు.

'నతనాభిన్ నవలా నొకానొక మరున్నారీ శిరోరత్నమున్'

ఇందు 'నవలా' అను పదము దీర్ఘాంతముగ కలదు. 'నుబలా' అను పారసీక పదమునకు తెలివైన ఆడది అను అర్థము వచ్చును. అది తెలుగున 'ఆడది' అను అర్థవ్యాకోచము నందును, కలికి శబ్దము వలె. కనుక 'నవలా' అను పదమునకు మూలము 'నుబలా' అను పారసీక పదమే. అది దీర్ఘాంతము. పెద్దన ప్రయోగమును దీర్ఘాంతము. అనగా అన్యదేశ్య శబ్దములోని అంతిమ దీర్ఘమునకు హ్రస్వమురాని సంప్రదాయమిది. వచ్చిన సందర్భము ముందు కలదు. రాని సందర్భము తర్వాత కలదు. కనుక వచ్చునా? రాదా? అను సందేహము ఆ తర్వాత కలుగును. వచ్చుననియో రాదనియో వ్యాకరణము చెప్పవలయును. 'ప్రయోగశరణం వ్యాకరణం'. రాదని ఆంధ్రశబ్దచింతామణియందు కలదు. కనుక ఆంధ్రశబ్దచింతామణి అల్లసాని పెద్దన మనుచరిత్ర కంటె అనంతర గ్రంథము కావలయును. మనుచరిత్ర రచనాకాలము పదునారవ శతాబ్ది ప్రథమ పాదము. కనుక ఆంధ్రశబ్దచింతామణి రచనా కాలము పదునారవ శతాబ్ది ద్వితీయ పాదము కావచ్చును. ఆ కాలము 1526- 1550.

నన్నయభట్టు లక్షణ సారము రచనా కాలము స్థూలముగ 1450- 1550 అని పూర్వోక్తము. నన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణి రచనాకాలము స్థూలముగ 1526- 1550. కనుక లక్షణసారమును రచించిన నన్నయభట్టు, ఆంధ్రశబ్దచింతామణి రచించిన నన్నయభట్టు ఒకడు కావలయును. అంతేకాదు. లక్షణ సారము ఛందోలక్షణ గ్రంథము. ఆంధ్రశబ్దచింతామణి వ్యాకరణ లక్షణ గ్రంథము. ఉపరి, ఆంధ్రశబ్దచింతామణియందు ఛందోవిషయము అలతిగ కలదు. కనుక లక్షణసారమును రచించిన నన్నయభట్టే ఆంధ్రశబ్దచింతామణి రచించిన నన్నయభట్టు అగును. అనగా ఆంధ్రశబ్దచింతామణి ఆదికవి నన్నయభట్టు కృతము కాదని, మధ్యకవి నన్నయభట్టు కృతమని అర్థము.

ఆంధ్రశబ్దచింతామణి రచనా కాలము 1526 — 1550 కావున లక్షణసారము రచనా కాలమును అదే. ఇంద్రవిజయ, రాఘవాభ్యుదయముల రచనా కాలమును అదే. ఇంద్రవిజయ, రాఘవాభ్యుదయములు అప్రాప్తములు. లక్షణసారాంధ్రశబ్దచింతామణులు ప్రాప్తాప్రాప్తములు. అథర్వణ కారికావళి అండ లేనిచో ఆంధ్రశబ్దచింతామణి అసమగ్రము. అప్రాప్తము. ఇంద్రవిజయ, రాఘవాభ్యుదయ, లక్షణసారాంధ్రశబ్దచింతామణులు పౌర్వాపర్యక్రమము కావచ్చును. కనుక ఆంధ్రశబ్దచింతామణి రచనా కాలము 1550 ప్రాంతము.

1550 ప్రాంతమునందు అపర నన్నయభట్టు రచించిన ఆంధ్రశబ్దచింతామణి ఎలకూచి బాలసరస్వతికిలభించినది. ఎప్పుడు? ఎక్కడ? - ఎట్లు? ఎలకూచి బాలసరస్వతియే చెప్పినవిషయమిది-

'-మున్నొక్కనాడు విద్యానగరిలో నచింత్యకారణోపాగమ స్నేహసాహచర్యుండగు శివయోగివర్యుచే దైవచోదనం బున బ్రాప్తమైన యాంధ్రశబ్దచింతామణి గ్రంథంబునకు లోకోపకారార్థంబుగాఁ దీకఁ గావింపఁగోరి నెమ్మనంబున-

'ఉ॥ ఏమి మహాద్భుతంబిది హరీ! హరి! యెక్కడి యాంధ్రశబ్దచిం
తామణి ఫక్కి? యెక్కడి మతంగ నగంబు? యుగాది సంభవుం
డై మును చన్న నన్నయమహాకవి యెవ్వఁడు? సిద్ధుఁ డెవ్వఁ? డా
హా! మదగణ్యపుణ్యచయముచగ్రితఁ జేకుఱెఁగాదె యిప్పుడున్

మ॥ ఇలఁ బ్రాజ్ఞాదికులౌ కవుల్ మునుపు లేరే! వారు వ్యాఖ్యాన క
ర్తలుగా నోపరె! పెక్కు వత్సరము లంతర్భూతమై యున్న యీ
తెలుఁగు వ్యాకరణంబు నాకొసఁగెఁ బ్రీతిన్ దీకఁ గావింప సం
చలసిద్ధుండు మదిష్టదేవత విరూపాక్షుండు నిక్కంబుగన్'

ఇది ఎలకూచి బాలసరస్వతి తన ఇష్టదైవమైన విరూపాక్ష స్వామి సాక్ష్యముగ చెప్పిన విషయము. అనగా దేవునిమీద ప్రమాణము చేసి చెప్పిన విషయము. కనుక నిజము కావలయును.

విరూపాక్షస్వామి హంపీవిజయనగర లోని దైవము. హంపీవిజయనగరమే విద్యానగరము. విద్యానగరము నందే ఎలకూచి బాలసరస్వతికి ఆంధ్రశబ్దచింతామణి లభించినది. అదికూడ శివయోగి వలన. ఆ శివయోగి సిద్ధుడు. సిద్ధుడైన శివయోగి మతంగ నగ సమీపము నందు మఠాధిపతి కావచ్చును. మతంగ నగము విజయనగర ప్రాంతమునందే కలదు.23 మఠము లందు తాళపత్ర గ్రంథములే కాదు; తామ్రఫలకశాసనములును చేరును. అట్లు చేరిన ఆంధ్రశబ్దచింతామణి తాళపత్రగ్రంథమును శివయోగి బాలసరస్వతికి ఈయవచ్చును. టీక రచింపుమనియును చెప్పవచ్చును. అట్లు లభించిన ఆంధ్రశబ్దచింతామణి పరిచ్ఛేదముల చివర 'ఇతిశ్రీ సకలభాషా వాగనుశాసన నన్నయభట్ట విరచితాంధ్రశబ్దచింతామణౌ' అని కలదు. అది చూడగానే విపుల శబ్దశాసనుడైన ఆదికవి నన్నయభట్టు బాలసరస్వతి దృష్టికి వచ్చును. కాని ఆదికవి నన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణి రచించినట్లు అప్పటికి ఎవ్వరికిని తెలియదు. బాలసరస్వతికిని తెలియదు. కనుక 'పెక్కు వత్సరము

లంతర్థానమైయున్న' దను భావము కలుగును. అంతేకాదు. ఎవ్వరికిని తెలియని, ఆదికవి నన్నయభట్టు కృతమని భావించిన, ఆంధ్రశబ్దచింతామణి తనకే లభించినందున ఎంతో ఆశ్చర్యము కలుగును. అదే 'ఏమి మహద్భుతంబిది హరీ! హరీ' అను ఆశ్చర్య ప్రకటనము. ఉపరి, ఆంధ్రశబ్దచింతామణి ఆదికవి నన్నయభట్టు కృతమని అనుకొనుట వలన 'ప్రజ్ఞానిధుల్ కవుల్ మునుపు లేరే! వారు వ్యాఖ్యానకర్తలు గానోపరె!' అను భావమును కలుగును. కనుక విరూపాక్షస్వామి సాక్ష్యముగ బాలసరస్వతి చెప్పినదెల్ల నిజమే. కాని భ్రాంతిమూలకము.

ఇంతకు, ఆంధ్రశబ్దచింతామణి ఆదికవి నన్నయభట్టు కృతము కాదు. అర్వాచీనకవి అపరనన్నయభట్టు కృతము. అది కూడా బాలసరస్వతికి తెలియపోవచ్చును. అపర నన్నయభట్టు కృతమైన లక్షణసారము, ఇంద్రవిజయము, రాఘవాభ్యుదయము కూడ బాలసరస్వతికి తెలియకపోవచ్చును. అదెట్లు సంభవము ?

ఎలకూచి బాలసరస్వతి 'పాకనాటి సుకవి పండితమహాజనాచార్యుండైన కృష్ణయార్యవర్యుని' తనయుడని బాలసరస్వతీయము నందు కలదు. అంతేకాదు. బాలసరస్వతి పెదముత్తాత 'తిరుమలేంద్రుఁ డళియరామావనీశదత్త యెడవల్లినామ సగ్రామహామహార చ్ఛత్రపల్యంతికా మణివిభూషుడై వైదుషీస్ఫూర్తిఁబొలుపు మించె' నని కూడ అందే కలదు. బాలసరస్వతి జన్మస్థలము నెల్లూరు మండలము కావచ్చును. కాని బాలసరస్వతి భర్తృహరి సుభాషిత రత్నావళి జటప్రోలు సంస్థానాధిపతికి అంకితము. చంద్రికాపరిణయము పత్తియాల సంస్థానాధిపతి ప్రేరణమున సరస్వతికి అంకితము. జటప్రోలు సంస్థానము మహబూబునగర మండలములోనిది. పత్తియాల సంస్థానము కృష్ణామండలము లోనిది. ఇప్పటి పరిటాల. విద్యానగరము బళ్ళారిమండలములోనిది అట బహుదేశాటనపటుండుపడైన బాలసరస్వతికి ఆంధ్రశబ్దచింతామణి లభించినది. కనుక ఆంధ్రశబ్దచింతామణిని రచించిన అపరనన్నయభట్టు విద్యానగర ప్రాంతీయుడు కావచ్చును.

బళ్లారి మండలము వాడగు అపరనన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణి రచనాకాలము 1550 ప్రాంతము. అది బాలసరస్వతికి కీలకనామ సంవత్సరమున లభించినదని అప్పకవి అందిచ్చిన సమాచారము (50 ప., 1 ఆ.) ఆ కీలకనామ సంవత్సరము 1608. కనుక 1550 ప్రాంతమునందలి బళ్ళారిమండలము వాడగు అపర నన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణి, 1608 వ ప్రాంతము వరకు నెల్లూరిమండలము వాడైన ఎలకూచి బాలసరస్వతికి ఆ కాలము నందు తెలియకపోవుట సంభవమే. అంతేకాదు, ఆ మధ్యకాలము నందు అనగా పదునారవశతాబ్ది ఉత్తరార్ధము నందు అపరనన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణి ప్రసిద్ధము కాకపోవుటకూడా సంగతమే.

మఱి నన్నయభట్టు లక్షణసారములోని ఒక పద్యము లింగమగుంట తిమ్మకవి సులక్షణసారము నందు కలదు గాని, నన్నయభట్టు లక్షణసారము నుండి అని లేదు. మఱొక పద్యము ముద్దరాజు రామన కవిసంజీవని యందు కలదు గాని, అందును నన్నయభట్టు లక్షణసారము నుండి అని లేదు. అనగా పదునారవ శతాబ్ది ఉత్తరార్ధమునందు, పదునేడవశతాబ్ది పూర్వార్ధము నందును, అపర నన్నయభట్టు లక్షణసారమును అంత ప్రసిద్ధము కాదని అవగాహనమగును. గుణపవరపు వేంకటకవి 'ఆంధ్రప్రయోగరత్నాకరము' నందు నన్నయభట్టు లక్షణసారమునుండి లక్ష్యలక్షణములు ఉండుటయేగాక, అన్ని స్థలము లందును నన్నయభట్టు లక్షణ సారము నుండి అని కలదు. కనుక అపరనన్నయభట్టు లక్షణ సారము పదునేడవశతాబ్ది ఉత్తరార్ధము నందు ప్రసిద్ధము కావచ్చును. అయినను లింగమగుంట తిమ్మకవికి, ముద్దరాజు రామనకు, గణపవరపు వేంకట కవికి నన్నయభట్టు లక్షణసారము లభించినది. ఇదెట్లు సంభవము ?

లింగమగుంట తిమ్మకవి 'వృద్ధకుండికాతీర లింగమగుంట నామ పట్టణస్థితకుండ' ని సులక్షణ సారమునందు కలదు. లింగమగుంట నెల్లూరు మండలములోనిది. లింగమగుంట తిమ్మకవి నెల్లూరి మండలమువాడైనను, తెనాలి రామకృష్ణుని అల్లుడు లింగమగుంట రామకవి తమ్ముడు. రామకవి ఆనందకానన మాహాత్మ్య, చతుర్వాటికా మాహాత్మ్య, వేంకట మాహాత్మ్య, మత్స్యపురాణ వామన పురాణాద్యనేక గ్రంథముల కర్త.24 తెనాలి రామకృష్ణుడు విద్యానగరములోని విద్వత్కవి అన్న మావగారి ఇంటికి తమ్ముడు వెళ్లవచ్చును. కనుక విద్యానగర ప్రాంతీయుడైన అపర నన్నయభట్టు లక్షణసారము, లింగమగుంట తిమ్మకవికి విద్యానగరమునందు లభించుట సంభవమే.

ముద్దరాజు రామన నివాసము తెలియదు. విలాసమును తెలియదు. కవిసంజీవనియందు కానరాదు. కాని కవిసంజీవనియందు కవిత్రయము వారి భారతముతోపాటు కృష్ణదేవరాయల ఆముక్తమాల్యద, పెద్దన మనుచరిత్ర, పింగళి సూరన రాఘవ పాండవీయము ప్రసక్తమైనవి. ఆముక్తమాల్యద నుండి అధిక ప్రయోగములు కలవు. కనుక ముద్దరాజు రామన విద్యానగర ప్రాంతీయుడు కావచ్చును. అయిన, విద్యానగర ప్రాంతీయుడైన అపర నన్నయభట్టు లక్షణసారము ముద్దరాజు రామనకు లభించుట అవకాశమే.

గణపవరపు వేంకటకవి 'కాపెఫలీఖ్య గణపవర గ్రామశేఖ' డు అని ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసమునందు

కలదు. కాని కాటెపలీముఖ్య గణపవరము జాడ కానరాదు. అయినను వేంకటకవి విద్యావతీ దండకము మధుర నాయక రాజైన ముద్దళఘురి వృత్తాంతము. వేంకటకవి 'కర్ణాటతుండీర చోళపాండ్య మండల ప్రముఖాఖిల మహీమండలాఖండలదత్త' రాజ లాంఛనములు కలవాడని అతని గ్రంథారంభ గద్యలందు కలదు. బాలసరస్వతిని మించిన బహు దేశాటనశీలి. కర్ణాటరాజులన విజయనగర రాజులు. వారు ఒసగిన 'మత్తసింధుర సైంధవాందోళికాచిరత్న రత్న కాంచనాంబరాది వస్తు' వు లందు ఏది గ్రహించుటకైనను గణపవరపు వేంకటకవి విద్యానగరమునకు విచ్చేయవలయును. విద్యానగరమునకు విచ్చేసిన గణపవరపు వేంకటకవికి విద్యానగర ప్రాంతీయుడైన అపర నన్నయభట్టు లక్షణసారము లభించుట సంభవమే.

గణపవరపు వేంకటకవి ఆంధ్రప్రయోగ రత్నాకరము నందు ఇరువదిమూడు లక్షణ గ్రంథముల నుండి లక్ష్య లక్షణములు కలవు. అవి - 1. విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి (40); 2. అథర్వణాచార్య ఛందము (20); 3. కవిరాక్షసుని ఛందము(6); 4. భీమన ఛందము(17); 5. జయదేవ ఛందము (19); 6. ఆంధ్రశ్రీధరచ్ఛందము (18); 7. అనంతుని ఛందము (43); 8. నీలకంఠచ్ఛందము(21); 9. ముద్దరాజు రామన కవిజన సంజీవని(20); 10. గణపవరపు వేంకటకవి సర్వలక్షణ శిరోమణి (1); 11. ఉత్తమగండ ఛందము(23); 12. నన్నయభట్టు లక్షణ సారము(25); 13. తాతంభట్లు చింతామణి(8); 14. ఆంధ్రగోకర్ణ ఛందస్సు(19); 15. కవి కంఠాభరణము(2); 16. భాస్కరదేవుని ఛందము(19); 17. సర్వదేవచ్ఛందము(5); 18 భైరవ ఛందము (9); 19. సరస్వతీ విలాసము(2); 20. కవికంఠ భూషణము(1); 21. ఛందోదర్పణము (5); 22. లక్షణదీపిక(3); 23. సాహిత్య చింతామణి(2); ఇందు ప్రసిద్ధా ప్రసిద్ధములు కలవు. భ్రమప్రమాదములును కలవు. ప్రసిద్ధములైన లక్షణ గ్రంథములు యథార్థము, అప్రసిద్ధములైన లక్షణ గ్రంథములు కథార్థము అనుట కేవలము అవిచార మూలకము.

ఇంద్రవిజయములోని పద్యములు ఉత్తమగండచ్ఛందము నందు, శ్రీధరచ్ఛందము నందును కలవు. అవే గణపవరపు వేంకటకవి ఆంధ్రప్రయోగ రత్నాకరము నందు, కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందము నందును కలవు. కనుక ఇంద్రవిజయము గణపవరపు వేంకటకవికిని లభించినట్లు కాదు. లభించిన చిత్రపు భీమన ఉత్తమగండచ్ఛందము శ్రీధరుని ఛందము నేడు లభించునవి కావు. కనుక చిత్రపుభీమన, శ్రీధరుల ఉక్తి తెలియునది కాదు. కాని, ఉత్తమ గండచ్ఛందము, శ్రీధరచ్ఛందము ప్రథమతః లింగమగుంట తిమ్మకవి సులక్షణ సారమునందు ప్రసక్తము లయినవి. కనుక చిత్రపు భీమన, శ్రీధరులు లింగమగుంట తిమ్మకవి జన్మ స్థలమైన నెల్లూరు మండలము వారుగాని, తెనాలి రామకృష్ణుని వాసస్థలమైన విద్యానగరము ప్రాంతము వారు గాని కావచ్చును.కనుక విద్యానగర ప్రాంతీయుడైన అపర నన్నయభట్టు ఇంద్రవిజయము విద్యానగర ప్రాంతీయులో, విద్యానగర సమీప ప్రాంతీయులో అగు చిత్రపు భీమన, శ్రీధరులకు లభించుట అనుమానమే.

గణపవరపు వేంకటకవి ఉట్టంకించిన ఇరువదిమూడు లక్షణ గ్రంథములందు సర్వదేవచ్ఛందము ఒకటి. సర్వదేవచ్ఛందము నుండి ఆంధ్రప్రయోగరత్నాకరము నందు అయిదు ఉదాహరణము కలవు. అందు మూడు లక్ష్యములు కలవు. రెండు భాస్కరరామాయణము లోనివి. సర్వదేవచ్ఛందము అనగా సర్వదేవకవి కృతమైన ఛందోగ్రంథ మని అర్థము. సర్వ దేవకవి ఆదిపురాణ, విరాటపర్వముల పద్యములు పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరము నందు కలవు. అవి ప్రాఙ్నన్నయ యుగ కావ్యములు కాక అర్వాచీనయుగ కావ్యములని ప్రతిపాదితము.[25] ఇది తదుపబలకము. ఆదిపురాణ, విరాటపర్వముల కర్త అయిన సర్వదేవకవియే సర్వదేవచ్ఛందఃకర్త అగును.

సమష్టిపై ఇంద్రవిజయము, రాఘవాభ్యుదయము, లక్షణసారము, ఆంధ్రశబ్దచింతామణి అసలు నన్నయభట్టు కృతములు కావని అని అపర నన్నయభట్టు కృతములని, పదునారవశతాబ్ది ద్వితీయ పాదములోని (1526 -1550) గ్రంథములని స్పష్టము

సూచికలు

1. ఆంధ్రకవుల చరిత్ర, ప్రథమభాగము, పు. 68
2. ఆంధ్రకవితరంగిణి - మొదటి సంపుటము, పుటలు 45 - 6
3. ఒకటి వలె
4. రెండు వలె, పు. 47
5. ప్రబంధరత్నావళి-ద్వితీయముద్రణము, పీఠిక, పు. 10
6. తెలుగుభాషలో ఛందోరీతులు, పు. 403

. సమగ్ర ఆంధ్రసాహిత్యం - ఏడవసంపుటం, పు. 49
8. ఒకటివలె, పుటలు 68 - 9
9. రెండువలె, పు. 47
10. ఒకటివలె, పుటలు 69 - 84
11. అదే - పుటలు 41 - 64
12. చింతామణీవిషయ పరిశోధనము
13. నవభారతి - 1979, సెప్టెంబరు, పుటలు 51- 56, అక్టోబరు, పుటలు 32 - 42
14. శాసనపద్యమంజరి, ప్రథమభాగము, పు. 1
15. అదే, పు. 3
16. ప్రాచీనాంధ్రశాసనాలు, పు. 68
17. అదే, పు. 141
18. అదే, పు. 154
19. ఒకటివలె, పు. 684
20. కేతన, పు. 101- 5
21. ఒకటివలె. పు. 683
22. ప్రత్యేకవ్యాసమును ప్రకటింతును.
23. ప్రాచీనాంధ్ర చారిత్రికభూగోళము, పు. 295
24. రెండువలె, తొమ్మిదవ సంపుటము, పు. 175
25. నవభారతి, 1978, ఏప్రిల్, పుటలు 7 - 18

(అయిపోయింది)

అపూర్వ త్యాగఫలం

శ్రీ చల్లా రాధాకృష్ణ శర్మ

నిన్న మొన్నటిదాకా
మహావృక్షాలంటే
మర్రిచెట్టు మొదలైనవి.
ఈనాడు
సంపాదించింది
వటవృక్ష విఖ్యాతి
గరికపోచ సైతం.

ఒకప్పుడు
ఉన్నతసౌధాలే
ఆకట్టుకునేవి నలుగురినీ.
ఇప్పుడు
పూరిపాక కూడా
పరవశింపజేస్తున్నది
పెద్దల మనస్సుని.
ఒకనాడు
ప్రభుత సాగింది
విద్యావంతుల చేతుల్లో.
ఈనాడు
నిరక్షరాస్యుడు సైతం
ప్రభుత్వ కార్యకలాపాలలో
పంచుకుంటున్నాడు పాలు.

ప్రభుస్వామ్యానికి
సమాధి కట్టింది
జనశక్తికి
నివాళి పట్టింది
సమాజంలో సమతకు
పునాది వేసింది
సామాన్య మానవుణ్ణి
గద్దెను నిలిపింది.
వర్ధిల్లాలి చిరకాలం
ప్రజాస్వామ్యం !
అపూర్వ త్యాగఫలం
మా ప్రజాస్వామ్యం !

గమనించు మిత్రమా!

డా॥ సి. నారాయణరెడ్డి

నడిచింది ఒక్కమైలు అంతలోనె అత్రమా
తొలిపొద్దు వేళలోనే తలపైన ఛత్రమా?
నీ అడుగులకో తుదిగమ్యం అందాలంటే
ఎడతెగని యెదురుదెబ్బలు - గమనించు మిత్రమా!

ఎంతెంత దుమ్ము కమ్మిందో నిలిచి చూసుకో
నీ గుండెను ఒక అద్దంలా తుడిచి చూసుకో.
ఎన్నెన్ని ఎగుడు దిగుడులో ఈ జీవయాత్రలో
ఎదలోని బొమ్మ చెబుతుందిక తెరిచి చూసుకో.

పసవుంటే సుడిగాడ్పులైన వీగుతాయిలే
పదమంటే గిరి పంక్తులైన సాగుతాయిలే.
నీ పలుకులోన మొక్కవోని పదునే వుంటే
ఏ పడగలైన కోకిలలై పాడుతాయిలే.

ఇది కాదు నేటి ఘర్షణ; ప్రతినిత్య సంగరం.
ఒక నువ్వుకాదు అక్రమ వంచితుల మందరం.
అనుకున్న సమత అమృతంలా దొరకాలంటే
జన జలధి మథించాలి మరో క్రాంతి మందరం.

ఏ మనిషిని హింసించవద్దు మతం పేరుతో
ఏ కొత్తను నిరసించవద్దు గతం పేరుతో.
తరగెత్తి కాలవాహిని నిను వెరపిస్తుంటే
నీ శిరసు వంచవద్దు పురాకృతం పేరుతో.

తెలుగునాట
వెలుగుబాట

తెలుగునాట ఒకనాడు పాడిపంటలు వెల్లివిరిసాయి. పాలు, తేనెలు ప్రవహించాయి. సిరి సంపదలు విలసిల్లాయి లలితకళలు నాట్యమాడాయి. పౌరుషం ప్రజ్వరిల్లింది. శాతవాహన, ఇక్ష్వాక, కాకతీయ, విజయనగర సామ్రాజ్యాల కాలంలో తెలుగు తేజం దిగంతాల వెలుగొందింది. అనంత కీర్తిని ఆర్జించింది. ఆనాటి సిరి సంపదలను తిరిగి సాధించి, ప్రజా జీవితాన్ని సౌభాగ్యవంతం చేసి ఆనాటి పౌరుషాన్ని, కళా ప్రాభవాన్ని పునః ప్రతిష్ఠించి, తెలుగుజాతికి చిరకీర్తిని చేకూర్చాలన్నదే శ్రీ ఎన్. టి. రామారావు నాయకత్వాన గల రాష్ట్ర ప్రభుత్వ ప్రగాఢ ఆకాంక్ష. ఆ లక్ష్య సాధనకోసం క్రొత్త ప్రభుత్వం మూడు నెలల స్వల్ప కాలంలోనే ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు గైకొన్నది.

- దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకోడానికి ఆతృతతో ముందుకు వచ్చింది. ధాన్యానికి క్వింటాలుకు 20 రూపాయల చొప్పున సబ్సిడి ప్రకటించి రైతన్న వెన్ను తట్టింది.
- పేదలకు రెండు రూపాయలకే బియ్యం సరఫరా చేసే బృహత్ పథకాన్ని నేటి ఉగాది నుంచే అమలు జరుపుతున్నది.
- బలహీన వర్గాల కోసం 2 లక్షల 20 వేల యిళ్ళు నిర్మించనున్నది.
- ఆడపడచులకు తండ్రి ఆస్తిలో సమాన ఆస్తి హక్కు కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ విధానమండలిలో తీర్మానాలు ఆమోదింపచేసింది.
- మహిళలకోసం తిరుపతిలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేక విశ్వవిద్యాలయం ఆరంభించనున్నది.
- 62 లక్షల మంది బాలలకు మధ్యాహ్న భోజనం కోసం సమగ్ర పథకం ప్రవేశపెట్టింది.
- విధాన పరిషత్తును రద్దు చేయటానికి, పార్టీ ఫిరాయింపులను నిరోధించడానికి, మాజీ శాసనసభ్యుల ఫించనులకు స్వస్తి పలకటానికి విధాన సభలో తీర్మానాలు చేయించింది.
- ఉద్యోగావకాశాలను హెచ్చించి నిరుద్యోగ యువత నైరాశ్యాన్ని పారద్రోలే సంకల్పంతో ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 55 సంవత్సరాలకు తగ్గించింది.
- వివిధ కార్పోరేషన్ల సంఖ్య తగ్గింపు ద్వారా 4కోట్ల రూపాయలపైగా వ్యయాన్ని ఆదా చేయనున్నది.
- ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి నిర్మూలన కోసం ధర్మమహామాత్రను ఏర్పాటు చేసింది.
- సచివాలయ స్థాయిలో తెలుగును అధికార భాష చేసే కార్యక్రమం ఈ ఉగాది నుంచే ప్రారంభమవుతున్నది.

ప్రజా సౌభాగ్యం కోసం, వివిధ రంగాలలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం 15 అంశాల కార్యక్రమాన్ని రూపొందించింది. మంచినీటి సరఫరా, బలహీన వర్గాల సంక్షేమం, పేదలకు గృహవసతి, గ్రామీణ విద్యుదీకరణ, భూసంస్కరణలఅమలు వంటి అభ్యుదయ కార్యక్రమాల అమలుకు ఈ పదిహేను అంశాల కార్యక్రమం పునాది అవుతుంది.

తెలుగు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చటానికి అంకితమైన ప్రభుత్వ కృషికి, కార్యదీక్షకు ఇది నిదర్శనం.

డైరెక్టరు,
సమాచార, పౌర సంబంధ శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, హైదరాబాదు.

D I P R No. 25514 / Advt. / C3 / 83.

డా॥ హెచ్. ఎస్. బ్రహ్మానంద

సెర్గిజ్ కార్ చెవ్‌స్కి సంకేత దృష్టి

ఆధునిక భాషాశాస్త్రానికి పైతాళికుడుగా చెప్పబడుతున్నవాడు ఫర్డినాండ్. డి. ససూర్. సెర్గిజ్ కార్‌చెవ్‌స్కీ ససూర్‌కి స్వయానా శిష్యుడు. 1884లో ఈయన రష్యాలో జన్మించాడు. 1905 నాటి విప్లవంలో రాజకీయ ఖైదీగా ఒక సంవత్సరం జైలులో గడిపాడు. తరువాత స్విట్జర్‌లాండ్‌కు తరలించబడ్డాడు. అక్కడే ఈయన ససూర్ శిష్యరికం చేసాడు. రష్యాలో 1917 – '19 ల మధ్య ససూర్ ప్రతిపాదించిన ఆధునిక భాషాశాస్త్ర దృక్పథాలతో ఆనాటి రష్యా యువతరాన్ని ఎంతో ఉత్తేజితం చేసాడు. అక్కడి కమ్యూనిస్టు పాలనతో అసంతృప్తుడై మళ్ళీ రష్యాను వదిలి ప్రాగ్‌లో నిల్చిపోయాడు. ప్రాగ్ భాషాశాస్త్రసదస్సులో ఒక ముఖ్యవ్యక్తి అయ్యాడు. 1930లో మళ్ళీ స్విట్జర్‌లాండ్‌కు వచ్చాడు. అక్కడే జెనీవా భాషాశాస్త్ర సంస్థని ప్రారంభించాడు. 1955 లో ఈయన చనిపోయాడు.

ససూర్ సంకేతదృష్టి

ససూర్‌ని అనుసరించి భాష ప్రాథమికంగా సామాజికమైన అస్తిత్వాన్ని కలిగింది. అది అవగాహన రూపమైనది. ససూర్ పరిభాషలో ఇది లాంగ్ అని పిలవబడింది.

భాషావ్యవహారం వక్త శ్రోతల మధ్య అభిప్రాయ నివేదనకు మాధ్యమికంగా ఉంది. ఎలాగంటే భాషాసంకేతం ఒక వస్తువును సూచించే పేరుకాదు. ఒక భావాన్ని బంధించే శబ్దచిత్రం. అంచేత సంకేతంలో భావమూ, శబ్దమూ ఇవిరెండూ ఒకే నాణానికున్న బొమ్మా బొరుసుల్లాంటివి. భాషలో శబ్దానికి, భావానికీ మధ్య ఇక్కడ మాత్రమే అన్వయం ఉంది.

కాని భాష ఒక నిర్మాణాన్ని సంతరించుకుంటోంది. ఆ నిర్మాణం సంకేతగతమైన శబ్దభావ అన్వయాన్ని ఆధారంగా కాకుండా సంకేతాల సంధాన ప్రత్యామ్నాయ క్రమ విన్యాసంవల్ల ఏర్పడుతోంది. ఈ విన్యాసం ఒక సంకేతం, ఇంకో సంకేతం కంటే భిన్నంగా ఉండటంవల్లనే సాధ్యమవుతోంది. వక్త శ్రోతలమధ్య అభిప్రాయ వినిమయం సంకేతాలమధ్య ఉన్న ఈ వ్యతిరేకతను ఆధారంగా పుడుతున్న అవగాహన కారణంగా ఏర్పడుతోంది. అంచేత సంకేతాలమధ్య నున్న భిన్నతే భాషలో నిర్మాణఘటన సమర్థమైన అంశ.

ససూర్ భాషలో రెండు ప్రధాన అంశాలను గుర్తించాడు. ఒకటి– సంకేతానికున్న భావజనక శక్తి (సిగ్నిఫికేషన్). రెండు – సంకేతాల భావనివేదన వ్యాపారం (కమ్యూనికేషన్).

భాషాశాస్త్రం - సంకేతవాదం

ససూర్ తరువాత ఆయన చేసిన పై రెండు ప్రతిపాదనల్ని ఆధారంగా రెండు భిన్నశాఖలు భాషాసంకేతాన్ని గురించి విచారించటం మొదలుపెట్టాయి. 1) భాషాశాస్త్రం 2) సంకేతవాదం (సెమియాటిక్స్). అమెరికాలో బ్లూం ఫీల్డ్ సంప్రదాయం, వాట్సన్ ప్రభృతుల మానసిక ప్రవృత్తి వాదాన్ని భౌతిక ప్రక్రియాదృష్టితో భాషను ఒక ప్రతిక్రియగా నిరూపించింది. ఇక్కడ లుప్తమైనఅంశం భాషకున్న సామాజిక అస్తిత్వం. చామ్స్కీ రంగంలోకి వచ్చి మొదటిసారిగా ససూర్ ప్రతిపాదించిన లాంగ్ అన్న అంశాన్ని బయటకు లాగాడు. సామాజికమైన ఆ అవగాహననే ఆయన 'ప్రతిభ' అన్నాడు. అది మానసికమని గుర్తించాడు. కాని పరిశోధన అంతా ససూర్ ప్రతిపాదించిన రెండవ అంశాన్ని ఆధారంగా జరిగిందే తప్ప మొదటిదాన్ని అనుసరించికాదు.

బ్లూం ఫీల్డుకు సమకాలికంగానే ఛార్లెస్ మోరిస్ ప్రవృత్తి వాద దృష్ట్యా సంకేతాన్ని వక్త, శ్రోత, సందర్భం, ప్రయోజనం అనే అంశాల్ని ఆధారంగా వివరించడానికి ప్రయత్నిస్తూ సాహిత్య భాషను పూర్తిగా వదలి సంకేత సిద్ధాంతాన్ని చేసాడు. బ్లూంఫీల్డుకు ముందు సపీర్, మోరిస్ ముందు పేయర్స్ సంకేతాలను మానవ నిసర్గ వ్యాపారంగా, సామాజికమైన సంపదగా వ్యాఖ్యానించడానికి ప్రయత్నాలు చేసారు. ఏదిఏమైనా ససూర్ ప్రతిపాదనల్లోని మొదటి అంశం మాత్రం ఎక్కడా గణనలోనికి రాలేదు. స్థూలంగా నిర్మాణవాదం అన్న ఒక మార్గం ఏర్పడటానికి ససూర్ చేసిన రెండవ ప్రతిపాదనే కారణం. ఈ మార్గంలో దాదాపు 30 ఏళ్ళ నుంచి శ్రమిస్తున్న పరిశోధకుడు రొలాన్డ్‌బార్తెస్. బార్తెస్‌ను

అనుసరించి సంకేతానికి అర్థంలేదు. భావం మాత్రమే ఉంది. భావగ్రహణ దశలు కొన్ని ఉన్నాయి. సంకేతం ఒక నిర్దిష్ట ప్రయోజనాన్ని ఆశించి ఒక నిర్ణీత మార్గంలో విన్యస్తమై ఆయా భావ దశల్ని వ్యక్తీకరించ గలుగుతుంది తప్ప ఈ సంకేతానికి ఇది అర్థమన్న 'అభిజ్ఞ' ఇటు వక్తకు కాని అటు శ్రోతకుకాని ఇద్దరికీ లేనప్పుడు భాషా పరిశీలనకు మాత్రం ఎందుకు? బార్త్స్ ఈ విధంగా ఆలోచించడానికి కారణం ఆయన సాహిత్యభాషను గురించి ఆలోచించడం.

ఫ్రాన్స్‌లో బార్త్స్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిర్మాణ వాదమే కాకుండా మరొక యథాతథవాదం (ఫెనామెనలిజం) కూడా వుంది. ఈ వాదం ప్రకారం సంకేతం నిరాధారమూ నిర్హేతుకమూ కాదు. మానవుడికి భాషతోఉన్న మానసిక భౌతిక సంబంధం నిరసించడానికి వీలులేనిది. చేత, రాత, మాట ఈ మూడూ ఒకదానిని వదలి మరొకటి ఉండవు. అంచేత శబ్దసంకేతం భావజనక సమర్థమైనదని ఈ వాదం విశ్వసిస్తుంది. హుజర్ల్ అన్న యదార్థదేయుడు భాషను వైయక్తిక దృష్టితో వ్యాఖ్యానించడానికి ప్రయత్నించాడు. ఈ దృష్ట్యా శబ్దసంకేతం భావానికి అభివ్యక్తీకృతి. ఇది ససూర్ ప్రతిపాదనలోని మొదటిఅంశాన్ని తాకుతోంది. ఇక్కడ శ్రోతను గురించి కొన్ని నిర్దిష్టమైన అంచనాలు ఉన్నాయి. శ్రోతవక్తతో సమానమయిన మానసికనిర్మాణం కలవాడని భావజగత్తులోని ఈ అద్వైతం కారణంగా సంకేతం భావాన్ని సద్యస్ఫురితం చేయ కలుగుతోందని హుజర్ల్‌వాద తాత్పర్యం.

సంకేతవాద అశాస్త్రీయత - ఖండనలు

భాషాశాస్త్రం, సంకేతవాదం కుడిఎడమలుగా ఎదుగుతూ వచ్చినా సంకేతవాదంలోని అభౌతిక విషయ ప్రసక్తి వలన భాషాశాస్త్రానికి వచ్చిన శాస్త్రీయ మర్యాద దీనికి రాలేదు. జాక్స్‌డెరిడా 1973 లో ససూర్ హుజర్ల్ ప్రతిపాదనలను పురస్కరించుకొని మొత్తం సెమియాటిక్ శాఖనే అశాస్త్రీయమని ఖండించడానికి ప్రయత్నించాడు. కల్లర్ కూడా కమ్యూనికేషన్, సిగ్నిఫికేషన్‌ల మధ్యనున్న వైరుధ్యాన్ని గుర్తించినా సెమియాటిక్స్ ఈ భావ వైరుధ్యంనుంచి ఎలాబయటపడగలుగుతుందా అన్న సంశయాన్ని వెలిబుచ్చాడు. జార్జ్‌స్టెయినర్ లాంటి వాళ్లు సాహిత్యం ద్వారా అభివ్యక్తమవుతున్న భావం సాహిత్యాన్ని మొత్తాన్ని సంకేతంగా భావిస్తూ అది పఠితలో కలిగించే భావవికల్పాల్ని, పొందే నూత్న అనుభవాన్ని ఒక హెర్మెన్యూటిక్ పద్ధతిలో విశ్లేషిస్తున్నారు. ఈ రెంటిమధ్యా ఒక సమన్వయ రూపమయిన మార్గం ఒకటి కనిపెట్టాల్సిన అవసరం ఉందని కల్లర్ అభిప్రాయపడుతున్నాడు. అంటే సెమియాటిక్స్ చెప్పాల్సింది సంకేతానికున్న అభిప్రాయసంధాన శక్తి గురించా, భావవ్యక్తీకరణను గురించా అన్నది ఇంతవరకూ తేలని సమస్య అన్నమాట.1

జాక్స్ డెరిడా సెమియాటిక్స్ లోని అభౌతికతత్వాన్ని నిరసించడం వరకూ బాగానే ఉంది. అంతమాత్రాన సెమియాటిక్స్ అశాస్త్రీయమని నిందించాల్సిన అవసరం లేదంటూ సిగ్నిఫికేషన్, కమ్యూనికేషన్ అన్న ఈ రెండు అంశాలు విరుద్ధాంశాలు కావని భాషా వ్యవహారమే ఈ రెండంశాల సమన్వయ రూపంగా ఉంటుం

---

1. భాషాశాస్త్ర సంప్రదాయాల్లో కూడా ఈ రెంటిమధ్య వైరుధ్యమున్నదనే అనిపిస్తుంది. ఎంచేతనంటే బ్లూంఫీల్డు సంప్రదాయం అర్థాన్ని గురించి అసలు పట్టించుకోపోగా అసలు భాషాశాస్త్రంలో అర్థానికిచోటే లేదనిగూడా తేల్చివేసింది. అప్పటినుంచీ ఇప్పటిదాకా ప్రసిద్ధమైన మార్గాలన్నీ భాషానిర్మాణ సూత్రీకరణకు ఇచ్చిన ప్రాధాన్యం అటు భాషకున్న అనుసంధాన గుణాన్ని గురించికానీ, ఇటు భావ వ్యక్తీకరణ గురించికానీ చూపటంలేదు. వెరసి భాషా శాస్త్రజ్ఞుడంటే మెకానిక్ లాగా కారులోని భాగాలన్నింటినీ వేటికివాటిని విప్పదీసి ఆయాభాగాల్ని వాటిలోని సమాన లక్షణాలద్వారా వర్గీకరించి ప్రదర్శిస్తాడన్న అభిప్రాయం ఒక్కటే స్థిరపడి పోయింది. ఇది సమగ్రమయిన అభిప్రాయం కాదు. భాషాశాస్త్రానికి ఒక్కో చారిత్రక దశలో భిన్నశాస్త్రాల సంపర్కంతో నేపథ్యంతో ఏర్పడ్డ స్వరూపమే తప్ప ఇదమిత్థమయిన నిర్వచనం ఏదీలేదు. ఏదీ ఉండదు. ఉండకూడదుకూడా. ఆధునికంగా భాషాశాస్త్ర సంప్రదాయాలకు పాదు సంపన్నమయిన ఒక దేశం కావటం వల్లో అక్కడకు వెళ్ళి చదువుకు రావటంవల్లో ఆ సంప్రదాయమే అత్యుత్తమమనిగాని అదే సమగ్రమనిగానిఏ భాషావిజ్ఞానీ విశ్వసించడు. భాషకు సమగ్రమయిన వ్యాఖ్యానం చేయడమే ధ్యేయం. ఆ వ్యాఖ్యానం సాధించడంలో ఉన్న సంప్రదాయాన్ని కాదనడానికి కాని భిన్నసంప్రదాయాల్లోంచి ఎరువు తెచ్చుకోవడానికి కాని, పరో మార్గాన్నిత్రవ్వుకోడానికికాని వెనుకాడను. భాషమీదపరిశోధనఅంతా 'గుడ్డెద్దు చేల్లో పడ్డ చందమే'. అంతే తప్ప మనం ఒక మార్గాన్నీ, ధ్యేయాన్నీ ముందుగా నిర్ధరించుకొని దానికి అనుగుణంగా పట్టినంతవరకే భాషను విశ్లేషించడం తక్కిన విషయాల్ని నాకు సంబంధించినవి కావనికాని, అవి అశాస్త్రీయాలనిగాని మడిగట్టుకోవటం శాస్త్రప్రగతికి సహకరించే పద్ధతికాదు. భాషాశాస్త్రంలో భాగంగా ఎదిగిన 'సెమాంటిక్స్' కన్నా 'సెమియాటిక్స్' వేరుపడుతున్నది 'సిగ్నిఫికేషన్' అన్న అంశంలో మాత్రమే. వివరాలకు చూ. బ్రహ్మనంద(1981: అధ్యా. 1)

దని సంకేతానికున్న ఉద్విధాకృత వక్రత(డ్యూయల్ అసెమిట్రి) సంకేత ప్రథమ ధర్మమని కార్ చెవ్‌స్కీని ఆధారంగా ప్రతిపాదించినవాడు పీటర్ స్టైయినర్ (1981). ఈ అవగాహన సంక్షిప్త వివరణం ఇది:

కార్చెవ్‌స్కీ ప్రతిపాదవల సారాంశం

'భాషాసంకేతం' భావనివేదనకు అపసుగ్రరూపకల్పనం. దీనికి నిదర్శనం ఒకే శబ్దం అనేక వ్యాపారాల్ని కల్గివుండటం. ఒకే అర్థం భిన్నశబ్దాల ద్వారా చెప్పబడగలిగి వుండటం. ప్రతి భాషాశబ్దానికీ ఈ ద్విధాకృత స్థితి వుంది. ప్రతి పదమూ - వాక్యమూ - ఒక పర్యాయవాచకమే। వాటి అర్థాలూ 'నానార్థా'లలో ఒకటి మాత్రమే. అంటే 'అర్థ' మనబడేది 'శబ్దం' తో సహజ నిసర్గ సంబంధం వున్నదికాదు. పర్యాయవాచకత × నానార్థకతల మధ్యగల స్పర్ధతో నిర్ధరింపబడుతున్న మానసికాంశమన్న మాట. ఒక ఉదాహరణ చూద్దాం.

తెలుగులో 'తేలు' అన్నమాట వుంది. దీనికి విశేష్యార్థం (ఇంగ్లీషులో) స్కార్పియన్, క్రియార్థం 'టు ఫ్లోట్' (తేలటం) 'తేల్చు' అన్నపుడు 'టు డిసయిడ్ (నిర్ణయించటం) అన్న నవ్యార్థ స్ఫూర్తి వుంది. [తేప్పు 'ఇరకట్' ॥ తేల్చు (రాయలసీమ) వ ॥ ల వ్యత్యయం].

చారిత్రిక పరిణామకారణాలవల్ల 'తేలు' - రెండు భిన్న మూల రూపాలనుంచీ ఏర్పడుతూ ఈనాడు రూపాభిన్నతను పొందింది. (చేళ్→తేళ్→తేలు. తేల్→తేలు). వ్యవహర్త అవగాహనలో ఈ రెండురూపాలు భాషాశక్తి (లింగ్విస్టిక్ పొటెన్షియల్) కి సంబంధించినవి అయిపోయాయి- 'ముసలి మానులు' అని ప్రయోగించి - సాధించిన 'కవిత్వ ధర్మం' ఈ అంశంవల్లే భాషలో ఏర్పడుతోంది.

కాని భాష అంతటా ఇలాంటి పనాలే వుండవు. ఉదాహరణకి అద్దె, వాడుగ, కిరాయి అనే పర్యాయవాచకాలున్నాయి. వక్త వీటిలో మూటిని తెలిసివున్నా మూటినీ వాడడు. అంటే ఒక పర్యాయపదాన్ని వాడుతున్నాడు. వాడటం ద్వారా శ్రోతను ఒక సందిగ్ధంలో పడవేస్తున్నాడు. 'అద్దె' మాటను వాడాడు. 'బాడుగ' ఎందుకు వాడలేదు? అన్న మీమాంసకు మాత్రం సంబందించింది కాదు ఆ సందిగ్ధత. 'అద్దె' అనే మాటద్వారా వక్త ఉద్దేశించిన భావాన్ని కనుక్కోవడానికి సంబంధించింది అది. దీన్ని 'విచికిత్స' అందాం. వక్తకు 'వివక్ష'; శ్రోతకు 'విచికిత్స' - ఈ రెండూ పర్యాయవాచకత, నానార్థకత అనే అంశాలకు సంబంధించిన మానసిక వ్యాపారాలు (మెంటల్ ట్రాన్స్‌యాక్షన్స్),

నిత్య వ్యవహారంలో వివక్షకు - విచికిత్సకు ఒకరకమైన సంబంధం ఉంది. అది శబ్ద సంకేతానికి అర్థనిర్ణయం చెయ్యడంలో బుద్ధికి సంబంధించిన మెలకువ- స్పృహాలక్షణం- పనిచేస్తూండటం వల్ల ఏర్పడేది. దీని ఫలితంగా ఏర్పడుతున్నదే 'కమ్యూనికేషన్'. ఒకఉదాహరణం చూద్దాం. వార్తాపత్రికలు చదువుతుంటాం. ఎవరైనా ఇది అర్థం కావడంలేదనికాని- ఏమిటో నానార్థాలతో చచ్చిపోతున్నామనికాని- ఎడిటర్ ఏమి చెప్పాలబ్బా! అనికాని ఆలోచిస్తూ కూర్చునే సమయం ఇవ్వకుండా జాగ్రత్త పడటమే పత్రికావిలేఖరి 'వివక్ష'. ఎంత అలంకారికంగా మాట్లాడినా-సామెతలు, జాతీయాలు వక్రోక్తులూ, ధ్వనులూ వాడినా- విషయాన్ని- వార్తను- బౌద్ధికంగా అందించి పాఠకుడికి 'అభిప్రాయనివేదన' కల్గించడంకోసమే వార్తాపత్రిక ప్రయత్నిస్తుంది. ఈ లక్షణం నిత్య వ్యవహారంలో ప్రధానం కాబట్టే సాధారణంగా సంకేతం- ప్రసిద్ధమైన ఒక అర్థంలో స్థిరపడి సాక్షాత్కరించినట్టుగా ఉంటుంది.

నేను ఇంటికి వెళ్తున్నాను

సాయంత్రమైయింది

మా ఆవిడ నాకోసం కాచుకూర్చునుంటుంది.

ఇవి మామూలుగా రోజూవాడేవాక్యాలే. కాని 'కవిత్వం'లో వీటిని వాడేటప్పటికి - ఇవి 'అభిప్రాయ నివేదన' కోసం కాకుండా 'భావవ్యంజకాలు' (సిగ్నిఫికేషన్)గా పనిచేస్తాయి. ఆ భావం వక్త వివక్షకు సంబంధించింది. దాని అభివ్యక్తి శ్రోతలో కల్గడానికిముందు జరిగేపని 'విచికిత్స'- నిత్య వ్యవహారంలోనూ కొన్ని సందర్భాల్లో ఈ సమస్య రావడం ఉంది. తిట్టుకోవడం (బూతు పదాలు వాడుకోవడం); స్నేహితులతో మాట్లాడే కల్లబొల్లి కబుర్లు; పెళ్ళాంతో కోసే కోతలు- ఈ సందర్భాల్లో (వివక్ష- విచికిత్స) 'కమ్యూనికేషన్' వుండదు. 'ఎక్స్‌ప్రెషన్' వుంటుంది. ఇక్కడ శబ్ద సంకేతం- తనకున్న బౌద్ధిక వ్యాపారాన్ని మాని హృదయ వ్యాపారం మొదలెడుతుంది, శబ్దం- చేష్టతో సమానత్వం పొందుతుంది. అభినయ మవుతుంది. పశు శిశు సంకేతాలతో సమాన మౌతుంది. రచయిత వాడే ప్రతిమాటా ఒక పర్యాయ వాచకమే. దాన్ని మరెన్నో రీతుల్లో చెప్పడానికి వీలుందని భావం. కాని అలాగే వాడటంలో రచయిత 'దృష్టి' ఏమిటన్న విచికిత్స

మొదలై - పఠిత అర్థాల్ని తవ్వడం మొదలు పెడతాడు. పఠితకు రచనలోని ఏ వాక్యమైనా 'నిలువుటద్దం' కాదు. గాజు పట్టకం. రంగుల కళ్ళజోడు- ఇలా కావడం వల్లే రచనకు 'భావనీయక శక్తి' వస్తోంది. ఆ శక్తివల్లే మాటలద్వారా రచయిత చెప్పలేని విషయం- పఠితకు 'అనుభవం' లోకి వస్తోంది. అది పదానికున్న అర్థాన్ని నిర్ధారించడంవల్ల రావడంలేదు. పదాన్ని హృదయధర్మి (సబ్లైమ్) తో భావించడంవల్ల వస్తోంది. నిత్య వ్యవహారంలో అర్థనిర్ణయం చేసుకొని మాట్లాడుతున్నామా! అనే సందేహం రావచ్చు. కాని 'వాచకాలలో' జాతి/ వ్యక్తి భేదాలున్నట్టుగానే 'వాచ్యం' లో కూడా ఉంది. రెండు మూడు వాచ్యార్థాలలో ఉన్న సామ్యాల్ని ఆధారంగా నిర్ధరిస్తున్నదే లక్ష్యార్థం- అంటే మనిషికి భేదాల మధ్య సామ్యాల్ని దర్శించే మానసికధర్మం వుందన్నమాట. సాహిత్య సృష్టి ఈ సామ్యదర్శనం వల్లనే జరుగుతోంది. పండు, అన్నం, మనిషి లాంటి జాతి వాచకాలు ఈ దర్శనంవల్లే ఏర్పడుతున్నాయి. లేకపోతే మామిడి పండు కి ఒకపేరు, అరటి పండు కి మరోపేరు వచ్చివుండాలి. రాగిముద్దకో పేరు, జొన్నన్నానికి మరో పేరు వచ్చి వుండాలి. స్త్రీ పురుషులిద్దరినీ 'మనిషి' అని పిలవడానికి అవకాశం లేకుండాలి. ('మనిషి' అంటే మనకి వెంటనే మగవాడు స్ఫురిస్తాడు. 'ఆడమనిషి' అనే వాడుకలో మాత్రమే ఆడవాళ్ళు కూడా మనుష్యులుగా తెలిసేది. ఇలా ఒకో 'పదం' నియమితమైన సాంఘిక చరిత్రను వ్యంజిస్తూ ఒకవైపు వ్యక్తి వాచకంగా; మరోవైపు జాతి వాచకంగా- రెండుగా ఉపయుక్తమవటంలోనే భాషా సంకేతానికున్న భావ వినిమయ; సమర్పణ శక్తులు రెండూ కలిసి వున్నాయని అర్థం చేసుకోవాలి.)

అంచేత వాచకత, వాచ్యత కార్చెవ్‌స్కీని అనుసరించి సంకేతానికున్న 'శాశ్వత విలువ' (పర్మనెంట్ వాల్యూ) కాదు. మానవుడి అంతశ్చేతనం సంకేత ఉపయోగంద్వారా ఏ దశలో భావవినిమయం/ ప్రకటన జరపాలని 'వివక్షి'స్తుందో; దానికి అనుగుణమైన 'విచికిత్స'ను రేకెత్తించే దానిగా 'సంకేతాన్ని' సృజిస్తుంది. అంచేత సంకేతాలు 'గోడలో ఇటుకల్లా' గా నిలకడగా వుండేవికావు. అవి శరీరంలో ప్రసరిస్తున్న రక్తకణాల్లాంటివి. రక్తకణాలు చలించకపోతే; ఆ చలనంలో భిన్నగతులు లేకపోతే భిన్నదైహిక మానసిక స్థితులు ఎలా వుండవో; సంకేతాలు కూడా నిశ్చలంగా వుంటే భిన్న దశల్లో వాచ్య: వాచక సంబంధాతిరిక్తంగా అవి ప్రవర్తించడానికి వీల్లేదు. కాని వాచ్య, వాచకత లేకుండా దానికి నిర్మాణం లేదు. అంచేత 'సంకేతం' స్థిరంగా ఉండునట్లు కనిపిస్తూ చలించే భూగోళంలాంటిది. సంకేతం వాచ్యతను కోల్పోకుండా మరికొన్ని పరిధుల్లో అర్థప్రసరణ శక్తిని కల్గివుంటుంది.

కార్చెవ్‌స్కీ ప్రకారం భావ/శబ్దాల మధ్య బింబ / ప్రతిబింబ భావంలేదు. శబ్దం గాజు అద్దం కాదు. అటున్నది ఇటు నీటుగా కన్పించడానికి. సంకేతసృష్టి వ్యక్తిగత చేతనలో జరగ్గా; అవగాహన సామాజిక చేతనలో జరుగుతోంది. ఈ రెంటి మధ్యా చెప్పలేనంత దూరంవుంది. ఏ వ్యవస్థలోనైనా మానవుడికి స్వయార్జితమైన అంతశ్చేతన సామ్రాజ్యం వుంది. అక్కడ వ్యక్తి 'సామాజిక జంతువు' మాత్రం కాడు. ఈ సామ్రాజ్యంలో సృజింపబడుతున్నది సంకేతం కాబట్టి; ఒకవైపు భావాభివ్యక్తినీ; కాని ఆ సంకేతోపయోగం సమాజంలో కాబట్టి భావ వినిమయ శక్తినీ - రెంటినీ కూడదీసుకుంటోంది.

అంచేత వక్త వాడే ఏ శబ్దరూపమైనా అది వ్యక్తివాచకంగా కాకుండా జాతివాచకంగా (అంటే ఒక పర్యాయవాచకంగా) వాడబడుతోందన్నమాట. పదానికున్న ఈ జాతిలక్షణ స్పృహ సామాజిక చేతనా ధర్మం కాబట్టి పదాన్ని వినగానే మొదలయ్యే బౌద్ధిక విచికిత్స 'జాతి' నుంచి 'వ్యక్తి' ని నిర్ధరించు కొంటోందన్న మాట. కాని 'జాతిని' సామ్యదర్శనంతో పునర్నిర్మించు కోవడంలో మాత్రం పనిచేసేది 'హృదయ ధర్మి స్ఫురణ' తప్ప బౌద్ధిక విచికిత్స కాదంటాడు కార్చెవ్‌స్కీ. ఈ కారణంవల్లే సంకేతంలో ఈ రెండు లక్షణాలూ సహజీవనం చేస్తున్నాయి- అని ఆయన అభిప్రాయం. గురువుగారిని ఒకవైపు అనుసరిస్తూ - మరోవైపు సవరించాడు.

కార్చెవ్‌స్కీ ప్రతిభ ఈ రెంటినీ సమన్వయించడంలో వుంది.

సంకేతానికున్న ఈ ద్విధాకృతి వ్యతిరేక విన్యాసానికి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

'చెట్టు' అనే పదం వుంది. గుట్ట కానిది. పుట్ట కానిది, మొక్క కానిది, మాను కానిది అని 'నేతి' వాదానుసారంగా దీన్ని వ్యతిరేక ముఖంగా అర్థంచేసుకొంటున్నామా? లేక ఆ పదం వినగానే కలిగే అన్వయ రూపంగానా!

'చెట్టు' అనే రూపం చిత్రీకృతమై మనసులో ముద్రితమై 'వృక్షత్వ' భావరూపంగా ప్రతితెలుగువాడి అనుభవంలోనూ వుంది. తెలుగు రాని వాడిగతి ఏమిటి? 'మర(ం)', పేఢ్, ట్రీ, వృక్షః అనే రూపాలతోనైనా ఈ 'చిత్రం' ప్రతి వ్యవహర్త మనః ఫలకం పైనా వుంది. ఈ వృక్షత్వభావాన్నే ససూర్‌తోపాటు కార్ చెవ్‌స్కీ కూడా సంకేతానికున్న అన్వయరూప విన్యాసంగా గుర్తించింది. కాని ససూర్ ప్రకారం ఈ అన్వయం సామాజికంగా వ్యవహర్తలందరికీ ఉన్న వాజ్‌నిర్వహణ శక్తి 'లాంగ్' కి సంబంధించింది. నిత్యవ్యవహారంలో ఎన్నో సమస్యలున్నాయి. ప్రధానసమస్య ఎదుటివాడితో తన భావాన్ని వినిమయం చేసుకోవటం. ఈ వినిమయంలో సాయపడేది అన్వయరూపమైన భావాభివ్యక్తి కాదు - సంకేతగత 'విలక్షణత' - అది ఇతర సంకేతాలతో స్పర్ధించుకోవటంవల్ల సిద్ధిస్తుంది.

'చెట్టు', 'పెట్టు' అనే రెండు మాటలు తెలుగులో వున్నాయి. మొదటి వర్ణాలు చకార పకారాలు. ఇవి ఒకదాని బదులు మరోటి వాడటంవల్లనే ఇద్దరు తెలుగు వ్యవహర్తలు ఇది చెట్టనీ అది పెట్టనీ గుర్తిస్తున్నారు - నిత్యవ్యవహార సహకారి సూత్రం ఈ 'విభేద' పరిగణనం మాత్రమేనని ససూర్ వాదం.

కార్‌చెవ్‌స్కీ ప్రకారం గురువుగారు సంకేతంలో నిబిడీకృతంగా ఉన్న పై రెండు ధర్మాల్ని సమన్వయించలేకపోయారు. కారణం చకార పకారాల్ని ఒకదాని బదులు మరోటి వాడటం వల్లే 'చెట్టు', 'పెట్టు'లు ఏర్పడటం లేదు. చకార పకారాలు ఈ రెంటి మధ్యఉన్న తేడాని చెప్పగలుగుతున్నాయి. వ్యవహర్త 'చెట్టు' అని అంటున్నప్పుడు 'పెట్టు' అనే మాటను కూడా వ్యతిరేక ముఖంగానైనా ఉద్దేశించటంలేదు. 'చెట్టు' అనే మాటకు బదులు 'వృక్షత్వ' భావాన్ని చెప్పే మరోమాటను కూడా అనగలిగిన స్థితిలో వుంటూ 'చెట్టు' అనే అంటున్నాడు. ఇది వక్త్రి వివక్షకు సంబంధించింది. శ్రోత 'చెట్టు' పదం ద్వారా తనలో చిత్రితమైన వృక్షత్వభావాన్ని తోడి తెచు కుంటున్నాడు - దీన్నే 'విచికిత్స' అన్నది. ఉదాహరణానికి

'చెట్టై[2] వంగనిది మానై వంగుతుందా!'

అన్నప్పుడు 'చెట్టు', 'మాను' లు పరిమాణద్యోతకాలైన 'భావ' రూపాలై పిల్ల పెద్ద అన్న మానవ విభాగంతో అన్వయరూపాన్ని పొంది 'సార్థకా' లవుతున్నాయి తప్ప చెట్టుకానిదానితో; మాను కానిదానితో - వ్యతిరేకాన్వయం పొంది - అర్థవిభేదక శక్తివల్ల - భిన్నంగా గుర్తింపబడటంచేత కాదు.

ఇంతేకాకుండా ఒక 'పదా' న్నే ఎప్పుడూ ఎవ్వరూ సృష్టించరు. రెండు పదాలు సృష్టిస్తారు. ఒకటి వ్యక్తి సంబంధి (ఇండివిడ్యువల్), రెండోది జాతి సంబంధి (క్లాస్). వక్త 'వ్యక్తి' ని ప్రయోగించినపుడు శ్రోత 'జాతి' ద్వారా 'వ్యక్తి' అర్థాన్ని నిర్ధరించుకొంటున్నాడు. ఇది 'సంకేతం' వ్యవహారాన్ని పొందేటప్పుడు కలిగే 'వ్యతిరేక విన్యాస' స్వరూపం. ఈ లక్షణం వల్లే ఒకవైపు భావ వినిమయాన్ని; మరోవైపు భావాభివ్యక్తినీ - సంకేతం ఒకేసారి సాధిస్తోంది - అని కార్చెవ్‌స్కీ ప్రతిపాదించాడు.

సంకేతం' భాషా పదమే కానక్కరలేదు. భాషాపద ప్రయోజనంకూడా నిర్మాణ సౌష్ఠవంమాత్రంకాదు. ఈ సౌష్ఠవం చారిత్రక గతిలో మార్పును పొందకుండా స్థిరంగా వుండటమూ లేదు. సరిగ్గా ఈ సమస్యను పరిష్కరించడానికే ససూర్ 'చారిత్రక భాషా విజ్ఞానం' వేరుగా చూడదగినదని సూచించాడు. అంటే భాషలో ఎప్పటికప్పుడు స్థిరత్వం+ మార్పు కలిసి వుంటాయని ససూర్ అంగీకరించలేదన్న మాట. ఇది చాలా అశాస్త్రీయ మార్గం. భాషలో కొత్త- పాత అన్నది లేదు. పదాన్ని ఉపయోగించడం వల్లనే భాష జీవిస్తోంది. అప్పుడే దానికి 'వ్యక్తి' త్వం వస్తోంది. రూపం సిద్ధిస్తోంది. 'సందర్భం- ప్రయోజనం- వక్త- శ్రోత' లు లేకుండా పదానికి స్వతంత్ర వ్యక్తిత్వం లేదు. ఇతర సంకేతాలు (చేష్టలు, గుర్తులు మొ॥) ఎలా 'సార్థ' కాలో అలాగే పద సంకేతం కూడా.

ఉదాహరణానికి ఈనాటి తెలుగుని చూద్దాం. శాస్త్రీయ ప్రయోజనాలకోసం మాత్రమే అచ్చతెలుగని; తెలుగులో దేశీయ (ద్రావిడాంశమనీ), అన్య దేశీయమని- విభాగించి ప్రదర్శిస్తున్నాం. కాని ఎలా జాతికి స్వచ్ఛత ఉండదో అలాగే భాషకుకూడా ఎన్నో భాషాంశాలు కలిసి ఈనాటి తెలుగు 'ఇంగ్లీషు' స్థాయిలో రచనలు చేయడానికి అనుకూలమైన స్థితికి చేరుకుంది. కేవలం అచ్చతెలుగు మాట్లాడే వ్యవహర్త ఎవడూ దొరకడు. మరో భాషో, భాషా పదమో కలవకుండా ప్రత్యక్ష అప్రత్యక్ష భావ ప్రభావమో- లేకుండా ఎవ్వడూ మాట్లాడడు. ఈ కారణంగానే కింది పదాలు ఒకదానికంటె మరొకటి గౌరవప్రదమని గుర్తిస్తాడు. (చూ. బ్రహ్మానంద - 1982 చి.)

1. బువ్వ (కడి)	పెండ్లి	చూడ్డం	బాట	చాకలి గుంపు
2. భోజనం	వివాహం	దర్శనం	రోడ్డు	రజక సంఘం

2. మొక్కై - అని మరికొన్ని ప్రాంతాల వ్యవహారం.

వ్యవహారంలో 1, 2 లు రెండూ వున్నాయి. సందర్భం బట్టి 'బువ్వ, కడి, అన్నం, బోజనం, భోజనం'అన్న పదాల్ని వ్యవహర్త వాడుతున్నాడు. ఈ పదాలన్నీ పర్యాయ పదాలే. కాని దేనికది విలక్షణ అర్థ ప్రసరణశక్తి కల్గింది. ఈ శక్తిలోనిభేదమే వ్యవహర్తల్ని వేరు చేస్తున్న అంశం. ఈ నాటి తెలుగులో 'భాగవతం' అనే వక్త అశిష్టుడని- 'భాగవతం' అనే వక్త శిష్టుడనీ పరిశోధకులు గుర్తిస్తున్నారు. కాని ఛావు, ఫెద్ద, ఢామ్మని, ఫెళ్ళని లాంటి ప్రయోగాలు శిష్టులకూ అశిష్టులకూ సమానమే. ఇక్కడ పై భేద పరిగణన సూత్రం ఎందుకు పని చెయ్యడంలేదు? తెలుగులో 'ఖర్మ' అనే మాటలో మహాప్రాణముంది. ('ఫేట్' అనే అర్థంలో) 'కర్మ' అనే మాటకూడావుంది (ఆబ్సెక్వీస్ అనే అర్థంలో)- ఇతరత్రా ఎక్కడా అల్పప్రాణ మహాప్రాణ భేదం అర్థ విభేదకం కాదు- ఇక్కడ అవుతోంది- అని ఎవరైనా అంటే అది తప్పు. మొదటి కారణం 'కర్మ' కు రూపాంతరం; అర్థాంతరం రెండూ ఏర్పడి 'ఖర్మ' అనే తెలుగువాడి ఉచ్చారణ, భావాభివ్యక్తిఏర్పడ్డాయి, క/ ఖలు ఏకస్థానవ్యాప్తిని, అర్థ భేదాన్ని సూచిస్తున్నా అవి ప్రత్యేక వర్ణాలు కావు. 'ఛావు' లోని మహాప్రాణమూ ప్రత్యేక వర్ణంకాదు. కాని 'నొక్కి' చెప్పడాన్ని సూచిస్తుంది. ఇది భావాభివ్యక్తి (సిగ్నిఫికేషన్,; 'ఖర్మ' అన్నపుడేర్పడుతున్నది ప్రత్యేక పదంకాదు. 'కర్మ' కు ఒక పర్యాయపదం మాత్రమే. కాని అర్థ విశేషం వుంది. ఇది 'కర్మ' పదానికున్న జాత్యర్థం (కనొటేషన్) నుంచీ అవగతమవుతోంది. దీన్నే 'కాగ్నిషన్' అంటాం. అందుకే కర్మ - ఖర్మలు భావవినిమయ వాహికలుకూడా (కమ్యూనికేషన్).

సాహిత్య సృష్టిలో - అనుభవంలో కూడా ఈ రెండు ప్రయోజనాల్నీ సాహిత్య సంకేతం సాధిస్తోంది. కవి ఒక మాట వాడుతాడు.

'మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడచిరా'

- (దాశరథి)

ఇక్కడ వాచ్యార్థం లేదంటారు విమర్శకులు. ఇంగ్లీషు విమర్శ కూడా చదువుకున్నవారు ఇందులో 'అనిర్వచనీయత' వుందంటారు. (చూ. చి. సుబ్బారావు - 1967). ఇక్కడ వున్న సంకేత వ్యాపారంలో కార్చెవ్స్కీ చెప్పే రెండు వ్యాపారాలూ ఎలా వుంటో పరిశీలిదాం.

తను మధ్యమ; శూన్యమధ్యమ అన్నపుడు ఎలా తను, శూన్య పదాలు మధ్యమ పరిమాణ వ్యంజకాలో; అలాగే 'మాట్లాడని మల్లెమొగ్గ' ఒకవైపు ఆమె మాటని గూర్చి; మరో వైపు ఆమె సౌందర్యాన్ని గూర్చి ఒకేసారి చెబుతోంది. 'ఆమె బుంగమూతి పెట్టుకుని కూర్చుంది -' అనే భంగిమనూ తెలుపుతోంది. ఇంకా ఏమేమో; తెలపవచ్చు. ఇదంతా మనం చేసే ఊహ సర్కస్సులు.

దాశరథి దేన్నో ఉద్దేశించాడు. దాన్ని చెప్పడానికి ఒక మార్గం అలా అనటం (కమ్యూనికేషన్) ; ఆ పదాలు ఒకదానితో ఒకటి 'రాముడు అన్నం తిన్నాడు' లాగా కలిసి వుండటంలేదు. కాని ఒక భావాన్ని నిష్పన్నం చేస్తున్నాయి (సిగ్నిఫికేషన్); అది రియలిస్టు కవితయినా, సర్రియలిస్టు కవితయినా - ఈ రెండూ ఉంటాయి. ఈ రెంటిలోనూ మొదటిది లేకుంటే రచయిత చెప్ప దల్చుకున్న దానికి 'ఔట్‌లెట్' ఉండదు. రెండోది లేకపోతే మొదటిది అనుభవంలోకి రాదు. వక్త - శ్రోత ఎవరికి వారే - యమునాతీరంలో విహారం చెయ్యాల్సిందే.

కాబట్టి సాహిత్యమంతా ఇలా 'ఏమో' చెప్పడం, 'ఏదో' అర్థం కావడమూ - అయితే ఈ కావ్యంలో ఇదే చెప్పబడదని విశ్వనాథ లాగా ఒకడు ఎలా చెప్పగలుగుతున్నాడు? ఒక వెయ్యేళ్ళ క్రితం రాసిన పుస్తకం ఈనాడు ఎలా అర్థమవుతోంది? ఒక భాషనుంచి మరో భాషలోకి ఎలాఅనువదిస్తున్నాం?

గురజాడ శ్రీశ్రీకి మాత్రమే ఎందుకర్థమయ్యాడు? ఇద్దరికీ వస్తుతత్త్వావగాహనలో సామ్యాలు ఉండటంవల్ల - అన్నది ఒక్కటే సమాధానం. (వివరాలకు చూ. బ్రహ్మానంద 1982 ఎ.) అంటే (సాహిత్య) భాష ఒక 'అవగాహన' మన్నమాట. ఒక వాక్యంలో పదాలు ఒకదానితో ఒకటి కలసి స్పర్థించుకొని - తాత్పర్యంగా ఒక భావాన్ని అందిస్తాయన్న మాట. ఆ భావం ఆ పదాలలో దేనిలోనూ సంపూర్ణంగా ఉండకపోవచ్చన్నమాట.

అంటే ఆ భావాన్ని సూచించడానికి ఆ వాక్యంలో వాడబడ్డవన్నీ పర్యాయవాచకాలు కాకపోతే భావావిష్కరణకు మరో మార్గం లేదు. దీన్ని తిరగేసి చెబితే ప్రతిపదమూ స్వతంత్రంగా ఒక అర్థాన్ని (విభేదకశక్తివల్ల) ; అస్వతంత్రంగా ఒక భావాన్ని (అభివ్యక్తివల్ల) చెబుతుందని సారాంశం. ఆనందవర్ధనుడు ధ్వని సిద్ధాంతంగా ఈ అంశాన్నే ప్రతిపాదించింది. కల్లర్, బార్తెస్ మొదలైన వాళ్ళు ఈనాడు గుర్తిస్తున్నదీ ఈ అంశాన్నే.

కార్చెవ్‌స్కీ ప్రతిభ భాషాసంకేత ధర్మంగా ఈ వ్యతిరేక అన్వయ విన్యాసాన్ని గుర్తించడంలో వుంది. 'ధ్వని' వాగ్వ్యాపారమన్న ఆనందవర్ధనుడు కూడా ఒక కార్చెవ్‌స్కీ వంటివాడే.3

'సెమియాటిక్స్' అన్న విభాగాన్ని ఇంకా సమగ్రం చెయ్యడానికి; మన భాషా స్వరూపావగాహన విస్తరించుకోవడానికి కార్చెవ్‌స్కీ ప్రతిపాదనని పట్టుగొమ్మగా వాడుకోవచ్చు.

---

3. వివరాలకు చూ. బ్రహ్మనంద(1981. ఎ. అధ్యాయం 2) భారతీయ అలంకారికుల్లో కుంతకుడికి ఒక ప్రత్యేక స్థానం వుంది. ఆనందవర్ధనుడి వాచ్య /వ్యంగ్య భేదపరిగణనం అశాస్త్రీయమనీ 'స్పంద' మార్గానుగామిగా కుంతకుడు భావించాడు. ఆ దృష్టితో 'భావం', 'వాచకం', 'వాచ్యం' అన్న మూడు అంశాలు మాత్రమే వుంటాయి. 'వాచకం' అంటే 'శబ్దం', 'వాచ్యం' అంటే అర్థం. సరిగ్గా కార్చెవ్‌స్కీ లాగే 'శబ్ద' మంటే ఏమిటో కుంతకుడు ఇలా చెబుతున్నాడు :

'శబ్దో వివక్షితార్థైక వాచకోఽన్యేషు సత్స్వపి'

(వక్రోక్తిజీవితం 1-9)

ఇతర శబ్దాలు (పర్యాయవాచకాలని వీటినే మనం అన్నది) ఉన్నా వివక్షితమైన అర్థాన్ని ప్రతిపాదించే ఏకైకమైన శబ్దాన్నే 'వాచకం' అంటాం - అని అర్థం. అర్థవిషయం ఇక్కడ ప్రస్తావించడం లేదు. కాబట్టి వివక్షిత/అవివక్షిత - అనే భేదపరిగణనం అనవసరమని కుంతకుడి ఆలోచన. (కుంతకుడి మీద పరిచయానికి చూ. బ్రహ్మనంద 1981. అధ్యా. 2. పుటలు 172-177.)

పఠనీయ వాఙ్మయం

1. బ్రహ్మనంద, హెచ్. ఎస్. — 'వ్యంజన సూత్రము' అక్షర ప్రసార పరిచురణ (1981)
2. — 'తెలుగు సాహిత్య విమర్శః పాశ్చాత్య ప్రభావం' (అము) (1982 ఎ)
3. — 'భాషలో ప్రతిబింబన ధర్మం' స్రవంతి అక్టోబరు సంచిక (1982 బి)
4. స్టెయినర్, పీటర్ — 'ఎ డిఫెన్స్ ఆఫ్ సెమియాటిక్స్ — ది డ్యూయల్ అసెమ్మెట్రీ ఆఫ్ కల్చరల్ సైన్స్', న్యూ లిటరరీ హిస్టరీ (లో) 12 - 3 పు. 415-436 (1981)
   [కార్చెవ్‌స్కీ (1929) ఫ్రెంచి భాషలో రాసిన వ్యాసాన్ని ఆధారంగా పీటర్ స్టెయినర్ ప్రతిపాదించిన విషయాల్ని ఈ వ్యాసం చర్చించింది. పాఠకులు స్టెయినర్ వ్యాసంలో వివరాలు చూసుకోవచ్చు.]
5. ససూర్, ఫర్డినాండ్ డి. — 'కోర్స్ ఇన్ జనరల్ లింగ్విస్టిక్స్' (ఫ్రెంచినుంచి అనువాదం) వాడ్‌బాస్కిన్) న్యూయార్క్ (1959).
6. సుబ్బారావు, చిరుమామిళ్ళ — 'కవిత్వంలో అనిర్వచనీయత', తిరుపతి సాహిత్య సమితి వ్యాసావళిలో (1967).

[ఈ వ్యాస రచయిత ఆంధ్రపత్రిక ఉగాది సంచిక (1978, 79, 80, 81) ల లోనూ, భారతి ఏప్రిల్ (1982) లోనూ, 'వ్యంజన సూత్ర ఖండనం' అన్న వ్యాసం (ముద్రణలో; భారతిలో) లోనూ చర్చించిన, చర్చిస్తున్న విషయాలకి ఈ వ్యాసం కంటిన్యుయేషన్ కాబట్టి పాఠకులు ఆ వ్యాసాలతో కలిపి దీన్ని చూసుకోవాలి. ఈ వ్యాసాల్లో వాడబడుతున్న పరిభాషకు ఒక కొత్త నిఘంటువును తయారు చేసుకోవాల్సిన అవసరమూ కనిపిస్తోంది. ఆ ప్రయత్నమూ జరుగుతోంది.]

చైత్రం

శ్రీ సోమసుందర్

పూవులు పెళ్ళి చేసుకొంటున్నాయి -
వస్తారా చూసొద్దాం !

ఆరామ వాటికల ఆనందనిలయాలలో
తపోవనాల కళ్యాణ వేదికలలో
పూవులు పెళ్ళిచేసుకొంటున్నాయని
ఎంత సరదా ? ఎంతసంబరం ? !

గుచ్ఛాలేతప్ప కులాలులేని పూవులు-
స్తబకాలేతప్ప మతాలెరుగని పూవులు-
మాధుర్యమేతప్ప మదమత్సరాలెరుగని పూవులు-
మంచితనాలకు మారుపేర్లు!

ఈ ఉగాది వేకువనే-
ఈ సుహాస సదస్సునే-
సందడిగా పెళ్ళిచేసుకుంటున్నాయి పూవులు
వస్తారా చూసొద్దాం!

ఆమని కోమలగాంధర్వం పూరించింది
అవని శ్యామలవసనం ధరించింది
మలలూ పొలాలూ ప్రతిరుతించాయి....
కాననాలూ కాసారాలూ ప్రతిచలించాయి!

ప్రతికొత్త కెరటమూ
ఒక కొత్త పేరుతో-
ప్రతి కొత్త ప్రసవమూ
ఒక కొత్త శోభతో,

ఈ ప్రభాతానిల శ్రవణాల నూదింది-
నవ జీవనానంద మంత్రాక్షరాలు....

సెలయేటి తటాలు
నిలువుకాళ్ళ నిలచాయి....
పంటకాలువ గట్లు
ఊటికాడల పూలబూరా లూదాయి....

చెరువు నడిబొడ్డులో నిలచి
జలక్రీడలాడుతున్న కలువలూ తామరలూ
మోమెత్తి పరకాయించిచూసి
గట్టునున్న మావికొమ్మ కొంటెచూపులకు
సిగ్గుపడి మొగం చాటుచేసుకుంటున్నాయి!

నిరంతరశ్రమ జీవనులు మధుపాలు
కష్టనిష్ఠుర జీవితం గడచిపోయిందనీ-
ఇకపై శ్రమఫలితంగా పుష్కలంగా మధువు
లభిస్తుందనీ ఒక్కటే రొదగా ఝుంకరిస్తున్నాయి !

తలిరాకు జొంపాల పరదాలు తొలగించుకొని
అప్పుడేవచ్చింది అసూర్యంపశ్య కోకిలభామ!

తానుమంగళగీతం వినిపించనిదే
పూవులపెళ్ళి ఎలా జరుగుతుందని-
ఆమె కెంత గర్వం ? ఎంత స్వాతిశయం ?

ఇంకేముంది ? మిత్తినెత్తి మొత్తింది
అనుకున్న పలాశం ఎర్రని చీరలతో
ముస్తాబై పచ్చల పళ్ళెరంలో
పసుపూకుంకుమా రవికలగుడ్డా తగవుతెస్తోంది!

పలాశం ఠీవిగా నడిచివస్తూంటే
చుప్పనాతి ఈత తుప్పలు స్తైతం
దారితప్పుకొని ప్రక్కల కొత్తిగిలుతున్నాయి!

చైత్రరథాన్ని లాగిలాగి
ఎత్తు కొండ లెక్కలేక ఎక్కలేక
ఆయాసంతో రొప్పుతున్నాయి చిలుకతేజీలు!

నల్లగా దర్జాగా నిలచిన తాళవృక్షాలు
తలలవంటి గెలలు భుజాలకెత్తుకొని
కోరమాపులు చూస్తున్న యమకింకరులు!
తోటనంతా ధిక్కరించి చేస్తున్నాయి ఎగతాళి....

అదేమిటీ....ఆ కొండవార - తుప్పల్లో ?!
ముళ్ళే ఎర్రగా పూసినట్లు -
ఏమిటానెత్తుటి మడుగులు ?
ఏ త్యాగధనుల ఆత్మార్పణ లొలికించిన సుడులు ?
కుసుమోద్వాహ శుభవేళ ఎందుకా రక్తకళ్యాణం ?

ఎక్కడపెళ్లిపందిరి ? అసలెక్కడ ఎక్కడ ?
అనుకుంటూ తొందరగా దిక్కులు వెదుకుతూన్న
దారి తెలియని వెర్రినాగమ్మలకు
తన పొడుగాటి బారుచేతులు చాపి -
కొబ్బరిచెట్టు
పక్కనేడున్న వేపగుబురు చూపుతోంది!

అప్పుడు ప్రారంభమైంది
వివాహ వైభోగం!
విందులూ పసందులూ అంతటా కోలాహలం!
పూవులపెళ్లి జరుగుతోంది—
వస్తారా చూద్దాం.....!

❖❖❖❖

గుండెకు అండ

డాక్టర్ దాశరథి

నా గుండెకు
    నేనే అండను;

నా ఆత్మకు
    నేనే కైదండను

వర్షా నదిలా పొంగను
    ఇసుక మేటులా క్రుంగను

ఎలాటి నియంతకైనా
    ఎలాటి హంతకైనా లొంగను

అదృష్టమే ఆగ్రహించినా
ఆ ప్రళయమే ఆవరించినా
    రవ్వంత చలించను
    నవ్వుతూ యెదుర్కొంటాను

కష్టాలను ఇష్టపడతాను
నమ్మిన సిద్ధాంతం కోసం నష్టపడతాను
    కాలమహాప్రవాహంలో కేళీ విలాసంగా
    లీలా విహారం చేస్తుంటాను

కలంలో బలం వున్నన్నాళ్ళు
    కవితలు వ్రాస్తూవుంటాను
గళంలో బలం వున్నన్నాళ్ళు
    కవితలు వినిపిస్తుంటాను.

డా॥ సి. వి. రామచంద్రరావు

రాయవాచక రచనా కాలము దాని చారిత్రకత

I

ముందు మాటలు

విజయనగర సామ్రాజ్య చరిత్రకు సంబంధించి అతి ముఖ్యమైన సారస్వతాధారము రాయవాచకము. ఇది ప్రత్యేకించి సాహితీ సమరాంగణ సార్వభౌముడు, అప్రతిహత చక్రుడు అయిన శ్రీకృష్ణదేవరాయల జీవిత విశేషాలను, పరిపాలనా విశేషాలను, అన్నిటికన్న మించి అతని దిగ్విజయాలను గూర్చి అమూల్యమైన, చారిత్రక సామాగ్రిని మనకు అందిస్తుంది. అంతేగాక, కర్ణాటక-విజయనగర పాలకుల దినచర్య, నాటి సాంఘిక మర్యాదలు, రాజోచిత మర్యాదలు, సంప్రదాయాలు, పరిపాలన, రాజనీతి, సైనికవ్యవస్థ, అర్థబలము, అంగబలము మొదలుగా అనేక ఆసక్తికరమైన విషయాలనుకూడా రాయవాచకము మనకు తెలియ చేస్తుంది. ఇట్లు శ్రీకృష్ణదేవరాయలను గూర్చి ప్రత్యేకించి, ఆపైన విజయనగర రాయలను గూర్చి అనేక విలువైన విషయాలు తెలుపునది కాబట్టి 'రాయవాచక' మని దీనికి సార్థక నామధేయము. ఈ విషయాన్ని రాయవాచక రచయిత, గ్రంథం మొదట్లో రెండు పద్యాల్లో క్లుప్తంగా ఇలా చెప్పాడు:[1]

విజయనగర వృత్తాంతము
సుజనులచే విన్నయట్టి సూనృతవాక్కుల్
ప్రజలకుఁ దేటపడంగా
సృజియించితిఁ గృష్ణరాయశేఖరు చరితల్.

విజయనగర జనపాలుడు
విజయపురి గోలకొండ వీడుల తోడన్
గజపతి నాజిగెలిచిన
విజయుండౌ కృష్ణరాయ వీరుని చరితల్.

రాయ వాచకం తెలుగు భాషలో, అందునా వ్యావహారిక భాషలో, వెలువడిన మొదటి వచన కావ్యాలలో ఒకటి. అందుచే దానికి చారిత్రకాధారంగానే కాక, ఆంధ్ర వచన వాఙ్మయంలో ఒక విశిష్టస్థానం ఉంది. ఒక సాహిత్య వేత్తనుడివినట్లు, 'దేశ చరిత్రకు వలెనె తెలుగు వచన చరిత్రకున్ను అది ముఖ్యమయిన గ్రంథము.'[2]

రాయ వాచకానికి రెండు తాటాకు ప్రతులు పుదుక్కోటలో లభించాయి. కీ. శే. జయంతి రామయ్య పంతులుగారు వీనిని పరిష్కరించి, పాఠము నిర్ణయించి, మొదటిసారిగా రాయవాచకాన్ని 1914 లో ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక తృతీయ సంపుటంలో ముద్రిస్తూ, ఇలా వ్రాశారు: "ఈ గ్రంథము తాటియాకు ప్రతులు రెండు పుదుక్కోటలో దొరకినవి. అందొకటి సంపూర్ణముగను మరియొకటి యసంపూర్ణముగా నున్నవి. రెంటిని బరిశీలించి పాఠము నిర్ణయించుటమైనది. భాష తఱచుగా లక్షణ విరుద్ధమయినను జరిత్రాంశములే ప్రధానముచేసియు దక్షిణదేశము నందానాడు వ్యాపించియున్న వ్యావహారికాంధ్రభాషా స్వరూపము లోకమునకుం దెలియుట మంచిదనియు వాక్యరచన మున్నది ఉన్నట్లే ప్రకటించుచున్నాము. శీఘ్రముగానే యీ గ్రంథము టిప్పణముతో పుస్తకరూపముగ ప్రకటించదలచినారము."[3] రామయ్య పంతులుగారు రాయవాచకాన్ని ప్రకటించిన నాటినుండి అది విజయనగర సామ్రాజ్య చరిత్రకారుల దృష్టి నాకర్షించి, అందులోని చారిత్రక విషయాలు చర్చలోనికి తెచ్చుట జరిగింది. ఈ వ్యాసం ఉద్దేశం రాయవాచకంలో విజయనగర చరిత్రకు సంబంధించిన అనేక విషయాలను ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయల దిగ్విజయాలకు సంబంధించిన విషయాలను చర్చకు తేవడంకాదు; అది పెద్ద గ్రంథమవుతుంది. ఈ వ్యాసం రాయవాచక రచనాకాల నిర్ణయానికి, చారిత్రకాధారంగా దానికి గల విలువను నిగ్గుదేల్చుటకు పరిమితమయింది.

II

రచయిత - రచనాకాలము

రాయవాచక రచయిత తనను 'శ్రీ మన్మహామండలేశ్వర కాశీవిశ్వనాథ నాయనయ్య వారి స్థానాపతి' నని పదవిచే తెల్పుకొన్నాడుగాని తన పేరును తెల్పలేదు.[4] విజయనగర సామ్రాజ్య కాలంలో విజయనగర రాయల సామంతులు, అమర నాయకులు రాజధానీ నగరమైన విజయనగర మందలి రాజకీయ వృత్తాంతాలను ఎప్పటికప్పుడు తమకు చేరవేయడానికి, తమకు చక్రవర్తులకు మధ్య రాజకీయ లావాదేవీలు కొనసాగించడానికి తమ స్థానాపతులను విజయనగర మందుంచెడివారు. ఇట్లే ఒక రాజ్యమువారు తమ ఇరుగు పొరుగు రాజ్యాలలో ఇట్టి స్థానాపతులను నియమించెడి రాజకీయ ఆచారముండెడిది. గజపతిరాజ్యంలో కర్ణాటకంవారి స్థానాపతి కమలనాభయ్యను,[5] పరస్పరంగా ఉన్న తదితర రాజ్యాల రాజ్యాధిపతుల, అమర నాయకుల స్థానాపతులను రాయవాచకం పేర్కొంటుంది.[6] కాశీవిశ్వనాథ నాయనయ్యవారి తరపున విజయనగరంలోఉన్న స్థానాపతి ('పొలిటికల్ ఏజంట్') పంపిన విన్నపం లేక 'రిపోర్టు' యీ రాయవాచకం.

రాయవాచకంలో 'కాశీ విశ్వనాథ నాయనయ్యవారి స్థానాపతి భక్తి పరాధీనుండు సద్వినయ భయ భక్తులనున్ను శాయంగల విన్నపం' అని చెప్పి ఉండడం[7] చేత 'భక్త పరాధీను' డనేది యీ స్థానాపతిపేరా అని ప్రశ్నించుకోవచ్చు ; షష్ఠీతత్పురుషంలో ఉన్న ఇట్టి పేరు అరుదైనది; వింతైనది. ఒకవేళ ఉండినదనుకొన్నా సమకాలిక సారస్వతంలో, శాసనాలలో తటస్థపడదు. అందుచే మనం ప్రస్తుతానికి రాయ వాచక రచయితను విశ్వనాథ నాయకుని స్థానాపతి అని పదవీపరంగానే చెప్పుకోవలసి ఉంటుంది. దీనినిబట్టి ఈ విశ్వనాథ నాయకుడెవడో అతని కాలమేదో నిర్ణయించ గలిగితే రాయవాచక రచనాకాలం నిర్ణయించడం సాధ్యమవుతుంది.

విజయనగర చరిత్రలో సుప్రసిద్ధుడైన విశ్వనాథనాయకు డొకడున్నాడు. ఇతడు కొటికం నాగమనాయని పుత్రుడు. శ్రీకృష్ణదేవరాయల (క్రీ. శ. 1509 - 1530) చివరి ఏండ్లలో తంజావూరు పాలకుడైన వీరశేఖరచోళుడు మధురరాజ్యంపై దండెత్తి అచట రాయల సామంతుడుగ మధురను పాలిస్తున్న చంద్రశేఖర పాండ్యుని పారదోలగా, పాండ్యుడు తన రాజ్యాన్ని తనకు దక్కించవలసిందని రాయలతో మొరపెట్టుకొన్నాడు. వీరశేఖరచోళుని దండించి పాండ్యునికి రాజ్యమిప్పించవలసినదని రాయలు నాగమనాయకుని ఆదేశించి సైన్యాలతో పంపాడు. నాగమనాయకుడు చోళుని తరిమి మధురరాజ్యాన్ని ఆక్రమించి ఆ రాజ్యాన్ని రాయల ఆదేశం ప్రకారం పాండ్యున కప్పగించక, అధికారాన్ని హస్తగతం చేసుకొని రాయల కెదురు తిరిగాడు. రాయలు నిండు సభలో ఈ తిరుగుబాటు దారును శిక్షించగల సమర్థుడు లేడా అని ప్రశ్నించగా, విశ్వనాథనాయకుడు తానున్నానని ప్రకటించుకొని రాయల అనుమతితో తన తండ్రిపై దండెత్తి అతనిని బంధించి తెచ్చి రాయల సమక్షంలో ఉంచాడు. రాయలు విశ్వనాథనాయకుని అనన్య సామాన్య స్వామిభక్తికి మెచ్చి, నాగమనాయకుని క్షమించి, విశ్వనాథనాయకుని, మధురరాజధానిగా, పాండ్యచోళ రాజ్యాలకు అధిపతిని చేసినాడు. ఈ వృత్తాంతం మనకు 'తంజావూరు ఆంధ్ర రాజుల చరిత్ర' లో కనబడుతుంది.[8] 'కర్ణాట కొటికం రాజుల కైఫీయతు' ప్రకారం అచ్యుతరాయలకాలంలో విశ్వనాథనాయకుడు మధుర రాజ్యానికి పట్టాభిషిక్తుడైనట్లు తెలుస్తుంది.[9]

పై వృత్తాంతాల ప్రకారం విశ్వనాథనాయకుడు శ్రీకృష్ణదేవరాయల చివరికాలంలోనో లేక అచ్యుతదేవరాయల కాలం (1530 - 1542) లోనో మధుర రాజ్యానికి పట్టభద్రుడై, మధుర నాయక రాజ్యస్థాపకుడును, మధుర నాయక రాజులకు మూలపురుషుడును అయినాడు. విశ్వనాథనాయకుడు క్రీ. శ. 1563 వరకు జీవించి వుండినట్లు తెలుస్తుంది; శాసనాలను బట్టి అతడు క్రీ. శ. 1560 వరకు పదవిలో ఉన్నట్లు తెలుస్తుంది. పై వృత్తాంతాలలోని విశ్వనాథనాయకుడిని, రాయవాచకం పేర్కొన్న కాశీవిశ్వనాథనాయనయ్యను ఒకరుగానే ఊహించి, గుర్తించి, ఆసూరి రంగస్వామి సరస్వతి[10], యస్. కృష్ణస్వామి అయ్యంగార్ [11], జయంతి రామయ్యపంతులు[12], అరుణకుమారి[13] మొదలుగా కొందరు చరిత్రకారులు, రాయవాచకాన్ని విశ్వనాథనాయకుని స్థానాపతి పదునారవ శతాబ్ది పూర్వార్ధంలో, కృష్ణదేవరాయల చివరి ఏండ్లలోనూ, అచ్యుతరాయలకాలం (క్రీ. శ. 1530 - 1542) లోనో వ్రాసి ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు. కొందరు రాయవాచకం 16 వ శతాబ్ది ఉత్తరార్ధంలో, విశ్వనాథనాయకుని కాలం (క్రీ. శ. 1529 - 1564) లో వ్రాసిందని భావించారు.[14]

విజయనగరచరిత్ర చతురాననులైన వెంకటరమణయ్యగారు మొదట్లో పై అభిప్రాయాన్నే కలిగి ఉండినారు.[15] కాని తరువాత

ఈ విషయంలో విశేష పరిశోధనగావించి, పై అభిప్రాయంతో విభేదించారు. సమకాలిక రచనలు, శాసనాలు, సారస్వతము, కైఫియతులు ఆధారంగా, విశ్వనాథనాయకుడు కృష్ణదేవరాయల కాలంలో అడపం (తాంబూలకరండ వాహకుడు)గా మాత్రముండినవాడని, అచ్యుతరాయల కాలంలో అతడు కొంతకాలం (క్రీ. శ. 1530-42) అతడు సామంత రాజోచితమైన మహామండలేశ్వరాది బిరుదములు లేక తనను అచ్యుతరాయల 'ఊడిగము' (సేవకుడు) గ మాత్రమే చెప్పుకొన్నవాడని, అటుతర్వాత అమర నాయకుడుగ మాత్రమే ఉండినాడని, మధుర నాయక రాజ్యము కృష్ణదేవరాయల కాలమున గాని, అచ్యుతదేవరాయల కాలమునగాని, విశ్వనాథ నాయకుడు స్థాపించలేదని, అది రాక్షస-తంగడి లేక తళ్లికోట యుద్ధము (క్రీ.శ. 1565) తర్వాత, సదాశివరాయల కాలం (క్రీ. శ. 1542-1576) లో అప్పటి అల్లకల్లోల పరిస్థితులు అదునుగా తీసుకొని అప్పటివరకు అమరనాయకుడుగా ఉన్న విశ్వనాథనాయకుని కుమారుడు కృష్ణప్ప (క్రీ. శ. 1564-1570) స్థాపించినాడని వెంకట రమణయ్యగారు నిర్ధారించారు[16]. అంతేకాక, రాయవాచకంలో పేర్కొన్న 'కాశీ విశ్వనాథనాయనయ్య' మధురనాయక రాజ్యస్థాపకుడుగా తలచబడే నాగమనాయకుని పుత్రుడు విశ్వనాథనాయకుడు కాదని నిరూపించి, రాయవాచక గ్రంథకర్త "మధుర రాజ్యస్థాపకుడైన విశ్వనాథనాయకుని యొక్క స్థానాపతియుగాను, పదునారవ శతాబ్దము నందీ గ్రంథము వ్రాయబడనులేదని తీర్మానించారు.[17]

వెంకటరమణయ్యగారు చెప్పినట్లు, నాగమనాయకుని కుమారుడు విశ్వనాథనాయకుడు మధుర నాయక రాజ్యస్థాపకుడు కాకపోగా, రాయవాచక మందలి అంతఃస్సాక్ష్యం కూడా అది విశ్వనాథనాయకుని కాలంలో, అనగా క్రీ.శ. 1560 లకు ముందు వ్రాయబడినట్లు తెలుపదు. రాయవాచకంలో క్రీ. శ. 1560 కి తర్వాత ఉండి ప్రసిద్ధికెక్కిన చారిత్రక వ్యక్తుల, సంఘటనల ప్రసక్తి అధికంగానే ఉంది. రాయవాచక రచనాకాలానికి సంబంధించి ఈ అంతః స్సాక్ష్యంవల్ల తెలియవచ్చే చారిత్రక వ్యక్తులను, సంఘటనలను కొన్నిటిని వెంకటరమణయ్యగారు తెలిపిఉన్నారు; వారు తెలిపినవిగాక నేనుగా గమనించిన విషయాలు కొన్ని కలవు. ఈ గ్రంథరచనాకాలానికి సంబంధించి వెంకటరమణయ్యగారు తెలిపిన విషయాలను కొంత విపులీకరించిన్నీ, నేనుగా గమనించినవానిని ఈ క్రింద పొందుపరుస్తున్నాను. కాని ఈ అంతఃస్సాక్ష్యమంతా రాయవాచకం ఫలానిసంవత్సరాల మధ్య వ్రాసి ఉండవచ్చునని చెప్పడానికి తోడ్పడుతుందే కాని, నిచ్చితంగా రచనాకాలాన్ని గుర్తించడానికి వీలుగాలేదు. శ్రీకృష్ణదేవరాయల (క్రీ. శ. 1509-1530) తర్వాతి కాలానికి సంబంధించి రాయవాచకం పేర్కొన్న సన్నివేశాలను, వ్యక్తులను, ఈ క్రింద, వీలైనంతవరకు వాని కాల క్రమంలో పొందు పరుస్తున్నాను.

(1) మొదటగా రాయవాచకం ఫలానాకాలానికి ముందుగా రచించినదని చెప్పడానికి గట్టి ఆధారముంది. ఈ రాయవాచకం ఆధారంగా కుమార ధూర్జటి 'కృష్ణరాయవిజయ' మనే పద్య కావ్యాన్ని, ఆర్వీటి చిన వెంకటపతి కోరికపై రచించి, శ్రీరాముని కంకితమిచ్చాడు. ఈ చిన వెంకటపతిని క్రీ. శ. 1630-1642 లో కర్ణాటసామ్రాజ్యాన్ని పాలించిన ముమ్మడి వెంకటపతిదేవరాయల తమ్ముడు చిన వెంకటపతిగా గుర్తించి, వెంకటరమణయ్యగారు, ఈ కాలం (క్రీ. శ. 1630 - 1642) నాటికి "రాయవాచకము రచియింప బడియుండెనని నిశ్చయముగ జెప్పవచ్చును" అని అన్నారు[18]. కాని ఈ చిన వెంకటపతిని గుర్తించుటలో వెంకట రమణయ్యగారు పొరపాటు పడ్డారు. ఈ చిన వెంకటపతి, ముమ్మడి వెంకటపతి దేవరాయల తమ్ముడయిన చిన వెంకటపతికి మనుమడైన ఆర్వీటి కోదండరామరాజు రెండవకుమారుడు. అనగా క్రీ. శ. 1630 - 42 తర్వాత రెండు తరాలుదాటి ఉన్నవాడు. అందుచే 'కృష్ణరాయ విజయం' క్రీ. శ. 1675 తర్వాత వ్రాసినదై ఉండాలి [19]. ఇది రాయవాచానికి పద్యానుకృతి కాబట్టి, రాయవాచకం క్రీ. శ. 1675 లకు ముందు వ్రాయబడి ప్రాచుర్యాన్ని పొందినట్లు చెప్పవచ్చును.

(2) రాయవాచక కర్త అందలి విషయాలు తాను నేరుగా చూచి వ్రాసినవిగాక, ఇతరులనుండి విని వ్రాసినట్లు, అవతారికా పద్యాలలో మొదటిదానిలో 'విజయనగరవృత్తాంతము సుజనులచే విన్నయట్టు సూనృతవాక్కుల్' అని సూచించి ఉన్నాడు. రాయవాచకం శ్రీకృష్ణదేవరాయల అన్న వీరనరసింహరాయల (1504-1509) దినచర్యను గూర్చి, శ్రీకృష్ణదేవరాయల దిగ్విజయ విశేషాలను గూర్చి తెలుపుతుంది. రాయవాచకకర్త వారి కాలంలో విజయనగరంలో ఉన్నవాడుకాకపోవుటచే అటుతర్వాతి కాలంలో తాను ఇతరులవల్ల విన్న విషయాలను వ్రాయడం జరిగింది. అందుచేతనే కాలవ్యతిరిక్తమయిన సన్నివేశాలను, వ్యక్తులను, విషయాలను రాయవాచకంలో చేర్చడం జరిగింది.

(3) రాయవాచకకర్త, రాయవాచకంలో సంకుసాలనృసింహకవి విరచిత 'కవికర్ణ రసాయనం' నుండి రెండుపద్యాలను ఉద్ధరించాడు[20]. సాహిత్యచరిత్రకారులు 'కవికర్ణ రసాయనము'

శ్రీకృష్ణదేవరాయల అనంతరము (క్రీ. శ. 1540) జరిగిన రచనగా అభిప్రాయపడ్డారు.

(4) శ్రీకృష్ణదేవరాయల ప్రత్యర్థి అయి అతని కాలంలో ఉన్న గజపతి వంశపాలకుడు ప్రతాపరుద్రగజపతి (క్రీ. శ. 1497 - 1538). కాని రాయవాచకం శ్రీకృష్ణదేవరాయల సమకాలి కుండుగా బాహుబలేంద్ర ముకుందగజపతిని పేర్కొంటుంది. తెలుగువాడయిన ఈ బాహుబలేంద్ర ముకుంద గజపతి క్రీ. శ. 1560 నుండి క్రీ. శ. 1568 వరకు కళింగోత్కలాలను పరిపాలించాడు.[21] అందుచే రాయవాచకం క్రీ. శ. 1568 తర్వాతనే వ్రాసి ఉండాలి.

(5) విద్యారణ్యులు విజయనగరస్థాపనకు "శాలివాహన శకాబ్దములు లెక్క ౧౧౨౭ యేండ్లు వెయ్యింన్నూట యిరువై ఏడేండ్ల మీద చెల్లే ప్రభవ నామసంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి స్థిరవారం శుభయోగ శుభకరణములు గూడిన శుభముహూర్తమందు ముహూర్తముజేసి, కృష్ణపక్షం అమావాస్యనాటి రాత్రి, నిశిసమయమందు శంకుస్థాపనం" చేసినట్లు రాయవాచకం తెలుపుతుంది.[22] అంతేగాక, వీరనరసింహరాయల కాలంనాటికి ఇరవై తొమ్మిది మంది రాజులు మున్నూరేండ్లు పాలించారని జరిగిపోయిన కాలాన్ని చెప్పి, భవిష్యత్తులో "ఇంక అరువై యేండ్లు పట్టణమున్ను సింహాసన మున్ను నిలిచియుండును" అని కూడా చెప్తుంది.[23] ఇక్కడ చెప్పిన ప్రభవనామసంవత్సర చైత్ర శుద్ధ పౌర్ణమి స్థిరవారానికి సరిఅయిన శాలివాహన శకసంవత్సరం 1129; 1127 అని చెప్పటం పొరపాటు. దీ కి సరిఅయిన క్రీస్తుశకకాలము 1207 మార్చి 15 గురువారం.[24] చైత్రకృష్ణ అమావాస్యకు సరిఅయిన క్రీస్తుశకకాలం 1207 మార్చి 30 శుక్రవారం.[25]

కాని ఇచట కాలనిర్ణయానికి రాయవాచక కర్త చెప్పిన శాలివాహన శకం 1127 నే లెక్కలోనికి తీసుకోవటం సరిఅయినదిగా కనబడుతుంది. ఈ శకసంవత్సరానికి సరిఅయిన క్రీస్తువత్సరం 1127+78=1205. అదారభ్యం వీరనరసింహరాయల కాలంనాటికి మూన్నూరేండ్లు అయినట్లు రాయవాచకం చెప్తుంది. అనగా క్రీ. శ. 1205+300=క్రీ. శ. 1505. ఇది సరిగా కృష్ణదేవరాయల ముందు పాలించిన అతని అన్న వీరనరసింహరాయలు పట్టాభిషిక్తుడైన కాలానికి సరిపోతున్నది. అటుతర్వాత అరవై ఏండ్లు అనగా క్రీస్తుశకం 1505+60=క్రీ. శ. 1565 వరకు పట్టణమున్ను, సింహాసనమున్ను నిలిచిఉంటాయని రాయవాచకం భవిష్యత్తును చెప్పింది. ఇది రక్షస - తంగడి యుద్ధం జరిగి విజయనగరం విధ్వంసమయిన సంవత్సరం. రాయవాచకంలో ఈ విషయం భవిష్యత్తును గూర్చి చెప్పినట్లు ఉండినా, యథార్థానికి ఈ రాక్షస - తంగడి యుద్ధం (క్రీ. శ. 1565) తర్వాతనే రాయవాచకం వ్రాయడం జరిగిందని మనం అనుకోవాలి. చరిత్రలో జరిగిపోయిన విషయాలను ఇట్టి భవిష్యపురాణాలుగా చెప్పడం మనకు సంప్రదాయమే.

విజయనగరస్థాపన జరిగింది. క్రీ. శ. 1336 లో అని చరిత్రకారులు ఏకగ్రీవంగా అంగీకరించిన విషయం. రాయవాచకం 130 ఏండ్ల తేడాతో విజయనగరకాలాన్ని తప్పుగా చెప్పినా, అప్పటినుండి వీరనరసింహరాయల కాలానికి (క్రీ. శ. 1505-1509), అటు తరువాత విజయనగర విధ్వంసకాలానికి (క్రీ. శ. 1565), రాయవాచక కర్త చెప్పిన కాలం లెక్కింపు సరిపోతున్నది.

(6) రాయవాచక కర్త క్రీస్తుశకం పదహారవ శతాబ్దపు పూర్వార్థంలో రచించిన ఏకామ్రనాథుని 'ప్రతాపచరిత్ర'[26] చూచినట్లు, రాయవాచకంలో చెప్పిన "ఢిల్లీలోనున్న ప్రతాపరుద్రుని వృత్తాంతము"[27] సూచిస్తుంది. అట్లే, పదహారవ శతాబ్దపు మధ్యకాలంలో రచించినట్లు భావింపబడిన 'సభాపతివచనము'[28] నుండి రాయవాచక కర్త చాలా విషయము ఉద్ధృత మొనర్చాడు.[29]

(7) రాయవాచకంలో రాయలవారు వేగర్లను పంపించిన పట్టణాల జాబితాలో మైసూరు, చెన్నపట్లం చెప్పబడినాయి.[30] అట్లే బాగానగరం లేక భాగ్యనగరాన్ని కూడా రాయవాచకం పేర్కొంటుంది.[31] ఈ పట్టణాల నిర్మాణకాలాలు రాయవాచక రచనాకాలాన్ని నిర్ణయించడానికి ఉపకరిస్తాయి.

క్రీ. శ. 1571 లో కాని మైసూరు పట్టణం ఏర్పడలేదని చరిత్రకారుల అభిప్రాయం.[32]

ఇచట పేర్కొన్న చెన్నపట్టం కర్ణాటకంలోని చెన్నపట్టణం. విజయనగర దళపతి, సామంతుడు అయిన రాణా ఇమ్మడి జగదేవరాయడు దీనికి క్రీ శ. 1580 లో కోట ఏర్పరచి, తనకు రాజధానిగా చేసుకొని పాలించినాడని చరిత్రకారుల అభిప్రాయం.[33]

బాగానగరం లేక భాగ్యనగరం నేటి హైదరాబాదుకు మరొక పేరు. దీనిని గోల్కొండ సుల్తానైన మహమ్మద్ కులీకుతుబ్‌షా (క్రీ. శ. 1580 - 1612) క్రీ. శ. 1591 లో నిర్మించాడని చరిత్రకారుల నిర్ణయం.[34]

(8) రాయవాచకం శ్రీకృష్ణదేవరాయలవారి సామంతుల, అమరనాయకుల, దళపతుల పేర్లను మనకు తెలిపింది. వీరందరు చారిత్రిక వ్యక్తులే. వీరిలో రాణాజగదేవుడు, మట్ల అనంతరాజు, వెలిగోటి యాచమనాయడు, సాళువ మేకరాజు, చెవ్వప్పనాయడు

కృష్ణప్పనాయడు, అయ్యనమలక పేర్కొనబడినారు.[35] కాని వీరు కృష్ణదేవరాయలకాలంలో చారిత్రిక ప్రసిద్ధివహించినవారుకారు; కృష్ణదేవరాయలనాటి శాసనాలలోకాని, సమకాలిక సారస్వతంలో కాని వీరిపేరు వినపడదు. అచ్యుతరాయల కాలం (1530-1542)లో కూడా వీరు చారిత్రిక ప్రసిద్ధి వహించలేదు. సదాశివరాయలకాలం క్రీ. శ. 1542 - 1576) లో, రక్షస - తంగడి యుద్ధానంతరం, క్రీ. శ. 1570 మొదలు విజయనగరసామ్రాజ్యాన్ని పాలించిన ఆరవీటి వంశపాలకుల కాలంలో, వీరు రాజకీయ ప్రాముఖ్యం వహించడం, వీరి పేర్లు సమకాలిక శాసనాలలో, సారస్వతంలో కనపడడం జరిగాయి.

పైన పేర్కొన్న వారి చరిత్రను కొంత ఇచట క్లుప్తంగా చెప్పడం అవసరం.

రాజా జగదేవుడు కర్ణాటకరాష్ట్రమందలి చెన్నపట్టణపాలకుడయిన ఇమ్మడి జగదేవుడు. ఇతడు ఈ చెన్నపట్టణానికి క్రీ. శ. 1580 లో కోట కట్టించి, దానిని రాజధానిగా పాలించాడని పైన చెప్పిఉన్నాము. ఇతడు అళియరామరాయల కాలమాదిగా విజయనగరరాజులను పట్టభద్రులను చేయుటలో ప్రముఖపాత్ర వహించినట్లు పొన్నతోట ఓభళకవి ఇతని కంకితమిచ్చిన వామనపురాణం పీఠికలోని ఈ క్రింది పద్యం తెలుపుతుంది.

అళియరామావనీశుఁ దిర్మలనృపాల
వరుల శ్రీరంగరాయల సరసుఁడైన
వీరవెంకటరాయని వెలయరాయ
పట్టభద్రులఁజేసె నప్పార్థివుండు.

ఇతడు రెండవ వెంకటపతి దేవరాయల కాలం (క్రీ. శ. 1586-1614) లో, అధికారానికై అప్పుడు ఉన్న అంతఃకలహాలలో, తిరుగుబాట్లలో, వెంకటపతిదేవరాయల పక్షం వహించి అతనిని సింహాసనంపై నిలబెట్టినవాడు.[36]

మట్ల అనంతరాజు సాహిత్యవేత్తలకు 'కకుత్స్థ విజయ' కార్యకర్తగా తెలుసు. ఇతడు పై చెప్పిన జగదేవరాయనితోపాటు, రెండవవెంకటపతి దేవరాయల కాలంలో ఏర్పడిన తిరుగుబాట్లనణచి, యవనదాడుల నెదిరించి ఆ రాయలకు సింహాసనమున నిలకడ గలిగించినవాడు. 'కళాపూర్ణోదయ' కృతిపతి నందేల కృష్ణమరాజు తిరుగుబాటు నణచి రాయలకు మిక్కిలి సహాయపడినవాడు.[37] క్రీ. శ. 1606 (శా. శ. 1527 గత విశ్వావసు సంవత్సరం) నాటిది, సిద్ధవటం తాలూకాలో, అనంత భూపాలుని సిద్ధవట శాసనం ఒకటి లభించింది.[38] ఈ శాసనం "వీర వెంకటరాయ విభుండు చంద్రగిరీంద్రసీమ సామ్రాజ్యంబు సేయుచుండ" అని రెండవ వెంకటపతిదేవరాయలను పేర్కొని, అనంత భూపాలుని, "విబుధ కకుత్స్థలి విజయ ప్రబంధాది కావ్య నిబంధన గ్రంథకర్త" "అఖిలకర్ణాట సింహాసనాధీశ్వర దక్షిణ బాహాభిధానధారి" అని వర్ణించింది అతని ఇతర ఘనకార్యాలను పేర్కొన్నది.

వెలుగోటి యాచమనాయడు కస్తూరి రంగప్పనాయని పుత్రుడు. ఇతనికే పెద్ద యాచమనాయడని, యాచ భూపుడని పేర్లు. ఇతడు క్రీ. శ. 1601 - 1602 ప్రాంతంలో తమిళ దేశంలోని తిరుగుబాట్ల నణచి రెండవ వెంకటపతి దేవరాయల నుండి పెరుంబేడు (చెంగల్పట్టు, మదురాంతకం తాలుకాలు) ను అమరంగా పొందినవాడు. రెండవ వెంకటపతి తర్వాత నాలుగు సంవత్సరాలు మాత్రమే పాలించిన శ్రీ రంగరాయల (క్రీ. శ. 1614 - 1619) ప్రత్యర్థుల నెదిరించి, అతనిని సింహాసనముపై కుదురుపరచవలెనని తీవ్ర ప్రయత్నము చేసినవాడు. శ్రీ రంగరాయల తర్వాత రామదేవరాయల (క్రీ. శ. 1619 - 1630) ను విజయనగర సింహాసనమున నిలుపు ప్రయత్నంలో సుప్రసిద్ధమయిన తోపూరు యుద్ధం (క్రీ. శ. 1617)లో గొబ్బూరు జగ్గ

రాయాది ప్రత్యర్థుల నెదిర్చి జయించినవాడు. ఈ యాచమనాయని వీరోచిత కృత్యాలు వెలుగోటివారి వంశావళిలోను, అనేక కైఫియత్తులలోను, చాటువులలోను వర్ణింపబడినాయి.39

సాళువ మాకరాజు రెండవ వెంకటపతి కాలంలో, రెండవ శ్రీ రంగరాయల కాలం (1614 - 1619)లో ఉండి వారి ప్రత్యర్థి వర్గంలో చేరినవాడు. ఈ సాళువ మాకరాజు తండ్రి అయిన సాళువ తిమ్మరాజుకే చదలువాడ మల్లన కవి తన 'విప్రనారాయణ చరిత్ర' నంకితమిచ్చాడు. పై చెప్పిన తోపూరు యుద్ధంలో మాకరాజు గొబ్బూరి జగ్గరాయలవైపు పోరాడాడు.40

చెవ్వప్పనాయడు తంజావూరు నాయక రాజుల మూల పురుషుడయిన చెవ్వప్ప నాయకుడు (క్రీ. శ. 1535-1580) అయి ఉండవచ్చు. ఇతడు అచ్యుత దేవరాయల దేవియైన తిరుమలాంబ (?) చెల్లెలు మూర్త్యాంబ భర్త. కొటికం విశ్వనాథ నాయకుని సమకాలికుడు. ఇతడు క్రీ. శ. 1580 వరకు జీవించి ఉండినా, ఇతని పరిపాలన క్రీ. శ. 1572 కు పరిమితమయింది.41

కృష్ణప్పనాయడు విశ్వనాథనాయకుని పుత్రుడై ఉండవచ్చు. ఇతడే మధుర నాయకరాజ్య స్థాపకుడని వెంకట రమణయ్యగారి అభిప్రాయాన్ను పైన చెప్పిఉంటిమి విశ్వనాథుని పుత్రుడైన ఈ కృష్ణప్పనాయకుడు గాక, సదాశివ రాయల కాలంలో అడపం బయ్యప్పనాయకుని పుత్రుడు మరిఒక కృష్ణప్ప నాయకుడు కానవస్తాడు. ఇతడు హసన దేశాన్ని అమరనాయకంగా పాలించాడు. క్రీ. శ. 1562, 1563 నాటివి కర్ణాటక శాసనాలు మూడు ఇతనిని పేర్కొంటాయి.42

అయ్యన మలుక సదాశివరాయల కాలంలో దుమ్మె సీమను అమరంగా పాలిస్తున్నట్టు క్రీ. శ. 1562 నాటి ఒక కర్ణాటక శాసనం చెప్తుంది. ఈ శాసనంలో ఇతడు అయ్యన మలుక వొడెయరు అని పిలువబడ్డాడు.43

పైన కనుపరచిన వ్యక్తులు, సన్నివేశములు రాయవాచకము ఖచ్చితముగా క్రీ. శ. 1575 కు పూర్వము వ్రాసినది కాదని సూచించును. రాయ వాచకమందలి బాగా నగర లేక భాగ్య నగర ప్రసక్తి అది ఆ నగర నిర్మాణము (క్రీ. శ. 1591) తర్వాతనే వ్రాసి ఉండవలెనని సూచిస్తుంది. పోగా,

9) రాయ వాచకము పైన కనబరచిన చారిత్రిక వ్యక్తులతో పాటు కొటికం విశ్వనాథ నాయకుని కూడా కృష్ణరాయల దళ నాయకులలో ఒకరిగా పేర్కొనింది.44 ఇతనిని మహామండలేశ్వరుడనిగాని, మధుర రాజ్య పాలకుడనిగాని రాయ వాచకము ఎక్కడా చెప్పలేదు. రాయ వాచకమును రచించిన 'మహా మండలేశ్వర కాశీ విశ్వనాథనాయని స్థానాపతి' ఈ 'దళనాయకు' డయిన విశ్వనాథనాయని స్థానాపతి. కాడనుటకు, ఈ విశ్వనాథ నాయకులు వేర్వేరు వ్యక్తులనుటకు ఇది బలవత్తరమైన సాక్ష్యము. ఇక

10) రాయ వాచకము పేర్కొనిన ఈ మహామండలేశ్వర విశ్వనాథ నాయనయ్య ఎవ్వరనునది విచారణీయము. మధుర నాయక రాజులలో వారి మూలపురుషుడుగా ఎంచబడే నాగమ నాయని పుత్రుడు విశ్వనాథ నాయకుడు గాక మరి ఒక విశ్వనాథ నాకుయడు ఉన్నాడు. ఇతడు క్రీ. శ. 1595 మొదలు 1602 వరకు మధురను పాలించిన రెండవ కృష్ణప్ప తమ్ముడు. ఇతడు తన అన్నతో కలిసి రాజ్యము పాలించినాడని చరిత్రకారుల అభిప్రాయము. రాయవాచక రచయిత అయిన స్థానాపతి, 'విస్సప్ప' అనబడే ఈ విశ్వనాథ నాయకుని స్థానాపతి అయి ఉండవలె.

పై ఉపపత్తులన్నీ రాయవాచక కర్త రెండవ వెంకటపతి దేవ మహా రాయల కాలం (క్రీ. శ. 1586-1614) లోనో, అటు తర్వాతనో ఉన్నవాడని సూచిస్తాయి. కాని ఇతడు మహా మండలేశ్వర విశ్వనాథ నాయనయ్యవారి స్థానపతి అగుటచే, ఈ విశ్వనాథ నాయనయ్యను రెండవ వెంకటపతి దేవరాయల కాలం (క్రీ శ. 1586-1614)లోనే ఉండి, క్రీ.శ 1595 మొదలు 1602 వరకు మధురను తన అన్నతోపాటు కలసి పాలించిన రెండవ కృష్ణప్ప తమ్ముడు విశ్వనాథ నాయకునిగా గుర్తించవలసి వస్తుంది. అందుచే రాయ వాచకాన్ని క్రీ.శ. 1592, 1602ల మధ్య ఎప్పుడో వ్రాసి ఉండవలె. ఇది తరువాత జన బాహుళ్యంలో బాగా ప్రచారంలోకి వచ్చి ఉంటుంది. అందుచేతనే, సుమారు యాభై ఏండ్ల తర్వాత ఉండిన కుమార ధూర్జటి, ఆర్వీటి కోదండరామ రాజు రెండవ కొడుకైన చిన వెంకటపతి ఆదేశంమీద రాయ వాచకాన్ని 'కృష్ణరాయ విజయ'మనే పేర పద్యకృతిగా మలచడం జరిగింది. ప్రస్తుతానికి రాయ వాచకం క్రీ. శ. 1592, 1602ల మధ్య వ్రాసినట్లే నిర్ణయించవలసి ఉన్నది. ఇంతకన్నా సూక్ష్మంగా రచనా కాలాన్ని నిర్ణయించడానికి ఆధారాలు లేవు.

కాలనిర్ణయానికి సంబంధించిన ఈ చర్చను ముగించేముందు ఒక అనుమానాన్ని పాఠకులముందు ఉంచాలి. రాయవాచక కర్త రెండవ వెంకటపతి (1586 - 1614) కాలంలోనే ఉన్నవాడయితే, రాయవాచకంలో, రెండవ వెంకటపతి కాలంలోనే రాజకీయ ప్రాముఖ్యాన్ని వహించిఉన్న పట్ల అనంతరాజు, రాణా జగదేవు

మొదలైన ప్రసిద్ధ వ్యక్తులను కృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్నవారుగా ఏలచెప్పవలసివచ్చింది? దీనికి ప్రస్తుతంలో సరియైన సమాధానంలేదు. బహుశా తనకాలంలో రాజకీయ ప్రాముఖ్యం వహించిన ఈ వ్యక్తులు, కృష్ణదేవరాయల కాలంనాటికి రాజకీయ ప్రాముఖ్యం వహించక పోయినా ఆ నాటికి వయసు తక్కువవారై ఉన్నవారే కాబట్టి, వారిని రాయలవారి ఒడ్డోలగంలో సభ్యులుగా పేర్కొనుట వారికి గౌరవప్రదముగా రాయవాచక కర్త భావించి ఉండవచ్చును. రాయవాచక కర్త, పై అనుమానంమీద, రెండవ వెంకటపతి కాలం తర్వాత ఉండిన వాడని చెప్పడానికి, అతడు విశ్వనాథ నాయనయ్యవారి స్థానాపతి అనే విషయం అడ్డుతగులు తుంది.

III

రాయవాచకము - చారిత్రకాధారము

రాయవాచకం చరిత్ర కారులకు బంగారు గని. విజయనగర చరిత్రకారులకు, అందును ప్రత్యేకముగ సాహితీ సమరాంగణ సార్వభౌముడయిన శ్రీ కృష్ణదేవరాయల చరిత్రపై కృషిచేయు వారికి ఇది అమూల్యమైన మౌలికాధారము. చారిత్రకాధారంగా దీని విలువను చరిత్రకారులనేకులు గుర్తించారు. కాని ఈ గని త్రవ్వి విజయనగర చరిత్రలో బంగారు పంట పండించినవారు, విజయనగర చరిత్రలో అర్ధశతాబ్దమునకు మించి అవిరళ కృషి గావించిన డాక్టర్ నేలటూరు వెంకట రమణయ్యగారు. విజయ నగర చరిత్రకు సంబంధించి, కృష్ణ రాయల పరిపాలనా కాలానికి ప్రత్యేకించి, రాయ వాచకంలోని అనేకానేక విషయాలను, ముఖ్యంగా ఆనాటి పరిపాలనా యంత్రాంగానికి, కృష్ణరాయల దిగ్విజయాలకు సంబంధించిన విశేషాలను, సమకాలిక సార స్వతంలో, శాసనాలలో చెప్పిన విషయాలతో, విదేశీయుల రచనలతో సమన్వయించి, తైపారులేసి, దానిలోని గుణ, దోష నిరూపణచేసి, దానినిగ్గు తేల్చిన మనీషి వెంకట రమణయ్యగారు.45 వెంకట రమణయ్యగారు విశేష కృషి సలిపి ఉన్నప్పటికి, రాయ వాచకంలోని చారిత్రిక విషయాలకు ఆంగ్ల, ఆంధ్ర భాషలలో సమగ్ర వ్యాఖ్యా నాన్ని సంతరించి ప్రకటించ వలసిన అవసరం ఎంతైనా ఉంది; కాని అది ప్రత్యేకమయిన విపుల గ్రంథం అవుతుంది; దానికిది చోటు కాదు.

చారిత్రకాధారంగా రాయ వాచకానికి గల ప్రాముఖ్యాన్ని గూర్చి పండితులు వెలిబుచ్చిన అభిప్రాయాలను కొన్నింటిని ఇచ్చట చెప్పడం అవసరం. విజయనగర చరిత్రకు గల మౌలిక సారస్వతాధారాల సంకలమయిన 'సోర్సెస్ అఫ్ విజయనగర్ హిస్టరీ' 1919 లో ప్రచురింపబడింది. దాని ఆంగ్ల ఉపోద్ఘాతంలో, సంకలనకర్త రంగస్వామి సరస్వతి ఇట్లా వ్రాశాడు: "ది హిదర్ టు నాట్ వెల్ ఎక్స్‌ప్లాయిటెడ్ 'కృష్ణరాయ విజయమ్' అంఢ్ ది 'రాయవాచకమ్' త్రో మచ్ లైట్ అపాన్ ది యాక్చ్యువల్ కోర్స్ ఆఫ్ కృష్ణరాయాస్ క్యాంపైన్ ఎగెన్స్ట్ ఒరిస్సా."46 1933 లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు (కాకినాడ) వారు తమ 33వ ప్రచురణగా రాయ వాచకాన్ని పుస్తక రూపంలో ప్రచురించారు. దాని 'ఫోర్‌వర్డ్' లో యస్. కృష్ణస్వామి అయ్యంగార్: "ఇట్ సెర్టెన్లీ ఈస్ వర్త్ పబ్లికేషన్ యాస్ ఎ వర్క్ అఫ్ హిస్టారికల్ క్యారెక్టర్ బేంగ్ అపాన్ ది రెయిన్ అఫ్ ది గ్రేట్ విజయ నగర్ ఎంపరర్ కృష్ణరాయ ."47 దాని 'ఇంట్రొడక్షన్' లో జయంతి రామయ్య పంతులుగారు: "దిస్ క్రానికల్ ఈస్ నౌ రిపబ్లిష్డ్ ఇన్ బుక్ ఫామ్ ఫర్ ది యూస్ అఫ్ దోస్ యెంగేజ్డ్ ఇన్ హిస్టారికల్ రిసెర్చ్ .. ఇన్ సమ్ పార్ట్స్, ఇట్ రిసీవ్స్ రిమార్కబల్ కన్ఫర్మేషన్ ఫ్రం ది అకౌంట్స్ ఆఫ్ ది పోర్చుగీస్ ప్రైటర్స్ పెయస్ అండ్ న్యూనిజ్ .. గివ్స్ యాన్ ఇన్ సైట్ ఇన్టు ది డైలీ రొటీన్ అఫ్ ప్రైవ్ విచ్ ది కింగ్స్ ఇన్ దోస్ డేస్ వెర్ ఎక్స్పెక్టెడ్ టు లివ్ అంఢ్ విచ్ దె ప్రాబబ్లీ లివ్డ్"48 అని దాని ప్రాముఖ్యాన్ని వివరించినారు. "రాయ వాచకము, చారిత్రక విషయముల పట్టిక (క్రానికల్) అగుటచే వర్ణనలేమియు లేవు. కవి కేవలము చారిత్రకాంశములను వరుస క్రమమున చెప్పెను .... పెక్కు చారిత్రక విషయములను క్రమ ముగ తెల్పుటచే విజయనగర చరిత్ర తెలిసికొనగోరు చరిత్ర కారులకిది మిక్కిలి తోడ్పడును వచన చారిత్రక గ్రంథమగు 'రాయవాచకము', ఛందోబద్ధమగు చారిత్రక కావ్యమగు 'కృష్ణరాయ విజయము' కృష్ణదేవరాయల చరిత్రను ఆంధ్రులకు అందచేయు అపూర్వ గ్రంథములు" అని అరుణకుమారిగారు చెప్పినారు.49 'ఆంధ్ర వచన వాఙ్మయ' సిద్ధాంత వ్యాసకర్తలైన కులశేఖరరావు గారు ఇట్లు చెప్పినారు: "చారిత్ర వచనైక గ్రంథములందు రాయ వాచకమొకటి. ఇదివరకు వెలువడిన చారిత్రిక గ్రంథములగు ప్రతాప చరిత్ర, సిద్ధేశ్వర చరిత్రములకన్న నిది విశిష్టమైనది ఇందలి చారిత్రక విశేషములు, పరికొంత యథార్థములుగ నుండు

నికి కారణము.... ఇట్లే గ్రంథకర్త వ్రాసిన విశేషములు చరిత్ర కన్నను, చరిత్రకు సన్నిహితముగానున్న వనుట జనము జరిగిన సన్నివేశముల పైన, చారిత్రకాంశములమీద ని దృష్టి యుండుటచే, భాష, శైలి మున్నగువాని నీతడంత ద్ధగా పాటించి యుండలేదు. అందుచేత వ్యావహారిక ప్రయోగము లిందున్నవి. సాహిత్యకమైన ప్రాధాన్యము నాతడు పాటించియుండక పోవుటకూడ నీ కర్తకు చరిత్రపైగల యభినివేశమును స్పష్టపరచుచున్నది"50

రాయవాచక మందలి విషయాలను, విజయనగర చరిత్రకు సంబంధించి తాను వ్రాసిన గ్రంథాలలో అతి విస్తారముగా ఉపయోగించుకొన్న నేలటూరు వెంకటరమణయ్యగారు, "వాటెవర్ బి ది డేట్ అఫ్ ఇట్స్ కంపోజిషన్, ఇట్ స్టాండ్స్ ది టెస్ట్ అఫ్ ఫ్యాక్ట్స్ రిమార్కబ్లీ వెల్. ది జెన్యునెస్ అఫ్ ది వేరియస్ ఐటమ్స్ అఫ్ ఇన్‌ఫార్మేషన్ విచ్ ఇట్ సప్లైస్ క్యాన్ బి ప్రూవ్డ్ బై ఎ కంపారిజన్ విత్ ది ఇన్‌స్క్రిప్షన్స్ అండ్ ది పోర్చుగీస్ రికార్డ్స్" అన్నారు.51 కాని వేరొకచోట వెంకట రమణయ్యగారు ఈ క్రింది అభిప్రాయమును వెలిబుచ్చినారు." రాయవాచక మంతటి విశ్వాసపాత్రమైన యాధార గ్రంథము గాదు. రాక్షస తంగడి యుద్ధానంతరము కావేరికి దక్షిణ మందుండు రాయ రాజ్యము నాక్రమించుకొనిన మధుర నాయకులు కృష్ణరాయలచే దక్షిణ రాజ్యమున ప్రతిష్ఠింపబడిరను నసత్యకల్పిత గాథను ప్రచారములోనికి దెచుట ఈ గ్రంథముయొక్క ముఖ్యోద్దేశము. కాని యందు వర్ణింబడియుండు కృష్ణరాయల జైత్రయాత్ర కథన మన్య చరిత్రాధారముల మూలమున వాస్తవమని తేలుచుండుటవలన దానిని మన మంగీకరించవచ్చును."52 వెంకట రమణయ్యగారి ఈ అభిప్రాయ మందలి మొదటి రెండు వాక్యములు, ఆంగ్లములో వారొసగిన పై అభిప్రాయానికి కొంత వ్యతిరిక్తంగా ఉన్నాయి. వారు రాయవాచకంలో కొట్టవచ్చినట్టు కనబడే ఒకటి రెండు చారిత్రిక విరుద్ధ విషయాలు జ్ఞప్తి యందుంచుకొని ఇట్టి అభిప్రాయాన్ని వెలుబుచ్చారనుకొంటాను. వారు రచించిన 'విజయనగర చరిత్ర' (2 భాగములు), 'కృష్ణదేవరాయలు' అను ప్రామాణిక చారిత్రక గ్రంథాలలో, 'స్టడీస్ ఇన్ ది థర్డ్ డైనాస్టీ అఫ్ విజయనగర్' మొదలుగా ఆంగ్లంలో రచించిన చారిత్రక గ్రంథాలలో, రాయవాచకము నుండి విశేషముగా, విస్తారముగా విషయాల నుద్ధరించి వాని చారిత్రక ప్రామాణ్యతను నిరూపించి ఉన్నారు. అట్లే పై అభిప్రాయంలో, రాయవాచక ముఖ్యోద్దేశ్యము మధుర **నాయక రాజ్యస్థాపన గూర్చిన అసత్యపు గాథను** ప్రచారములోనికి తెచ్చుట అని ఏల వెంకట రమణయ్యగారు చెప్పిరో అర్థమగుటలేదు. రాయవాచక ప్రారంభంలో దాని రచయిత తనను విశ్వనాథ నాయనయ్య స్థానాపతిగా పేర్కొనుటతప్ప, ఇక ఆ గ్రంథంలో ఎచ్చటా మధుర నాయక రాజుల ప్రసక్తి మాటవరసకైనను లేదు. పైన కనుపరచినట్లు మధుర నాయక రాజ్య స్థాపకుడని తలచబడే కొటికం విశ్వనాధ నాయకుని కూడా రాయవాచక కర్త, ఆ రాజ్య స్థాపకుడనిగాని, మధుర నాయకరాజుల మూలపురుషుడని కాని చెప్పలేదు; అతనిని కృష్ణదేవరాయల దళనాయకులలో ఒకడుగా మాత్రమే పేర్కొనినాడు. బహుశా, రాయవాచక కర్త, మధురనాయక రాజ్య కాలంలోఉన్న ప్రసిద్ధులయిన కొందరు చారిత్రిక వ్యక్తులను కృష్ణరాయని కాలములో ఉన్నట్లు చెప్పుట వెంకట రమణయ్యగారి ఈ అభిప్రాయానికి కారణమై ఉండవచ్చు; కాని ఈ వ్యక్తులకు మధుర రాజ్యంతో ప్రసక్తి ఉన్నట్లు రాయవాచకం ఎక్కడా చెప్పలేదు. అందుచే, చారిత్రకాధారగ్రంథంగా రాయవాచకమును గూర్చి వెంకట రమణయ్యగారు ఆంగ్లములో తెలిపిన అభిప్రాయమే సరిఅయినది.

రాయవాచకంలో కొట్టవచ్చినట్లు కనబడే ఒకటి రెండు చారిత్రక విరుద్ధ విషయాలున్నాయని చెప్పితిమి. వాని నిచట కొంత ప్రస్తావిస్తాము. మొదటిది విద్యానగర్ లేక విజయనగర నిర్మాణము. విద్యానగర నిర్మాణము శ్రీ విద్యారణ్య మునీంద్రుల ప్రోత్సాహముతో (క్రీ. శ. 1335/6 - 1353) ప్రారంభించినాడను నది పరిశోధనాఫలితంగా చరిత్రకారులంగీకరించిన సత్యము. కాని రాయవాచకము విద్యానగర నిర్మాణ ముహూర్త, శంకుస్థాపనలను గూర్చి, "శాలివాహన శతాబ్దములులెక్క ౧౧౨౭ యేండ్లు వెయ్యిం నూటయిరువై యేడేండ్లమీద చెల్లే ప్రభావనామ సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమి స్థిరవారం శుభయోగ శుభకిరణములు గూడిన శుభముహూర్తమునందు ముహూర్తముజేసి, కృష్ణపక్షం అమావాస్యనాటి రాత్రి నిశి సమయమందు శంఖుస్థాపనం"53 జరిగినట్లు తెలుపుతుంది. అనగా క్రీ. శ. 1205 లో విద్యానగర నిర్మాణం ప్రారంభమయినట్లు తెలుపుతుంది.

ఇట్లాంటిదే కొంత చారిత్రిక కాలవిపర్యయంతోకూడి ఉన్నా, ఆసక్తికరమైన విషయము. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర దేవస్థాన ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయల, అతని దేవేరులైన తిరుమలదేవీ, చిన్నాదేవుల తామ్రి ప్రతిబింబాలను అందరూ చూచే ఉంటారు. శ్రీకృష్ణదేవరాయలు తన కళింగ దిగ్విజయానంతరము, రాయచూరు, కలుబరిగెలను జయించిన తర్వాత, తిరుపతి, కాళహస్తి దర్శించి, ఈ తామ్రి ప్రతిబింబాలను "శ్రీముఖ సంవత్సర అశ్వీజ శుద్ధ 12ది"కి, ఏ ఒకటో, రెండో రోజుల ముందుగా నిలిపినట్లు చెప్పుతుంది.54 ఈ తేదీ క్రీ. శ. 1513, అక్టోబరు 12, మంగళ వారానికి సరిపోతుంది. కాని కృష్ణరాయల పూర్వ దిగ్విజయయాత్రి క్రీ. శ. 1517 నాటికిగాని పూర్తికాలేదు. రాయచూరు, కలుబరిగె దండయాత్రలు క్రీ. శ. 1520 నాటికిగాని ముగియలేదు.55 అందుచే రాయవాచకం, ఈ సంఘటనల తర్వాత క్రీ. శ. 1513లో ఈ తామ్ర ప్రతిబింబాలను నిలిపినారని చెప్పడం కాల వ్యతిరిక్తమయిన విషయము. కాని దీనిని బట్టి, రాయవాచకము చెప్పిన ఈ విషయమును ఉపేక్షింప తగదు. ఏలనన, క్రీ. శ. 1513లో శ్రీకృష్ణదేవరాయలు పూర్వ దిగ్విజయాత్రిను ప్రారంభించి ఉగయగిరిని ముట్టడిస్తున్న కాలంలో శక 1435 శ్రీముఖ వైశాఖ బ. 12 సోమవారం (క్రీ. శ. 1513 మే 2) నాడు, మరలా శక 1435 శ్రీముఖ ఆషాఢ శు. 11 సోమవారం (క్రీ. శ. 1513 జూన్ 13) నాడు వెంకటేశ్వరస్వామిని దర్శించినట్లు తిరుపతి - తిరుమల దేవస్థాన శాసనాలవలన తెలుస్తుంది.56 ఈ సందర్భాలలో ఒక దానిలో శ్రీకృష్ణదేవరాయలు తనయొక్క, తన దేవేరుల తామ్రి ప్రతిబింబాలను అచట నిలపడం జరిగి ఉండవచ్చు; కాని ఈ విషయం ఎక్కడా శాసనస్థం కాలేదు: రాయవాచకాన్ని బట్టి శ్రీముఖ సంవత్సరంలోనే మరలా, మూడవ సారి, రాయలు వెంకటేశ్వరస్వామిని దర్శించి, ఈ తామ్రి ప్రతిబింబాలను నిలిపినట్లు తెలుస్తుంది. రాయవాచక కర్త చెప్పిన చారిత్రిక సంఘటనల (పూర్వ దిగ్విజయము, రాయచూరు, కలుబరిగె విజయాలు) కు, శ్రీముఖ (క్రీ. శ. 1513) సంవత్సరానికి, అయిదారు సంవత్సరాల తేడాతో కాలం కుదరకపోయినా, కృష్ణరాయలు తామ్రి ప్రతిబింబాలను శ్రీముఖ (1513) సంవత్సరంలో నిలిపినాడని రాయవాచకం చెప్పిన విషయం యదార్ధమని తోస్తోంది. రాయలు ఈ తామ్రి ప్రతిబింబాలు నిలిపిన విషయాన్ని, ఎప్పుడు నిలిపాడనే విషయాన్ని ఒక్క రాయవాచకం మాత్రిమే చెపుతుంది. నాకు తెలియవచ్చినంత వరకు సమకాలిక సారస్వతంలోకా శాసనాలలోకాని ఈ ప్రిస్తావన కానరాదు.

చరిత్రిలోని అతి ప్రిసిద్ధ విషయాలను గూర్చి చెప్పడంలో కొంతపొరపాటును కనుపరచిన రాయవాచకము చరిత్రకారుల స్థూలదృష్టికి అందని అతిసూక్ష్మ విషయాలు ఎట్టి పొరపాటులేక చక్కగా తెలియజేస్తున్నది. అట్టి విషయం ఒకటి ఇచట ప్రస్తావిస్తాను. కళింగోత్కలపాలకుడైన గజపతి వారి స్థానాపతిగా, చారుమగా సుబుద్ధి అనే నియ్యోగి విజయనగరంలో రాయలవారి సభలో ఉన్నట్లు రాయవాచకం చెప్తుంది. 'మంచ బుద్ధిగలవాడు' అని అర్థమిచ్చే ఈ పేరు యథార్థమైన వ్యక్తినామంగాక, రాయవాచక కర్త ఎదో సందర్భోచితంగా సృష్టించిన పేరు అనుకోవడం సహజం. ఇట్లు అనుకొని చరిత్రకారులు ఈ సుబుద్ధిని చారిత్రక వ్యక్తిగా పరిగణించలేదు; కల్పిత వ్యక్తిగా భావించారు. కాని గజపతి వారిని య్యోగి అయిన ఈ సుబుద్ధిని, ప్రతాపరుద్ర గజపతిని ఓడించిన తర్వాత, కృష్ణరాయలవారు తన ఆశ్రయంలోనికి తీసుకొని, ఆదరించి, అతని జీవనానికై రెండూళ్లు ఇచ్చినట్లు ఒక తిరుమల - తిరుపతి దేవస్థాన శాసనం తెలియజేస్తుంది.57

రాయవాచక కథనంలో అయువుపట్టనదగినది, అత్యంత ప్రధానమయినది కృష్ణరాయ దిగ్విజయ వృత్తాంతము. రాయవాచకంలో ఇచ్చిన ఈ దిగ్విజయ వివరాలు, కాలక్రమం, సమకాలిక శాసనాలనుండి, సారస్వతం నుండి తెలియవచ్చు విషయాలతో చాల వరకు సరిపడి, విజయనగర చరిత్రకారులకు మిక్కిలి ఉపయుక్తంగా ఉన్నాయి. ఇంతేగాక రాయవాచకం, విజయనగర సామ్రాజ్య పరిపాలనాయంత్రాంగం, మంత్రాంగం, కోశాదివివరణము, రాజోద్యోగులు, పదవులు, సేనావివరాలు, సాంఘిక మర్యాదలు, రాజసభామర్యాదలు, రాజుల దినచర్య మొదలయిన అనేక విషయాలను గూర్చి తెలియజేస్తుంది; వేషభాషలు మొదలగు విషయాలను గూర్చి కొంత తెలియజేస్తుంది. ఆనాటి రాజ్యాల, రాజుల బలాబలాల తారతమ్యం, వారి అంగబలం, అర్థబలం, వారి రాజకీయపు ఎత్తుగడలు, రాజ్య విస్తీర్ణాలు, దండన విధానాలు వేగు, మొదలగు ఆసక్తికరమగు ఎన్నో విషయాలను మనకు ఎరుక పరుస్తుంది.

చరిత్రకారులనే గాక, వాఙ్మయ చరిత్రకారులకు, సాహిత్య పరిశోధకులకు కూడా రాయవాచకం అత్యంతోపయోగమయినది. కృష్ణరాయలవారు తమ దిగ్విజయాలనన్నిటిని ముగించుకొన్న తర్వాత "కీర్తి శాశ్వతముగా నిలిచేటందులకు" తన మంత్రుల సలహాపై "కృతు లందుకోవలెనని" నిశ్చయించి, అల్లసాని పెద్దనను 'మనుచరిత్ర'ను చెప్పవలసిందనిన్ని, ముక్కు తిమ్మనను 'పారిజాతాపహరణము' వ్రాయమనిన్ని ఆనతిచ్చినట్లు రాయవాచకం చెప్పుతుంది.[58] రాయవాచక మందించిన ఈ సమాచార మాధారంగా సాహిత్య పరిశోధకులు మనుచరిత్ర, పారిజాతాపహరణ కావ్యాల రచనాకాలాన్ని నిర్ణయించడానికి ప్రయత్నించారు.[59] అష్టదిగ్గజ కవీశ్వరులలో రాయవాచకం ముక్కు తిమ్మయ్యను, అల్లసాని పెద్దన్నను, మాదనగారి మల్లయ్యను మాత్రమే పేర్కొంటుంది.[60] అష్టదిగ్గజ కవులందరూ ఆంధ్ర కవులు కారని, వారిలో తమిళ, కన్నడ భాషా కవులు కూడా ఉండినారని ఒక వాదమున్నది; బహుశా రాయలకు సమకాలికులయిన "అష్టదిగ్గజ" ఆంధ్రభాషా కవులు వీరు ముగ్గురే అయిఉండవచ్చు. అట్లే, తురకల మీద రాయల విజయాన్ని గూర్చి ముక్కు తిమ్మన చెప్పిన చాటువొకటి రాయవాచకంలోని కెక్కింది.

చరిత్రకారులు త్రవ్వుకొద్దీ అమూల్యమైన చారిత్రక సంపద సందియ్యగల స్వర్ణఖని రాయవాచకము.

సూచికలు

1. రాయవాచకము. (సం. డా॥సి. వి. రామచంద్రరావు), ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1982, పు. 1 ఇందుమీదట రా. వా. అని సూచించడమైనది.

2. తెలికచర్ల వెంకటరత్నం 'వచన రచనా పరిణామము', విజ్ఞాన సర్వస్వము, III (1959) పు. 632

3. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, (1914), పు. 11.

4. రా. వా, పు, 2

5. రా. వా. 68: 24; 69: 26; (ఇట్లు ఇచ్చిన సంఖ్యలలో, మొదటి సంఖ్య రాయవాచకంలోని పుటను తరువాతి, సంఖ్య లేక సంఖ్యలు, ఆ పుటలోని పంక్తులను తెలుపుతాయి.

6. 35 : 18-19; 43 : 15; 45 : 4; 49 : 14; 50 : 25-26; 79 : 16.

7. 2 : 3-5.

8. చూడు యస్. కృష్ణస్వామి అయ్యంగార్, "సోర్సెస్ ఆఫ్ విజయనగర్ హిస్టరీ" (1919), పు. 327 మొ॥

9. ప్రభాకరశాస్త్రి. వేటూరు, తంజావూరు ఆంధ్రరాజుల చరిత్ర పు. ౧-౧౫; వెంకట రమణయ్య నేలటూరు, "ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర్ హిస్టరి" (1946), II, పు. 32 మొ॥

10. "సోర్సెస్ ఆఫ్ విజయనగర్ హిస్టరీ" (1919), పు. iii

11. రాయవాచకము (1933), "ఫోర్‌వర్డ్", పు. 12

12. అదే, "ఇంట్రడక్షన్", పు. 2

13. అరుణకుమారి, ఆంధ్ర చారిత్రక కావ్యములు (1978), పు. 165

14. కులశేఖరరావు, ఆంధ్రవచన వాఙ్మయము (1974), పు. 509 510

15. "పినినేకాక కొటికము విశ్వనాథనాయని స్థానాపతి రచించిన 'రాయవాచకము' ను కూడా ఇచట స్మరింపవలసియున్నది." -వెంకట రమణయ్య "తెలుగుదేశ చరిత్ర - ఆధారములు"- విజ్ఞానసర్వస్వము, III, పు. 62

16. వెంకట రమణయ్య, "స్టడీస్ ఇన్ ది థర్డ్ డైనాస్టీ ఆఫ్ విజయనగర్" (1935), పు. 239-241 లు.

17. వెంకట రమణయ్య, 'మధుర తంజావూరు నాయకరాజుల నాటి ఆంధ్ర వాఙ్మయము' భారతి, 1954, ఫిబ్రవరి, పు. 148.

18. అదే, పు. 148

19. కొన్ని ఉపపత్తులను బట్టి 'కృష్ణరాయ విజయము' యథార్థానికి 18వ శతాబ్దం మొదటి దశకంలో వ్రాసినట్టు చెప్పవలసి వస్తుంది. 'కృష్ణరాయ విజయ' రచనాకాలాన్ని, నేను పరిష్కర్తగా ఆం. ప్ర. సాహిత్య అకాడమీవారు ప్రచురించిన 'కృష్ణరాయ విజయము'లో విపులంగా చర్చించాను. చూడు కృష్ణరాయ విజయము (సం. డా॥ సి. వి. రామచంద్రరావు), ఆం. ప్ర సాహిత్య అకాడమీ, హైదరాబాదు, (1891), పు XIV-XXIII.

20. 62 . 21-26; 63 : 1-4; కవికర్ణ రసాయనము (సం. మోచర్ల రామకృష్ణకవి), II. 6 , 65.

21. ప్రకంద బాహుబలేంద్ర గజపతి 3వ అంకవత్సరం, రౌద్రి చైత్ర శు 1, బుధ (క్రీ. శ. 1560 ఏప్రిల్ 10) నాటి తెలుగు శాసనము ఉంది దీనిని బట్టి ఇతడు క్రీ. శ. 1558-59 లో రాజ్యానికి వచ్చినట్లు తెలుస్తుంది.

22. 10 : 7-12

23. 11 : 3-6

24. స్వామికన్ను పిళ్ళె : "ఎఫిమెరిస్"

25. అదే

26. "ప్రతాపరుద్ర చరిత్రము" (తణుకు, 1969). దీని రచనాకాల నిర్ణయానికై చూడు ఖండవల్లి లక్ష్మీరంజనం గారి ఉపోద్ఘాతము పు 1-8 లు; ఏకామ్రనాథుడు క్రీ. శ. 1623 ప్రాంతంవాడను అప్పుదగారి గణింపు (సంగ్ర ఆంధ్ర సాహిత్యం, సం 9, పు.77)ను లక్ష్మీరంజనంగారు సరికాదన్నారు లక్ష్మీరంజనం గారివాదం సమంజసంగా ఉంది.

27. 45 : 21-24; 46 : 1-13; 46 : 13-18; ప్రతాపరుద్ర చరిత్రము, పు. 84-85 లు.

28. "ఎ డిస్క్రిప్టివ్ కేటాలాగ్ అఫ్ తెలుగు మ్యానుస్క్రిప్ట్ ఇన్ ది మహారాజ సర్ఫోజీ'స్" సరస్వతీమహల్ లైబ్రరి, నం. 815; "సభాపతి లక్షణము", ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, సం. 13 (1925), సంచిక 1, పు. 69-71.

29. రాయవాచకంలో, "కృష్ణరాయనికి మంత్రులు రాజనీతి నుప దేశించుట" అనే శీర్షికక్రింద, "తరుణుండై .. అని ప్రారంభమయిన కందపద్యం మొదలు, "దుష్టజన నిగ్రహం బును శిష్టజన పరిపాలనంబును జేయవలయు" అనునంతవరకు గ్రాంథికభాషలోఉండే 'అరువుటల గ్రంథమంతా' 'సభాపతి వచనము' నుండి రాయవాచక కర్త యధాతథంగా గ్రహించాడు. చూడు రా. వా.పు 13-18

30. 21 : 9; 21 : 17

31. 49 : 20

32. చూడు, సెవెల్, "ఎ స్కెచ్ అఫ్ ది డైనాస్టీస్ అఫ్ సౌత్ ఇండియా" (ఢిల్లీ, పునర్ముద్రణ 1975) పు. 51, సూచిక. 3

33. లెవిస్ రైస్, "ఎపిగ్రాసియా కర్ణాటకా", వాల్యూం. 2. బెంగుళూరు. నిడుదవోలు వెంకటరావు, "మైసూరు చెన్నపట్టణ నిర్మాత ఇమ్మడి జగదేవరాయుడు "భారతి, 1953, జనవరి, పు. 76-79 లు.

34. చూడు, షేర్వాని. హెచ్. కె, "మహమ్మద్ కులీకుతుబ్‌షా" (బొంబే, 1967), పు. 14, 135 లు, సిద్దికి. ఎ. ఎమ్, "హిస్టరీ అఫ్ గోల్కొండ" (హైదరాబాద్, 1956), పు. 91, 389; విజ్ఞాన సర్వస్వము, III పు. 429.

నేలటూరు వెంకట రమణయ్యగారు ఈ భాగానగరం క్రీ. శ. 1580 తర్వాత నిర్మించారని ఒకచోట (స్టడీస్ ఇన్ ది థర్డ్ డైనాస్టీ, పు. XXV), "భాగ్యనగరము క్రీ. శ. 1589 వ సంవత్సరమున నిర్మింపబడెను" అని మరియొకచోట (భారతి, 1954, పు. 148) చెప్పినారు.

35. 41 : 15-25

36. చూడు, నిడుదవోలు వెంకటరావు, "మైసూరు చెన్న పట్టణ నిర్మాత ఇమ్మడి జగదేవరాయుడు", భారతి, 1953, జనవరి, పు. 76-79లు; దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. (1960), పు. 483 మొ॥; జగదేవరాయని వంశవృక్షానికై చూడు. తిరుమల తిరుపతి దేవస్థానములు, వాల్యూం. 2, టేబిల్ నం. 170.

37. వెంకట రమణయ్య. యన్, "ఫర్దర్ సోర్సెస్ అఫ్ విజయనగర్ హిస్టరీ", I, పు. 314, 316, 319, 323-34 లు; చాగంటి శేషయ్య, 'ఆంధ్ర కవి తరంగిణి, II వ సంపుటం, పు. 67 మొ॥

38. "సోర్సెస్ అఫ్ విజయనగర్ హిస్టరి" (1919), పు. 238; చాగంటి శేషయ్య, "ఆంధ్ర కవి తరంగిణి", సంపుటం II, పు. 73-75; మట్ల వంశవృక్షానికై చూడు, "తిరుమల-తిరుపతి దేవస్థాన శాసనములు, వాల్యూం 2, టేబిల్ నం. 34.

39. "ఫర్దర్ సోర్సెస్ అఫ్ విజయనగర్ హిస్టరీ" (1946), I, పు. 321 మొ॥, 327, 332, 334. లు.

40. చాగంటి శేషయ్య, 'ఆంధ్ర కవితరంగిణి', సంపుటం. 10, పు. 67; "ఫర్దర్ సోర్సెస్ అఫ్ విజయనగర్ హిస్టరీ, I."

మొత్తం సిద్ధాంత వ్యాసాన్ని ఏడు ప్రకరణాలుగా విభజించడం జరిగింది. మొదటి ప్రకరణంలో జాషువ జీవిత ప్రస్థానం, రెండవ ప్రకరణంలో జాషువ కృతుల వర్గీకరణం, మూడవ ప్రకరణంలో పద్య కృతులు-కావ్యఖండికలు, నాల్గవ ప్రకరణంలో గద్య కృతులు, ఐదవ ప్రకరణంలో దృశ్యకావ్యాలు, ఆరవ ప్రకరణంలో రచనా విశేషాలు, ఏడవ ప్రకరణంలో జాషువకవిత్వ తత్త్వాలను గూర్చి వివరించడం జరిగింది. 'నాదు కన్నీటి కథ సమన్వయము సేయ-నార్ద్రహృదయంబుఁగూడ కొంతవసరంబు' అని జాషువ ఆశించినట్లే చౌదరిగారు జాషువ కృతులను సమీక్షించడం జరిగింది.

భాస్కర చౌదరిగారి సిద్ధాంత వ్యాసంలో మరొక ఉత్తమ లక్షణం - కవి దృక్పథంతో భేదించేటప్పుడు కూడా స్పష్టంగా, నిర్ద్వంద్వంగా భేదించటం. అక్కడ ఎటువంటి మలినఛాయా ఉండకపోవటం ఇట్లాంటి లక్షణం ఎక్కువ మంది పరిశోధకుల్లో ఉండదు.

జాషువ పదప్రయోగంలో ఉన్న వైచిత్రిని, అతను ఉపయోగించిన అన్యదేశ్యపదజాలాన్ని, అంత్ర పదజాలాన్ని, ఛందోవిశేషాల్ని, అలంకార విశేషాల్ని సోదాహరణంగా వివరించారు. అయనపై వచ్చిన శాస్త్రసంబంధమైన విమర్శను, ప్రతి విమర్శను కూడా పాఠకుల ముందుంచారు.

జాషువ సమకాలీనులైన కవుల్లో ఆయన పద్యానికున్న నడక మరొకరికి సాధ్యపడక పోవటం పద్యనిర్మాణ శిల్పమర్మజ్ఞులైన వారందరికీ తెలుసు. జాషువ అభ్యుదయ వర్గానికి చెందినవాడా ? భావకవితావర్గానికి చెందినవాడా ? అనేవి పనికిరాని చర్చలు. జాషువ రచనలన్నింటిలోనూ, వర్ణవ్యవస్థా ప్రస్తావన ఉండటం సర్వసాధారణమైన విషయం. ఆయన జీవితాంతమూ బాధపడినది దానిని గురించే కనుక. సాటి కవులు కూడా ఒకే వేదిక మీద ఆయనను అవమానించినట్లు ఇప్పటివారు చెప్పుకుంటారు.

భవభూతి 'ఏకోరసః కరుణ ఏవ' అన్నట్లుగానే జాషువ 'కరుణరస మొకండె కఠిన రాక్షస మూకా/హృదయములను గరిగి ముదముగూర్చు / వేడికంటి నీటి విలువ సహజమైన/వలువ లీను అశ్రువులకు లేదు/అంటాడు. సందర్భం వేరైనా కరుణ రసానికి గల స్థానాన్ని ఏ కవైనా అంగీకరించి తీరవలసిందే గదా!

"ఒక ఉద్యమాన్ని ఆలంబనంగా చేసుకొని, తల్లక్షణాలను కవితద్వారా అభివ్యక్తం చేసిన కవి ఆ ఉద్యమపు వేడి చల్లారి పోవటంతో తెరమరుగై పోవటం సాహిత్యలోకంలో సాధారణంగా కన్పించే విషయమే. ఈ కారణం వల్లనే భావ కవిత్వపు రోజుల్లో వెలుగులోనికి వచ్చిన కొందరు కవులు నేడు పాఠకలోకానికి దూరం కావటం జరిగింది" అని అంటున్నారు భాస్కర చౌదరి గారు జాషువా కవిత్వ తత్త్వంలో. ఇది కొంచెం తొందరపాటు నిర్వచనమేమో. ఏనాడైనా ఏ ఉద్యమ కాలంలోనైనా మిగిలేది కొంతమంది కవులే. ఉద్యమం వేడికి కవులు మిగలడానికి ఏం సంబంధంలేదు.

జాషువ ప్రధానంగా సంస్కరణవాదకవి. వర్ణ వ్యవస్థను మొత్తంగా అతను కాదనలేదు. వర్ణ వ్యవస్థలో ఉన్న లోపాలను అతను దుయ్యబట్టాడు. అన్ని వర్ణాలు సమానం అనటంలేదు, వర్ణ సాహిత్యాన్నికోరటం వేరు. అట్లాగే ఆర్థిక వ్యవస్థకూడా. ముష్టి వేయటంవల్ల, దానం చెయ్యటంవల్ల శ్రమజీవి దారిద్ర్యం తీరదు. తీరదని జాషువాకు తెలుసు. అయితే అతను కాలం కంటె ముందు చూడలేదు. కనుకనే —

"వాని రెక్కల కష్టంబు లేనివాడు
సస్య రమ పండి పులకింప సంశయించు
వాఁడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁ బెట్టు వానికి భుక్తిలేదు"

అనిచెప్పి పరిష్కారాన్ని వదిలేశాడు. అయితే గాంధేయ వాదం ఒకటి అతనికి కవచం. దారిద్ర్యానికి గాంధేయవాదం పరిష్కారమా ? ఇవన్నీ శేష ప్రశ్నలు.

ఈ సిద్ధాంత గ్రంథంలో చౌదరిగారు దర్శించిన జాషువా స్వరూపం సమగ్రమైనది. ఆయన కవిత్వతత్త్వానికి చాలా దగ్గరగా ప్రస్థానించి ఆయన జీవలక్షణాన్ని, బలాన్ని, బలహీనతని అంతర సాధ్యంగా చూపించారు భాస్కర చౌదరిగారు. వారి పరిశోధనా పాటవానికి, వారు పడిన శ్రమకు అభినందనీయులు.

నవోదయం (కవితా సంకలనం)

[డా॥ ఎస్. గంగప్ప. వెల: రు. 6-00 లు. ప్రతులకు: శశీప్రచురణలు, C-73, శ్రీనివాసనగర్, గుంటూరు - 522006; నవోదయ పబ్లిషర్సు, ఏలూరురోడ్, విజయవాడ - 2; అరండల్ పేట, గుంటూరు-2]

ఇది గంగప్పగారి పద్య, గేయ, వచనగేయ కవితాసంకలనం. సాహిత్యపరిశోధకులు, పరిశీలకులు అయిన గంగప్పగారు బాలగేయాలతోపాటు కవితాసంకలనాలను కూడా వెలువరిస్తున్నారు. ఈ సంకలనానికి ఆచార్య తూమాటి దోణప్పగారు, ఆచార్య జి. ఎన్.

రెడ్డిగారు, ఆచార్య సి. నారాయణరెడ్డిగారు, స్ఫూర్తిశ్రీగారు, చిట్ట చివరకు పొన్నెకంటి హనుమంతరావుగారు అవసరమైనంతగాను, కొనంతగాను కూడా ముందు మాటలు రాసి అభినందనలను, అభిప్రాయాలను, అనుశీలనలను అందించారు. ఈ కవితాసంకలనంలో గురజాడ, శ్రీశ్రీ, లాల్‌బహదూర్‌శాస్త్రి, రవీంద్రుడు మొదలైన వారిపై అభినందన ఖండికలు, ఉగాదిపై, బిచ్చగానిపై, బాంగ్లాదేశ్ విజయంపై, రాష్ట్రావతరణంపై ఇంకా అనేక అంశాలపై కవితలున్నాయి. గాంధీని కృష్ణదేవరాయలను గంగప్పగారుకూడా మరోసారి జ్ఞప్తిచేశారు పాఠకులకు. సుబ్బన్నగారిపై కవితలు రెండుచోట్ల కనబడతాయి. ఏదిరాసినా ఈ సమాజంలో అందరూ సుఖపడాలని, హెచ్చుతగ్గులుండకూడదనే తపన గంగప్పగారిది. రాసిన ప్రతి ఖండికా కవిత్వం కావాలని మనం ఆశించగూడదు. కవిత్వాంశగల కవితాసంకలనం ఇది. వారి ఆశయానికి ఈ ఉదాహరణ చాలు.

'నల్లటి మచ్చ అమవస నిశియై
అల్లుకుంది సందింతలేక
బ్రతుకు చీకటి
బరువు బాధ్యత
కరువు కాటకాలు
చీలి హృదంతరాలు'

ఈ వర్తమాన స్థితిలోంచి—

'బ్రదుకు బాటలో వెలుతురు ప్రసరించే
ఆశాభానూదయం కావాలి
బాధల గాథల చీకటులు
పంచబంగాళం కావాలి'

అనే ఆశావాదంతో ఈయన కవిత ముడిపడి ఉంది.

స్యమంతక మణి (గేయ కావ్యం)

[రచన: పెంటమరాజు నరశింగరావు, బి. ఎ. వెల: లేదు. ప్రతులకు: పెంటమరాజు నరశింగరావు, జాతీయోన్నత పాఠశాల, నాగర కర్నూలు - 509 209.]

ఇది స్యమంతక మణి కథ. వినాయకచవితి పండగ చేసుకునే పిల్లలకూ, పెద్దలకూ చదువు వచ్చినా రాకపోయినా తెలిసిన కథ ఇది. ఈ కథను బడిపిల్లలకు పనికివచ్చే శైలిలో గేయాలుగా రూపు నిచ్చారు రచయిత. వారి రచనకు ఈ గేయం ఉదాహరణ.

"ఘనుడైన భగవంతుని
కథను చదువ విన్నగాని
పరమాత్ముని కృప కలిగి
పాపమంత తొలిగిపోవు"

శ్రీ సాయినాథ కరావలంబ స్తోత్రము

[రచన: బాపట్ల వేంకట పార్థసారథి. వెల: రు. 1-00 లు ప్రతులకు: బాపట్ల వేంకట పార్థసారథి, శ్రీ సాయినిలయమ్, నెగుమ-522 113.]

షిరిడీ సాయిబాబాను స్తుతిస్తూ రాసిన చిన్న పుస్తకమిది. ఈ పుస్తకంలో 27 పద్యాలున్నాయి. అన్నీ భగవంతుని భక్తుడు ఏమి కోరతాడో కోరవలెనో చెప్పేవే. మచ్చునకు-

"శాంతి కరువయ్యె సంసారసాగరమున
సుఖము మరుగయ్యె; ఆశయే చుట్టుకొనియె
యమభటుని పాశమట్టుల; ఆర్తిదొలగ
చేయి నందించుమా నాకు సాయినాథ!"

సాయిభక్తులు పారాయణచేసి తరించటానికి బాగుంటుంది.

శ్రీ టి. ఎల్. కాంతారావు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.

41. కురుగంటి సీతారామయ్య, 'తంజావూరు నాయక చరిత్రము, (1932), పు. 76 మొ॥.

42. "ఎపిగ్రాఫియా కర్నాటక", V, హెచ్‌యన్ 15 (క్రీ. శ. 1562); అదే హెచ్. యన్. 6 (క్రీ.శ. 1563); అదే హెచ్. యన్. 2 (క్రీ. శ. 1563)

43. "ఎపిగ్రాఫియా కర్నాటికా" VII సిఖ. 69 (క్రీ. శ. 1562; మరియొక కర్నాటక శాసనం "ఎపిగ్రాఫియా కర్నాటికా" IV, యన్‌జి, 26 (క్రీ. శ. 1563) లో "అలకమలక", జగదేకరాయని కార్యకర్తగా చెప్పబడినాడు.

44. 44 : 20.

45. రాయవాచకంలోని చారిత్రక విషయాలకు సంబంధించిన చర్చ వెంకటరమణయ్యగారి ఈ క్రింది గ్రంథాలలో సందర్భాను సారంగా చూడవచ్చు.

   i) స్టడీస్ ఇన్ ది థర్డ్ డైనాస్టీ ఆఫ్ విజయనగర్, మద్రాస్, 1935

   ii) ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర్ హిస్టరీ, మద్రాస్, 1946

   iii) 'కృష్ణదేవరాయలు', హైదరాబాదు, 1972

   iv) విజయనగర చరిత్ర, భాగములు 1, 2, హైదరాబాదు 1976

46. సోర్సెస్ ఆఫ్ విజయనగర్ హిస్టరీ, పు. 11

47. రాయవాచకము, ఆంధ్రసాహిత్య పరిషత్ప్రచురణ. 33(1933)

48. అదే

49. అరుణకుమారి, ఆంధ్రచారిత్రక కావ్యములు, పు. 198

50. కులశేఖరరావు, ఆంధ్రవాచక వాఙ్మయము, పు. 507-508 లు.

51. స్టడీస్ ఇన్ ది థర్డ్ డైనాస్టీ, పు. xxvi

52. కృష్ణదేవరాయలు (1972), పు. 3.

53. 10 : 7-12

54. 76 : 25 నుండి 77 : 17; రాయలు శ్రీముఖ సంవత్సర ఆశ్వీజ శుద్ధ 12 న కాళహస్తిలో ఉన్నట్లు రాయవాచకం చెపుతుంది. అందుచే ఒకటి రెండు రోజులముందు తిరుపతిలోఉన్నట్లు ఎంచడమైనది.

55. వెంకటరమణయ్య, విజయనగర చరిత్ర, భా. 2, పు. 10 మొ॥

56. రిపోర్ట్ ఆన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఇన్‌స్క్రిప్షన్స్. (సాదు సుబ్రహ్మణ్యశాస్త్రి, 1930), పు. 151 మొ॥

57. అదే, పు. 206

58. 79 : 19 నుండి 80 : 5 వరకు

59. ఉదాహరణకు, కుందూరి ఈశ్వరదత్తు, "పారిజాతాపహరణ, మనుచరిత్ర రచనా కాలములు", ఆంధ్రపత్రిక, 1930, ప్రమోదూత, పు. 103 మొ॥

60. 61 : 18, 19, 25 ; 80 : 3.

కిరణ స్పృహ

శ్రీ కె. అంజయ్య

చాప కింది నీరులా రెప్పపాటు అజాగ్రత్తలో
నిన్ను కబంధ హస్తాల్లో బంధీ చేస్తుంది చీకటి
కన్ను కుట్టటంలో మొలకేస్తుంది చీకటి
మనిషి అత్యాశలో పరుచుకు పోతుంది చీకటి
మూర్ఖుని ఆయుధం వెదజల్లేది చీకటి
శ్మశాన వైరాగ్యాన్ని నూరిపోసే సైనేడ్ చీకటి
గద్దెపై కెక్కిన చీకటి
పొరలు పొరలుగా ప్రపంచాన్నాక్రమించాలని
ప్రయత్నిస్తుంది
బాబాల, కాజీల, ప్రవక్తల స్పీకర్ డబ్బాల్లోంచి
డైరెక్టుగా మెదడు నరాల్లోకి ఎక్కించబడుతుంది.

చీకట్లో తచ్చాడుతూ కాలాన్ని తినేవాడు బానిస
చీకటి మేస్తూ చీకటి చిమ్మే బ్రోకర్ బురాక్రాట్
గొడ్లలా అనుసరించే కాళ్ళ ప్రవాహం
శూన్యలక్షణ చర్యలకు చప్పట్లు చరిచే చేతులు
అన్నింటికీ తలాడించే ట్యూబులైట్లు
అడ్డగాడిదల్లా ఎదిగి నన్నాళ్ళూ
చీకటి సూర్యున్ని మింగగలనని గంతులేస్తుంది.
నదిబడ్డున పిండ ప్రవచనాలు
గుడి నుదుట మొక్కుబడుల నమ్మకాలు
మన జుట్టుకు కట్టి ఆడించాలని చూస్తుంది చీకటి
అడివి నంటించి చీకటిని పారదోలాలని
కిరణం మెదళ్లు కంకణం ధరిస్తాయి
చుక్కల్ని చూపి మురిపించే నక్క చీకటి
కిరణాల అడుగుజాడలు నాటుకోకుండా
బహిరంగ మైక్ మాయా వాగ్దానాలై
నమ్మించే కాగితం మీద ముద్దర్లేసి
నిముషంలో బుర్ర ఖాళీ చేసి ఊపిస్తుంది.

కళ్ళు తెరిస్తేచాలు
కళ్ళల్లో దుమ్ము కొట్టాలని చూస్తుంది చీకటిగాలి
చీకటి నియంతరాజ్యాన్ని కూలదోస్తారని
గుడ్డి వెల్తురు ఆర్డినెన్సుల చంద్రునిగద్దె కెక్కించి
మురిపంగా మరిపించి ముచ్చటుగా దోస్తుంది
చీకటి తాగేవాడు కార్చే అక్షరాలు
అస్థానకవి పొగడ్తల్లా నవ్వుల పాలౌతాయి
చంద్రునిలో సమస్త కవిత్వం చవిచూసే సుఖజీవి
వెలుతురు గోదాలో దిగి ప్రజాసమస్యల్ని ఎదుర్కోలేడు
చీకటి గాలి సోకిన ప్రబుద్ధుడు
తాడును పాముగా భ్రమసి బెదురుతాడు
రేడియో వసంత తుంపరల్ని నిజమనుకొని
అనుభూతి పైత్యంలో వడ్ల పిట్టయై
ప్రకృతి ప్రవృత్తి మరిచి
ఊహాకలల్ని ప్రతీకల్తో ఊస్తూ ఆనందిస్తాడు
ఆయుధాలున్నా చీకటిగూట్లో పాదం మోపలేని పిరికిపంద
అయోమయ అధివాస్తవికతలో కొట్టుకుపోతాడు
చీకటికి గుండు కొట్టించి పారదోలేవాడు
ఏ ఆయుధం ఆసరా రాకున్నా
రెండు రాతి మెదళ్ళను రాపిడి చేసి
వెలుగు పంట ప్రపంచంపై కుమ్మరిస్తాడు.

కాదు ముఖ్యము - ఉనికి తీరు

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు

నీవు లింగము అయితేమానె
నేను జంగము కాను కాను.

ఎవరు లింగమో
ఎవరు జంగమో

ఏది కదలికో
ఏది నిలకడో

ఏది ఘనమో
ఏది ద్రవమో

ఏది జడమో
ఏది జీవమో

ఎందుకీ మీమాంస ఇప్పుడు
ఏల తర్జన భర్జనమ్ము

చరము పురుషుడు అయిననేమి
స్థిరము ప్రకృతి అయిననేమి

కలయికే మన లక్ష్యమైతె
కాదు ముఖ్యము ఉనికితీరు.

నీవు నేనను మాట మరచి
ఒకటిగానే ఉండిపోదము.

అందుకే రావోయి సఖుడా
అందుకొన అధరామృతమ్ము

లింగమై ఒకచోటునుండకు
భ్రమరమై నాచుట్టు తిరుగుము

మల్లెతీగకు మొగ్గనై
నేనుండి పోదును ప్రియతమా

కొలనులోనే కమలమై
తేనెలను ఒలికింతును

భ్రమరమై నా పొందు గూడుము
భ్రమలు తీరునులే!

శ్రీ మాదిరాజు రంగారావు

చైతన్య స్రవంతి విధానం

చైతన్య స్రవంతి సంవిధానం మనస్తత్వ శాస్త్ర ప్రభావం వల్ల సృజనాత్మక సాహిత్యంలో ప్రవేశించింది. కొత్త ప్రపంచాన్ని దర్శించే అవకాశమూ కలిగింది. పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం వల్ల కొత్తదనాన్ని అన్వేషించే లక్షణంతో సుప్రసిద్ధ రచయితలు శ్రీశ్రీ, బుచ్చిబాబు, గోపీచంద్, రాచకొండ తమ రచనల్లో దీన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఇటీవల నవీన్, నాగరాజు మొదలైన ఆధునిక రచయితలు ఈ సంవిధానం అవలంబించి ఉత్తమ నవలలు వ్రాసారు. దీన్ని నిర్వహించడానికి మనస్తత్వ పరిజ్ఞానం అవసరం. దీనితో ఎంత క్షుణ్ణంగా పరిచయం ఉంటే, అంత చక్కగా తమ లక్ష్యమూ, పరిమితులూ అర్థమవుతాయి. పాత్ర చిత్రణలో లోతునూ, వేగాన్ని కలిగిస్తూ కొత్తదనాన్ని భావింపజేసే స్థితి చేకూరుతుంది. ఫ్రాయిడ్ అడ్లర్ యుంగ్ మనస్తత్వ శాస్త్రవేత్తల గొప్ప పరిశోధనల కృషి ఫలంగా మనః ప్రపంచానికి సంబంధించిన చైతన్యరూపం గురించీ ఎన్నో రహస్యాలు బయటికి వచ్చాయి. ఎంతో ఆలోచనకూ అవకాశం కలిగింది. జీవితాన్ని వెనుకనుండి నడిపే అదృశ్యమాన చైతన్య శక్తుల పాత్ర గురించి, అవగాహనలో సంపూర్ణమైన మార్పు వచ్చింది. ఇది ఆధునిక యుగానికి పరిహరింపరాని లక్షణంగానూ నిలచింది.

'చైతన్యం' అనేమాట ఇక్కడ కాంషస్‌నెస్‌కు అనువాదం. దీనికి అనేకమైన అర్థాలున్నాయి. ఇందులో కొన్ని- అనుభవ పూర్వకమైన జ్ఞానరూపం. మెలకువ. వ్యక్తి కోరికల ఆలోచనల అనుభూతుల సమాహారరూపం. ఒక విషయాన్నిగురించి మనస్సుకు గల జ్ఞానం, ఆలోచన అనుభూతులకు సంబంధించిన స్ఫూర్తి, మనస్సుయొక్క క్రియాత్మకమైన స్థితి. ఇలా ఎంతైనా వివరిస్తూ పోవచ్చు. ఎంతచెప్పిన ఎంతో కొంత మిగిలేఉన్నట్లు అనిపిస్తుంది. ఏమైనా సంగ్రహంగా ప్రస్తుత విషయాన్నిబట్టి మనోవ్యాపారం యొక్క శక్తిరూపంగా భావించవచ్చు. కాంషస్‌నెస్ అంటే చైతన్యం అనీ ఈ సంవిధానంలోని పరమమైన ఉద్దేశాన్ని దృష్టిలో పెట్టుకొని, తెలుగులో శ్రీశ్రీ, బుచ్చిబాబు వంటి ప్రముఖులు స్ట్రీమ్ ఆఫ్ కాంషస్‌నెస్ అంటే 'చైతన్య స్రవంతి' అనీ ప్రయోగించడం జరిగింది. ఒకవ్యక్తి చైతన్యంగా ఉన్నాడంటే అతనిలో మానసికమైన క్రమగతి (మెంటల్ ప్రాసెస్) జరుగుతూందని అర్థం. ఒకరు అచేతనంగా (అన్- కాంషస్) గా ఉన్నారంటే ఈ క్రమగతి విరామాన్ని పొందడమో లేదా నిరోధింపబడడమో జరుగుతుంది. మిక్కిలిగాఢమైన నిద్రలోనూ, స్పృహతప్పినపుడూ ఇది సంభవిస్తుంది. వ్యక్తి చైతన్యంగా ఉన్నాడంటే అతనికి తన మానసికమైన స్థితి గురించిన జ్ఞానం లేదా ఎరుక (ఎవేర్‌నెస్) కూడా వర్తిస్తుంది. తాను ఆలోచిస్తున్న, అనుభవిస్తున్న జ్ఞానమూ కొంతవరకు ఉంటుంది. బాగాతెలివిలో ఉన్నదానికీ, అసలే తెలివిలో లేనిదానికీ మధ్య ఎన్నో దశలున్నాయి. నిద్ర చెందిన వ్యక్తి కేవలం అచేతనంగా ఉండాలనేంలేదు. ఎందుకంటే అతడు కనే కలలు, వాటిని గురించిన అనుభవ ముద్ర- నిద్రపోయేప్పుడు కలిగిన స్పర్శ, ధ్వని మొదలుగా విపరీతమైన లేదా విశిష్టమైన అనుభవజ్ఞానం ఉంటుంది. అందువల్ల చైతన్యం అంటే వ్యక్తిలో ఎక్కడో స్థిరంగా నిలచి ఉండేదికాదు. అతనిలో మానసికంగా జరుగుతూన్నది; సరిస్తూన్నది అని భావం.

ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని బట్టి చైతన్యస్వరూపం మూడు విధాలు. 1. కాంషస్ - మొదటి చైతన్య స్థాయి 2. ప్రి-కాంషస్ చైతన్యం క్రిందిస్థాయి. చైతన్యం వెనకనే (అడుగున) ఉండేది. వ్యక్తికి ఆ సమయంలో ఒక విషయం జ్ఞప్తికి ఉండకపోవచ్చు. కాని వెంటనే దాన్ని స్మృతి పథానికి తెచ్చుకోగల ఆలోచనకు స్థానమైంది. 3. అన్-కాంషస్. ఇది చైతన్యం అట్టడుగునకు చెందింది. ఎంతో లోతైంది. సాధారణ పరిస్థితుల్లో బయటికి రాని విషయాలు, ఎప్పటివో ఇందులో పడి ఉంటాయి. ఈ స్థాయి చాలా ముఖ్యమైంది. సాహిత్యంలో ఇది సముద్రంగానూ, సరస్సుగానూ లోతైనలోయ, లోయలో సరస్సుగానూ అక్కడి సందర్భాన్ని బట్టి రచయిత ఆశించే ప్రయోజనాన్ని బట్టి ఎంతో ప్రతీకాత్మకంగా చిత్రితమవడం గమనించవచ్చు. నీరు సాధారణంగా అవ్యక్త చేతనకు ప్రతీకగా కన్పిస్తుంది. లోయలో సరస్సు, చేతనలో లోతైన పొరలో దాగిన పురాభావ (ఆర్కెటయిప్) రూప సంచయాన్ని సూచిస్తుంది. ఇది సామూహిక అవ్యక్త చేతనస్థాయి (లెవెల్) కి చెందింది. ఇది నిస్సందేహంగా పైకి కన్పించని

గంభీరతతో లోలోన పడిఉన్న అనేకమైన పురా భావ జాలం నమూనాల (పాట్లర్న్స్, మాడెల్స్) తో నిండి ఉంది, ఎంతో మహనీయమైందనీ మనస్తత్వశాస్త్రవేత్తల అభిప్రాయం. ఆధునిక కాలంలో సృజనాత్మక రచయితలను ఫ్రాయిడ్-మనస్తత్వ విశ్లేషణం, అడ్లర్- న్యూనతాభావం, యుంగ్ - సామూహిక అవ్యక్త చేతనం సిద్ధాంతాలు ఎంతగానో ప్రభావితం చేసాయి. జీవిత ప్రపంచంలో ఇంతకుముందు కన్పించని, చూడని ప్రదేశాలపై దృష్టి ప్రసరించి ఎన్నో రహస్యాలు కనుగొనడమూ జరిగింది. ఇంకా మనస్తత్వ పరమైన సాహిత్య విమర్శలో ఇటీవల ప్రత్యేకంగా పురాభావరూపాలకు సంబంధించిన వివేచన కూడా చెప్పదగిన స్థానాన్ని పొందింది.

ప్రస్తుత విషయానికి వస్తే - ఫ్రాయిడ్ దృష్టిలో అవ్యక్త చేతన విస్మృతమైన, అణచబడిన, అనేక విషయాల సంచయ స్థానం. ఈతని సిద్ధాంతం ప్రకారం అవ్యక్తచేతన ప్రత్యేకంగా వైయక్తిక (పర్సనల్) గుణోపేతమైంది. యుంగ్ తన పరిశోధనలతో దీనిపై మరికొంత అభివృద్ధిని సాధించాడు. ఈతని సిద్ధాంతం ప్రకారం అవ్యక్త చేతనయొక్క పైపొర నిస్సందేహంగా వైయక్తికమైంది. దీన్ని ఇతడు వైయక్తిక చైతన్యం (పర్సనల్ కాంషస్) అంటాడు. ఇది లోతైనపొరపై నిలిచి ఉంది. ఈ లోతైన పొరగలస్థాయిని సామూహిక అవ్యక్తచేతనగా కనుగొని స్థాపించడంలో ఇతని సిద్ధాంతంయొక్క ఆయువుపట్టు నిక్షిప్తమైంది. ఇది వ్యక్తిగతం కాదు. అందరిలోనూ, ఉండేదీ. సర్వసాధారణమైందీ. ఇందులో ఉండేవన్నీ పురాభావ రూపాలు.[1] ఇవి బహు పురాతనమైనవీ. ఎన్నో యుగాల నాటివీ. అసంఖ్యాకమైనవీ ప్రతిరూపాలు స్వతంత్రమైనవీ. ఇవి కలలో సాక్షాత్కరిస్తాయి. దైనందిన జీవితంలో మన ప్రవర్తనల్లోనూ జీవనపద్ధతుల్లోనూ ఏదోఒక రూపంలో ప్రతిఫలిస్తాయి.

చైతన్యంయొక్క వివిధమైన పొరలలో, నిహితమైన దృశ్యాదృశ్య జీవిత ప్రపంచం అంతా- 'చైతన్య స్రవంతి' రచనలో నియతమైన కాలప్రవాహంగా రూపొందిన అనేక స్థితులు, ఆలోచనాతరంగాలుగా భావలయతో మనకు విశిష్టమైన గతితో దర్శనమిస్తుంది.

స్ట్రీమ్ ఆఫ్ కాంషస్‌నెస్ (తెలుగులో చైతన్యస్రవంతి) అనే పదబంధం మనస్తత్వశాస్త్ర పరమైంది. దీన్ని విలియమ్ జేమ్స్ తన ప్రిన్సిపుల్స్ ఆఫ్ సయికాలజీ అనే గ్రంథంలో మొదట రూపొందించాడు.[2] ఇది డోరోతీరిచార్డ్‌సన్ చేత సాహిత్యంలో ప్రయుక్తమైంది. ఈ సంవిధానానికి మార్గదర్శకురాలుగా ప్రశస్తి వహించింది[3] హెన్రీ జేమ్స్‌ద్వారా ప్రవేశ సౌగమ్యాన్ని పొందింది.[4] వర్జినియా వూల్ఫ్ రచనలతో ఒక స్థిరమైన స్థితిని పొందింది.[5] ఈమెలో సుకుమార ప్రవృత్తితో అన్వేషణంతో చైతన్యసీమల్ని దర్శించే శక్తి కన్పిస్తుంది. "సామాన్యమైన రోజున సాధారణమైన మనస్సును పరిశీలిస్తే- మనకు ప్రకాశవంతమైన పరివేషం కన్పిస్తుంది. చైతన్యం ఆరంభం మొదలు చివరిదాకా కొంత స్వచ్ఛమైన కాంతి సంప్రసారమైన పొర మనచుట్టూ వ్యాపించి ఉంటుంది."[6] అన్న మాటల్లో పై భావం చక్కగా ఉన్మీలితమైంది. 'వేవ్స్' లో వాస్తవికతయొక్క వైయక్తిక దర్శనం బాగా కన్పిస్తుంది. జేమ్స్ జాయిస్ కృతుల్లో[7] ముఖ్యంగా యులిసెస్ మహాగ్రంథంతో ఇది ఒక శక్తివంతమైన సంవిధానంగా కళాత్మకమైన విలువలు కలిగే తన వైశిష్ట్యాన్ని నిలుపుకుంది. నవలను చైతన్యంతో ఉజ్జీవింపజేసాడు. యులిసెస్ మానవ జీవితం యొక్క వ్యంగ్య చిత్రం. ఇందులో భౌతికమూ, ఇంకా అధికంగా మానసికమైన భూమికల్లో జీవితంయొక్క స్థూల సూక్ష్మమైన రూపాలు ఎంతో వివరంగా విశ్లేషితమైనాయి. జీవితంలో ఎదురయ్యే సమస్యలు- మానసికమైన భ్రాంతి, సంఘర్షణ, ఆదర్శాలు వాస్తవానికీ కల్పనకూ మధ్య అంతరం రెండూ కలసే ప్రదేశాలు, ఎంతో నిశితంగా చైతన్యంయొక్క వివిధస్థాయిల్లో దర్శితమైనాయి. మానవ మనస్తత్వ పరిశీలనలో విస్తృతీ వైవిధ్యమూ వైచిత్రి గలగొప్ప రచన. ఆ తరువాత విలియమ్ ఫాల్క్‌నర్ మొదలైన రచయితలు దీనికి కొత్త కొత్త పార్శ్వాలతో చిరమైన కీర్తిని ఆర్జించి పెట్టారు. ఫాల్క్‌నర్ లో వర్జీనియా వూల్ఫ్, ఇంకా జేమ్స్ జాయిస్ యొక్క చక్కని జీవితాదర్శ సమ్మేళనం గోచరిస్తుంది. ఇతని రచనల్లో[8] పాత్రయొక్క అంతర్దర్శనం ముఖ్యం. లిబిడో యొక్క అవ్యక్త చైతన్యా విష్కారం, స్వప్న విధాన రూపం మొదలుగా మనస్తత్వ ప్రకాశనం అధికం. సాహిత్య విమర్శలో మే స్లింక్లియర్, దీన్ని మొదట డోరోతీ రిచార్డ్‌సన్ వ్యాసంలో వివేచన చేసింది.[10] ఈనాడు సాహిత్య రంగంలో ఈ సంవిధానం గురించి తెలియక పోవడం అంటే, ఆధునిక లక్షణానికి కొంత లోపం కలిగినట్లే!

2

చైతన్య ప్రవంతి సంవిధానం నవల్లో పాత్ర, మానసికమైన క్రమగతి (మెంటల్ ప్రాసెస్) సంబంధించిన అనేకమైన

మనస్తత్వ పరమైన అంశాలపై నిర్మితమౌతుంది. దీనివల్ల పాత్ర అంతరంగ దర్శనం సిద్ధిస్తుంది. ఇంతకుముందు తెలీని బయట పడని స్పష్టంకాని ఎన్నో సూక్ష్మమైన విషయపరిశీలనకూ అవకాశం కలిగింది. పాత్రల మనస్తత్వ పరమైన అనేక పార్శ్వాలు ఒక టొకటీ ప్రకాశమానం కావడంతో దీని ప్రాముఖ్యం ఇటీవల బాగా గుర్తింపుకు వచ్చింది. ఇందులో స్మృతి (మెమరీ) అంతరం, ప్రవహించే చైతన్యంగా రూపొందుతుంది. స్మృతి కీలకమైన పాత్రను నిర్వహిస్తుందని చెప్పవచ్చు. పాత్రల మానసికమైన క్రమగతిని స్మృతి నియమించడంచేత పాత్రనిర్మాణంలో సంప్రదాయనవల్లోకన్నా ప్రత్యేకమైన రూపాన్ని పొందుతూంది. ఈ విధమైన రచనచేసే రచయిత, పాత్రస్మృతి పరంపరా సమయంలో కాలంతో ప్రవహించే వ్యక్తిత్వాన్ని సృష్టించే ఉద్దేశం కలవాడవడంచేత, ఇందులో చైతన్యం యొక్క పై పొరలను ఛేదించుకొని వివిధ స్థాయిలలో అనేక దశల్లోని రహస్యాలను ఆవిష్కరించే ప్రయత్నం జరుగుతుంది. ఇవి అనంతమైనవి. మనం సాధారణంగా ఊహించలేనివి. ఇవి ధరించే ఆకృతులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి, ఉత్సుకతను పెంపొందిస్తాయి. ఈ జీవితంలో ఉంటూ దీని వెనుకనున్న కొత్తప్రపంచంలో తిరుగుతూన్న మానసిక స్ఫూర్తి కలుగుతుంది. కాబట్టి మనస్సుయొక్క బాహ్యమైన ఆవరణలు క్రమిస్తూ, లోలోపల అడుగున నిహితమైన రూపాలపైనే పాత్ర వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. చైతన్య రూపం వస్తు విన్యాసానికి స్థానమవుతూంది. చైతన్యం క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకూ పాత్ర మనస్తత్వ సమర్పంగా చిత్రించడంలో రచయిత సందర్భానికి తగిన విధంగా వివిధాంశాలు ఎన్నుకొనే ప్రజ్ఞ ఎంతో అవసరం.

చైతన్యరూపాన్ని రెండు భాగాలు చేస్తే, ఒకటి కింది స్థాయిలో, రెండోది పై (ఉన్నత) స్థాయిలో ఉండేది. కిందిది మసక మసకగా అస్పష్టంగా ఉంటుంది. పైది ప్రకాశవంతంగా ఉంటుంది. మొదటిది వాక్కుకు పూర్వమైన దశ (ప్రీస్పీచ్ లెవెల్) ఇది సాధారణంగా మన కందదు. రెండోది వాక్‌దశ (స్పీచ్ లెవెల్) కు చెందింది. మన కందుబాటులో ఉండేది. చైతన్య స్రవంతి రచనలో ఆ అందని స్థాయిలో అస్పష్టంగా మసక మసకగా, ఇంకా కిందికిపోతే విస్మృతమై ఎప్పుడో, లోతుగా చీకటిలో ఉన్న మనస్తత్వపరమైన, జాతి సామూహిక లక్షణయుతమైన ఎన్నో అంశాలు అనేక రీతుల్లో విచిత్ర సామరస్య రూపంలో ఆవిష్కృతమౌతాయి.

ఇవి ఉద్గమనంలో, ఏ కత్తిరింపులకూ లోను కాకుండా నియమితమూ కాకుండా, యథాతథంగా అవలీలగా మనస్సునుండి ప్రసరిస్తాయి. రచనలో కళాత్మకమైన విలువల దృష్ట్యా క్రమబద్ధం చేయబడతాయి. ఇది శిల్పం క్రిందికి వస్తుంది. లేకపోతే సాహిత్య పరంగా క్షతి ఏర్పడుతుంది. వివిధస్థాయిలలో ప్రసరించే చైతన్యంతో పాత్ర క్రియాత్మకమైన మనోరూపాన్ని పొందుతుంది. మనస్సు బాహ్యమైన అనేకావరణలు దాటి చైతన్యంలోపల ఉన్న పొరల్లోకి ప్రవేశించి అందులో దాగిన వ్యక్తిత్వ రూపాలను బయటికి లాగడం జరుగుతుంది. మొదటి నుండి చివరివరకూ రచయిత ఈ పనిలో కేవలం నిర్వాహకుడు (స్టేజి మేనేజరు) గా మాత్రమే ఉంటాడు. ఏ విధంగానూ పాత్రలను నిర్దేశించడు, ప్రవర్తనను నియమించడానికీ పూనుకోడు. ఎంతో తటస్థంగా ఉంటాడు. ఈ కారణంగా పాత్రలు స్వేచ్ఛగా ప్రవర్తించే అవకాశం ఎక్కువ. ఏ నీతి నియమాలకూ కట్టుబడవు. ఎంతో నిర్భయంగా అభిప్రాయ ప్రకటం గావిస్తాయి. రచయిత ప్రభావం ఏ మాత్రమూ లేని స్వతంత్రమైన వ్యక్తిత్వాలతో ప్రవర్తించడం దీనిలోని విశేషం. భాష కూడ సాధారణ సూత్రాలకూ నియమాలకూ కట్టుపడదు సహజమైన ప్రసంగధోరణి కలిగి ఉంటుంది. పదబంధాలు, పదరూపాలు కొత్తగానూ వాక్య విన్యాసం ఖండ ఖండాలుగానూ, ఒక్కొక్కప్పుడు దీర్ఘదీర్ఘంగానూ, ఆకర్షణీయంగా సహజత్వంతోపాటు శిల్పగుణమూ కలిగి ఉంటాయి. రచన ప్రవాహంగా ఆలోచనా తరంగాలతో భావలయతో పరిక్రమిస్తుంది. గతంనుండి వర్తమానంలోకీ, వర్తమానంనుండి గతంలోకీ పాత్రలు వస్తూపోతూ ఉంటాయి. కాలం ఒక క్రమంలోనూ ఉండదు. అయినప్పటికీ రచన మొత్తంమీద, పాత్ర స్వరూపాన్ని బట్టి ఒక ఏర్పాటు, ఒక పద్ధతి పర్యాప్తమై ఉంటుంది.

కాలానికి సంబంధించినంత వరకు రెండు రకాలైన రచనలు కన్పిస్తాయి. 1) కొన్ని రచనల్లో కథ ఒకరోజులో లేదా కొన్ని గంటల్లోనో సమాప్తమౌతుంది. ఒకరోజులో లేదా కొన్నిగంటల్లో ఎంతో కాలాన్ని వివిధ స్మృతి విశేషాలతో, అనుభవ పరంపరలతో అనేక సంఘటనల మయమైన ఇతివృత్తం, అన్నిటినీ తనలో ఇముడ్చుకొని అవయవ పూర్ణమైన ఆకృతిని శిల్పగుణం చేత పొందుతుంది. మరికొన్ని రచనల్లో ఇతివృత్తంలో అనేకమైన సంఘటనలు పురస్కరించుకొని సాధారణమైన సంప్రదాయ ధోరణిలో కథ నడుస్తూ మధ్యమధ్య ఈ సంవిధానం ఆవిష్కృతమౌతుంది. ఈ పద్ధతిలో అటు సంప్రదాయగతమైన నవలా పద్ధతిలో, ఈ నవ్యమైన సంవిధానం అనుసంధితం కావడం ఇందులో విశేషం. తెలుగులో అసమర్థుని జీవయాత్ర, అల్పజీవి పేర్కొనదగినవి. ఇది మొదటిదానికన్న సులభమైంది. చైతన్య స్రవంతి సంవిధానానికి మొదటిపద్ధతిలో అంటే కొన్ని గంటల్లో

లేదా ఒక రోజులో జరిగి కాలంలో అనేక కోణాలనుండి రూపొందిన ఇతివృత్తంగల కథారూపమే సంపూర్ణమైన ప్రాతినిధ్యం వహిస్తుంది.

పాత్రల సజీవమైన దర్శన శక్తి (లైవ్ ఇన్ట్యూషన్) తో వివిధ చైతన్య దశలను ప్రతిఫలింపజేసే స్వభావంతో, ఆకర్షణీయమైన సృజన రూపాన్ని ఉన్నత ప్రమాణాల్లో కలిగి ఉండడమనేది, రచయిత పరిణతమైన సృజన శక్తికీ, కళాపరమైన శిల్ప దృష్టిపై ఆధారపడి ఉంటుంది.

చైతన్య స్రవంతి - రచన రచయిత చేసే ఏ వ్యాఖ్యానమూ, విశ్లేషణమూ లేకుండా పాత్ర మనస్సునుండి నేరుగా ఉద్గమించే కళాత్మకమైన విధాన రూపం.[11]

3

ఒకవేళ రచయిత స్వయంగా వివరించడానికీ, విశ్లేషించడానికీ లేదా వ్యాఖ్యానించడానికీ ఉపక్రమిస్తే అది అంతర్విశ్లేషణం (ఇంటర్నల్ ఎనాలిసిస్) అనే పద్ధతికి చెందుతుంది.[12] ఎందుకంటే రచయిత ప్రమేయ స్పర్శతో పాత్ర రూపొందే వ్యక్తిత్వమే వేరవుతుంది. ఇందులో పాత్ర ఆంతరమైన జీవితరూపం నేరుగా ఆవిష్కృతం కావడానికి బదులు పాత్రకూ పాఠకునికీ మధ్య రచయిత చోటు చేసుకుంటాడు. దీనితో పాత్ర నిర్మాణంలోనే కాక పాఠకుని మనస్సుపైనా ఏదో ఒక విధమైన ప్రభావాన్ని నెరపుతాడు. ఇది పాత్రలపై మనకొక అభిప్రాయాన్ని కలిగించేదిగా ఉండవచ్చు లేదా పాత్రలను తన అభిప్రాయానికనుగుణంగా ప్రవర్తింపజేసేదిగా ఉండవచ్చు. ఇంకా అనేకవిధాలుగా ఉంటుంది. అభిప్రాయాలకూ సిద్ధాంతానికీ చెందినవి కావచ్చు. ఏమైనా ఇది సూచనగా ఉండవచ్చు, తప్పదు. కాని ప్రమేయంగామారి చివరకు పాత్రలపై ఆధిపత్యం వహించి వాటి "కీలుబొమ్మలు చేయడం ఈనాటి నవలా ప్రపంచంలో ఎక్కువమంది అంగీకరించడం లేదు. అయితే అభిప్రాయ భేదం ఎప్పుడూ ఉంటుంది. తెలుగులో అల్పజీవి నవల, రచయిత ఎంతో తటస్థంగానూ, ఏ విధమైన ప్రమేయస్పర్శ లేకుండా నిర్వహించే ప్రయత్నం జరిగింది. దీనివల్ల రచనకు ఎంతో సహజత్వం, సజీవమైన వాస్తవ గుణంతో నిండి వెరిసిమిలిట్యూడ్ లక్షణం చేకూరింది.[13] అందువల్ల ఈ నవల తక్కిన వాటికన్నా ఏదో విలక్షణంగా మనల్ని ఆకర్షిస్తుంది. ఈ ఆకర్షణకు వేరే గుణాలూ లేకపోలేదు.

చైతన్య స్రవంతి రచనలో పాత్రల మనస్సునుండి నేరుగా ఉద్గమిన రూపం (డయిరెక్ట్ కొటేషన్) పొందిన రచన అంతా నాటకీయత కలిగి ఉంటుంది. సంభాషణకు ప్రాధాన్యం హెచ్చుగా ఉండడమూ ఒక కారణం కావచ్చు. వాచికంతో పాటు ఆంగికమైన వర్ణనం, హేతుక్రమంలో సంఘటనల ఏర్పాటు శ్రవ్యంతోపాటు దృశ్యానుగుణమైన ప్రత్యక్షీకరణ పద్ధతి మొదలైనవి వేరే కారణాలూ ఉండకపోవు. ఒక్కొక్క రచయిత ఒక్కొక్క విధంగా సాధిస్తాడు కాబట్టి ఇలా అనడం జరిగింది. ఈ సంవిధానంలో మూర్త (కాన్క్రీట్) లక్షణం ప్రముఖంగా ఉండడమూ పేర్కొనదగిన అంశం.

ఇంతకుముందు చెప్పినట్లు గ్రంథమంతా ఈ విధానమే అవలంబితం కావచ్చు. కొంతభాగం లేదా మధ్య మధ్య ఖండఖండాలుగానూ ఉండవచ్చు. అంతర్విశ్లేషణంలో రచయిత ప్రమేయం ఉంటుంది. ఇందులో అమూర్త (అబ్స్ట్రాక్ట్) లక్షణాని కవకాశం ఎక్కువ.

ఈ సందర్భంలో పేర్కొదగిన మరొకటి—అంతర్భాషణం (ఇంటర్నల్ మానోలాగ్). ఇది స్వగతం కాదు, ఏకాంత భాషణమూ కాదు. దీన్ని చైతన్య స్రవంతిగా భావించే ప్రమాదమూ సంభవిస్తూ ఉంటుంది. ఇందులో మనస్సులో కదలికనుబట్టి ఒక భావం తరువాత మరొకటి క్రమిస్తుంది. మనస్సులో అది వచ్చినది వచ్చినట్లుగా పాత్ర సాధారణ సంభాషణలో రూపొందుతుంది. ఈ సమయం బుద్ధి చాలా వేగంగా పనిచేస్తూఉంటుంది. మూర్తమైన ఇంద్రియానుభవ ముద్ర నుండి అమూర్తమైన ఆలోచనలు, భావరూపాలు (ఇమేజెస్) ప్రసరిస్తూ ఉంటాయి. ఇది చాలా పరిమితమైన పరిధి కలిగింది. పాత్ర తీవ్రమైన, అనిర్దిష్టమైన (అన్‌డయిరెక్టెడ్) ఆలోచనా గతికి గురైనపుడూ, ఇంకా స్వప్నస్థితిలోనూ, కాల్పనిక ధోరణిలో ఇంద్రియానుభవాన్ని వ్యక్తం చేసేప్పుడూ ఈ విధానం ఉపయుక్తమౌతూంటుంది. పాత్ర మనస్సు ఒక లక్ష్యంతో విశ్లథనా (లూజ్‌మై) ధోరణిలో పనిచేస్తూ ఉంటుంది. అంతర్భాషణమూ, చైతన్యస్రవంతి ఒకటికాదు. దీనిలో దశాక్రమం (పిరియాడిక్ మానర్) లేకపోవడంవల్ల, అప్పటిస్థితిని బట్టి రచయిత ఎంతో మెలకువతో ఉపయోగించవలసి ఉంటుంది. లేకపోతే 'అయోమయం' గా రూపొందే ప్రమాదం ఉంది. దీన్ని దుజార్డన్ (ల మోనోలోగ్ అంతెరుర్) కనుగొన్నట్లు చెబుతారు. డోస్టావిస్కీనవల్లో పాత్ర మనస్సునుండి ఖండ ఖండాలుగా వెలువడిన ఆలోచనా పరంపర ఈ పద్ధతిలో ఎంతో కళాత్మకంగా ఆవిష్కృతమైనాయి.

4

చైతన్య ప్రవంతి రచనా నిర్మాణం అనేక సంఘటనల పరంపరారూపం. దీనికి "ఫ్లక్స్" లేదా ప్రవహించే వస్తుతం లేదా క్రియాత్మకత అవశ్యమైన లక్షణం. పాత్రపై దృష్టితో, దాని నిర్మి

తినిబట్టి- అంతరంగ చిత్రణంవల్ల, ఆలోచనలో అవిచ్ఛిన్న స్థితిచేత ఈ భావం వ్యక్తమైంది, అంతరంగ ప్రసారం- ఒక క్రమపద్ధతిలో అర్థవంతంగా రూపొందాలి. ఇక్కడ అంతరంగ రూపం, జీవిత ప్రపంచం రెండూ అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. ప్రాథమిక (ప్రియిమరీ కాంషస్‌నెస్) అవల ఉన్న స్మృతులూ ఆలోచనలూ అనుభూతులూ అన్నీ కలిసి ఏ అదుపూ, అణచివేత లేకుండా ఒక క్రమంలో అంటే గొలుసుగా కాక ప్రవాహం వలె నరిస్తూ ఉంటాయి. దీన్నే బెర్గ్‌సన్ అభిప్రాయానుసారం కాల ప్రవాహకత్వాన్ని బట్టి ఫ్లక్స్ అనడం జరిగింది. గొలుసు కూడా అవిచ్ఛిన్నంగా ఉండవచ్చు. ఒక కొక్కానికి మరొకటి చేర్చబడే నిర్మితం కావచ్చు. ఇందులో సహజమైన ఉద్గమనం ఎక్కడుంది? లేదు. శ్రమచేత సాధించిన ప్రయత్నరూపం ఇది. ఇందులో సృజనశక్తి లేదు. సహజమైన ఆవిర్భావం లేదు. ఇంకా ఈ పదార్థంలో ఘనత్వం ఉంది. నిలకడ ఉంది. అయితే ప్రవాహంలో గతి వర్తనంఉంది. పదార్థంలో ద్రవత్వంఉంది. అందువల్ల "స్ట్రీమ్" అన్నమాట ఎంతో అర్థవంతంగా ప్రయుక్తమైనట్లు విదితమౌతుంది. పైగా అంతో ఇంతో ప్రవాహం లోతూ ఉంటుంది. నీటి లోతు అవ్యక్త చేతన (అన్ కాంషస్‌నెస్) కూ, నీటి ఉపతలం క్రింది భాగం ఉపచేతన (సబ్ కాంషస్ నెస్)కూ ప్రతీకలు. ఇది చాల ప్రసిద్ధమైందే. రెండు తీరాల మధ్య ప్రవహించే ప్రవాహం, మానసికమైన క్రమ గతిని సూచిస్తుంది. ఈ ప్రవాహ క్రియ కాలానుబంధమై ఉండడం విశేషం. అవిచ్ఛిన్నత్వమూ మరీ ముఖ్యం.

ఇందులో భౌతికమైన వస్తు విన్యాసం, అంతరంగ కథనానికి కేవలం ఆశ్రయ భూమిగానే ఉంటుంది. ఈ అంతరంగ కథనం, మనస్తత్వ ప్రధానమైంది. ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ పాత్రల చైతన్యం విషయ రూపం కలదికాబట్టి- చైతన్య స్రవంతి సంవిధానం (టెక్నిక్)గా గుర్తించనివారూ లేకపోలేదు.[14] ఈ అభిప్రాయాన్ని గురించి ఆలోచిస్తే పాత్ర సమస్య కేంద్ర స్థానం వహించడమే హేతువవిపిస్తుంది. ఇది అన్ని నవలల్లోనూ ఉంటుంది. ఇక్కడ దీని ఆవిష్కారంలో ఎంతో విశిష్టత ఉంది. అదే చైతన్య స్రవంతి ధోరణి, కాబట్టి సంవిధానమనీ సమాధానం.

సృజన సాహిత్యంలో స్థూలమైన స్వరూపం దీన్ని గురించి నిర్దిష్టమైనా ఒక్కొక్క రచయితను బట్టి ఒక్కొక్క విధంగా రూపొందడం సహజం. రచయితకూ రచయితకూ, రచయిత రచనకూ రచనకూ ఈ భేదం గుర్తించవచ్చు. పాత్రస్వేచ్ఛ, సంఘర్షణతో ఆరంభమై అన్వేషణలో కొనసాగుతూ సజీవ దర్శనంగా రూపొందుతుంది. ఇక్కడ పాత్ర సహజత్వానికి భంగం రాకూడదు. అయితే దీని వెనుకనుండీ పనిచేసేవీ వాస్తవికాలే, కాని మనకు తెలీనివి, అందనివి కావడంవల్ల ఆశ్చర్యానికి ఆస్కారకాలవుతాయి.

ఈనాటి రచయితకు మనస్తత్వ శాస్త్రంతో అంతో ఇంతో స్థూలమైన పరిచయమైనా అవసరం. ఈ సంవిధానం మనః ప్రపంచాన్ని దర్శించే, పరిశోధించే సాధనం. జీవితం అంతః పార్శ్వాలను గురించిన విశ్లేషణమూ, వివేచనమూ దీనిసహాయంతో చేయబడుతుంది. ప్రత్యక్షమైన జీవితం నుండి అప్రత్యక్షమైన చైతన్యం వరకూ అంతా అనుభవ లోకమే. "అనుభవం ఎప్పుడూ మితం కాదు. అది ఎన్నటికీ సంపూర్ణం కాదు"[15] మనిషిలో కోర్కెలు, ఆలోచనలు, ప్రవర్తనలతో సంబంధం గల చర్యలు, ప్రతి చర్యలు కలసి ఏర్పడిన సంఘటనల క్రమం జీవితం. దీని అనుభవం చైతన్యం ఉపరితలపైని సామాన్యమైన పొరనుండీ, అట్టడుగున ఉన్న మహనీయమైన లోపొరవరకూ వాస్తవమైంది. ఈ కారణంగా చైతన్యపుటర (ఛాంబర్ ఆఫ్ కాంషస్‌లెస్) నను అనుభవపుటర (ఛాంబర్ ఆఫ్ ఎక్స్‌పీరియెన్స్) గా పేర్కొనడం జరిగింది. ఇది ఒక ముఖం కాదు. సామాన్య వ్యక్తిగా సంఘ సభ్యుడుగా, కుటుంబ సభ్యుడుగా, మానవుడుగా, ఇలా ఇందులో ఇంకెన్నో: స్నేహితుడు పరిచయస్థుడు, వైయక్తికమైన జాతి, సంస్కృతీ పరంగా మానవతా లక్షణంతో ఎంతో వైవిధ్య విలసితమైంది. దేన్ని కదిలించినా ఒక తరంగంవలె ఉద్గమిస్తుంది. దీన్ని ఒక క్రమంలో కదపడంలో ఒక రీతిగా సంయోజించడంలో రచయిత శిల్పం ఎంతో అవసరమౌతుంది. దీని అతిశయమైన ప్రాముఖ్యాన్ని బట్టీ చైతన్యస్రవంతిని సంవిధానంగా గుర్తించడానికి అవకాశం లభిస్తూంది.

స్మృతులు, ఆలోచనలు అనుభవాల వెనుకనున్న మానవ మనోజీవితాన్ని యథార్థ జీవితతలంపై చైతన్యాత్మకంగా ప్రవహింపజేయడంలో ఇతర ప్రక్రియలకన్నా నవల్లో ఈ సంవిధానం బాగా విజయవంతమైంది. ఈ విధమైన నవలలకు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానమూ ఉంది. పాఠకునికీ దీన్ని గురించిన పరిచయం వల్ల ఇంకా బాగా అనుభవంలోకి తెచ్చుకొని, ఆనందించగలడు. ఆ పైన ఆలోచనకూ అవకాశం ఉంది. దీనివల్ల అతడు రచన చదివి పొందే అనుభవానికీ, చేసే ఆలోచనకూ ఎంతో ప్రయోజనకరమైన విస్తృతి కలుగుతుంది. ఇంకా వ్యక్తుల సమాహారమైన సమాజపరంగానూ, ఎన్నో మానసికమైన అవలక్షణాల తొలగింపుకూ, విషమస్థితుల్ని సరిచేయడానికీ ఉపకరిస్తుంది. వ్యక్తుల్లో దాగిన ఎన్నో రహస్యరూపాలనూ దర్శింపజేస్తుంది. మొత్తం మీద గుప్తమైన స్వస్వరూపం అవగతికి రావడంవల్ల

మానసికంగా ఆరోగ్యకరమైన వాతావరణానికి దారి తీస్తుంది. అయితే చివర ఒక మాట, సృజనాత్మక సాహిత్యంలో కళాత్మక వివేచనలో, మనస్తత్వ పరమైన పరిశీలనకూ కొన్ని పరిమితులు లేకపోలేదు. సాహిత్య దర్శనంలో ఇదీ ఒక పరిహరింపరాని భాగంగా గుర్తింపజేయడమే ప్రస్తుతాశయం.

వ్యాస సూచికలు

1. ఆర్కె (i) : "ఛీఫ్ టయిప్ ఆర్ మాడెల్; ఒరిజినల్ టయిప్ ఆర్ పాటర్న్ ప్రియిమార్డియల్ ఇమేజ్" అనీ అంటారు. దీన్ని పురా (భావ) రూపం అనడం జరిగింది.

2. విలియమ్ జేమ్స్ : (1842-1910) అమెరికన్ తత్వవేత్త. తత్త్వశాస్త్రం, మనస్తత్వశాస్త్రం వ్యాసంగంలో జీవితమంతా గడిపాడు. ఇతని రచనలు: 1. ప్రిన్సిపల్స్ ఆఫ్ సఘకాలజి 2. వెరయిటీస్ ఆఫ్ రెలిజియస్ ఎక్స్‌పీరియన్స్. 3. ది మీనింగ్ ఆఫ్ ట్రూత్.

3. 1) డోరోతీ రిఛార్డ్‌సన్ :నావెల్; పిల్‌గ్రిమేజి.

: "ఇన్‌వెంటెడ్ ది ఫిక్షనల్ డెపిక్షన్ ఆఫ్ ది ఫ్లో ఆఫ్ కాంషస్‌నెస్" - బౌలింగ్.

2) "ఇట్ ఈజ్ సయికలాజికల్ ఆటోబయోగ్రఫీ"- బౌలింగ్.

4. హెన్రీ జేమ్స్. : (1843-1916) ఆంగ్లో అమెరికన్ నవలా రచయిత. ఇతని నవలలు: 1. రోడ్రిక్ హడ్సన్ 2. పోర్ట్రెయిట్ ఆఫ్ లేడీ 3. ది గోల్డెన్ బౌల్.

5. వర్జీనియా వూల్ఫ్ : నవలలు 1. మిసెస్ డాల్లోవే 2. ది వైట్ హవుస్ 3. వేవ్స్

6. "ఎక్సామిన్ యాన్ ఆర్డినరీ మయిండ్ ఆన్ యాన్ ఆర్డినరీ డే .... లయిఫ్ ఈజ్ ఎ ల్యూమినస్ హాలో, ఎ సెమీ ట్రాన్స్‌పరెంట్ ఎన్‌వలప్ సరవుండింగ్ అస్ ఫ్రమ్ ది బిగినింగ్ ఆఫ్ కాంషస్‌నెస్ టు ది ఎండ్" — వేవ్స్

7. జేమ్స్ జాయస్ : నవలలు 1. యులిసెస్ 2. ఎ పోర్ట్రయిట్ ఆఫ్ ది ఆర్టిస్ట్ యాస్ ఎ యంగ్ మాన్. రెండవ రచనలో పాత్ర స్టీఫెన్ ముసుగులో రచయిత కళా రూపంయొక్క పరిణామ సిద్ధాంతాన్ని వ్యక్తం చేశాడు - హెరాల్డ్ ఇ టాలివర్.

8. విలియమ్ ఫాల్క్‌నర్ : 1. ది సౌండ్ ఆఫ్ ఫ్యూరీ 2. యాస్ ఐ లే డయింగ్

9. లిబిడో : లైంగిక వాంఛారూపం (ఫ్రాయిడ్)

10. మేసింక్లేర్ : డోరోతీ రిఛార్డ్‌సన్ మీద వ్యాసంలో "దేర్ ఈజ్ నో డ్రామా, నో సిట్యుయేషన్, నాట్ సెట్ సెన్స్, నథింగ్ హాపెన్స్ ఇట్ ఈజ్ జస్ట్ లయిఫ్ గోయింగ్ ఆన్ ఎండ్ ఆన్. ఇట్ ఈజ్ మిరియమ్స్ స్ట్రీమ్ ఆఫ్ కాంషస్‌నెస్ గోయింగ్ ఆన్ ఎండ్ ఆన్." ఇగాయిస్ట్ - ఏప్రిల్, 1918.

11. "స్ట్రీమ్ ఆఫ్ కాంషస్‌నెస్ ఈజ్ ఎ మెథడ్ విచ్ గివ్స్ అజ్ ఎ డయిరెక్ట్ కొటేషన్, ఫ్రమ్ ది మయిండ్, వితవుట్ ది ఆథర్స్ కామెంట్ ఆర్ ఎనాలిసిస్" - లారెన్స్ ఎడ్వార్డ్ బౌలింగ్ - స్ట్రీమ్ ఆఫ్ కాంషస్‌నెస్.

12. "ఇఫ్ ది ఆథర్ హిమ్‌సెల్ఫ్ యింటర్‌వెన్స్ టు యింటర్‌ప్రెట్, ఎనాలిసిస్ ఆర్ కామెంట్, హవెవర్ హి ఎంప్లాయిస్ ఎ డిఫరెంట్ మెథడ్, విచ్ షల్ బి లేబిల్డ్ యాస్ ఇంటర్నల్ ఎనాలిసిస్."

13. వెర్‌సిమిలిట్యూడ్ : (జీవిత) సత్యాన్ని పోలిన రూపం: నవలలో వాస్తవికతకూ, రూపకల్పనకూ గల స్థానాన్ని గురించిన చర్చకు ఆధారమైన ప్రధానాంశం. ఈ సత్యం జీవితంలోని యథార్థస్థితికి సంబంధించింది. ఇది భౌతికం కావచ్చు. మానసికమూ కావచ్చు.

14. వాలస్ ఏమ్. బాకన్.

15. ఎక్స్‌పీరియన్స్ ఈజ్ నెవర్ లిమిటెడ్ ఎండ్ ఇట్ ఈజ్ నెవర్ కంప్లీట్- హెన్రీజేమ్స్.

వినుతి వినోదము

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

సీ॥ శిరముపై గాంగ నిర్ఝరిణి సంధానించి
నుదుట చిచ్చరకన్ను పొదిగినావు
జడముడి నమృతాంశుబుడుతను సవరించి
గళమున విషమును నిలపినావు
సర్వమంగళను మైసగమున ధరియించి
కాటికాపురమును గాంచినావు
పులితోలు చలువదువ్వలుగా దాలిచి
ఎద్దు వాహనముగా నెసగినావు

గీ॥ చిత్ర చిత్రముల్ నీచేయుచేష్టలెల్ల
నీ ప్రభావము నెన్నగా నేర్చునెవడు ?
పరమ భుజగాధిపాకల్ప! భక్తకల్ప!
కామదాహక! చండీశ! వ్యోమకేశ!

సీ॥ స్థాణువై నీవు నిర్వాణము నొసగ
అపర్ణయై తా సుఖపాత్ర◆మూను
గిరిశుడవై నీవు సరసత చూప తా
గిరిజయై నీలోన కరగిపోవు
రుద్రుడవై నీవు భాద్రములీయ తా
చండికయై సౌమ్యసరణి నెరపు
ధవళా కృతిని నీవు నవరక్తి వెలయింప
గౌరియై తాను రాగంబు నిలుపు

గీ॥ ఈశ్వరుండవై నీవు వహిమ వహింప
ఆర్యయై తాను పూజలనందుకొనును
నీవు పార్వతి దంపతిభావమొంది
వెలయు టెంతయు ఉచితము విశ్వనాథ!

గీ॥ అంతరాయ సంతప్తలోకాళికి తత
విఘ్నసంహారకుండు ప్రాప్తించుటయును
దనుజబాధితులై కడు వనటనొందు
వేలుపులకు సేనాని లభించుటయును
భవ్యమైన మీ దాంపత్యఫలముగాదె ?
విశ్వహితులార! జగదేకపితరులార!

◆ పత్రిభావము

పుప్పొడి చినుకులు

"సౌంధ్యశ్రీ"

ఎవడన్నాడో కానీ
దేశమంటేకాదని.... ?
కాదన్నవాడికేం తెలుసు ఈ క్రమాస్నాతకవ్రతం....

ఒక్కబిడ్డను కని స్త్రీ మాతృశబ్దానికి నిఘంటువైతే
ఇందర్ని కన్న మట్టి
ఏ నైఘంటికార్థానికి లోబడుతుంది.... ?

ఋతానికి
సత్యానికి
మధ్య
మండిగంమీద పెట్టిన మహాదీపం నేల....

సత్య ఋత శౌర్యాల్ని ఆవహించుకొని
దీక్షాతపస్సుల్ని సమీకరించుకొని
జ్ఞానయజ్ఞాల్ని
కత్తితో - సుత్తితో
నాగలితో - దాగలితో
సమారాధనకు సమర్పిస్తే
సప్తర్షిత్వాన్ని సంతరించుకుంటాడు మనిషి

బిడ్డల్ని కన్నతల్లికి
ఈ పృథివికి
ఇంతకన్నా మహాపర్వం మరొకటుందా.... ?

పులకించి ఒడిని పూలబుట్ట చేసుకొని
పుప్పొడిని చల్లుతున్న పృథివిని
అమానుషుడెవ్వడో___
అట్టహాసంగా చాపచుట్ట చుడితే
దేశంకాదు లెమ్మని - ఊర్కొన్న
నిద్రారోగికాదు మిత్రమా-! మన దైవం....
మేల్కొన్న - నువ్వు నేను....

2

విశ్వాసపాత్రమైన హితాకాశకోశాన్ని
నిప్పుల్తోమండించే ఉద్రేకంలో
ఉనికిని పోగొట్టుకుంటాడని
ఎంత ఓర్పును నేర్పుతోందో నేల మనిషికి....

మనిషి మర్త్యుడేకానీ -
చచ్చిపోయి బ్రతుకుతారు శాశ్వతంగా - కొందరు
వాళ్ళకోసం....

భీకరాకారంతో ఒళ్ళు విరుచుకుంటున్నతుఫాను
కెరటాలతో విరుచుకుపడుతున్న మహార్ణవం

యుద్ధాగ్ని జ్వాలల్తో మదించిన చలినికాచుకుంటున్నపద:
నేలమీద - ఉద్రేకంతో ఉన్మాద చర్యలకొడిగడితే
మౌనసమాధిలో ఔదార్యాన్నావహించిన
మహాక్షమావ్రత క్షితి....

చూశావా - తూట్లుపడ్డ హృదయంలోంచి
మూలికాబీజాలు తలెత్తి నమస్కరించటం
గాయపడ్డ శరీరంమీద కూడా
ఓర్పుగా ఆకుపచ్చను పులుముకొనటం... ?

మిత్రమా...
మానవతకన్న ఒక మెట్టు ముందున్న మాతృశక్తి
శక్తినిలయ శబ్దస్పందనాజాత విశ్వానికి
అక్షరాభ్యాసం చేసే తొలిదినాల్లో
మనిషికన్నముందు మనసును పరివ్యాప్తం చేసింది.... !

—✻—

శ్రీ ముదిగంటి సత్యనారాయణ రెడ్డి

భూ సంస్కరణలు దాని అమలుపై ఒక పరిశీలన

(గత సంచిక తరువాయి)

గ్రామీణ ఆరోగ్య పూర్వ రంగము

ఈ గ్రామములో పరిస్థితులు సరిగా లేవని సర్వే వలన వెల్లడి అయినది. వీరి ఆరోగ్యము బాగుగా లేనందులకు కొన్ని దురలవాట్లకు పాలుపడుటవలన మరియు కొన్ని పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేకుండా అని తెలియుచున్నది. ఆ దురలవాట్లలో ముఖ్యమైనవి మద్యపానము, పొగత్రాగుట (చుట్ట త్రాగుట) మరియు మురికి నీటి పారుదల సరిగా లేకుండుట. వారిలో అనేకులు మద్యపానము చేయుటకు ఈ క్రింద నుదహరించిన కారణములు తెల్పినారు.

1. ఋణ బాధను మరచుటకై.
2. కుటుంబ భారము వలన.
3. ఆరోగ్యము బాగుగా లేక వారికిగల ఛాతి నొప్పిని మరియు తదితర బాధలను మరచుటకై.
4. కష్టము ఎక్కువ చేయుటవలన.

ఈ కారణాల వలన మద్యపానము చేయుటకు అలవాటైనావి. తత్ఫలితంగా గ్రామ ప్రజలలో కొందరు అనారోగ్యాన్ని వరించుచున్నట్లుగా ద్యోతకము అవుచున్నది. ఈ అనారోగ్యాన్ని దూరంజేసి, ప్రజలను ఆదుకొనే ఆరోగ్య వసతులు మరియు ఆరోగ్య సిబ్బంది లేరు. దవాఖానాలు కూడా లేవు. ఈ గ్రామము నుండి సుమారు 8 కి. మీ. దూరములో నున్న మల్యాల తాలూకా కేంద్రమునకు వైద్య సహాయానికి పోవలసి ఉన్నది. వీరు ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రులకు పోవుదురు.

వీరిలో అనేకుల అభిప్రాయాలను పరిశీలించగా తెలిసినది ఏమనగా వారు ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య సహాయానికై పోరనియు వానికి ఈ క్రింద నుదహరించినవి కొన్ని ముఖ్య కారణములు అని తెలియుచున్నది.

1. ప్రభుత్వ ఆసుపత్రుల వారు బాగుగా చూడరని.
2. అది వారి పరిసర ప్రాంతములకు దూరముగా ఉన్నదని.
3. ప్రభుత్వ ఆసుపత్రిలలో ఎక్కువ కాలయాపన చేయవలసి వచ్చునని.
4. ప్రభుత్వ ఆసుపత్రిలలో వెచ్చించే కాలములో సంపాదన దెబ్బతినునని (ప్రైవేటు ఆసుపత్రిలకు పోవుచున్నామని).
5. ప్రభుత్వ ఆసుపత్రిలలో కూడా డబ్బులు అడుగుచున్నారని.

మొదలగు కారణాల వలన ప్రభుత్వ ఆసుపత్రిలకు కాకుండా ప్రైవేటు దవాఖానాలకు వెళ్లుచున్నట్లు ఈ సర్వేలో తెలిపినారు.

గ్రామీణ రాజకీయ పూర్వ రంగము

ఈ గ్రామములో రాజకీయంగా ఆలోచించిచో ఎక్కువ మంది కాంగ్రెస్, జనతా పార్టీలలో అగ్రకులాలవారు ఎక్కువగా ఉన్నారు. వారికి వ్యతిరేక పార్టీగా కమ్యూనిస్టు భావాలు కల్గి అగ్రకులాలలోని బీదవారు, వెనుకబడిన తరగతులవారు మరియు షెడ్యూల్డు కులాలకు చెందిన యువకులు కాంగ్రెస్, జనతా పార్టీలోని ధనిక వర్గాలకు వ్యతిరేకంగా నిలిచినారు. ఈ కమ్యూనిస్టు భావాలు కల్గిన యువకులను సంఘటిత శక్తి కాకుండా వీరిలో వీరికి కలతలు ద్వేషాలు లేపటం, ఏవో నేరాలను పెట్టి పోలీసులకు పట్టి ఇవ్వడముద్వారా అగ్రకులాలకు చెందిన ధనిక వర్గాలవారు వీరిని చెదరగొట్టుచున్నారు. కాని వీటిని కొందరు ఎదుర్కొని

ముందడుగు వేస్తున్నారని చెప్పుట నిస్సందేహమైనదే. వీరు (యువకులు) ఒక సంఘటిత సంఘంగా ఏర్పడకపోవుటకు కారణాలను ఈ సర్వేలో వెలిబుచ్చినారు. వాటిలో ఇవి కొన్ని —

1. ఆర్థిక స్థోమత లేకపోవుట.

2. నిరక్షరాస్యత.

3. తమకు మిగులు సమయము లేనందున.

4. వారు ఐక్యతను పొందకుండా వారి ప్రయత్నాలను అగ్రికులాలకు చెందిన ధనిక వర్గమువారు విఫలము చేయుటవలన.

మొదలగు కారణాల వలన వారు గ్రామీణ రాజకీయాల్లో చురుకుగా పాల్గొనలేక పోవుచున్నారని, ఈ సర్వేలో తెలిసికొనటైనది.

గ్రామీణ ప్రాంతాలలో భూసంస్కరణల అమలుపై ఒక గ్రామ ప్రాంత పరిశీలన - గ్రామ ప్రజలు వెలిబుచ్చిన అభిప్రాయాలు

కరీంనగరం జిల్లాలోని జగిత్యాల తాలుకా ప్రస్తుతము మల్యాల తాలుకాలోని మేడంపల్లి గ్రామములో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే 1975 సంవత్సరములో భూసంస్కరణల అమలు చేయుటకై సన్నాహాలు జరిగినవి. ఈ సంస్కరణలు "ఆంధ్ర ప్రదేశ్ భూసంస్కరణలు [సీలింగ్‌లో అగ్రికల్చరల్ హోల్డింగ్స్] చట్టము 1973" మూలముగా చేయుటకై సంకల్పింపబడినది. ఈ చట్టము ఆంధ్రప్రదేశ్ 1-1-1975 నుండి అమలులోనికి వచ్చునట్లుగా తీర్చిదిద్దడము జరిగినది. ఈ చట్టానికి ఆంధ్ర ప్రదేశ్ భూసంస్కరణల అమలుకై రూల్సు, 1974ను కూడా రచించి అయా రెవెన్యూ ఆఫీసర్లను భూసంస్కరణల ట్రిబ్యునల్స్ గా నియమించి భూసంస్కరణలను అమలు చేయుటకు కృతనిశ్చయిలైనారు. అయితే కరీంనగర్ జిల్లాలో మూడు భూసంస్కరణల ట్రిబ్యునల్స్‌కు సంబంధించి స్పెషల్ తహశీలుదారు [భూసంస్కరణలు] ఎ. ఓ. ప్రభుత్వ తరపున మరియు ఇతర సిబ్బందితో నెలకొల్పినారు. ఇది కరీంనగరం జిల్లాలోని జగిత్యాల, కరీంనగరం, పెద్దపల్లి రెవెన్యూ డివిజనులలో స్థాపించి వారిని పర్యవేక్షించుటకై జిల్లా భూసంస్కరణల అధికారి [డి.ఎల్. అర్. ఓ.] కరీంనగరం జిల్లా కేంద్రములో స్థాపించబడినవి. ఈ విధముగా స్థాపించిన భూసంస్కరణల కార్యాలయములు 1-1-1975 నుండి పని చేయుట ప్రారంభించి సుమారుగా 1977 సంవత్సరము వరకు ముమ్మరంగా పనులు కొనసాగించబడి, రెండు ట్రిబ్యునల్స్ [జగిత్యాల మరియు పెద్దపల్లి] రద్దుచేయబడి వాటి రికార్డులను కరీంనగర్ ట్రిబ్యునల్‌కు అప్పగించబడినవి. ప్రస్తుతము కరీంనగర్ ట్రిబ్యునల్ మరియు దాన్ని పర్యవేక్షించుటకై డి. ఎల్. అర్. ఓ. [జిల్లా భూసంస్కరణల కార్యాలయము] జిల్లా కేంద్రములో పనిచేయుచున్నవి.

ఈ చట్టము ప్రకారము భూ పరిమితిని ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా నిర్ణయించబడినది. భూమిని ముఖ్యంగా తరిలో 6 రకాలుగా [ఎ, బి, సి, డి, ఇ, యఫ్.] మరియు ఖుష్కిని 5 రకాలుగా [జి, హెచ్, ఐ, జె, కె,] విభజించి అయా రకానికి కొంత భూపరిమితిని నిర్ణయించినారు. వీటి వివరాలు ఈ క్రింద నుదహరించి బడినవి.

		రెండు పంటల తరి భూమి	రెండు పంటల పరిధిని తరి భూమి
ఎ	తరగతి భూమి	10 ఎకరాలు	15 ఎకరాలు
బి	,,	12 ,,	18 ,,
సి	,,	13.20 ,,	20 ,,
డి	,,	15 ,,	22.20 ,,
ఇ	,,	16.20 ,,	25 ,,
యఫ్	,,	18 ,,	27 ,,
			ఖుష్కి
జి	,,	—	35 ,,
హెచ్	,,	—	40 ,,
ఐ	,,	—	45 ,,
జె	,,	—	50 ,,
కె	,,	—	54 ,,

ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో తరికి సంబంధించిన భూములలో ఇ. యఫ్ తరగతులకు మరియు ఖుష్కి సంబంధించిన భూమిలో హెచ్, ఐ, జె, కె, తరగతులకు చెందిన భూములు ఉన్నట్లు విజ్ఞులద్వారా తెలిసికొనదమైనది. అదే ప్రకారముగా ఒక వ్యక్తి లేక ఒక కుటుంబ యూనిటు (ఐదుగురు కుటుంబ సభ్యులుగా మించకుండ ఉండునట్లుగా) కు ఒక్కొక్కింటికి ఒక స్టాండర్డ్ హోల్డింగ్ భూ పరిమితి అని నిర్ణయించ బడినట్లుగా ఆ యస్. హెచ్. ను వివిధ భూములు వివిధ రకాలుగా ఉండునట్లుగా తెలుసుకొన్నాను. భూమిలో మార్పు వచ్చిన భూమి పరిమితిలో మార్పు వచ్చే అవకాశము ఉన్నదని తెలుసుకున్నాను. అయితే ఈ ప్రస్తుత సర్వే ఆ గ్రామా

నికి నీటి పారుదల కల్పించకముందే చేయనైనది. ప్రస్తుతము కొంత భూమి నీటి పారుదల క్రిందకు తీసుకొని వచ్చినారు.

ఈ విధముగా చేసిన భూ సంస్కరణాల అమలుపై నేను పరిశీలించ దలచి ఒక సమగ్రి ప్రశ్నావళిని సమకూర్చుకొని మ్యాదంపల్లి గ్రామ నివాసులైన 100 మంది రైతులను కలుసుకొని వారి వారి అభిప్రాయాలను సేకరించనైనది.

వారి అభిప్రాయాల నివేదికను ఈ క్రింద నుదహరించనైనది. దీనితో ఆ గ్రామములో భూ సంస్కరణల అమలుపై ఒక చక్కని అవగాహన ఏర్పడవచ్చుననే అశాభావముతో చేయనైనది.

భూ సంస్కరణలపై ప్రశ్నావళి మరియు 100 మంది ఇచ్చిన అభిప్రాయాలు :

1. భూకమతాలపై ప్రభుత్వం పరిమితులను విధించినట్లు వినియుంటిరా ?	అందరు విన్నామని చెప్పినారు.
2. విన్నచో ఎటువంటి పరిమితులను విధించడం జరిగింది ?	1. కొందరు 25 ఎకరాలు 2. మరికొందరు 20 ఎకరాలు 3. ఇంకొందరు 15 ఎకరాలు 4. మిగిలినవారు 5 ఎకరాలు ఇందులో ఎక్కువమంది 5 ఎకరాలు చెప్పినారు.
3. ఎవరిద్వారా వింటిరి ?	1. పత్రికల ద్వారా 2. ప్రజలద్వారా 3. రేడియో ద్వారా 4. చదువుకున్నవారి ద్వారా
4. మీ ఊళ్ళో ఎంతమంది ఈ పరిమితిలోకి వస్తారు.	8 మంది
5. భూమి ఎక్కువ ఉన్నవార ఏదోవిధంగా భూమి పోకుండ చేసుకుంటున్నారని తెలిసినది.	90% మంది చెప్పినది ఏమనగా భూస్వాములు తమ భూములు పోకుండా చేసికొంటున్నారని.
6. వారు పరిమితిలోనికి రాకుండా ఏవిధంగా తప్పించుకొనుచున్నారు.	ఈ ప్రశ్నకు సర్వేలో అనేకులు ఒక్కొక్క రకాన్ని వెలిబుచ్చినారు. వారి వారి అభిప్రాయాలను ఈ క్రింది పట్టికలో క్రోడీకరించనైనది.

పట్టిక - 14

వారు పరిమితిలోనికి రాకుండ తప్పించుకొనే మార్గాల వివరాలు :

క్ర. సం.	వారు అవలంబించే మార్గాలు	అభిప్రాయాలు ఇచ్చిన వారి సంఖ్య
1.	కొడుకులు, బిడ్డల తరపున	47
2.	వారి జీతగాండ్ల తరపున	10
3.	వంట మనుషుల తరపున	9
4.	బంధువుల తరపున	20
5.	అమ్ముకొనుట వలన	66
6.	మిగులు భూముల మీద అప్పులు తీసికొనుట వలన	4
7.	గుమాస్తాల తరపున	1
8.	దాసీల తరపున	2

వీరి అభిప్రాయాల ప్రకారము భూమికలవారు ఎక్కువ శాతము భూములను అమ్ముకొనుట వలన ప్రథమము మరియు ద్వితీయ మార్గము కొడుకుల, బిడ్డల తరపున భూములను మార్పించి భూపరిమితి నుండి తప్పించుకొనుచున్నారని ఈ సర్వేలో తెలియవచ్చింది.

7. భూమి పరిమితిలో నుండి తప్పించుకొనేందులకు ఎవరు సహాయ పడుచున్నారనే ప్రశ్నకు ఈ సర్వేలో అనేకులు ఒక్కొక్కరు ఒక్కొక్క తీరుగా తమ అభిప్రాయములను వెలిబుచ్చినారు. వారి అభిప్రాయాలను ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

పట్టిక - 15

భూమి పోకుండా తప్పించుకోవడంలో సహాయపడు వారి వివరాలు

క్ర. సం.	సహాయ పడువారు	అభిప్రాయాలు ఇచ్చిన వారి సంఖ్య	శాతం
1.	పట్వారీ	69	69 %
2.	తహశీలుదారు	16	16 %
3.	కలెక్టరు	8	8 %
4.	న్యాయవాదులు	4	4 %
5.	గిర్దావరు	1	1 %
6.	సర్పంచ్	1	1 %
7.	పోలీసు పటేలు	1	1 %
		100	100 %

దీనిని బట్టి చూడగా పట్వారీలు 69%, తహశీలుదార్లు 16% ఈ భూమిని కోల్పోకుండా భూకామందులకు సహాయకారులుగా ఉన్నట్లుగా వారిది ప్రథమ ద్వితీయ స్థానాలని తెలియుచున్నది.

8. దున్నేవారికి భూమి ఇవ్వడం అవసరమా? అనే ప్రశ్నకు ఈ సర్వేలో అధిక శాతం మంది అవసరమే అని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఎందుకనగా మంచిగా బ్రతకవచ్చుని మరియు భూమి అందరికి లభించునని, మరియు భూమి కలవారిలోని అసమానతలు తొలిగిపోవునని.

9. భూమి కొంత మంది చేతులలో ఉండటానికి కారణ మేమి అని ప్రశ్నించగా ఈ సర్వేలో ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చినారు. వారి అభిప్రాయాలను పట్టిక-16 లో క్రోడీకరించనైనది.

పట్టిక - 16

భూమి కొంత మంది చేతులలోనే ఉండుటకు కారణాలు :

క్ర. సం.	కేంద్రీకరణకు కారణాలు	అభిప్రాయాలు ఇచ్చిన వారి సంఖ్య
1.	అప్పులు పెట్టి	29
2.	నిరక్షరాస్యత వలన (తెలివిలేక)	61
3.	బెదిరించి	19
4.	తహశీలు చెల్లించలేక	10
5.	పట్వారీలు, అధికారులు అగ్రకులాల వారగుటవలన	10
6.	శారీరక, కామ సుఖాలకై కొందరు భూమిని అప్పగించుటవలన (కొందరు ఉంచుకొనుట వలన)	7
7.	ఇద్దరి మధ్యలో తగవులు సృష్టించి	4

వీరి అభిప్రాయాల ప్రకారము తమ తమ భూములను కొందరి చేతులలో కేంద్రీకృత మగుటకు కారణములు వారు నిరక్షరాస్యులగుట మరియు తెలివి లేకపోవుట వలన, వారి దగ్గర అప్పులు తెచ్చుకొనుటవలన, అగ్రకులాల వారి బెదిరింపుల వలన, భూమి శిస్తును చెల్లించే అవకాశము లేదని మొదలగు కారణాలను ఈ సర్వేలో వెల్లడించారు.

10. మీ కెంత భూమి ఇస్తే బాగుంటుందనే ప్రశ్నకు జవాబుగా ఈ సర్వేలో ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చినారు. వారి అభిప్రాయాలను ఈ క్రింది పట్టికలో గమనించవచ్చు.

పట్టిక - 17

ఎంత భూమి ఇస్తే బాగుంటుంది అనే వివరాలు

క్ర. సం.	భూమి ఎకరాలు	అభిప్రాయాలు ఇచ్చినవారి సంఖ్య	శాతం
1.	0-1	—	—
2.	1-2	22	22%
3.	3-5	66	66%
4.	6-8	7	7%
5.	9-10	5	5%
		100	100%

దానినిబట్టి చూడగా 66% మంది 3-5 ఎకరాల భూమిని, 22% మంది 1-2 ఎకరాల భూమిని పంపిణీ చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయాలను ఇస్తే 7% మంది 6-8 ఎకరాల భూమిని, 5% మంది 9-10 ఎకరాల భూమిని ఇస్తే బాగుంటుందని అభిప్రాయాలను వెలిబుచ్చినారు. అయితే ఏ ఒక్కరుకూడా 0-1 ఎకరాల భూమిని తీసికొనుటకు సుముఖత తెలియ చేయలేదు. అధికశాతం 3-5 ఎకరాల కొరకై చెప్పినారు [66%].

11. ఈ సర్వేలో 3-5 ఎకరాల భూమిని కావాలన్న 66% మందిని అంతే భూమి ఎందుకు కావాలని అనుకొంటున్న వారిని పరిశీలించగా వారు ఈ క్రింద నుదహరించిన అభిప్రాయాలను వెలిబుచ్చినారు.

1. ఎక్కువ భూమి అయినచో సక్రమంగా సాగుచేయలేరని
2. ఎక్కువ పెట్టుబడి పెట్టలేమని.
3. అందరికి పంపిణీ అందాలని.

12. మీ గ్రామములో భూమి పంపిణీ చేసినట్లయితే ఎవరైనా వ్యతిరేకిస్తారా అని ప్రశ్నించగా ఈ సర్వేలో అందరు భూమి ఉన్నవారు వ్యతిరేకిస్తారని చెప్పినారు. అటువంటి వారు ఎంతమంది ఉంటారని అడుగగా వారిలో కొందరు 4 గురు అనియు మరి కొందరు 8 మంది అనియు ఇంకొందరు 20 మంది అని చెప్పినారు. 20 మంది ఉన్నారని చెప్పిన వ్యక్తులను తిరిగి ప్రశ్నించగా 20 మందిలో ఎవరిది పోతున్నను వారికి సంబంధించిన బంధువులకు పోతుందని వ్యతిరేకిస్తారు. వ్యతిరేకించే 4 గురు

నుండి 8 మంది భూస్వాముల గురించి ప్రస్తుత సర్వేలో పాల్గొన్న వారిని ప్రశ్నించగా వారు ఈ క్రింద నుదహరించిన కారణాలు వెలిబుచ్చినారు.

1. భూమి పోతుందని.
2. తెల్లబట్టలు వేసుకొని తిరుగలేమని
3. ఇతరులు చెప్పినట్లుగా వినరని
4. వారి పెత్తనము పోతుందని
5. జీతగాండ్లు ఉండరని
6. క్లబ్బులకు తిరుగలేమని

మొదలగు కారణాలను వారు తెలియజేసినారు.

13. మీ గ్రామములో భూమి పంపిణీ ఎంతమంది సమర్థించుతారని ప్రశ్నిస్తే ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 95% మంది సమర్థిస్తారనే చెప్పినారు. అయితే వారందరు కలిసికట్టుగా సమర్థించరు. సమర్థించలేక పోవుటకు సమగ్రపరిశీలన చేస్తే వారిలో ఐకమత్యం, కలిసికట్టు తనం లేకపోవుట అని తెలియ వచ్చింది. ప్రజలు ఐక్యంగా లేకుండుటకు కారణాలను, వారి అభిప్రాయాలను సేకరించి ఈ క్రింద నుదహరించిన పట్టికలో పొందుపర్చ బడినది.

పట్టిక - 18

ప్రజలు ఐక్యంగా ఉండకపోవుటకు కారణాల వివరాలు:

క్ర. సం.	కారణాలు	అభిప్రాయాలు ఇచ్చినవారి సంఖ్య	శాతం
1.	దొర భయానికి	67	67%
2.	చట్టము తెలియక	6	6%
3.	ఆర్థిక స్థోమత లేక పోవుట	4	4%
4.	పోలీసుల భయానికి	4	4%
5.	దొర భయానికి, చట్టములు తెలియక	14	14%
6.	నిరక్షరాస్యత వలన	2	2%
7.	దొరల అప్పుల భయానికి	3	3%
		100	100%

దీనిని బట్టి చూడగా 67% మంది వెలిబుచ్చిన వారి అభిప్రాయాల ప్రకారము ప్రజలు ఐక్యంగా ఉండకపోవుటకు కారణము "దొర భయము" అనియు, 14 మంది అభిప్రాయాల ప్రకారము దీనికి కారణములను "దొర భయానికి, చట్టములు తెలియక" అని తెలియుచున్నది.

14. ప్రభుత్వము భూమి పంపిణీ చేస్తున్నదని మీకు నమ్మకముందా అని ప్రశ్నిస్తే, ఈ సర్వేలో పాల్గొన్న వారు రెండు విధములుగా వెలిబుచ్చినారు. అవి ఒకటి నమ్మకమున్నవారు మరియు నమ్మకము లేనివారు. ఈ విషయాలను పట్టిక 19 లో చూడవచ్చు

పట్టిక - 19

క్ర. సం.	అభిప్రాయాలు	అభిప్రాయాలిచ్చిన వారి సంఖ్య	శాతం
1.	నమ్మకం ఉన్నవారు	70	70%
2.	నమ్మకం లేనివారు	30	30%
		100	100%

వీరిలో ప్రభుత్వం భూపంపిణీ చేస్తుందా అనే నమ్మకం ఉన్నవారు 70% మరియు 30% నమ్మకంలేనివారని తెలియుచున్నది.

ఆ పంపిణీ గురించి నమ్మకం లేనివారు వెలిబుచ్చిన కారణాలను పట్టిక 20లో చూడవచ్చు.

పట్టిక - 20

క్ర. సం.	కారణాలు	అభిప్రాయాలిచ్చిన వారి సంఖ్య	శాతం
1.	భూసంపద ఉన్నవారే అధికారులలో (కాంగ్రెస్) భాగమై యుండుటవలన వారు పంపిణీకి తోడ్పడరని అభిప్రాయాన్ని చెప్పినవారు.	6	6%
2.	ఇంతవరకు గ్రామములో పంపిణీ జరగలేదని చెప్పినవారు.	86	86%
3.	భూమి కల్గినవారే ఉద్యోగ బృందంలో ఉన్నారు కాబట్టి వారు పంపిణీ సమర్థించరు అనే అభిప్రాయాన్ని ఇచ్చినవారు	8	8%
		100	100%

దీనిని బట్టి చూడగా 86% మందికి ఇంతవరకు తమ గ్రామములో భూపంపిణీ జరగలేదనే కారణమువలన భూసంస్కరణలు అమలుపై నమ్మకం లేనివారు అని తెలియుచున్నది. ఈ నమ్మకం లేని 30 మందిలో 86% మంది ఈ ఒక్క కారణమును చూపించిన వారే. వీరిలో మిగిలిన 14% మంది వేరే కారణాలను తెలిపినారు.

15. భూమి పంపిణీ ఏ విధముగా అమలు చేస్తే బాగుంటుందని ప్రశ్నించగా ఈ సర్వేలో ప్రజలు మూడు పద్ధతులను సూచించినారు. వారి అభిప్రాయాల ప్రకారము వారి పద్ధతులను పట్టిక - 21 లో పొందుపర్చబడినవి.

పట్టిక - 21

క్రి. సం.	వారు సూచించిన పద్ధతులు	అభిప్రాయాలు ఇచ్చినవారి సంఖ్య	శాతం
1.	సంఘముల ద్వారా	61	61 %
2.	ప్రభుత్వ మనుషులద్వారా	36	36 %
3.	కలెక్టర్ల ద్వారా	3	3 %
		100	100 %

దీనినిబట్టి తెలియునది ఏమనగా 61% మంది భూపంపిణీని సంఘములద్వారా, 36% మంది ప్రభుత్వ మనుషులద్వారా అనియు మరియు 3% మంది కలెక్టర్ల ద్వారా అనియు తమ అభిప్రాయాలను వెలిబుచ్చినారు. అయితే ఎక్కువశాతము ప్రజలు సమర్థించిన పద్ధతి సంఘాలు. వారు మౌలికంగా వెలిబుచ్చిన అభిప్రాయము ఏమనగా సంఘాలలో షెడ్యూల్డు కులాలకు చెందిన అభ్యర్థులకు సరి అయిన ప్రాతినిధ్యము ఉండాలని.

ముగింపు

ఈ చివరి అధ్యాయములో గ్రామీణ రైతుల యొక్క విద్య, నివాసము, ఆర్థిక వసతుల గురించి మరియు వారికున్న భూవసతి గురించి, భూములులేని వారి బాధలగురించి, వారియొక్క చెడ్డ రోజులు దొర్లిపోవుటకు, భూమి కలిగిన వారి మధ్యలోనున్న అహంభావాలను తగ్గించుటకై భూసంస్కరణల అమలు చేయుట ఎంతైనా అవసరమైన విషయాలను గురించి, రైతులందరిలో సమ సమానత్వం భూపంపిణీ గురించి, వీని అమలుకై ప్రభుత్వము తీసికొనవలసిన చర్యలలో కొన్నింటిని పొందుపర్చబడనవి. భూసంస్కరణల వంటి సాంఘిక మరియు ఆర్థిక విషయాలతో ముడివేయబడిన సంస్కరణలను తూ. చ. తప్పకుండ ఫలవంతంగా అమలు జరుపుటకు ప్రభుత్వము మరియు ప్రజల సహకారము ఎంతో అవసరమై యున్నది.

ఈ గ్రామీణ ప్రజలలో అధికశాతము వెనుకబడి మరియు బీదతనముతో కృంగదీయబడిన వారని తెలియుచున్నది. ప్రస్తుత పరిశోధనలో క్రోడీకరించిన విషయపరిశీలన చేసిన గ్రామీణ ప్రజలు పొందుచున్న విద్యా అవకాశములు చాల తక్కువగా యున్నవి. వారిలో అనేకులు నిరక్షరాస్యులు అయినప్పటికిని వారికి ఉన్న పిల్లలకు కూడా విద్యాభ్యాసము గడుపుటకు ఉత్సాహముతో ఉన్న అవి చాలినంత అనుకూలముగా లేనందున వారికి కూడా విద్యాభ్యాసము చేయు భాగ్యము దూరమైపోతున్నదని గ్రామీణ ప్రజలు వాపోవుచున్నారు. ఈ గ్రామీణ ప్రజలు మాధ్యమిక స్థాయి పాఠశాల వసతికై సుమారు 5-10 కి॥మీ॥దూరము పోవలసి యున్నది. ఈ గ్రామములో నున్న ధనిక వర్గపు పిల్లలందరు పట్టణములలో విద్యాభ్యాసము చేయుట పరిపాటి. గ్రామీణ వయోజనులకు విద్యాభ్యాసము చేయించుటకై రాత్రి పాఠశాలలు కూడా ఈ గ్రామములో లేవు. ఈ గ్రామీణ పేద ప్రజల బిడ్డలకు ఈ గ్రామములోనున్న విద్యావకాశాలు చాల తక్కువే అని చెప్పుట నిస్సందేహము. కావున ఈ విద్యావిషయాలలో ప్రభుత్వము తగిన చొరవ తీసికొని గ్రామీణ ప్రజలకు వయోజన విద్య

మరియు వారి పిల్లలకు సరైన విద్యా అవకాశాలను కల్పించే ఏర్పాట్లు చేయాలి. మరియు వారి పిల్లలకు నిర్బంధ ఉచిత విద్యను, భోజన వసతి సౌకర్యములను కల్పించి తగిన ప్రోత్సాహము ఇప్పించాలి. ప్రస్తుతము ప్రభుత్వము కల్పించుచున్న రిజర్వేషన్లు మరియు హాస్టలు వసతులను ఈ గ్రామీణ ప్రజలకు తెలియజేయు ఏర్పాట్లు చేయుచు వారు వాటిని వినియోగించే విధంగా ఏర్పాట్లు చేసిన వారి విద్యా విషయాలు మెరుగు పడవచ్చు. ఎందుకనగా ప్రభుత్వము చేయుచున్న సాంఘిక సంక్షేమ కార్యక్రమములు చాల మందికి తెలియక పోవుట వలన వానిని వారు సక్రమముగా వినియోగించుకొన లేకపోవుచున్నారని తెలియుచున్నది.

భూసంస్కరణల అమలు విఫలము కావటానికి కొన్ని ముఖ్య కారణాలు

1. ప్రభుత్వం గరిష్ట పరిమితులు నిర్ణయించిన కాలానికి, వాటిని ఆచరణలో పెట్టిన కాలానికి మధ్య ఎక్కువ తేడా ఉండటం వల్ల చాల మంది భూస్వాములు ఈ క్రింద నుదహరించిన మార్గాలను అవలంబించి తాము చట్టాల పరిధిలోనికి రాకుండా చూసుకొనుచున్నారని ప్రస్తుత సర్వేలో వెల్లడి అయింది.

1. కొడుకుల, బిడ్డల తరపున భూమి మార్పిడి.
2. జీతగాండ్ల తరుపున భూమి మార్పిడి.
3. వంట మనుషుల తరుపున భూమి మార్పిడి.
4. బంధువుల తరుపున భూమి మార్పిడి.
5. అమ్ముకొనుటవలన.
6. మిగులు భూములపై అప్పులు తీసికొనుట వలన.
7. గుమాస్తాల తరుపున భూమి మార్పిడి.
8. దాసీల తరపున భూమి మార్పిడి.

ఈ విధముగా కాలయాపన వలన వివిధ మార్గాలను అవలంబించి తాము మిగులు భూమిని భూమి మిగులకుండా చేయుచున్నారు.

2. ప్రభుత్వ విధానం మొదటినుంచి భూమి యాజమాన్యానికి సహకరిస్తు సొంత వ్యవసాయదారుని గురించి శ్రద్ధ చేయడం లేదు. భూమి కౌలుదార్ల క్రిందనున్న భూస్వాములు వారి నుంచి తిరిగి భూమిని స్వంత సేద్యము గురించి తీసికొనగల్గినారు. అంతే గాక భూములకు గల మినహాయింపులను తమ భూములకు వర్తించేవిగా శాసనాలను సవరించడం జరుగుచున్నది. పెద్ద భూస్వాములకు ఒత్తిడికి ప్రభుత్వాలు చట్టాలకు కొన్ని మినహాయింపులు తేవలసి యుంటుంది.

3. సరైన రికార్డులు లేకపోవుట వలన ఈ భూ సంస్కరణల అమలులో జాప్యము జరుగుచున్నది.

4. రాజకీయ వేత్తలు కూడా భూసంస్కరణ అమలుకు సహకారాన్ని అందించక పోవుటము.

5. ప్రభుత్వోద్యోగులు కూడా భూసంస్కరణల అమలుకు పూర్తి సహకారము చేయడంలేదు.

6. చట్టాలు, కోర్టు తీర్పులు, పరిపాలనా సంప్రదాయాలు, ఆచారాలు ఎంత కాలమైతే ప్రైవేటు ఆస్తుల రక్షణ కోసం మొగ్గు చూపుతాయో, భూసంస్కరణలు ప్రత్యేకంగా గ్రామ ప్రాంతాలకు వర్తింపజేసేవి, అమలు చేయటం అంత కష్టసాధ్యమైన పని అని విశదమవుచున్నది.

భూసంస్కరణల అమలు కోసం ఈ సలహాలను ఆచరించటం అవసరమని ఈ సర్వేలో తోచుచున్నది.

1. జిల్లాలో మరియు గ్రామీణ ప్రాంతాలలో కమిటీలు (సంఘాలను) ఏర్పరచి ఆ సంఘాలలో భూస్వాములు కాకుండా భూమిలేని ఉత్సాహవంతులను మరియు షె. కు. లకు తగిన ప్రాతినిధ్యము ఏర్పరచుటకు సభ్యులుగా నియమించవలెను.

2. భూసంస్కరణ చట్టానికి మరియు వాని అమలుకు మధ్యనున్న కాలయాపనను అరికట్టి ఆ జాప్యము జరగకుండా తీవ్ర చర్యలు తీసికొన్న భూసంస్కరణల అమలులో మెరుగు ఏర్పడవచ్చు.

3. భూమికి సంబంధించిన రికార్డులు ఎప్పటి కప్పుడు సక్రమముగా తయారు చేయవలెను.

4. భూసంస్కరణల అమలుకై రాజకీయ నాయకులుగాని లేదా ఆయా ప్రభుత్వ ఉద్యోగులుకాని సుముఖత చూపనిచో

వారిని సత్వరమే పదవీ భ్రష్టు ను చేయవలెను. అదే విధముగా చేసినచో భూసంస్కరణలు ఫలవంతంగా అమలు చేయవచ్చు.

6. కోర్టులు, చట్టాలు అవలంబించే ప్రైవేటు ఆస్తుల రక్షణ మార్గాలలో కొన్నింటిని భూమికి సంబంధించిన వాటిలో ప్రమేయాలను సడలించినచో కొంత మేరకు సులభముగా ఈ భూ సంస్కరణల అమలు సక్రమంగా కొనసాగుతుందని చెప్పవచ్చు.

భూసంస్కరణలు అమలు పరిచినప్పటికి పూర్తి ఆర్థిక సమానత్వము సాధించలేము. వీనికి తోడు గ్రామీణ ప్రాంతాలలో నున్న వారికి వ్యవసాయ మార్కెట్ల సౌకర్యము, పరపతి సౌకర్యాలను కల్పించి వ్యవసాయ సాంకేతిక నైపుణ్యాన్ని సమకూర్చవలసిన అవసరము ఎంతైనా కలదని చెప్పవచ్చు.

వ్యవసాయ వ్యవస్థ పునర్నిర్మాణంలో భూసంస్కరణల అమలు వల్ల ఎన్నో ప్రయోజనాలు సమకూర్చ బడుతాయి. నవ సమాజం సృష్టించ వలయునన్న, శ్రేయోరాజ్య స్థాపన చేయాలన్న, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుస్థిర ప్రాతిపదికపైన పునర్నిర్మాణము చేయవలయునన్న లెనిన్, మార్క్స్, గాంధీ మొదలగు సామ్యవాద సిద్ధాంతుల కలలు ఫలించాలన్న భూకమతాల గరిష్ట పరిమితి [సి. ఓ. హెచ్.] ఎంతైనా అవసరము. ఈ విషయములో ప్రభుత్వము ఎంతో శ్రద్ధాశక్తులతో కృషిచేయవలసిన అవసరము ఎంతైనా కలదు. దానికి ప్రజలు ఎంతయో సహకరించినపుడే భూసంస్కరణ చట్టాల వలన ప్రయోజనము చేకూరుతుందని చెప్పవచ్చు.

కృతజ్ఞతలు

ఈ పరిశోధన వ్యాసమును వ్రాయుటకు అనుమతించిన మరియు తగినంత సమయాన్ని కల్పించిన ఆచార్య పి. ఏ. జేమ్స్ గారికి కృతజ్ఞతలు.

ఈ వ్యాసమును వ్రాయుటలో తమ అమూల్యమైన సలహాలను అందించి, ఉత్సాహాన్ని కల్పించిన డా॥మురళి మనోహర్‌గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ వ్యాసము వ్రాయుటలో తగిన సహాయ సహకారాలను అందించిన లెక్చరర్స్ బృందము వారికి నా యొక్క హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ వ్యాసము వ్రాయుటలో సహకరించిన మ్యాడంపల్లి గ్రామప్రజలకు నా యొక్క కృతజ్ఞతలు.

ఈ వ్యాస రచనలో తోడ్పడిన మిత్రులందరికి నా యొక్క కృతజ్ఞతలు.

— ముదిగంటి సత్యనారాయణ రెడ్డి



కలగూరగంప

ఆల్బర్స్ పేరడాక్స్

యావజ్జీవ జాలానికి ఆధారభూతమైన సూర్య గోళానికి సంబంధించిన కొన్ని వివరాలనైనా తెలిసిన వారికి ఒక సందేహం కలుగుతుంది. దానిని ఈ విధంగా అనుకోవచ్చు:

"ఇది యేమి విపరీత
మెట్టి విపరీత మిది?

కోటి తారల వెలుగు కొల్లగొట్టుచున్న
ఏటికో నిశ చిమ్మ చీకటులు వేధించి?
ఒక్కొక్క నక్షత్ర మొక్కొక్క సూర్యుడై
చిమ్ము శక్తిని అకసమ్మేమి చేసింది?
చీకటికి మితిలేని అకలో? కాంతితో
వింపుగా తన పొట్ట నింపుకొంటున్నది!
తన కాంతి సాహసించెడు కాంతిని వెలార్చు
ఘన తారలను పగల్ భామడెటు కప్పునో?
ఒక్క తారక పట్ట పగలు కావించుటా?
ముక్కోటి తపసమున బిక్కుమని మునుగుటా?
ఇదియేమి విపరీత మెట్టి విపరీత మిది!"

సూర్యుడొక సామాన్య నక్షత్రమని తెలుసు. కోట్లాది నక్షత్రాలు ఆకాశంలో నున్నాయి. సూర్యు కంటె దీప్తిమంతమైనవి చాలా ఉన్నాయి. కాని సూర్యాస్తమయం కాగానే చీకటి పడుతుంది, చీకటిలో వెలుగు చుక్కల్లాగ రక రకాల నక్షత్రాలు కనిపిస్తాయే కాని, చీకటిని పోగొట్టలేవు.

పగటి పూట కూడా నక్షత్రాలు ఆకాశంలో ఉంటాయి. సూర్యుని మించగల నక్షత్రాలూ ఉన్నాయి. అయినప్పటికీ పగటి పూట సూర్యుని కాంతిలో అవి మునిగి పోవడమే కాని వాటి కాంతిని ప్రదర్శించలేవు.

వీటికి కారణం ఏమై ఉంటుందన్న ప్రశ్న హైన్‌రిక్ ఆల్బర్స్ అనే విజ్ఞానికి 1826 లో కలిగింది. అప్పటికి అమలులో నున్న ఖగోళ శాస్త్ర జ్ఞానం ఆధారంగా సమాధానం చెప్పడానికి ప్రయత్నించాడు.

ఆ సందర్భంలో కొన్ని ఊహనలు చేసేడు. అవి: 1. ఆకాశం అనంతం; 2. అది యూక్లిడ్ క్షేత్ర గణితాన్ని అనుసరిస్తుంది; 3. విశ్వం అనాది; 4. కాంతి విరజిమ్మే నక్షత్రాల వంటి గోళాలు ఆకాశంలో సర్వ సమానంగా పంపకమై ఉన్నాయి; 5. ప్రతి నక్షత్రం ఒకే దీప్తితో శక్తిని వెలువరిస్తుంది; 6. నక్షత్రాలనుండి భూమికి వచ్చే కాంతిని అడ్డడానికి కాని, హరించడానికి కాని, వాటికీ భూమికీ మధ్య పదార్థం ఏమీలేదు.

ఈ పరికల్పనలతో నక్షత్రాలనుండి భూమికి చేరే కాంతి పరిమాణం గణించేడు. ఆకాశాన్ని ఆవరించే కాంతి పరిమాణం అనంతం అన్న ఆశ్చర్యకరమైన ఫలితం వచ్చింది. రాత్రి చీకటి ఏమిటి? మరోలాగ అనుకోవచ్చు. ప్రతికాంతి జనకము సూర్యునిలాంటి నక్షత్రమై, వెనుకనున్న కాంతి జనకాలను వాటి ముందున్నవి కప్పి వాటి కాంతిని నిరోధించేయి అనుకొంటే, ఆకాశం యొక్క దీప్తి సూర్యుని ఉపరితలం యొక్క దీప్తితో సమానంగా ఉండాలి. కాని, రాత్రిళ్ల చీకటి ఎందుకు వ్యాపించాలో తెలియలేదు. అందుకే ఈ సమస్య "ఆల్బర్స్ పేరడాక్స్" అనే విరోధాభాసంగా మిగిలిపోయింది.

పోనీ, నక్షత్రాలకు నక్షత్రాలకు మధ్య పదార్థం ఉంది అనుకొంటే అది కొంత కాంతిని అడ్డుతుంది. కాగా ఆకాశం దీప్తి తగ్గుతుంది. దీనికో ప్రతి బంధకం ఏర్పడింది. పదార్థాల కాంతిని హరించిన పక్షంలో అది క్రమంగా వేడెక్కి కాంతిని వెలువరించే స్థితిని చేరుకొంటుంది. అంటే హరించిన శక్తిని మరోవిధంగా వెలువరిస్తుంది. కాగా నక్షత్రాంతరాళంలో నున్న పదార్థంవల్ల ఆకాశం యొక్క దీప్తి తగ్గదు.

లేదా, విశ్వం సాంతము, దాని వయసు పరిమితము అనుకొంటే ఏమౌతుందో చూద్దాము. విశ్వం సాంతం అనడానికి అధారాలు లేవు. యంత్రాల చూపేశక్తి ఎక్కువ అవుతూన్న కొద్దీ దూరదూరాన నక్షత్రాలు గేలక్సీలు కనిపిస్తూనే ఉన్నాయి. కాబట్టి విశ్వం సాంతం కాదు అనడమే సహజం. విశ్వం వయస్సు పరిమితం అనుకొంటే పరిష్కార మార్గం కనిపించేటట్లుంది. విశ్వం పుట్టి X సెకనులు గడిచిఉంటే ఈ కాలంలో ప్రయాణం చేసే కాంతి మాత్రమే భూమిని చేరుకొంటుంది. కాంతి వేగం C. కాబట్టి CX దూరంలో నున్న నక్షత్రాల నుండి వెలువడే కాంతి

మాత్రమే భూమిని చేరుకోగలదు. కాని ఈ భావం అంత సహజంగా కాక కృతకంగా కనిపించినా, సమస్యను పరిష్కరించడంలో అదే కొంత సహాయ పడుతూన్నది.

సుమారు 60 ఏండ్ల క్రిందట ప్రారంభమై బలం పుంజుకొంటూన్న "విశ్వం వ్యాకోచిస్తూంది" అన్న సత్యం, చాలా వరకు చిక్కు విడతీసింది.

గేలక్సీల కాంతియొక్క వర్ణపటం తీసి, దానిలోని రేఖల స్థానాలను ఇతరవర్ణ పటాలతో పోల్చినప్పుడు, ఆ రేఖలు ఎక్కువ అలపొడవువైపు జరుగుతున్నాయని – అదే "రెడ్‌షిఫ్ట్" – కనుగొన్నారు. ఈ పరిశీలన గేలక్సీలు చెదిరి పోతున్నాయనీ, విశ్వం వ్యాకోచిస్తూందనీ సూచిస్తుంది. గేలక్సీలన్నీ ఒకదానినుండి ఒకటి దూరంగా పారిపోతున్నాయి. మన చుట్టూఉన్న గేలక్సీలు అన్నివైపులా చెదిరిపోతున్నాయి. అట్లు పారిపోయే వేగం దూరంతో బాటు ఎక్కువ అవుతుంది. అంటే దూరంగా ఉన్నవి దగ్గరగా ఉన్న వాటికంటే ఎక్కువ వేగంతో చెదిరిపోతున్నాయి. ఒక గేలక్సీ విషయం యోచిస్తే దాని దూరం ఎక్కువ అవుతూంది కాబట్టి విలోమ వర్గ నియమం ప్రకారం దానినుండి భూమికి చేరే కాంతి తీవ్రత ఎలాగా తగ్గాలి. అదికాక మరో రెండు విధాలుగా తీవ్రత తగ్గుతూంది.

ఒక గేలక్సీ వర్ణపటరేఖలు ఎక్కువ అల పొడవువైపు జరగడమంటే దానినుండి వచ్చేకాంతి యొక్క పౌనఃపున్యం తగ్గడం. v పౌనఃపున్యం గల కాంతి ఫోటాను శక్తి E అయితే వాటి సంబంధము E–hv. ఇందులో h ప్లాంక్ స్థిరాంకం. దీని ప్రకారం v తగ్గినప్పుడు E విలువ తగ్గుతుంది. కాంతి జనకం నుండి భూమిని చేరే ప్రతి ఫోటాను యొక్క శక్తి తగ్గుతుంది. అంటే, ఫోటాన్లు కొంత శక్తి కోల్పోతాయి.

ఇక రెండవది. ఇది కాల భావానికి సంబంధించినది. అన్ని లోకాలలోని గడియారాలు ఒకే విధంగా పని చేయవు. కాలాకాశ వక్రత్వం బట్టి మార్పు కలుగుతుంది. మాటకు ఒక గేలక్సీలో గడియారం ప్రకారం ఒక సెకనులో బయలుదేరి వచ్చిన కాంతి భూమిని చేరుకొన్నప్పుడు దానిని భూమి గ్రహించడానికి భూగడియారం ప్రకారం ఒక సెకనుకంటె ఎక్కువ సమయం తీసుకొంటుంది. దాని మూలంగా కూడా కాంతి తీవ్రత తగ్గుతుంది.

విశ్వం పుట్టి 1000 కోట్ల ఏండ్లో, 1500 కోట్ల ఏండ్లో అయిందని అంచనా. పెద్ద ప్రేలుడుతో విశ్వం పుట్టగా అందులోని పదార్థం తునాతునకలై ప్రేలుడు బలానికి అన్ని దిక్కులా చెదిరి పోతూంది. ఆ ముక్కలు గేలక్సీలు. వాటికాంతి తీవ్రత దూరంలో తగ్గడమే కాకుండా గేలక్సీలు చెదిరి పోవడంచేతకూడా తగ్గుతూంది. కాగా దూరంగా ఉన్న కాంతి జనకాలవల్ల భూమినిచేరే కాంతికాని, కాంతి లేకపోవడంకాని అంతగా లెక్కించ తగినవి కాదు. ఆకాశంలోని వెలుగు చీకటుల విషయంలో గేలక్సీల కాంతికి స్థానం లేనప్పుడు సూర్యగోళం ఒక్కటే రాత్రింపగళ్ళను నిర్ణయిస్తుంది. సూర్యుని వెలుగులో గేలక్సీలుకూడా మునిగిపోయి పగటిపూట ఆకాశంలో ఉండీ కూడా కనిపించవు. సూర్యుడు కనిపించని రాత్రివేళ చీకటి అలముకొంటుంది. ఈ విధంగా ఆల్బర్స్ పేరడాక్స్ కు సమాధానం లభించింది.

శ్రీ వసంతరావు వేంకటరావు

బ్రతకవలసిన క్షణాలు!

"బ్రతికిన క్షణాలు" పేరిట శ్రీ వేగుంట మోహన ప్రసాద్‌గారి రచనల్ని చదివాక నాలో కన్పించిన మనుభావాల్ని అక్షర రూపంలో పెట్టేందుకు ప్రయత్నిస్తానో అదీ ఒక లక్ష్యంతోనే! ఎంతటి మేధావినైనా కదిలించ గలిగే శక్తి, ఆ "క్షణాల"కున్నాయి. వాటికి స్పందింప జేసే రసస్ఫూర్తి కూడ ఉంది. అయితే అర్థంకాని అస్పష్టత, అయోమయత్వం, పూర్తిగా భౌతిక దృక్పథం నిండు కొన్న జడవాదం, ఏదో విషాదంతో అలముటించే శూన్యవాదం అందులో కనిపిస్తాయి. పోనీ నాకు కనిపించాయి. భౌమిక పరిధిలో, దైహిక చింతనతో ఆ క్షణాలు పరితపిస్తాయి. వెర్రి ఆనందంతో తడిసి ముద్దవుతాయి! భ్రమలో కొట్టుమిట్టాడుతూ ఉంటాయి.

ప్రతిభ రాణించడం లేదని నే ననను కాని సామాన్యునివరకు వెళ్ళలేకపోతోందని అంటాను. ఎవడి అవగాహనా స్థాయి వాడిది అని అనుకుంటే అది వేరే విషయం. మహాప్రస్థానాన్ని రాసి, మరో ప్రస్థానాన్ని చూపి – అది రాసింది, ఇది చూపింది రిక్షావాడికోసమని, కూలివాడికోసమని – చెప్పుకోవడం, మహాకవి అయిపోవడం – ఇక్కడ గుర్తు చేస్తున్నాను. చెమటఅంటే అగ్గమయ్యే వానికి ఘర్మజలం అని చెప్పి సంప్రదాయ కవిత్వాన్ని తిట్టిపోయడం అర్థరహితం! అన్యాయంకూడా!!

నవ్యత అంతా ఆదరించదగ్గదికాదు. దేనికైతే స్పష్టత, విశిష్టత ఉండి, మనిషిని లోకశ్రేయోక్రియాపరునిగా తీర్చిదిద్దగల శక్తి ఉంటుందో దానిని - అది క్రొత్తదైనాసరే - ఎటువంటిదైనాసరే - ఆదరించవలసిందే. అది పద్యంకావచ్చును, గద్యంకావచ్చును, కావ్యంకావచ్చును, కవిత కావచ్చును, పాట కావచ్చును, మాట కూడా కావచ్చును! భావప్రాధాన్యానికే పట్టాభిషేకం కాని, శిల్ప సౌందర్యానికి కాదు. అయితే అందమైన భాషలో యిమడ్చబడ్డ అద్భుతమైన భావానికి లోకోత్తరమైన శక్తి ఉంటుంది రసవంతమైన పరిపుష్టి ఉంటుంది. అది పద్య కవిత కావచ్చును, గేయకవిత కావచ్చును, మినీకవిత కావచ్చును, అకవితకూడా కావచ్చును - ఇంకేమైననూ కావచ్చును. రూపంతో నిమిత్తంలేదు. భావాన్ని విశిష్టంగా ప్రకటింపగలిగే శబ్ద సౌందర్యమే అతిముఖ్యం. అలాగని శబ్దమే కవిత్వమని అనుకొంటే కనిపించే ప్రతి "అడ్వర్ టైజ్‌మెంటూ" ఒక కవిత్వమౌతుంది. శిల్పం, భావం - రెండూ సమపాళ్ళలో ఉండి, స్పష్టంగా అర్థమయ్యేలా ఉండి, ఏదైతే లోకానికి హితమయ్యే కార్యాన్ని నిర్వర్తించే వానిలా మానవుని కార్యోన్ముఖుని చేస్తుందో అదే ఉత్తమమైన సాహిత్యం! ఇది అందరికీ తెలిసిందే. మరి "బ్రతికిన క్షణాలు" పేరిట చేస్తున్న ఈ రచనల సంగతేమిటి? ఇలాంటివింకెన్నో ఉన్నాయి. వాటికి అసలు ఏ పరమార్థమంటూ ఉన్నదా? ఏమి సాధించడానికని రచయిత ఆరాటపడుతున్నాడు? అందులో ఏంకనిపించిందని "భారతి" దాన్ని పాఠకులపై రుద్దుతోంది?-అన్నది నా మట్టుకు నాకు అర్థం కాలేదు. ఎవరైనా హితైషులు సెలవిస్తే ఆలకిస్తాను.

ఒకటి మాత్రం మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను. నవ్యత పేరుతో అస్పష్టతను సృష్టించి సాహిత్యాన్ని భ్రష్టుపట్టిస్తే, కాలగర్భంలో కలిసి నశించి పోయేది, ఆ క్షుద్ర సాహిత్యమే! విప్లవమంటూ కొనసాగిస్తున్న రచనలు కానివ్వండి, భావబంధురశైలిలో తళుక్కు మంటున్న మినీ కవితా జ్యోతులు కానివ్వండి కాలప్రవాహంలో కొట్టుకుపోయేవే! ఎప్పటికైనా నిలిచేది, మనిషిని లోక శ్రేయోపరునిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించిన ఉత్తమ సాహిత్య గ్రంథాలు మాత్రమే! తోకచుక్కల మెరుపు లెక్కువైనా వాటి ప్రయోజనం శూన్యం! అయినా ఇవి తారసపడుతూనే ఉంటాయి ఎన్ని నక్షత్రాలు రాలినా సూర్యచంద్రులు ఎక్కడికిపోరు. ఇదే నిజమైతే ఒక శతాబ్దం గడవనివ్వండి (నిజానికి దశాబ్దం చాలు!) మహాప్రస్థానం అన్న మాట వినిపించదు. మినీ కవితల ఛాయలుండవు. అయినా భగవద్గీత అద్భుతంగా, ఆశ్చర్యం గొలిపే విధంగా కొనసాగుతూనే ఉంటుంది. ఇది తిరుగులేని మాట! అయితే దానిలో లేనిదేమిటి? మరి దీనిలో ఉన్నదేమిటి? - అన్నది ఎవరికివారే చర్చించుకొని తర్కించుకోవలసిన అంశాలు.

బ్రతికిన క్షణాలను ఎలాగూ వదలిపెట్టేద్దాం. గతం కనుక. ఇకమీదటైనా బతకవలసిన క్షణాలను జాగ్రత్తగా గడుపుకొందాము. నా అభిప్రాయంతో ఏకీభవించని వారెందరో ఉండవచ్చును. ఎవరెవరో ఏదేదో చెప్తుంటారు లెమ్మని త్రోసిపారేసేవారూ ఉండవచ్చును. అయినప్పటికీ నా మాటలను శ్రద్ధగా ఆలకించవలసిందిగా మరీ మరీ మనవి చేస్తున్నాను. నా దృష్టి చిన్నది. పైగా దోషం కూడా ఉండవచ్చును. అయినా అది నడుస్తున్న గమ్యం మాత్రం నూటికి నూరుపాళ్ళూ సరిఅయినదేనని నా నమ్మకం. నేను ఎంతో ఆర్తితో రాసినాను. పాఠకమహాశయులు నన్నర్థం చేసుకోగలరని విశ్వసిస్తున్నాను. "భారతి" సమాదరిస్తుందని ప్రగాఢమైన నమ్మకం!

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

శాంద్రకొట్టసు మౌర్య చంద్రగుప్తా?

పాశ్చాత్య చరిత్రకారులు కల్పించిన భారతదేశ చరిత్ర, శాండ్రకొట్టసు మౌర్య చంద్రగుప్తుడన్న ఒంటి కంబముపై నిలబెట్టిన మేడ. ఆ పాతిన ఒంటి కంబము, పాశ్చాత్య చరిత్రకారుల అంధ విశ్వాసము, కుటిల రాజనీతి అను ముడిపదార్థములతో నిర్మించినది. అట్లు కానిచో పురాణములలోని రాజ వంశావళులు, ఆయా రాజుల పరిపాలన కాలములు శాసనాద్యాధారములతో సరిపోవుచున్నవని అంగీకరించుచునే, ఆయా రాజుల ప్రాచీనత నంగీకరించకపోవుటకు వేరే కారణము లేదు.

"ది పురాణాస్ అర్, యూజువల్లీ ఫెయిర్లీ ఇన్ అగ్రిమెంట్ విత్ ది యెవిడెన్స్ ఆఫ్ ఇన్‌స్క్రిప్షన్స్ యాండ్ కోయిన్స్

సో ఫార్ యాజ్ ది నేమ్స్ ఆఫ్ ది కింగ్స్ యండ్ ది లెంగ్త్ ఆఫ్ దైర్ రెయిన్స్ అర్ కన్‌సెర్‌న్డ్." (యేన్‌షెంట్ ఇండియా బై రాప్సన్.)

రాజుల పేళ్ళు, వారి పరిపాలన కాలములు శాసనాదులతో సరిపోయినట్లు చెప్పుచు, వాని ప్రాచీనత మాత్రము సరికాదని తిరస్కరించుటకు హేతువులు రెండు— (i) సృష్టి పుట్టి సుమారుగ ఆరువేల సంవత్సరములు మాత్రమే అయినదని అర్చి బిషప్ మైనర్ సొంత ఊహ. పాశ్చాత్య చరిత్రకారులు దీనినే పరమ ప్రమాణముగా నమ్మినారు. (ఇది వారిపట్ల వింత కాదు. అమెరికా విద్యాలయములలో ఇప్పుడు గూడ ఆరు రోజులలో సృష్టి యావత్తు ముగిసినదన్న "క్రియేషన్" పాఠమును బోధించుచున్నారు. సైన్సు దారి సైన్సుదే మత మౌఢ్యము దారి మత మౌఢ్యముదే.)

(ii) వలస ప్రజల ఆధిక్యమును వీలయినంత తగ్గించి చూపుట పాలకులకు అవసరమున్న కుటిల రాజనీతి తంత్రము రెండవ కారణము. ఆర్యులు విదేశీయులనుట మొదలయినవి యీ కుటిల రాజనీతిలోని భాగములే.

పై రెండు కారణములచే, భారత దేశ చరిత్ర ప్రాచీనతను తగ్గించుటకు పూనుకొన్న పాశ్చాత్య చరిత్రకారులకు, దొరకిన పాచిక, శాండ్రకొట్టను.

అలగ్జాండరు దండయాత్రా కాలము, క్రీ.పూ. 327. చరిత్ర కారులకు లభించిన సరియైన కాలమిది ఒక్కటే. ఇంతకు మించి ఇంకేమియు దొరకలేదు. అలగ్జాండరు దండయాత్రాకాలమున మగధలో జాండ్రేమ్స్, శాండ్రకొట్టను, శాండ్రసిప్టను అను వారుండిరని గ్రీకుల వ్రాతల వల్ల తెలియుచున్నది. వీరిలో శాండ్రకొట్టను, మౌర్య చంద్రగుప్తుడని పాశ్చాత్య చరిత్రకారుల నిర్ణయము. చంద్ర=శాండ్ర- కావచ్చును గాని, శాండ్రకొట్టను మౌర్య చంద్రగుప్తుడయినచో జాండ్రేమ్స్, శాండ్ర సిప్టను-అన్న వారెవరు? మౌర్య చంద్రగుప్తుని తండ్రి మహాపద్మనందుడు. కుమారుడు బిందుసారుడు. మహాపద్మనంద శబ్దము జాండ్రేమ్స్ గాను, బిందుసార శబ్దము శాండ్రసిప్టసు గాను మారుట అసంభవము. ఈ పేళ్ళకు బొత్తిగా పోలిక లేదనుట నిర్వివాదము. కనుక శాండ్రకొట్టను మౌర్యచంద్రగుప్తుడు కాడు. కానిచో మరెవడయి యుండును? ఎవడయి యుండునో తెలియదని చెప్పుట ఋజు పద్ధతి. ఎవరితోనో ఒకరితో ముడిపెట్టుట చరిత్ర కారుల పద్ధతి.

ఇంతకు, శాండ్రకొట్టను గుప్త చంద్రగుప్తుడని 'ట్రాయర్' అను పాశ్చాత్య చరిత్రకారుడును, కుప్పయ్య అను పేరు గల భారతీయ చరిత్రకారుడును, సహేతుకముగా నిర్ణయించినారు. 'ట్రాయర్' మహనీయుడు తన నిర్ణయమును మాక్స్ ముల్లరు దృష్టికి కూడ తెచ్చినాడు. కాని అయన మౌనము వహించినాడు. విలియం జోన్స్ ప్రభృతులు కూడ తమ తప్పుడు చరిత్రను దిద్దుకొనక దాటవేసినారు. ఆంగ్లేయ ప్రభుత్వమునకు కావలసినది జోన్స్ ప్రభృతుల తప్పుడు చరిత్రయే గాన, వారు దానినే భారతీయ విద్యాలయములలో ప్రవేశపెట్టినారు. భావ దాస్యమునకు లోనయిన భారతీయులకు నాటి నుండి నేటి వరకు కనువిప్పు కలుగనే లేదు.

శాండ్రకొట్టను గుప్త చంద్రగుప్తుడయినచో జాండ్రేమ్స్' శాండ్రసిప్టను - అన్నవారెవరు? జాండ్రేమ్స్ చంద్రశ్రీ అను ఆంధ్రరాజు. చంద్రగుప్తుని కుమారుడగు సముద్రగుప్తుడు శాండ్రసిప్టను. అలగ్జాండరు దండయాత్ర నాటికి గుప్త చంద్రగుప్తుడు సముద్రగుప్తుడు ఆంధ్ర (సాతవాహన) రాజగు చంద్రశ్రీ కొలువులో నుండిరి. చంద్ర శబ్దము జాండ్ర, శాండ్ర శబ్దములు గాను, సముద్ర శబ్దము శాండ్ర శబ్దముగాను మారు అవకాశము కలదు. కనుక, శాండ్రకొట్టను గుప్త చంద్రగుప్తుడే గాని, మౌర్య చంద్రగుప్తుడు కాడు. అనగా అలగ్జాండరు దండయాత్రా కాలమగు క్రీ.పూ. 327- అన్నది పాశ్చాత్య చరిత్రకారులన్నట్లు మౌర్య చంద్రగుప్తుని కాలము కాదు; గుప్త చంద్రగుప్తుని కాలమన్న మాట. ఇది గుప్త చంద్రగుప్తుని కాలమే అనుటకు రాజుల పరిపాలన కాలములే, తార్కాణము. భారత యుద్ధానంతరము కలీ పూర్వము 36 వ సంవత్సరము నుండి ఆయా రాజ వంశముల పరిపాలన కాలములు :

రాజ వంశము	సంవత్సరములు	కలి శకము	హూణ శకము
బార్హద్రథ వంశము	1006	కలి పూ 36_కలి 970	క్రీ.పూ 3138_2132
ప్రద్యోత వంశము	138	కలి 970_1108	2132_1994
శిశునాగ వంశము	360	1108_1468	1994_1634
నంద వంశము	100	1468_1568	1634_1534
మౌర్య వంశము	316	1568_1884	1534_1218
శుంగ వంశము	300	1884_2184	1219_918
కాణ్వ వంశము	85	2184_2269	918_833
ఆంధ్ర వంశము	506	2269_2775	833_327

ఆంధ్రవంశాంతమగు క్రీ. పూ. 317 అన్నదే అలగ్జాండరు దండయాత్రా కాలము. అప్పుడు మగధలోనున్న ఆంధ్ర (సాతవాహన) రాజు, చంద్రశ్రీ = జాండ్రేమ్స్. అతని కొలువులోనున్న గుప్త చంద్రగుప్తుడు = శాండ్రకొట్టస్. సముద్రగుప్తుడు = శాండ్రసిప్టస్.

పురాణ శ్లోకములలోని పాఠ భేదములు మున్నగు వాని నుపయోగించుకొని పాశ్చాత్య చరిత్ర కారులు భారతదేశ చరిత్ర ప్రాచీనతకు భంగము కలిగించుటకు పాటు పడిరేగాని, సాదుపాఠ నిర్ణయమునకు సిద్ధపడలేదు. ఈ విషయమే ఆంధ్ర మత్స్యపురాణపు ఉపోద్ఘాతికలో ఇట్లు తెలిపి యున్నారు.

"ఈ ముద్రిత పురాణములలో భారతదేశ ప్రాచీన చరిత్ర కాలమునుదగ్గించుట కుద్దేశించిన వ్యక్తులచే నీ పురాణ శ్లోకములు తారుమారు చేసియు, కొన్ని తీసివేసియు, కొన్ని యపపాఠములు కలిపియు భ్రష్టము చేయబడినట్లు స్పష్టముగా కనిపించుచున్నది. 'శతం పూర్ణం శతేద్వేచ- అని 300 సం॥ లని స్పష్టముగానుండగా 'శతం పూర్ణం దశద్వేచ' (112 సం॥) అని దిద్ది శుంగ కాలము తగ్గించబడినది".

రాజవంశావళుల కాలము లు సరిచూచుకొనుటకు పురాణములలో సప్తర్షి మండల చలనమాధారముగా నిరూపించబడినది. సప్తర్షి మండలము క్రాంతివృత్త (ఎక్లిప్స్) మార్గమునయున్న అశ్విన్యాది నక్షత్రముల యొద్ద నూరేసి సంవత్సరములుండునని ఖగోళవేత్తల సిద్ధాంతము. ఇది వైజ్ఞానిక సత్యముగాని, పాశ్చాత్య చరిత్ర కారుల యూహాపోహలవంటివికాదు. సప్తర్షి మండలము మఘా నక్షత్రమున ప్రవేశించిన 76 వ సంవత్సరములో కలియుగము ప్రవేశించినది. అప్పుడు సప్తగ్రహములు మేష రాశిలోనున్నవి. అది క్రీ. పూ. 3102 వ సంవత్సరము ఫిబ్రవరి నెల 20 వ తేదీ రాత్రి 2 గంటల 27 నిముషముల 30 సెకెండ్ల కాలము.

"ఎకార్డింగ్ టు ది యెస్ట్రొనోమికల్ కాల్క్యులేషన్ అఫ్ ది హిందూస్, ది ప్రెజెంట్ పీరియడ్ అఫ్ ధి వర్ల్డ్, 'కలియుగ' కమెన్స్‌డ్ 3102 యియర్స్ బి. సి. అన్ ది ట్వెంటీయత్ ఫిబ్రవరీ యెట్ 2 అవర్స్ 27 మినిట్స్ 30 సెకెండ్స్, ది టైం బీయింగ్ దజ్ కాల్క్యులేటెడ్ టు మినిట్స్ అండ్ సెకెండ్స్ .... ది కాల్కులేషన్ అఫ్ ది బ్రాహ్మిన్స్ ఈజ్ సో యగ్జాక్ట్లీ కన్‌ఫర్మ్‌డ్ బై అవర్ ఓన్ ఎష్ట్రొనోమికల్ టేబిల్స్ దట్ నథింగ్ బట్ యాన్ యాక్చువల్ అబ్జర్వేషన్ కుడ్ హేవ్ గివెన్ సో కరస్పాండెంట్ ఎ రిజల్ట్" (కౌంట్ జారస్ జర్నా)

అల్బరూని, క్రీ.శ. 1031 వ సంవత్సరము, కలిశకము 4132 సంవత్సరమునకు సమానమని వ్రాసినాడు. 4132 – 1030 = క్రీ. పూ. 3102.

సప్తర్షి మండలము మహాపద్మనందుని పట్టాభిషేకమునాటికి శ్రవణ నక్షత్రము నొద్దనుండునని, 24 వ నక్షత్రమునుండగా ఆంధ్ర (సాతవాహన) సామ్రాజ్య స్థాపన జరుగునని పురాణ కథనము.

"శ్రవణేతే భవిష్యంతి, కాలే నందస్యభూపతేః
చతుర్వింశేధ నక్షత్రే, భవిష్యంతి శతం సమాః
అంధ్ర రాజ్యారంభకాలా, దారభ్యైతే సురర్షయః"
(భవిష్య పురాణము)

నక్షత్రము	కడపిన కాలము	కలి శకము	హూణ శకము
1 మఘ	61 సం॥	కలి పూర్వము 36 - కలి 25	క్రీ.పూ 3137 - 3076
2 ఆశ్లేష	100	కలి 26 - 125	3077 - 2977
3 పుష్యమి	100	126 - 225	2978 - 2877
4 పునర్వసు	100	226 - 325	2878 - 2777
5 ఆర్ద్ర	100	326 - 425	2778 - 2677
6 మృగశిర	100	426 - 525	2678 - 2577
7 రోహిణి	100	526 - 625	2578 - 2477
8 కృత్తిక	100	626 - 725	2478 - 2377
9 భరణి	100	726 - 825	2378 - 2277
10 అశ్విని	100	826 - 925	2278 - 2177
11 రేవతి	100	926 - 1025	2178 - 2077
12 ఉత్తరాభాద్ర	100	1026 - 1125	2078 - 1977

నక్షత్రము	కడపిన కాలము	కలి శకము	హూణ శకము
13 పూర్వాభాద్ర	100	1126 - 1225	1978 - 1877
14 శతభిషము	100	1226 - 1325	1878 - 1777
15 ధనిష్ఠ	100	1326 - 1425	1778 - 1677
16 శ్రవణము	100	1426 - 1525	1678 - 1577
17 ఉత్తరాషాఢ	100	1526 - 1625	1578 - 1477
18 పూర్వాషాఢ	100	1626 - 1725	1478 - 1377
19 మూల	100	1726 - 1825	1378 - 1277
20 జ్యేష్ఠ	100	1826 - 1925	1278 - 1177
21 అనూరాధ	100	1926 - 2025	1178 - 1077
22 విశాఖ	100	2026 - 2125	1078 - 977
23 స్వాతి	100	2126 - 2225	978 - 877
24 చిత్ర	100	2226 - 2325	878 - 777

సప్తర్షి మండలము మఘలోనుండగా భారత యుద్ధము జరిగినది. ధర్మరాజు పరిపాలన కాలము 36 సంవత్సరములు. సప్తర్షి మండలము మఘలో, కలియుగమున కడపిన కాలము 25 సంవత్సరములు. వెరసి 36 + 25 = 61 సంవత్సరములు. (సప్తర్షి మండలము మఘలో ప్రవేశించిన 39 వ సంవత్సరమున భారత యుద్ధము జరిగెనన్నమాట.) అటనుండి అపసవ్య గమనమున శ్రవణములో ప్రవేశించి యుండగా మహాపద్మనందుని పట్టాభిషేకము జరిగినది. మహాపద్మ నందుని పట్టాభిషేకము కలిశకము 1468 = క్రీ. పూ. 1634. సప్తర్షి మండలము శ్రవణములో నున్న కాలము, కలి శకము 1426 – 1525 = క్రీ. పూ. 1678 – 1577. అనగా సప్తర్షి మండలము శ్రవణములో ప్రవేశించిన 43 వ సంవత్సరమున మహాపద్మనందుని పట్టాభిషేకము జరిగెనన్నమాట. మహాపద్మనందుని పట్టాభిషేకము నాటికి సప్తర్షి మండలము శ్రవణములో నున్నదన్న పురాణోక్తి సరిగా సరిపోవుచున్నది. ఇట్లే సప్తర్షి మండలము 24వ నక్షత్రములోనుండగా ఆంధ్ర సామ్రాజ్య స్థాపన జరిగెనన్న విషయముకూడ సరిగా సరిపోవుచున్నదని పై పట్టికవల్ల స్పష్టమగుచున్నది.

శాండ్రకొట్టసు మౌర్య చంద్రగుప్తుడను తమ నిర్మూలపు టూహను సమర్థించుకొనుటకు ఖారవేలుని హాతిగుంఫ శాసనములో కాలము నూహించిన తీరు, పాశ్చాత్య చరిత్రకారుల ధోరణికి, వారి అనుయాయుల, పరప్రత్యయనేయ బుద్ధికి నిదర్శనము. ఈ శాసనములో తేదీని తెలుపు వాక్యము వేయబడి యుండవచ్చునని, అది శిథిలమయి యుండవచ్చునని కొంతమంది యూహించినారు. తేదీ వేయబడి యుండదని మరికొంతమంది యూహించినారు. తేదీ వేసి యున్న పక్షమున 16 వ పంక్తిలో వేయబడి యుండవచ్చునని కొంతమంది యూహించినారు. ఆ 16 వ పంక్తిలో తేదీ వేయబడిన పక్షమున, ఆ వేయబడిన తేదీని తెలుపు వాక్యము 'రాజామురియా' అయి యుండవచ్చునని మరికొంతమంది యూహించినారు. ఈ 'రాజామురియా = 165' మౌర్యరాజుల పరిపాలన కాలమునుగాని, ఎవడో ఒక మౌర్యరాజు పరిపాలన కాలమునుగాని తెలుపునని యూహించినారు. అలగ్జాండరు కాలమగు క్రీ. పూ. 323 సంవత్సరమునుండి 165 తీసివేసి ఖారవేలుని శాసనకాలము క్రీ. పూ. 158 అని తేల్చినారు. ఇట్లు నిర్మూలపుటూహలతో కల్పించిన ఖారవేలుని శాసన కాలము క్రీ. పూ. 158, అలగ్జాండరు దండయాత్రా కాలమగు క్రీ. పూ. 327, మౌర్య చంద్రగుప్తుని కాలమను ఊహకు, ప్రమాణమన్నమాట. ఈ శాసనమునుగూర్చి 'రాప్సన్' వ్రాసిన వాక్యము లిట్లున్నవి.

"అఫ్ ఇట్స్ సెవెన్టీన్ లైన్స్ ఓన్లీ ది ఫస్ట్‌ఫోర్ రిమైన్ ఇన్ దైర్ ఎంటైరిటీ .... ఆల్ ది అదర్ లైన్స్ ఆర్ మోర్ ఆర్ లెస్ ఫ్రాగ్మెంటరీ .... ఈవెన్ ది ఫండమెంటల్ క్వశ్చన్ వెదర్ ది ఇన్‌స్క్రిప్షన్ ఈజ్ డేటెడ్ ఆర్ నాట్ ఈజ్ స్టిల్ ఇన్ డిస్ప్యూట్. సమ్ స్కాలర్స్ కంటెండ్ దట్ ఏ పాసెజ్ ఇన్ ది సిక్స్‌టీన్త్ లైన్ కెన్ ఓన్లీ బి ఇంటర్‌ప్రెటెడ్ టు మీన్ దట్ ది ఇన్‌స్క్రిప్షన్ వజ్ ఎన్‌గ్రేవ్డ్ ఇన్ ది 165త్, ఇయర్ ఆఫ్ ది మౌర్య కింగ్స్ ఆర్ ఆఫ్ ది మౌర్యకింగ్స్, లైక్ అదర్స్ డిక్లై ది ఎగ్జిస్టెన్స్ ఆఫ్ యెనీ సచ్ డేట్. (ఏన్‌షెంట్ ఇండియా బై రాప్సన్)

పై వాక్యములను బట్టి శిథిల భాగములో మౌర్యరాజు (ల) 165 వ సంవత్సరమును తెలుపు 'రాజామురియా' అను అక్షరములు కొందరు ప్రక్షిప్తము చేసినారనుట స్పష్టము. ఈ ప్రక్షిప్త వాక్యమే తరువాత తిరుగులేని సిద్ధాంతమయినది. శాండ్రకొట్టసు మౌర్య చంద్రగుప్తుడనుట శకార భాషితము వంటిదేగాని సప్రమాణము కాదు. గుప్త చంద్రగుప్తుడన్నదే సహేతుకము, సప్రమాణము.

(ఆధారము : కీ. శే. కోట వేంకటాచలముగారి గ్రంథములు.)

శ్రీ పంతరాం రామకృష్ణరావు

"బొబ్బిలి" కథ

సెప్టెంబరు 1982 భారతిలో విజయ దత్తాత్రేయ శర్మగారి "విజయనగరం గ్రామ నామములు" - ఒక పరిశీలన చదివితిని. చక్కని వ్యాసము.

అందు "బొబ్బిలి" కాపేరు ఎట్లు వచ్చినదో వారిచ్చిన వివరణ ఇపుడు చర్చింతును.

"బొబ్బిలి"కి ఆ పేరు వచ్చుట కీ పద్యము నిచ్చిరి :

"షేరనఁ దురుష్క-భాషనుఁ జెలఁగను బులి
పెద్దపులియను పదమయ్యె బెబ్బులియన
బెబ్బులియె నాఁడు నాటికి బొబ్బిలియన ।
బొలిచె నక్షరములు మార్పుఁబొంద నిపుడు."

- ప్రవచన పారిజాతము - అవతారిక, పు. 8

దీనికి శర్మగారి వివరణ ఇట్లున్నది :

"సంస్థానప్రదాత చికాకోలు నవాబు షేరు మహమ్మదుఖాన్ పేర నిర్మితమైన బెబ్బులి (షేర్ అనగా పెద్దపులి) జనులనాడుకలో "బొబ్బిలి" అయినదనే వివరణ ధ్వని పరిణామ సూత్రముమేరకు కూడా విరుద్ధముగా లేదని విజ్ఞుల అభిప్రాయము."

నా మట్టుకు పద్యముకానీ, శర్మగారి వివరణ కానీ సరిగా ఉన్నట్లు అనిపించదు. కారణములు ఇవి :

1. సంస్థాన దస్తావేజు లేమనుచున్నవి ?
2. షేర్ ఖాన్ స్మృతిచిహ్నమైన ఊరిపేరు "షేరుఖాన్ పేట్" అనియో "షేర్ మహమ్మద్ నగరం" అనియో ఉండవలెగాని ఉత్తుత్త "బెబ్బులి" ఏమిటి ?
3. మొదట ఊరిపేరు "బెబ్బులి"గా పలుకబడుచు, రాను రాను "బొబ్బిలి" అని పూర్తిగా మారిపోవుటకు స్థానికముగా సాక్ష్యాధారములు కలవా ?
4. అన్యదేశీయ పదము తద్భవీకరణం కావచ్చును. (తేజ్‌సింగ్ → దేసింగు, ఇబ్రహీం → ఇబరాం అయినట్లు).

కాని అవ్వ తెలుగీకరణం అగుట కానిపని. ఇది మద్రాసులోని "బార్బర్స్ బ్రిడ్జి" వ్యవహారము లాంటిది కాదని నా భావం.

శర్మగారి ప్రణాళికను ఇట్లు సమీకరణించవచ్చును.

షేర్ మహమ్మద్ ఖాన్ = పెద్దపులి → బెబ్బులి → బొబ్బిలి.

ఇందు ఒక భాషాంతరీకరణం, ఒక సంధికార్యం, ఒక ధ్వని పరిణామం అనే మూడు భిన్న భాషాశాస్త్రప్రక్రియ లున్నవి. ఇదియంతయు కొంత అసంభవముగ కన్పించుచున్నది. "బెబ్బులి" అనే పదము ప్రసిద్ధమైనది. చెక్కు చెదరక జనులనోట నానుచు ఉంది. అట్టి సుప్రసిద్ధ పదము మారిపోయినది యనుటలో సామంజస్యము లేదు. "బొబ్బిలి" అని పలుకుట "బెబ్బులి" అని పలుకుట కంటే కష్టము. కావున "బెబ్బులి" ఉచ్చారణ రానురాను బొబ్బిలిగా మారుటకు వీలు కనబడుటలేదు.

తాండ్ర పాపారాయుని "బొబ్బిలి బెబ్బులి" అనుచునే ఉన్నారు. దీన్నిబట్టి "బెబ్బులి" పదము "బొబ్బిలి" గా ధ్వని పరిణామము చెందలేదనియు, "బొబ్బిలి" అవతరించుట వేరు విధమనియు స్పష్టము. దానిని వివరించెదను.

విజయనగర ప్రాంతములో "బిల్లి" అని ముగింపుకల గ్రామములు చాలా యున్నవి. ఉదాహరణములు:—

తంగుడుబిల్లి (కొత్తవలస)
రేగుబిల్లి (పెదమజ్జిపాలెం)
గరుగుబిల్లి (గజపతి నగరం)
అలుగుబిల్లి (ధర్మవరం)

ఇచట "బిల్లి" అనే నామాంతమును గమనింపుడు. అటులనే ఇపుడు చర్చనీయాంశమైన "బొబ్బిలి" మొట్టమొదట "బొబ్బ బిల్లి"గా ఉండెడిదని మన మనుకొనవచ్చును. "బొబ్బ బిల్లి" "బొబ్బిలి"గా ఎట్లు మారినదో వివరింతును.

సింకోపేషన్ అని పిలువబడే స్వరలోప లక్షణము ప్రకారము "బొబ్బ బిల్లి" లోని "బ్బ" ఎగిరిపోయి "బొబిల్లి" అయినది. ఉచ్చారణ సౌలభ్యము కొరకు "బొబిల్లి" పదము "బొబ్బిల్లి" అయినది. అచ్చతెనుగులో "ల" కు ఉండు "ల" ఒత్తు ఉండిన ఉండును, లేకున్న లేదు. ఒకసారి యుండును. మరియొకసారి యుండదు. ఉదా: జాబిల్లి, జాబిలి. కావున "బొబ్బిల్లి" తుదకు "బొబ్బిలి"గా అవతరించినది.

ఈ మార్పును ఒక ప్రణాళిక ద్వారా చూపించవచ్చును.

(బొబ్బ+బిల్లి) → బొబిల్లి → బొబ్బిల్లి → బొబ్బిలి.

"బొబ్బ బిల్లి" నుండి "బొబ్బిలి" వరకు గల పరిణామములన్నియు ఉచ్చారణ ఫలితములే. ఇట్టి శాస్త్రము "ఫోనాలజీ" అందురు. తక్కిన "బిల్లి" లు మారకుండ, "బొబ్బబిల్లి" మాత్రము పిల్లి మొగ్గలు వేయుటకు కారణమేమందురా ? చెప్పెదను. ఆ పేర్లు

పలుకుటకు సులభమైన అక్షరములు కల్గియున్నవి. "బొబ్బ బిల్లి" విషయములో అట్లుకాదు. ఒక అక్షరము ఒకసారికంటె ఎక్కువగా ప్రక్క ప్రక్క ఉండిన, ఉచ్చారణా సమస్యలుద్భవించును. అటువంటప్పుడు "సింకోపేషను", కుదింపు, ద్విత్వములు మున్నగు మార్పులు వచ్చును.

ఉదా: "హొలలగుంది" → "హొలగుంది"
"ఆకుకూరలు" → "ఆకూ్కరలు"
"సింబలలాజి" → "సింబలాజి"

ఇంకొక మచ్చు కన్నడభాష నుండి ఇచ్చెదను. "హుబ్లి" అను ప్రసిద్ధ పట్టణమునకా రూపము వచ్చిన వైనము.

(హువ్వు + బళ్లి) = హువ్వు బళ్లి → హుబళ్లి → హుబ్బళ్లి →
(1) (2) (3) (4)
హుబ్బళి → హుబ్లి
(5) (6)

ఈ పరిణామాలు "బొబ్బ బిల్లి"కి వచ్చినట్టివే. ఇప్పుడు, బ్రతుకు వేగములో ఓపికలేని తెనుంగువారు "బొబ్బిలి"ని "బొబ్లి" అని కూడా అనుచున్నారు, "బీమ్లి"ని వలె.

ఇదీ "బొబ్బిలి" కథ.

లేఖ

"కూరాకు" పద వివరణ

డిసెంబరు 1982 భారతిలో మిత్రుడు శ్రీ గంగప్ప వ్యాసం "అన్నమాచార్యుల సంకీర్తనములు రాయలసీమ మాండలిక ప్రయోగం" చదివితిని. చక్కని రచన.

అందులో "కూరాకు" కు ఇచ్చిన అర్థం పొసగదు. "ఆకుకూర" అని ఉంది. అది సరికాదని నా అభిప్రాయం.

"కూరాకు" రాయలసీమ మాండలికమైతే, "ఆకు కూర" ఏ ప్రాంతపు మాండలికం? "ఆకుకూర" కూడా మాండలికమా, వ్యాకరణయుక్త సమాసమా? ఇతర మండలాలలో ఈ పదార్థాన్ని ఏమని పిలుస్తారు? ఇవేవీ వివరించకుండా "కూరాకు" ను మాత్రం రాయలసీమ మాండలికమంటూ దానికి అర్థం "ఆకుకూర" అని ఇచ్చుట సరికాదు. "ఆకుకూర" అనే పదం తప్పు. "కూర" అంటే ఆకు ఉదా: తోటకూర, దంటుకూర. ఆకుతో చేసిన వ్యంజనం అనే పరిమితార్థంలో "ఆకు కూర" వాడవచ్చును. వంకాయకూర, ఉర్లగడ్డ కూరల వలె. "కూరాకు"ను కూర + ఆకు గా విడగొట్ట వీలు పడదు. ఎందుకంటారా? అది మిశ్రమ దుష్ట సమాసం. (మొదట సంస్కృతం, తర్వాత తెలుగు పదములుండుట వల్ల). ఇది పండితులకే చెల్లుకాని అచ్చపు తెలుగు మాటలు దొర్లించగల గ్రామీణులిట్టి పదజాలాన్ని వాడరు.

దీన్నిబట్టి "కూరాకు", "ఆకుకూర" కాదని తెలిసింది. "కూరాకు" కోసం మనం వేరే అంగట్లో వెదుకవలసి వస్తుంది.

"కూరాకు" అనే పదం రాయలసీమ పల్లెలలో "మాంసము"నకు పర్యాయపదంగా వాడబడుతూ ఉంది.

"కూరాకు" పదం "ఖురాక్" నుండి నిష్పన్నమైంది. "ఖురాక్" అంటే, ఉర్దూ (అరబ్బీ లేక పారశీక)లో ఆహారం అని అర్థం. పై రెండు భాషలు మాట్లాడే దేశాల్లోని వారికి మాంసమే, ఖురాక్ కదా! జీవాలను హలాల్‌చేసి ఖురాక్‌ను తయారుచేస్తారు. ఆ మాంసాన్ని కొనుక్కునే పల్లీయులకూ ఆ పరిభాష అబ్బింది. ఆహారం అనే సామాన్యార్థంకల "ఖురాక్" పదం, పై పరిస్థితులలో మాంసం అనే విశేషార్థం కలదైంది. ఆ "ఖురాక్" ఏ, మన "కూరాకు". "కూరాకు" "ఖురాక్" శబ్ద తద్భవం కానీ, ఆకుకూరకు మాండలికం కాదని తాత్పర్యం.

"త్రి"

గ్రంథ విమర్శలు

పింగళి సూరన కవితా వైభవం

[రచన: శ్రీ రంగాచార్య. డెమ్మీ 40 పుటలు. వెల 3 రూ. ప్రకాశకులు : యువ భారతి, 5, కింగ్స్‌వే, సికిందరాబాదు - 3. ప్రతులు లభించు చోటు 1. యువభారతి, 5, కింగ్స్‌వే, సికిందరాబాదు-3 లేదా 2. యువ భారతి కార్యాలయము, ఆంధ్ర సారస్వత భవనములు, తిలక్ రోడ్డు, హైదరాబాదు - 500001.]

సుప్రసిద్ధులైన తెలుగు కవుల కవితా వైభవాన్ని అందరికీ సంగ్రహంగా అందించడం 'యువ భారతి' లక్ష్యాలలో ఒకటి. ఆ సంస్థవారు, ఆయా కవులను గురించి ప్రత్యేక కృషిచేసిన విద్వద్విమర్శకులచేత ఉపన్యాసాలిప్పించి. వాటిని గ్రంథ రూపంగా ప్రకటిస్తున్నారు. ఇట్టి చిన్న పుస్తకాలలో ఈ "పింగళి సూరన కవితా వైభవం" ఒకటి.

ప్రబంధ యుగం నాటి ప్రధాన కవులలో పింగళి సూరన ఒకడు. ఆ కాలపు కవులందరూ గతాను గతికంగా ప్రసిద్ధ ప్రబంధాల ధోరణినే అనుసరిస్తే సూరనమాత్రం కొత్త పద్ధతిని అనుసరించాడు. అద్భుత సన్నివేశాలతో ఒక కల్పిత కథను ఇతివృత్తంగా తీసుకుని కళాపూర్ణోదయమనే ప్రబంధంగా రచించాడు. ఇది పద్య రూపంలోఉన్న నవల అనే చెప్పవచ్చును. ఇతని ప్రభావాలే ప్రద్యుమ్నంలో ప్రఖ్యాతకథకు కొంతకల్పితకథచేర బడింది. అందులోని సంభాషణములు ఎంతో హృదయంగమంగా కానవస్తాయి. రెండర్థాలుగల పద్యాలతో రాఘవ పాండవీయమనే ద్వ్యర్థికావ్యాన్ని రచించడం ఇతనిలోని ప్రత్యేకత. ఇందులో రామాయణ, భారత కథలు జోడించబడినవి.

సూరన రచనలను గురించీ, ప్రతిభా పాండిత్యాలను గురించీ వివరించే కవిత్వ తత్త్వ విచారం వంటి విమర్శ గ్రంథాలిదివరకే ఉన్నాయి. అందువల్ల రచయిత అతన్నిగురించి విపులంగా చెప్ప దలచలేదు. అతని గ్రంథములలోని కొన్ని రసవంతాలయిన పద్యాలను తీసికొని వాటి వైశిష్ట్యాన్ని వివరించడమే, ఆయన లక్ష్యం. ఈ విషయంలో రచయిత కృతార్థులైనారని చెప్పవచ్చును.

ఇందులో మూడు ప్రకరణాలున్నవి. మొదటిదానిలో కళాపూర్ణోదయంలోని వైశిష్ట్యం, రెండోదానిలో ప్రభావతీప్రద్యుమ్నంలోని చమత్కృతి, మూడవదానిలో రాఘవ పాండవీయంలోని ప్రత్యేకత వివరించ బడినవి.

ఇట్టి సంగ్రహగ్రంథాల ప్రకటనవల్ల, సాహిత్యాభిమానులు సులభంగా, ఆ యా కవుల కవితావైభవం గ్రహించడానికి వీలవుతుంది. ఇట్టి రచనలకు ప్రోత్సహిస్తున్న యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థవారు అభినందనీయులు.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

కనువిప్పు (నవల)

[రచన: అకెళ్ళ వెంకట సూర్యనారాయణ. ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్. విజయవాడ-4 వెల: తొమ్మిది రూపాయలు. పేజీలు: 168.]

1982 లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌వారు నిర్వహించిన నవలల పోటీలో తృతీయబహుమతి పొందిన నవల ఇది. దీనిలోని విషయం గ్రామ రాజకీయాలకు చెందినది.

అదొక గ్రామం. అందులో ఇద్దరు పెద్దమనుషులు. ఒకరు పెదరెడ్డి, పెద్ద భూస్వామి. మరొకరు పంచాయితీ ప్రెసిడెంట్ చౌదరి. ఇద్దరికీ పడదు. ఇక రాజకీయాలకేం కొదవ? వారి ఆటకు పావులు ఆ వూళ్లో హరిజనులు, ఆశ్రితులు.

ప్రసాద్ అనే యువకుడు, ఆ వూరి పంచాయతీ స్కూలు మాష్టారు కృష్ణమూర్తి తమ్ముడు. అన్నదమ్ములిద్దరూ ఆ గ్రామ ప్రజల్లో, హరిజనవాడలో వారి మధ్య వైషమ్యాలు పోగొట్టి కనువిప్పు కలిగిస్తారు.

నవలంతా ఇరుపక్షాల రాజకీయపుయెత్తులతో నిండి పాఠకుడు చదవటానికి ఆసక్తికరంగా వుంది. కాలక్షేపం కోసం రాయని మంచి నవల అని చెప్పవచ్చు.

వాసుదేవమూర్తి (నవల)

[రచన: బి. ఎల్. సత్యనారాయణశాస్త్రి. పబ్లిషర్స్, శ్రీదేవి పబ్లికేషన్స్, ఉమలింగేశ్వరఅగ్రహారం, కాకినాడ-533004; పేజీలు: 237, వెల: పద్నాలుగు రూపాయలు.]

ఇదొక ప్రత్యేకమయిన నవల. ఈ నవల రాయటానికిగల ప్రేరణ గురించి రచయిత ఇలా చెప్పారు:

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు వారి ద్వితీయ పుత్రుడ్ని కోల్పోయారు. "ఆ కుర్రాడు పోయేముందు తండ్రికి ఒక లేఖ వ్రాసాడట. పూర్వజన్మలో రామకృష్ణపరమహంసతో కలిసిఉండినట్లు తనకు తన పూర్వజన్మ వృత్తాంతం జ్ఞప్తికిఉన్నట్లు, తనకు గాయత్రీసాక్షాత్కారం కలిగినట్లు వ్రాసిపెట్టి వెళ్ళాడట."

తర్వాత అతని డైరీ కూడా రచయిత చదవటం, ఈ నవల రాయాలన్న కోరిక కలగటం జరిగాయని చెప్పారు.

నవలలో వాసుదేవమూర్తి పాత్ర చాలా ప్రత్యేకమయినది. అతను గాయత్రీ ఉపాసకుడు. "మనకు సప్తకోటి మహామంత్రాలున్నాయని, వాటిల్లో గాయత్రీ మంత్రం పరమోత్కృష్టమైనదని ప్రతీతి. గాయత్రీ వేదమంత్రం. 'గాయతిచ త్రాయతేచ గాయత్రీ' అని వేదమే చెబుతోంది. అంటే దీనిని ఎవరు గానం చేస్తారో వారిని రక్షించునది అని అర్థం....ఏ మంత్రసిద్ధికైనా శుచీభూతమైన అనుష్ఠానం ముఖ్యం ...సర్వేంద్రియాల సంయమనం బ్రహ్మచర్యం ద్వారా మాత్రమే వీలవుతుంది " ఇదీఅతని మనస్తత్వం.

వాసుదేవమూర్తి ఎన్నో వేదాంతవిషయాలు చర్చిస్తాడు. ఎక్కువ భాగం ఇలాంటి చర్చలతో, తర్కాలతో నిండివుంది.

ఈ నవల ఒక వ్యక్తిని ఆధారం చేసుకొని రాసింది గాబట్టి పూర్తిగా కల్పితం అని చెప్పలేం. ఈ రోజుల్లో వాసుదేవమూర్తి లాంటి వాళ్ళు వుంటారా అని కొంతమందికి అనిపించటం సహజం. నవలలోని 'విషయం' మీద నమ్మకం గలవారికి మంచి అనుభూతి నివ్వవచ్చు. నమ్మకం లేనివారికి వాసుదేవమూర్తి మనస్తత్వం అంతుపట్టదు సరికదా, అంతమూర్ఖంగా తన దేహాన్ని శుష్కింపజేసుకోటాన్ని హర్షించలేరు. దైవభక్తి అంటే ఇలా బ్రహ్మాండమైన మాయలోపడి కొట్టుకుపోవటమేనా అనిపిస్తుంది.

బ్రతుకు పోరు (నవల)

[రచన : బి. ఎస్. రాములు. ప్రచురణ: కరీంనగర్ బుక్ ట్రస్టు ప్రచురణలు. ప్రతులకు: సృజన, హనుమకొండ, వరంగల్-506 001 లేక పీస్ బుక్ సెంటర్, 4-5-421, సుల్తాన్‌బజార్, హైదరాబాద్-500001. పేజీలు: 111. వెల: అయిదురూపాయలు.]

ఈ నవలలో ప్రధానవిషయం శ్రమజీవుల జీవనపరిస్థితులు. కొత్తదనమేమిటంటే అందులోని వాతావరణం. నవల ముందుమాటలో చెప్పినట్టు బీడీ కార్మికుల గురించి రాయబడ్డ నవల ఇదే మొదటిది కావచ్చు.

కథాంశం ఒక్కటే - బీడీ ఫ్యాక్టరీ యజమానులచేత వారి దగ్గర పనిచేసే కూలీలు ఎట్లు దోపిడీకి గురిఅవుతున్నారు, అన్నది.

. రచయిత చెప్పేది మామూలు భాషలో వున్నా, పాత్రలచేత మాత్రం తెలంగాణా భాషలో పలికిస్తారు. ఇది ఇతర ప్రాంతాల పాఠకులకు అర్థం కాకపోవచ్చు, కానీ నవలకి అదే ప్రాణం అయి కూర్చుంది.

పుస్తకం చాలా నిరాడంబరంగా వుంది. ధరకూడా తక్కువని చెప్పవచ్చు. రచయితను, ప్రకాశకులను అభినందించదగ్గ పుస్తకం.

బాబు

గణపతి రామాయణ సుధ

[పద్య కావ్యము. గ్రంథకర్త : శ్రీ చర్ల గణపతి శాస్త్రి. డెమ్మీ సైజు 74 + 233 పుటలు. వెల 15 రూ. ప్రతులకు గ్రంథకర్తకు వ్రాయవలెను. చిరునామా : శ్రీ చర్ల గణపతిశాస్త్రి, కిర్లంపూడి కాలనీ, ఆంధ్ర యూనివర్సిటీ, వాల్తేరు - 3.]

ఆదికావ్యమైన వాల్మీకి రామాయణానికి తెలుగులో వచ్చిన పద్య రచనలు ఎన్నో ఉన్నాయి. వానిలో ప్రసిద్ధమైనవి ప్రాచీనాలైన భాస్కర, రంగనాథ రామాయణాలు, నవీనాలైన గోపీనాథ రామాయణం, వావిలికొలనువారి రామాయణం, రామాయణ కల్పవృక్షం మున్నగునవి. రామభక్తులైన చాలామంది కవులు తమ రామాయణ రచనలను సాగిస్తూనే వున్నారు. అలాంటి రచనల్లో ఈ "గణపతి రామాయణ సుధ" ఒకటి. 233 పుటలు గల కథాభాగం బాలకాండంమాత్రమే: దీనిని బట్టి మొత్తం గ్రంథం ఒక బృహద్గ్రంథంగా తయారు కావచ్చునని తోస్తున్నది.

చర్ల గణపతిశాస్త్రి గారిది పండిత వంశం. వీరి తండ్రిగారు నారాయణశాస్త్రి గారు గొప్ప విద్వాంసులు. తండ్రివలెనే కుమారుడు కూడా సంస్కృతాంధ్రాలలో గట్టి పండితులు. వ్యాకరణాలంకారాది శాస్త్రాలలో సమర్థులు. వ్యాకరణాలంకార శాస్త్రాలు తెలిసినవారు న్యాయ, వైశేషిక, వేదాంతాదులలో సమర్థులై ఉండడం అరుదు. గణపతి శాస్త్రిగారు ఆ శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలను కూడా రచించి, ప్రకటించడం వల్ల వీరి బహుముఖ ప్రజ్ఞ వెల్లడి అవుతున్నది.

దీనిని రచించడానికి ముందు రచయిత వాల్మీకి మహర్షి మూలాన్ని, భాస్కర రామాయణాన్ని, రంగనాథ రామాయణాన్ని, వావిలికొలను సుబ్బారావుగారి ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని, జనమంచి శేషాద్రి శర్మగారి రామాయణాన్ని, తాదేపల్లి వెంకటప్పయ్య శాస్త్రిగారి రామకథామృతాన్ని, గోపీనాథ రామాయణాన్ని, బులుసు వేంకటేశ్వర్లుగారి శ్రీమద్రామాయణాన్ని బాగా పరిశీలించినట్లు వీరి పీఠికవల్ల తెలుస్తున్నది. అంతేకాక రామాయణ కథ వున్న పద్మ పురాణం మొదలైన వాటినికూడా పరిశోధించారు. చర్చనీయాంశాలైన 'మానిషాద' శ్లోకార్థం, శాంత వృత్తాంతం, పాయస ప్రదానం, సీతా, రాముల వయోనిర్ణయం, రాముని మానవత్వం, సేతుబంధం, ఇంద్రజిత్తు కథ, సీత పూర్వజన్మ వృత్తాంతం, శంబూక వధ మున్నగు విషయాల వివరణ కలదు.

గణపతిశాస్త్రిగారు ఇతర కవుల రామాయణాలకూ, తమ రచనకూ గల వ్యత్యాసాన్ని పెక్కు ఉదాహరణలతో వివరించారు. కథాప్రారంభశ్లోకమైన "తపఃస్వాధ్యాయ నిరతం" అనే శ్లోకంతోనే తులనాత్మక విమర్శ ప్రారంభమైంది. దీనినిబట్టి వీరి నిశిత దృష్టి స్పష్టంగా తెలుస్తున్నది.

ఇందులో అయోధ్యనుండి లంకవరకూ గల మార్గాన్ని తెలిపే దేశపటం చేర్చబడింది. ఇది పాఠకులను ఎంతో ఆకర్షిస్తుంది. దీని విషయసూచికలో 97 శీర్షికలు ఉన్నవి. వాటినిబట్టి ఇందులో గ్రహించబడిన కథాంశం స్పష్టంగా తెలుస్తుంది.

పద్యకావ్యాలలో అక్కడక్కడ సుదీర్ఘమైన గద్యలు ఉండటం పరిపాటి. ఆ గద్యలు పద్యాలకంటే కఠినతర శైలిలో ఉండి పాఠకులకూ, శ్రోతలకూ విసుగు కలిగిస్తాయి. ఈ పద్య కృతిలో కూడా అక్కడక్కడ నాతిదీర్ఘమైన వచనాలూ ఉన్నవి. కాని ప్రబంధాల్లోని గద్యలవలె కఠినంగాకాక చాల సులభశైలిలో ఉండడం ఇందులోని ప్రత్యేకత.

రచయిత గట్టిపండితులయినా, ఇందలి పద్యాలు చాలా సులభ శైలిలో ఉండి పాఠకులు సులభంగా అర్థం చేసుకునే రీతినే ఉంటున్నవి. మచ్చునకు రెండు ఉదాహరణాలు-

సీ. క్ష్మామండలంబునఁ గలనైనదొరకక
దొరకిన యమృతంపు దొన్నెవోలె,
నీళ్లైన లేనట్టి నిండుయెడారిలోఁ
బూర్తిగ గురియు వానపోతవోలె,
సంతానమేలేని జనునికిఁ దనభార్య
లకుఁ గల్గిన సుపుత్ర లబ్ధివోలె
ధనముపోయి మిగుల వనటలఁగుందెడి
నరునికిఁ బెన్నిధి దరియు పగిది,
గొప్పయుదయము హర్షముఁగూరినటుల
నీదురాక నాకు ముదంబు నింపివైచె,
అనఘ! యోముని! నీ కిదే స్వాగతంబు
హృష్టుఁడనగు నేనిడుదు నీకేమికోర్కె? [పుట 92]

శ్రమపోగొట్టెడి యాశ్రమంబిదియు పూర్వం బందు నిందే త్రివిక్రముఁ డుండెంజుమి; మేము వామనునికై రాజిల్లు భక్తిన్ వసింతుమిటన్, రాక్షసు లిష్టి విఘ్నముల నెందున్ వచ్చి గావింతు రాశ్రమమందే యిట రాక్షసాళిని వడిన్ జంపందగున్ రాఘవా!
[పుట 118]

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆర్థికసహాయం కొంత దీని ముద్రణకు లభించింది.

అక్క మహాదేవి వచనములు

[అనువాదము : శ్రీ రేకళిగెమఠం వీరయ్య. క్రౌను 40+70+179 పుటలు. ప్రకాశకులు - శివానుభవ సమితి, 4-7-247, ఇసామియా బజారు - 500 027. వెల : సభ్యులకు - రు. 7 లు. ఇతరులకు - రు. 10.]

శివ శరణులని ప్రఖ్యాతి చెందిన శివభక్తాగ్రగణ్యులలో అక్క మహాదేవి యొకరు. ఆమె పుట్టినది కర్ణాటక ప్రాంతము. మానవ మాత్రుని వివాహమాడ నొల్లక శ్రీశైల ప్రాంతమున కదళీవనము నందలి చెన్న బసవేశ్వరునే తన భర్తగా భావించి, ఐహికసుఖములను చొరనొల్లక అచటనే శివైక్యము పొందినట్లు ప్రసిద్ధి. ఉత్తర దేశమునందలి మీరాబాయితో తులతూగగల మహాభక్తురాలీమె. కన్నడ, సంస్కృత భాషల యందు గొప్ప పాండిత్యము ఈమెకు సహజసిద్ధంగా లభించినది.

కన్నడ భాషలో భక్తి భావమును, తత్త్వమును బోధించు ప్రవచనములు వచనములుగా ప్రసిద్ధమై ఉన్నవి. అక్క మహాదేవి ప్రవచనములే ఇందు ఉన్నవి. కన్నడ భాషలోని ఆ వచనములను అనువాదకులు వీరయ్యగారు తెలిగించి ఈ గ్రంథరూపంగా ఇస్తున్నారు.

ఇందులో ఆమె రచించిన భక్తి, మాహేశ్వర, ప్రసాద, ప్రాణలింగ, శరణ, ఐక్య స్థలాల వచనాలున్నవి. తర్వాత సృష్టి వచనం ఉన్నది. అధికపాఠాలైన వచనాలు కూడా అందులో చేర్చబడినవి. చివర వచనాల అనుక్రమణిక ఉన్నది.

అనువాదకులు దీనికి సంబంధించిన పెక్కు గ్రంథాలను పరిశీలించి అక్క మహాదేవిని గురించిన విషయాలను జీవిత చరిత్రను సమగ్రంగా వివరించారు. ఆయన పరిశీలించిన గ్రంథాల పట్టికనూ ఇచ్చారు. ఆయన తమ విజ్ఞాపనలో తమ పరిశీలనను గురించి వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంధ్ర శాఖాధ్యక్షులు డాక్టర్ బి. రామరాజుగారు దీనిపై సదభిప్రాయాన్ని ఇచ్చారు.

వీరయ్యగారు సులభమైన శైలిలో అక్క మహాదేవిని గురించి చక్కగా చెప్పారు. వారి అనువాదంకూడా అందరికీ అర్థమయే రీతిని చాలా సులభమైన భాషలో సాగింది. మచ్చునకు ఒక ఉదాహరణ —

"పంచేంద్రియ గుణములందు ఒక్కదానికి
ప్రియుడైన చాలదా ?
సప్త వ్యసనములందు ఒక్కదానికి
ప్రియుడైన చాలదా ?
రత్నపు సంకెళ్లైన నేమి ?
బంధనము వదలునా చెన్న మల్లికార్జునా ?"

[151- వ వచనం]

వచనాలు సూత్రప్రాయంగా ఉన్నా వాటివల్ల గ్రహించవలసిన విషయం ఎంతో విలువైనది. దానిని గ్రహించడం అంత కష్టం కాదు.

దీని ముద్రణకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు, కొందరు వదాన్యులు సహాయపడ్డారు.

అక్క మహాదేవికీ, శ్రీశైల కదళీ వనానికీ సంబంధించిన చిత్రాలు కూడా ఇందులో ఉన్నవి. శైవుల భక్తి మార్గాన్ని సులభంగా తెలుసుకొనుటకు ఈ గ్రంథం బాగా ఉపయోగ పడుతుంది.

మాండూక్య సార సంగ్రహము

[రచన: శ్రీ నండూరు సుబ్రహ్మణ్య శర్మ. క్రౌను 10+252 పుటలు. వెల 12రూ. ప్రకాశకులు - అర్షవిజ్ఞాన గ్రంథమాల, శివాలయం వీధి, సత్యనారాయణపురం, విజయవాడ-520 011.]

వేదాంతవిషయాలను బోధించే ప్రాచీన సంస్కృత గ్రంథాలుకొన్ని ఉపనిషత్తులుగా వ్యవహరింపబడుతూ ఉన్నా, వైదిక వాఙ్మయానికి సంబంధించిన దశోపనిషత్తులు మాత్రం అసలైన ఉపనిషత్తులు. అవి ఈశ-కేన-కఠ-ప్రశ్న-ముండక-మాండూక్యాదులు. వీటిలో అద్వైతమతవిషయాన్ని ప్రతిపాదించే మాండూక్యోపనిషత్తునకు తక్కిన వాటికంటె ప్రచారం ఎక్కువ. ఆధ్యాత్మిక ప్రబోధం చేస్తూ వేదాంతోపన్యాసాలిచ్చే విద్వాంసులూ, పీఠాధిపతులూ ఈ ఉపనిషత్తునే ఆధారంగా చేసుకుని ఉపన్యసిస్తూ ఉంటారు.

రచయిత సుబ్రహ్మణ్యశర్మగారు సంస్కృతాంధ్రాలలో లబ్ధప్రతిష్ఠులైన విద్వాంసులు. 1944 నుండి భగవద్గీతోపన్యాసాలను, భారతోపన్యాసాలను ఇస్తూ తత్త్వజిజ్ఞాసువుల ఆదరాభిమానాలు చూరగొన్నవారు. కుర్తాళ శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతులు శ్రీ విమలానంద భారతీయతీంద్రుల అనుగ్రహంవల్లనూ, గౌడపాద కారికలు మున్నగువాని పరిశీలనవల్లనూ, అద్వైత తత్త్వాన్ని సమగ్రంగా అవగాహనచేసుకొని, దురవగాహమైన మాండూక్యోపనిషత్సారాన్ని జిజ్ఞాసువుల ఉపయోగార్థం గ్రంథంగా రచింప సంకల్పించారు. "నేను ఎవరను ? సత్యమని దేనిని అనాలి ? భగవంతుడు ఉన్నాడా ? ఉంటే ఎక్కడ ఉంటాడు ? చావుఅంటే ఏమిటి ?" మున్నగు ప్రశ్నలకు సమాధానాల రూపంగా తొలుత రచన సాగింది. కాని, ఆ వ్రాత ప్రతి అపహృతంకాగా, ఆయన తిరిగి ప్రశ్నోత్తర రూపాలలో కాకుండా ఉపన్యాసాల రూపంలో సులభశైలిలో దీనిని రచించారు. "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" మున్నగువానికి వీరు ఇచ్చిన వివరణం శర్మగారి ప్రతిభాపాండిత్యాలకు చక్కని నిదర్శనం. దుర్గ్రాహ్యాలైన విషయాలను సులభంగా అందరికీ బోధపడేవిధంగా చెప్పనేర్పుకల వీరివంటి తత్త్వవేత్తలు ఇప్పుడు చాలా కొద్ది సంఖ్యలోనే కానవస్తారు. మాండూక్యోపనిషత్తులోని సారాన్ని సప్రమాణంగా తెలిసికొనగోరే వారికి ఇది అవశ్యపఠనీయం. సుప్రసిద్ధ విద్వాంసులు, తర్కవేదాంత సమ్రాట్టు శ్రీ మద్దులపల్లి మాణిక్యశాస్త్రిగారు, శ్రీమాన్ కో. వెంకటకృష్ణమాచార్యులుగారు దీని ప్రాశస్త్యాన్ని వివరిస్తూ చక్కని అభిప్రాయాలిచ్చారు. ఆకర్షణీయమైన ముఖచిత్రంతో గ్రంథం అందంగా ముద్రింపబడింది. అద్వైతతత్త్వజిజ్ఞాసువులు దీనికి తగిన ప్రచారం అందించగలరని భావిస్తున్నాను.

భాగవత ప్రభ

[కర్త : శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి. డెమ్మీ 32 పుటలు. వెల : శ్రద్ధ, భక్తి, వైరాగ్యాలు. ప్రాప్తిస్థానం : శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి, జయశ్రీటాకీస్ రోడ్డు, రాజమండ్రి - 4.]

పురాణపండ వారిది పండితవంశం. రాధాకృష్ణమూర్తి గారి తండ్రిగారు, సోదరులు, బంధువులు అధ్యాత్మిక విషయ ప్రచారానికి ప్రయత్నిస్తూ, అందుకు ముఖ్య సాధనంగా పెక్కు గ్రంథాలను ప్రచురించారు. ప్రచురిస్తున్నారు. "పురాణ తిలకమై భక్తి జ్ఞాన వైరాగ్య ప్రబోధాలతో సనాతన హిందూధర్మ ప్రచారానికి సంపూర్ణంగా సహకరించే భాగవత మహా పురాణాన్ని" ఆరు సంపుటాలుగా అందరికీ అర్థమయ్యే శిష్ట వ్యావహారిక భాషలో రెండువేల పుటలలో ప్రకటించడానికి ఏతత్కర్త నిశ్చయించి, దానికి అనుబంధంగా ముందు బహుళ ప్రచారానికి ఈ "భాగవత ప్రభ" ను ప్రచురించి, ఉచితంగా పంచిపెడుతున్నారు. దీనిని చదివిన వారికి భాగవత ప్రాశస్త్యం అవగతమై, వారు ప్రచురించే భాగవతం పఠించడానికి ఆసక్తి కలుగుతుందని వారి అభిప్రాయం.

ఈ 'భాగవత ప్రభ' లో మొదట, భాగవతంలోని పన్నెండు స్కంధాలలోను గల విషయాలన్నీ చెప్పబడినవి. తర్వాత హరి నామ స్మరణాదుల ప్రయోజనం, భాగవత మాహాత్మ్యం వివరించబడినవి. దీని తర్వాత గోరఖ్‌పూరు గీతాప్రెస్ వారు ప్రచురించిన ''శ్రీకృష్ణోపనిషత్తు'' నకు తెలుగులో వచనానువాదం ఇయ్యబడినది.

వైదిక వాఙ్మయంలోని ఉపనిషత్తులు పది మాత్రమే ; అవి "ఈశ- కేన- కఠ- ప్రశ్నాదులు"అయినా ఇతరాలైన ఉపనిషత్తులు రమారమి నూరు తర్వాతి కాలాలలో తయారై ఉపనిషత్తులనే పేరుతో వ్యవహరింప బడుతున్నాయి. ఉపనిషత్తుల వలెనే ఇవి వేదాంత విషయాలను వివరించడం వల్ల వాటి వలెనే పవిత్రములూ, ఉపాదేయములూ, అయి ఉండడంవల్ల ఈ పేరు వచ్చి ఉండునని తోస్తున్నది. ఈ శ్రీకృష్ణోపనిషత్తు కూడా అటువంటిదే ; ఇందులో శ్రీకృష్ణావతారం, విష్ణుమాయా ప్రభావం వివరించబడినవి. ఆ తర్వాత ఆత్మ విశ్వాసాన్ని గురించిన కథలు సంగ్రహంగా ఉన్నవి.

పుస్తకం చివర నిత్య పారాయణకు అనుకూలంగా ఉండే 'కృష్ణం వందే జగద్గురుం' అనే మకుటం గల కృష్ణాష్టకం, అచ్యుత కథా శ్రవణఫలం (తెలుగువచనం), 'జగన్నాథస్వామీ నయన పథగామీ భవతు మే' అనే చతుర్థ పాదం గల 'జగన్నాథాష్టకం' ఇయ్యబడినవి. భాగవతంలో ఉన్న విషయాలన్నింటినీ సంగ్రహంగా తెలుసుకొనుటకూ, శ్రీకృష్ణ తత్త్వాన్ని గ్రహించుటకూ, కృష్ణాష్టక, జగన్నాథాష్టకాలను నిత్యపారాయణ చేయుటకూ ఈ పుస్తకం బాగా ఉపయోగిస్తుంది. రచయితకు వ్రాసి, యీ పుస్తకాన్ని ఉచితంగా పొందవచ్చును.

"ఆంగీరస"

విశ్వనాథ కథ

[రచయిత: శ్రీ జోశ్యుల సూర్యనారాయణమూర్తి. క్రౌను సైజు. పుటలు 72. మూల్యం అయిదు రూపాయలు. ప్రకాశకులు: దివిసీమ సాహితీసమితి, గాంధీ క్షేత్రం, అవనిగడ్డ - 521 121, కృష్ణా జిల్లా]

ఈ గ్రంథానికి, ప్రకాశకులు తొలిపలుకువ్రాస్తూ విశ్వనాథ సత్యనారాయణగారి పూర్వులది దివిసీమలోని విశ్వనాథపల్లి గ్రామమనీ, బాల్యం తండ్రిగారి మేనమామల యూరైన విశ్వనాథపల్లిలో గడిపారనీ, శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో ''ఒగిని మేమంద రము కృష్ణఒడ్డుజాతి" "ఆయన ప్రకృతియు నా యది మాయురె యొకజాతి ద్రవ్యమా యనిపించున్" అని మండలి కృష్ణారావు గారిని గూర్చి పేర్కొన్నారనీ వ్రాశారు. రచయిత ఈ గ్రంథాన్ని మండలి వేంకటకృష్ణారావుగారికి అంకితం ఇచ్చారు.

ఈ గ్రంథంలో, జోశ్యులవారు, వారి తొలిపరిచయం దగ్గరనుండీ, విశ్వనాథవారు స్వర్గస్థులయ్యేవరకూ, వారిరువురి మధ్య జరిగిన సన్నివేశాలనూ, కొన్ని సంఘటనలను ఏర్చి కూర్చారు. విశ్వనాథవారికి రచయితపైకల ఆదరాన్ని గూర్చిన విషయాలు చెప్పారు.

విశ్వనాథవారి షష్టిపూర్తి సభలలో జరిగిన విషయాలు చెప్పారు. విశ్వనాథవారి వనబడే సరసమైన చమత్కారాలతో పాటు, విరసమైన భాషణాలు కూడా యీ గ్రంథంలో చోటుచేసి కొన్నవి. చిత్తశుద్ధితో, వారినిగూర్చి తాను విన్న, కన్న, విషయాలను ఒకచోట రచయిత సంకలనంచేశారు.

రచయిత సమర్థులు. చదివింపదగిన రీతిలో, వచన గ్రంథాన్ని రూపొందించారు. విశ్వనాథవారిని గూర్చి అనేక గ్రంథాలు వస్తున్నవి. అందులో ఇది ఒకటి.

శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

ఆంజనేయ చరిత్ర

[రచన - "దిట్టకవి" ఎం. ఏ. మూల్యము: రు. 4-00లు. ప్రతులకు: "దిట్టకవి" ఎం. ఏ. వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం, పిడుగురాళ్ళ-522 413.]

రామకథ కంటే విశిష్టమయినది ఆంజనేయ చరిత్ర. సాధకుడు ఆంజనేయుడు. భక్తుడు ఆంజనేయుడు. త్రిమూర్తుల స్వరూపుడు ఆంజనేయుడు. ఈ చిన్న పుస్తకంలో హనుమ జ్జననము, హనుమత్తత్వము విశిష్టత, బాల్య సంఘటన, విద్యాభ్యాసము, శివుడే ఆంజనేయుడై రామునికి దాస్యము చేసినా, హనుమంతుని పూజించిన సర్వ దేవతలనుపూజించినట్లే, హనుమంతునికి వివాహం అయిందా? ఆంజనేయుడు - జీవితాదర్శములు, ప్రాపంచిక వస్తు వ్యామోహము లేకుండుట తదితర భాగాలున్నాయి.

రచయిత చెప్పినట్టు పిల్లల కోసం సులభశైలిలో వ్రాసిన పుస్తకం ఇది. ఒక్కొక్క భాగం ఒక్కొక్క కథగా వున్నది. అయితే ఈ కథలన్నీ విజ్ఞులకేకాక కొందరు వయోజనులకు కూడా తెలిసినట్టివే. హనుమంతుని వివాహం గురించి ద్వివిధాభిప్రాయాలున్నాయి. వివాహం కాలేదు కనుకనే సదా బ్రహ్మచారి యను బిరుదు కలదని కొందరి మతం. వివాహమయినా ఆంజనేయుడు బ్రహ్మచర్య వ్రతం విడనాడలేదని మరి కొందరి మతము. ఇదే విధంగా శనివారంనాడే ఆంజనేయుని పూజింపవలసిన ఆవశ్యకత గురించికూడా భిన్నాభిప్రాయాలున్నాయి.

ఇంతకూ ఈ పుస్తకం ఉద్దేశం పిల్లలకు సత్ప్రవర్తన నలవరచుట. అది అంత సులభమా? పెద్దలే ఫ్యాషన్లు, ఆధునికత పేరిట విపరీత బుద్ధుల నలవరచుకొనుచుండగా ఇక పిల్లల సంగతి వేరే చెప్పవలెనా? నిజమే! ఆంజనేయుడు సులభాతి సులభమైన దైవమే. అసలు దైవంలేదు-దైవభావం ఉన్నదనే వాదనొకటి ఉన్నది గదా? దైవభావానికీ, దైవానికీ, సంబంధాన్ని గురించిన పుస్తకాలు అంతఎక్కువగా తెలుగులో లేవేమో! "ఉన్నాడనుకుంటే ఉన్నాడు. లేడనుకుంటే లేడు" అనేరకం భావాలు గల వారితో వాదించుటకు ప్రాతిపదిక యేమిటి? దైవం అనే మాటకు బదులు పదార్థము అనేమాటను వాడడం ఆధునిక, తాత్విక సంతృప్తికాక మరేమిటి?

శ్రీ వి. ఎస్. అవధాని

గద్దర్ పాటలు

[వెల: రు. 3-50 లు. జన నాట్యమండలి ప్రచురణలు. ప్రతులకు:- 1) పీస్ బుక్ సెంటర్, హైదరాబాద్;
2) సృజన, వరంగల్.]

1970 తరువాత తెలుగు కవిత్వం విప్లవమార్గంలోకి మలుపు తిరిగింది. శివసాగర్ నరుడో భాస్కరుడా పాట రూప పరంగా విప్లవకవుల దృష్టిని మార్చింది. వచనకవిత్వ స్థానాన్ని పాట ఆక్రమించింది. జనం కోసం కవిత్వం రాసేటప్పుడు ఆ జనం భాషలోనే, ఆ జనానికి అలవాటైన రూపంలోనే రాస్తే దాని ప్రభావం అమితంగా ఉంటుందని విప్లవకవులు చాలామంది గ్రహించారు. అట్లా పాటని పాటక జనాల్లోకితీసుకుపోయి లక్ష్యసిద్ధికోసం పాటుపడుతున్న కవులలో గద్దర్ ఒకడు. జనంతోనూ, వారి జీవితంతోనూ ఎంతమాత్రం పరిచయం లేకుండా వారి భాషలో పాటలు రాయడం సాధ్యంకాదు. గద్దర్ నిరంతరం జనంతో జీవించేవాడు; వాళ్ళనుంచి నేర్చుకుని వాళ్ళకళారూపాన్ని వాళ్ళకే సుబోధకంగా ప్రదర్శించే నేర్పరి. "ముఖ్యంగా చాలామంది రచయితలు, కళాకారులు, తమకు ఎంతో జీవితఅనుభవం ఉంది అని ఇక జీవితంలో నేర్చుకోవడం మానేస్తారు. కాని ఈ కవి అలా కాదు. నిరంతరం జీవితాన్ని, సమాజాన్ని పెద్దబాలశిక్ష చదివినట్టు చదువుతాడు'' అంటాడు వర్గీస్, గద్దర్‌ను గురించి.

శ్రామిక జనంయొక్క "శ్రమనిష్ఫలమై జని నిష్ఠురమై''న దశలో వారి హక్కుకోసం, స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగిస్తారు. మేధావులూ, కళాకారులూ, సాహిత్యకారులూ సర్వజనసంక్షేమం కోసం, న్యాయంవైపు మొగ్గుతారు. "ఏయోగ వాదమనో అనుభూతివాదమనో ఏటోపేర్లు మెడల్లో వేసుకుని మధ్య తరగతిక్రింద పాయా పాఠకుల్ని ప్రలోభపెట్టుతూ కీర్తి, ప్రతిష్ఠా సంపాదించుకోవచ్చు. ఆకర్షణా కలిగించవచ్చు- ఇవి మిణుగురులు, కాకపోతే మెరుపులు - వంపులూ, విరుపులూ ఎన్నో ఉండి యీ మెరుపులు సాహిత్యంలో శిలాశాశ్వతంగా నిలిచిపోయినా ఆశ్చర్యంలేదు. అసూయా పన్లేదు-కావల్సింది నిలిపి వెలిగే దీపాలు - గుడిసెలో గుండెలో - చిమ్మ చీకట్లో ఘోర నిరాశలో, పోరాటసందర్భంలో ఉద్యమ సంరంభంలో - కరదీపాలు వెలిగి వెలిగించేవి. కాలుతూ వెలుతురునిచ్చేవి. ముందు దారి చూపేవి. వీటితైలం రక్తం" అంటారు కె. వి. రమణారెడ్డిగారు ఈ పాటల్ని గురించి.

"మన బతుకులు మారనీకి
మన ఎతలు తీరనీకి
అన్నలార చెల్లెలార
ఎత్తండి కొడవండ్లు
ఎఱ్ఱరాజ్య మొచ్చేదనుక
దించకండి కొడవండ్లు."

ఇది గద్దర్ దృక్పథం. ఈ పాటలు ప్రధానంగా ఏదో ప్రాంతపు మాండలికమై ఉంటాయి. అన్ని ప్రాంతాల వారికీ ఆ భావం సమగ్రంగా అర్థంకాకపోవచ్చు. అలాంటప్పుడు మాండలీక పదానికి అన్ని ప్రాంతాల్లోనూ ప్రసిద్ధమైన అర్థాన్ని ఇస్తే ఇతర ప్రాంతపు పాఠకులకు బాగుంటుంది.

వర్గీస్ పాటలు

[వెల: రు. 3-00లు. ప్రతులకు : 1) పీస్ బుక్‌సెంటర్, హైదరాబాద్; 2) సృజన, వరంగల్.]

కష్టజీవులకు పోరాటమార్గాన్ని ప్రబోధించేసే జనం పాటలు ఇవి. ఈ పాటలకు ముందు వర్గీస్ పాటల పుట్టుక, స్వరూప స్వభావాలను గురించి వివరించారు. జానపదుల్లో పుట్టిన పాటల స్వభావం భూస్వామ్య భావజాలమేనని అయితే ఆరూపంలోనే మారుతున్న సమాజస్వరూపాన్ని, రాగల ప్రజాస్వామిక విప్లవ భావాలను కొత్తదనంతో చెప్పవలసిన అవసరాన్ని వర్గీస్‌లాంటి పాటల కవులు గ్రహించారు. "నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం, నూతన ప్రజాస్వామిక సంస్కృతికోసం తమ తమ కలాలను, గళాలను మంచిస్తున్న కవులు జానపద సాహిత్యపోకడల్ని ఆకళింపు చేసుకొని కొత్తపద్ధతిలో, కొత్తనిర్వచనాలతో ప్రజా ఉద్యమాల పోరాటాల ఊపుతో ప్రజాసాహిత్య సృష్టికి మూల కారకులవుతున్నారు" అని వర్గీస్‌గారు చెబుతున్నారు. జానపదుల బాణీలోనే కొత్తదనంతో కొత్తభావాన్ని చెప్పాలనేది విప్లవపాటల రచనయొక్క ఉద్దేశం. అనాటి జానపదుల పాటల్లో భూస్వామ్య భావజాలముంటే ఈనాటి జనాల పాటల్లో ప్రజాస్వామిక విప్లవ భావజాలం ఉంటుంది. నక్సల్‌బరీ మార్గమే తమ మార్గంగా సకలమైన శ్రామిక వర్గం తీర్మానించుకుంటే ఈ వ్యవస్థ ఉన్నఫళంగా మారేతీరుతుంది. ఆ మార్పుకోసం ప్రజలను సమాయత్తం చేయటానికే ఈ పాటలు.

"ఎండిన నీ యెదనే
మండుతున్న పేనమయ్యి
మండుతున్న నీ నెత్తే
సర్రుమనే బండయ్యి
ఏగి ఏగిన కండ్లు
చింత నిప్పులయి
కాలిన నీ కాళ్ళేమో
కరిగిన సీసామయ్యి
పానం బిగబట్టరా-ఓ నాగులూ
పగవారిని గూల్చరా - ఓ నాగులూ."

లాంటి పాటలు, గుతపలందుకొని, మోసపోకోయి రైతన్న, ఆడ సీకాకులంల, ఎర్రెర్ర దండాలు ఒకటేమిటి సమస్తమైన పాటలు పీడితజన విముక్తికోసం పీడకులకు ఎక్కుపెట్టిన బాణాలే.

తిరుగుబాటు

[మలయశ్రీ. వెల: రు. 8-00 లు. ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ - 520 004.]

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ఏటా నవలల పోటీ పెట్టి బహుమతులిచ్చిసామాజిక చైతన్యానికి ప్రోద్బలం గావించే నవలలను ప్రచురిస్తున్నారు. సాహితీలోకం, సామాజిక అభ్యుదయ వాదులూ సంతోషించవలసిన విషయమే ఇది.

1982 వ సంవత్సరం నిర్వహించిన పోటీలలో రెండవ బహుమతి పొందిన నవల ఇది. మాధవరావు దొర అతని సంతానం శ్రీకాంత్, సునంద, దొర పాలేరు వెంకన్న అతని సంతానం రాజు, రాములు, మల్లి, ఆచార్యులు అతని కొడుకు రంగనాథ్. వీరి మధ్య ఈ నవల ఇతివృత్తం సాగింది. సునంద, రాజును అకస్మాత్తుగా ప్రేమించడంలో ఔచిత్యంలేదు. ఆచార్యులు - అతని కుమారుడు రంగనాథ్‌కి మధ్య ఒక తరంలో వచ్చిన భావ పరిణామం కనబడుతుంది. రాజు చదువుకున్న హరిజన యువకుడు. సంస్కరణవాదంతో సమాజం మారుతుందని విశ్వసించినవాడు. సునంద రాజును ప్రేమిస్తుంది; రాజు తిరస్కరిస్తాడు. తండ్రి తెచ్చిన సంబంధం చేసుకుంటుంది. నవల అంతంలో దీర్ఘ వ్యాధితో భర్త మరణిస్తాడు. శ్రీకాంత్ పోలీస్ ఆఫీసర్ అయి విప్లవ భాగస్వాములైన వారిని కాల్చి తను కాల్చబడతాడు. రంగనాథ్ మల్లిని వివాహం చేసుకుంటాడు. నవల చివరలో ఎలక్షన్లు, మినిస్టర్లు, ఉపన్యాసాలు, డిన్నర్లు యధావిధిగా జరుగుతాయి.

రచన సిద్ధాంత చట్రంలోంచి రాదు: జీవితంలోంచి వస్తుందని చాలామంది రచయితలకు తెలియక పోవటం శోచనీయం. కనీసం గోర్కీ జీవితం, సాహిత్యం అన్నా చదివితే రచన - జీవితం - అనుభవం వీటికి గల సంబంధం అన్నీ తెలుస్తుంది. ఈనాటి నవల కానీ మజిలీ కథల్లాగా ఉండటం ఆశ్చర్యం కదా!

స్వేచ్ఛాగానం

[కాణిపాకం లింగన్న. వెల : రు. 10-00 లు. ప్రతులకు : 1) కాణిపాకం లింగన్న, 15-7-17/3, డాన్ గార్డెన్స్, చిత్తూరు-2; 2) విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్, నేండ్రగుంట, చిత్తూరు జిల్లా]

ఇది కవితా సంకలనం. దీనికి డా॥ బి. భాస్కర చౌదరి గారు చిన్న పీఠిక లాంటి ముందుమాట రాశారు. దాంట్లో కవిగారి తత్వాన్ని వివరించటం జరిగింది. వివిధ సందర్భాలలో లింగన్న గారు రాసిన ఖండికలతో పాటు బంగ్లాదేశపు స్వాతంత్ర్య సమరాన్ని ధ్యేయంగా పెట్టుకుని రాసిన 'స్వేచ్ఛాగానం' ఖండికను చేర్చి ఈ సంకలనం వేశారు. 'విరసం, విప్లవం - ఇవి వినటానికి ప్రగతి సాధకాలని కొందరనుకుంటారు. కాని అది నేల వదలి సాముచేయడమని వీరి అభిప్రాయం' అని లింగన్నగారి దృక్పథాన్ని చౌదరి గారు విశదీకరించారు.

''ఈ ప్రగతి ఎక్కడిది ? ఈ ప్రాభవమెక్కడిది ?
ఆంధ్రావని నేడు అన్నపూర్ణ యైనది
ఈ నవత ఎప్పటిది ? ఈ సమత ఎక్కడిది ?
పల్లె పల్లెకు అభివృద్ధి పథకాలు వెలశాయి
నవ చైతన్య శక్తి నర్తించె నర్తించె
ఆంధ్రమాతకు అలంకారాలు హెచ్చాయి.''

అని కవి గారి అభిప్రాయం. అభివృద్ధి ఎవరిపాల బడుతోంది ? సంపదను సృష్టించేదెవరు ? దాని ఫలితాన్ని అనుభవిస్తున్న దెవరు? ఇత్యాదులైన ప్రశ్నలు లింగన్న గారికి కలిగినట్లు లేదు.

కవితా శైలీ, కవిత్వపు నడక నేర్చిన కవిత ఉన్నత పథాలవైపు ప్రయాణం చెయ్యాలి. ఇవ్వాళ కనబడుతున్నదే అభ్యుదయం, ప్రగతి అనుకుంటే మనం చూడలేని సమాజ జీవితం ఒకటున్నది. దాని భయంకరమైన స్థితిని కవినేత్రం దర్శించక పోతే ఎవరు చూడగలుగుతారు. లింగన్న గారు జీవితం పట్ల, సంఘం పట్లా పరిపూర్ణమైన అవగాహనతో మరింత మంచి కవిత్వం రాయాలి.

''జీవితమొక నదీ ప్రవాహం
తీరని కోర్కెల ఆరని దాహం
ఒక గట్టు సుఖ సోపానం
మరో గట్టు దుఃఖానికి స్థానం
సుఖ దుఃఖాలను ఒరుసుకుంటూ
ఆగక సాగడమే జీవిత పరమార్థం.''

అనుకున్న లింగన్నగారు జీవితంలో కష్ట సుఖాలకు కీలకమైన కారణాలను అన్వేషిస్తూ కవితం రాస్తారని ఆశ.

జాషువా కృతులు సమాలోచన

[డా॥ బి. భాస్కరచౌదరి, వెల: రు. 40/- లు, ప్రతులకు: 1) సమతా పబ్లికేషన్సు, 20-11-36/1, జైల్‌ఖానా వీధి, చిత్తూరు; 2) నవోదయా పబ్లిషర్సు, ఏలూరు రోడ్డు, విజయవాడ - ; 3) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ - 520 004 ; 4) విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్, నేండ్రగుంట, చిత్తూరు జిల్లా]

బి. భాస్కర చౌదరి గారు గతంలో జాషువా జీవిత కవితా ప్రస్థానం అనే ఒక లఘు విమర్శనా గ్రంథాన్ని అచ్చువేశారు. చెన్నయ్య గారితో కలిసి కృష్ణశాస్త్రి జీవితం - సాహిత్యం అనే పుస్తకాన్ని అచ్చు వేశారు. రాములింగారెడ్డి గారిపై వారి కాలేజి తెలుగుశాఖ చేసిన కృషిలో భాగస్వాములైనారు. ఈ పుస్తకం జాషువాపై వారు రాసిన సిద్ధాంత వ్యాసం.

విశ్వ విద్యాలయాల్లో తెలుగుభాషా సాహిత్యాలను గురించి పరిశోధన (పిహెచ్.డి. పట్టంకోసం) ఎంత ముందుకు పోయిందో ఫలితం అంత వెనక్కు వస్తున్నది. కొన్ని కొన్ని సిద్ధాంత వ్యాసాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో ఇటీవలి కాలంలో తెలుగు సాహిత్య పాఠకులకు విదితమైన విషయమే. చౌదరి గారి సిద్ధాంతవ్యాసం అందుకు అపవాదమై నిలుస్తున్నది. సిద్ధాంతవ్యాసం రాయడంలో చౌదరిగారికి గల చిత్తశుద్ధి, నిజాయితీ, కవిపట్ల ఆయనకు గల అపారమైన ఆర్ద్రతలను ప్రతి అక్షరం ఋజువు చేస్తున్నది.

కాల్పనిక కవిత్వం కాలంలోనే అందుకు భిన్నంగా వారి వారి విశ్వాసాలతో తెలుగులో కవిత్వం చెప్పిన వారిలో విశ్వనాథ, తుమ్మల, జాషువా ముఖ్యులు. ముగ్గురిదీ భిన్నమైన మార్గాలే. కవిత్వ రూపం మాత్రం ప్రాచీనమైనదే. అభివ్యక్తీకరణలో ఎవరి పద్ధతి వారికున్నది. జాషువా రచనలను తన పరిశోధనకు విషయంగా ఎన్నుకొని దానిని చౌదరిగారు నిర్వహించిన తీరు శ్లాఘాపాత్రమైనది.

మొత్తం సిద్ధాంత వ్యాసాన్ని ఏడు ప్రకరణాలుగా విభజించడం జరిగింది. మొదటి ప్రకరణంలో జాషువ జీవిత ప్రస్థానం, రెండవ ప్రకరణంలో జాషువ కృతుల వర్గీకరణం, మూడవ ప్రకరణంలో పద్య కృతులు-కావ్యఖండికలు, నాల్గవ ప్రకరణంలో గద్య కృతులు, ఐదవ ప్రకరణంలో దృశ్యకావ్యాలు, ఆరవ ప్రకరణంలో రచనా విశేషాలు, ఏడవ ప్రకరణంలో జాషువకవిత్వ తత్త్వాలను గూర్చి వివరించడం జరిగింది. 'నాదు కన్నీటి కథ సమన్వయము సేయ-నార్ద్రహృదయంబుఁగూడ కొంతవసరంబు' అని జాషువ ఆశించినట్లే చౌదరిగారు జాషువ కృతులను సమీక్షించడం జరిగింది.

భాస్కర చౌదరిగారి సిద్ధాంత వ్యాసంలో మరొక ఉత్తమ లక్షణం - కవి దృక్పథంతో భేదించేటప్పుడు కూడా స్పష్టంగా, నిర్ద్వంద్వంగా భేదించటం. అక్కడ ఎటువంటి మలినఛాయా ఉండకపోవటం ఇట్లాంటి లక్షణం ఎక్కువ మంది పరిశోధకులలో ఉండదు.

జాషువ పదప్రయోగంలో ఉన్న వైచిత్రిని, అతను ఉపయోగించిన అన్యదేశ్యపదజాలాన్ని, ఆంగ్ల పదజాలాన్ని, ఛందోవిశేషాల్ని, అలంకార విశేషాల్ని సోదాహరణంగా వివరించారు. ఆయనపై వచ్చిన శాస్త్రసంబంధమైన విమర్శను, ప్రతి విమర్శను కూడా పాఠకుల ముందుంచారు.

జాషువ సమకాలీనులైన కవుల్లో ఆయన పద్యానికున్న నడక మరొకరికి సాధ్యపడక పోవటం పద్యనిర్మాణ శిల్పమర్మజ్ఞులైన వారందరికీ తెలుసు. జాషువ అభ్యుదయ వర్గానికి చెందినవాడా? భావకవితావర్గానికి చెందినవాడా? అనేవి పనికిరాని చర్చలు. జాషువ రచనలన్నింటిలోనూ, వర్ణవ్యవస్థా ప్రస్తావన ఉండటం సర్వసాధారణమైన విషయం. ఆయన జీవితాంతమూ బాధపడినది దానిని గురించే కనుక. సాటి కవులు కూడా ఒకే వేదిక మీద ఆయనను అవమానించినట్లు ఇప్పటివారు చెప్పుకుంటారు.

భవభూతి 'ఏకోరసః కరుణఏవ' అన్నట్లుగానే జాషువ 'కరుణరస మొకండె కఠిన రాక్షస మూకల/హృదయములను గరిగి ముదముగూర్చు / వేడికంటి నీటి విలువ సహజమైన/చలువలేని అశ్రువులకు లేదు/అంటాడు. సందర్భం వేరైనా కరుణ రసానికి గల స్థానాన్ని ఏ కవైనా అంగీకరించి తీరవలసిందే గదా!

"ఒక ఉద్యమాన్ని ఆలంబనంగా చేసుకొని, తల్లక్షణాలను కవితద్వారా అభివ్యక్తం చేసిన కవి ఆ ఉద్యమపు వేడి చల్లారిపోవటంతో తెరమరుగై పోవటం సాహిత్యలోకంలో సాధారణంగా కన్పించే విషయమే. ఈ కారణం వల్లనే భావ కవిత్వపు రోజుల్లో వెలుగులోనికి వచ్చిన కొందరు కవులు నేడు పాఠక లోకానికి దూరం కావటం జరిగింది" అని అంటున్నారు భాస్కర చౌదరి గారు జాషువా కవిత్వ తత్త్వంలో. ఇది కొంచెం తొందరపాటు నిర్వచనమేమో. ఏనాడైనా ఏ ఉద్యమ కాలంలోనైనా మిగిలేది కొంతమంది కవులే. ఉద్యమం వేడికి కవులు మిగలడానికి ఏం సంబంధంలేదు.

జాషువ ప్రధానంగా సంస్కరణవాదకవి. వర్ణ వ్యవస్థను మొత్తంగా అతను కాదనలేదు. వర్ణ వ్యవస్థలో ఉన్న లోపాలను అతను దుయ్యబట్టాడు. అన్ని వర్ణాలు సమానం అనటంలేదు, వర్ణ సాహిత్యాన్నికోరటం వేరు. అట్లాగే ఆర్థిక వ్యవస్థకూడా. ముష్టి వడేయటంవల్ల, దానం చెయ్యటంవల్ల శ్రమజీవి దారిద్ర్యం తీరదు. తీరదని జాషువాకు తెలుసు. అయితే అతను కాలం కంటె ముందు చూడలేదు. కనుకనే —

"వాని రెక్కల కష్టంబు లేనివాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాఁడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁ బెట్టు వానికి భుక్తిలేదు"

అనిచెప్పి పరిష్కారాన్ని వదిలేశాడు. అయితే గాంధేయ వాదం ఒకటి అతనికి కవచం. దారిద్ర్యానికి గాంధేయవాదం పరిష్కారమా? ఇవన్నీ శేష ప్రశ్నలు.

ఈ సిద్ధాంత గ్రంథంలో చౌదరిగారు దర్శించిన జాషువా స్వరూపం సమగ్రమైనది. ఆయన కవిత్వతత్త్వానికి చాలా దగ్గరగా ప్రస్థానించి ఆయన జీవలక్షణాన్ని, బలాన్ని, బలహీనతని అనితర సాధ్యంగా చూపించారు భాస్కర చౌదరిగారు. వారి పరిశోధనా పాటవానికి, వారు పడిన శ్రమకు అభినందనీయులు.

నవోదయం (కవితా సంకలనం)

[డా॥ ఎస్. గంగప్ప. వెల: రు. 6-00 లు. ప్రతులకు: శశీప్రచురణలు, C-73, శ్రీనివాసనగర్, గుంటూరు - 522006; నవోదయ పబ్లిషర్సు, ఏలూరురోడ్, విజయవాడ - 2; అరండల్ పేట, గుంటూరు-2]

ఇది గంగప్పగారి పద్య, గేయ, వచనగేయ కవితాసంకలనం. సాహిత్యపరిశోధకులు, పరిశీలకులు అయిన గంగప్పగారు బాలగేయాలతోపాటు కవితాసంకలనాలను కూడా వెలువరిస్తున్నారు. ఈ సంకలనానికి ఆచార్య తూమాటి దోణప్పగారు, ఆచార్య జి. ఎన్.

రెడ్డిగారు, ఆచార్య సి. నారాయణరెడ్డిగారు, స్వా. శ్రీశ్రీగారు, చిట్ట చివరకు పొన్నెకంటి హనుమంతరావుగారు అవసరమైనంతగాను, కానంతగాను కూడా ముందు మాటలు రాసి అభినందనలను, అభి ప్రాయాలను, అనుశీలనలను అందించారు. ఈ కవితాసంకలనంలో గురజాడ, శ్రీశ్రీ, లాల్‌బహదూర్‌శాస్త్రి, రవీంద్రుడు మొదలైన వారిపై అభినందన ఖండికలు, ఉగాదిపై, విప్లవానిపై, బంగ్లా దేశ్ విజయంపై, రాష్ట్రావతరణంపై ఇంకా అనేక అంశాలపై కవితలున్నాయి. గాంధీని కృష్ణదేవరాయలను గంగప్పగారుకూడా మరోసారి జ్ఞప్తిచేశారు పాఠకులకు. సుబ్బన్నగారిపై కవితలు రెండుచోట్ల కనబడతాయి. ఏదిరాసినా ఈ సమాజంలో అందరూ సుఖపడాలని, హెచ్చుతగ్గులుండకూడదనే తపన గంగప్పగారిది. రాసిన ప్రతి ఖండికా కవిత్వం కావాలని మనం ఆశించగూడదు. కవిత్వాంశగల కవితాసంకలనం ఇది. వారి ఆశయానికి ఈ ఉదా హరణ చాలు.

'నల్లటి మబ్బే అమవస నిశియై
అల్లుకుంది సందింతలేక
బ్రతుకు చీకటి
బరువు బాధ్యత
కరువు కాటకాలు
చీలి హృదంతరాలు'

ఈ వర్తమాన స్థితిలోంచి—

'బ్రదుకు బాటలో వెలుతురు ప్రసరించే
ఆశాభానూదయం కావాలి
బాధల గాథల చీకటులు
పంచబంగాళం కావాలి'

అనే ఆశావాదంతో ఈయన కవిత ముడిపడి ఉంది.

స్యమంతక మణి (గేయ కావ్యం)

[రచన: పెంటమరాజు నరశింగరావు, బి. ఎ. వెల: లేదు. ప్రతులకు: పెంటమరాజు నరశింగరావు, జాతీయోన్నత పాఠశాల, నాగర కర్నూలు - 509 209.]

ఇది స్యమంతక మణి కథ. వినాయకచవితి పండగ చేసు కునే పిల్లలకూ, పెద్దలకూ చదువు వచ్చినా రాకపోయినా తెలిసిన కథ ఇది. ఈ కథను బడిపిల్లలకు పనికివచ్చే శైలిలో గేయాలుగా రూపు నిచ్చారు రచయిత. వారి రచనకు ఈ గేయం ఉదాహరణ.

"ఘనుడైన భగవంతుని
కథను చదువ విన్నగాని
పరమాత్ముని కృప కలిగి
పాపమంత తొలిగిపోవు"

శ్రీ సాయీనాథ కరావలంబ స్తోత్రము

[రచన: బాపట్ల వేంకట పార్థసారథి. వెల: రు. 1-00 లు ప్రతులకు: బాపట్ల వేంకట పార్థసారథి, శ్రీ సాయినిలయమ్, చెరువు-523 113.]

షిరిడీ సాయిబాబాను స్తుతిస్తూ రాసిన చిన్న పుస్తకమిది. ఈ పుస్తకంలో 27 పద్యాలున్నాయి. అన్నీ భగవంతుని భక్తుడు ఏమి కోరతాడో కోరవలెనో చెప్పేవే. మచ్చునకు-

"శాంతి కరువయ్యె సంసారసాగరమున
సుఖము మరుగయ్యె: ఆశయే చుట్టుకొనియె
యమభటుని పాశమట్టుల; ఆర్తిఁదొలగ
చేయి నందించుమా నాకు సాయినాథ!"

సాయిభక్తులు పారాయణచేసి తరించటానికి బాగుంటుంది.

శ్రీ టి. ఎల్. కాంతారావు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.

